Archaeological Series No. 33

కృష్ణదేవరాయులు

రచయిత

డా. నేలటూరు వెంకటరమణయ్య, M.A., Ph.D.

జనరల్ ఎడిటరు

మహమ్మద్ అబ్దుల్ వహీద్ ఖాన్, F. R. A. S. (Lond.)

డైరెక్టరు, పురావస్తుశాఖ,

ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు

ప్రకాశకులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

వెల రు. 15-00

CI

AOUA|01B|38

Archaeological Series No. 33

కృష్ణదేవరాయలు

రచయిత

డా. నేలటూరు వెంకటరమణయ్య, M.A., Ph.D.

జనరల్ ఎడిటరు

మహమ్మద్ అబ్దుల్ వహీద్ ఖాన్, F. R. A. S. (Lond.)

డైరెక్టరు, పురావస్తుశాఖ,

ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు

ప్రకాశకులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

వెల రు. 15-00

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10072

954..0245
VEN

PRINTED IN INDIA
AT THE ANDHRA PRADESH TEXTBOOK PRESS,
MINT COMPOUND, HYDERABAD.

PREFACE

Among all the Vijayanagar rulers Krishnadevaraya had enjoyed the unique honour of being not only the conquerer of a vast empire including Kalingadesa and the Raichur doab but also a great patron of renowned poets and scholars in several branches of learning. Traditions basing on the military achievements of this great monarch were recorded in the village diaries known as *kaifiats* which have been later collected and preserved by Meckenzie during the 19th century. Similarly the numerous royal records of his time engraved on copper plates and stone speak volumes about his valour and benevolence. Last but not the least is the literary source which furnishes the historian a good deal of authentic information regarding the unparalleled political and literary career of this great emperor. Corroborating all these sources with the accounts given by the Muslim historians and the Portuguese chroniclers of that period, Dr. N. Venkataramanayya, the renowned historian, has brought forth the true character of this valorous king. I hope this monograph in Telugu from the pen of this versatile writer in English as well as Telugu will be a welcome addition to the South Indian Medieval History and I am quite sanguine that it would be of great value to research students, scholars and teachers working on the subject.

I express my grateful thanks to Dr. N. Venkataramanayya, for contributing this monograph for the departmental publication. My thanks are also due to Dr. R. Subrahmaniam for writing a valuable introduction on the subject matter of the publication.

MOHD. ABDUL WAHEED KHAN,
Director.

FOREWORD

In the history of medieval South India, the empire of Vijayanagara played a very significant role. Of all the kings that ruled over this vast empire, the name of Krishnadēvaraya shines as the finest of stars. His name has come down to posterity. He was a great warrior, diplomat, man of letters and a great patron of all arts of peace. He was born at a time when the empire of Vijayanagara was very much eroded by the successful invasions of the neighbouring kings of Orissa and Gulbarga. The Gajapatis of Orissa were successful in extending their authority right upto Udayagiri Mandala and left no stone unturned to make inroads into the empire even against the capital city of Vijayanagara. The Bahmani Sultans did not lag behind, though the Sultanate slowly dismembered into five Muslim kingdoms of Bidar, Birar, Bijapur, Ahmednagar and Golconda. They also tried their best to encroach upon Vijayanagara empire and establish their authority there.

After the death of Narasā Nāyaka the regent of Immadi Narasimha, his son Veeranarasimha has ascended the throne of Vijayanagara. He was assisted in his wars as well as the administration of the empire by his able brother Krishnaraya. But, when he fell ill, the Tuluva emperor felt jealous and wanted to put an end to the life of Krishna so that his infant son might succeed to the throne. The times were turbulent and needed a competent warrior king on the throne and thanks to the manoeuvres of Sirah Pradhana Timmarusu, Krishnadēvaraya succeeded as emperor on the throne of Vijayanagara.

Almost the first task of Krishnadēvaraya after he ascended the throne, was the consolidation of his power and reconquest of the territories which his neighbours had taken from his predecessors. In a seven year war which he conducted against Prataparudra of Orissa, the armies of Krishnadēvaraya not only managed to avenge their earlier insults, but also succeeded in penetrating into the heart of the Gajapati's own kingdom and dictating terms of peace not quite honourable to the vanquished. River Krishna became the boundary between the two kingdoms and for sometime peace prevailed in that direction. Raya then marched against the Sultan of Bijapur and won a victory in the battle of Raichur in the 20s of 16th century. It was perhaps one of the most decisive battles ever fought between these two powers. No less significant was the achievement of Raya in the domain of diplomacy. His handling of the Portuguese problem, particularly his dealings with Fr. Luis, the conclusion of the treaty with the Portuguese for supply of the best breed of horses for Vijayanagara army depriving Bijapur which vied with Vijayanagara in the purchase of horses from them for the cavalry, have no parallels in the diplomatic history of medieval India.

Raya was a great devotee of Vishnu. But, as an ideal monarch, he was catholic in his outlook and gave equal patronage to all other creeds. Wherever

we go in the length and breadth of his vast empire which extended from Krishna to Kanyakumari and from the Bay of Bengal to the Western Ghats,we find the munificent hand of Raya in the stupendous constructions of temples, palaces, the master pieces of the age. Whenever he won a battle, the victory was celebrated by giving gifts to all the Siva and Vishnu temples in the South. The architecture of this age which again is a culmination of the earlier tradition of the Cholas is marked by numerous constructions of spacious halls, Kalyana Mandapas, Natya Mandapas, Sangita Mandapas within the temple enclosures and the lofty gopuras which rise high into the sky on all the four cardinal directions of the temple enclosure. His contribution to literature and art, philosophy and religion is equally significant and his reign is justly regarded as the golden age in the history of Telugu literature.

The following pages embody the history of this great potentate from the pen of Dr. N. Venkataramanayya, a scholar of great repute who spent more than 50 years in the study of Vijayanagara history and he is an acclaimed and accredited authority on Vijayanagar history. His earlier contributions *viz.*, 'Kampili and Vijayanagara', 'Founders of the City and the Empire of Vijayanagara,' 'Studies in the Third Dynasty,' 'Further Sources of Vijayanagara History' and 'Early Muslim Expansion in South India' are monumental and read by every student of history with great interest. This account of the political history of Krishnadevaraya from the pen of this versatile scholar is a welcome addition and I am sure the students of Vijayanagara history in general and the people of Andhra in particular will be beholden to him for this valuable work.

R. SUBRAHMANYAM,
Superintending Archaeologist,
Archaeological Survey of India

Jantar Mantar,
New Delhi,
Jan. 1, 1972.

కృష్ణదేవరాయలు

శ్రీ నేలటూరి వెంకటరమణయ్య

ప్రకరణము ౧. ఆధారములు

దక్షిణదేశమును పూర్వకాలమున పాలించిన హిందూ చక్రవర్తులలో గర్ణాటసామ్రాజ్యాధిపతి శ్రీకృష్ణదేవరాయలు ప్రఖ్యాతుడు. ఆ మహారాజుకీర్తిమూర్తి దాక్షిణాత్య హిందూ హృదయసీమల స్థిరముగ నెలకొనియున్నను, ఆయన చరిత్ర విద్వాంసులకుగూడ సుపరిచితముగాదు. ఉత్తరాపథమునకు విక్రమాదిత్య భోజనరపాలు రెట్లు వంద్యులో గృష్ణరాయ లట్లే సర్వదక్షిణభారత భూమికి బూజనీయుడు. ఆంధ్ర వాఙ్మయము నత డెట్లు పోషించినదియు, సంస్కృత కర్ణాటాదిభాషల నెట్లాదరించినదియు నంద రెఱుగుదురు. కాని యతని చరిత్రనుగూర్చి జన సామాన్యమున కెఱుక పడిన విషయ మత్యల్పము. ఇటీవల చరిత్రపరిశోధకులు కొందరు ప్రయత్నించి యతని చరిత్రకు సంబంధించిన విషయములు విదితములైనవి. లభ్యమైన చరిత్రాంశముల నెల్ల గ్రోడీకరించి శ్రీకృష్ణరాయల చరిత్రమును సాధ్యమైనంతనఱకు సంపూర్ణముగ రచియింపవలయునని నాయుద్దేశము.

ఆద్యమున శ్రీకృష్ణరాయచరిత్రరచనకు గల సాధనసామగ్రిని వర్ణించుట యుక్తము. ఇవి యిరు దెఱగులని. మొదట బేర్కొనదగినవి శాసనములు. తామ్రపట్టికలేమి, శిలాశాసనములేమి రాయలకాలమునాటివి దాదాపు ౩౦౦ ఇప్పటివఱకు లభ్యపడినవి. ఇవి సంస్కృతాంధ్రద్రావిడ కర్ణాటభాషలయందు విరచింపబడియున్నవి. సంఖ్య బహుళమగుటచేత నీ శాసనముల నన్నిటిని ఇట వర్ణించుటకు వలనుపడదు. ముఖ్యమైనవానిని సందర్భానుసారముగ గ్రంథమునం దుదాహరించినచాలును. పరిశోధనాసక్తి గలవారలు మదరాసు గవర్నమెంటు శాసన పరిశోధకశాఖవారి సాంవత్సరిక నివేదికలను, ఎపిగ్రాఫియా ఇండికావంటి శాసన సంశోధక పత్రికలను, దక్షిణ ఇండియా శాసనపరంపర, ఎపిగ్రాఫియా కర్ణాటికా మొదలగు శాసనగ్రంథసంపుటములను బరిశోధించి తృప్తిపడవచ్చును.

శాసనముల తరువాత బేర్కొనదగినది వాఙ్మయము. వాఙ్మయ మనగా కేవల గద్యపద్యాత్మకమైన కావ్యమని యెంచరాదు. గ్రంథరూపమున నుండు సాహిత్యమంతయు నీ తరగతిలో

జేరినదే. రాయలనాడు విరచితములైన కావ్యములే కాక మహమ్మదీయ చరిత్రకారుల రచనలు, పోర్చుగీసు గ్రంథకర్తల వృత్తాంతములు, వంశానుచరితములు, తరతరములనుండి లోకమున ప్రచారమునందుండుగాథలు, చాటూక్తులు, గ్రామకవిలెలు, కైఫీయతులు మొదలగునవి యన్నియు నిట గ్రాహ్యములు. ముఖ్యమైన ఆధార గ్రంథములను సంగ్రహముగ నిచట వర్ణించుచున్నాను.

కావ్యములు : భాషననుసరించి ఇవి రెండు తరగతులవి.

(ఎ) సంస్కృతమున కొన్ని గలవు. సంస్కృతకావ్యములలో ప్రధానమైనది రాజనాథ డిండిమవిరచిత అచ్యుతరాయాభ్యుదయము. ఇందు కృష్ణరాయల కళింగదిగ్విజయ ప్రస్తావన గలదు. మఱియు భండారు లక్ష్మీనారాయణకృత సంగీత సూర్యోదయ పీఠికయందు కళింగ దిగ్విజయమును నేదులఖానునిపై విజయమును గలుబరిగ దండయాత్రయు వర్ణింపబడియున్నవి.

(ఏ) ఆంధ్రప్రబంధములు : ఇవి ముఖ్యముగ మూడు : (i) మొదట బేరొకానదగినది యల్లసాని పెద్దనార్యకృత మనుచరిత్ర. పీఠికయందును నాశ్వాసాద్యంతములందును గటకదహనపర్యంతము గల కృష్ణరాయల కళింగవిజయయాత్రయు, మఱి కొన్ని యజ్ఞాత దండయాత్రలును వర్ణింపబడియున్నవి. (ii) కృష్ణరాయరచితాముక్తమాల్యద. దీనికిని మనుచరిత్రకును పీఠిక చాలవఱకు సామాన్యమైనను, ఇందు కళింగదండయాత్రయందు చేకుఱిన విజయములు మఱియు విపులముగ వర్ణింపబడియున్నవి. మఱియు నిందు ఉత్తర దిగ్విజయము, సగరపురకల్పరిగనగర ప్రాంతములదురకలతో జరిగిన యుద్ధములును, నేదులఖానుని వధయు, కొంబావి రణక్షేత్ర విజయమును వివరింపబడియున్నవి. ఇంకను కృష్ణరాయవిరచితసంస్కృతాంధ్రగ్రంథములును నిందు బేరొకానబడియున్నవి. (iii) ముక్కు తిమ్మనగారి పారిజాతాపహరణము. ఇందును గృష్ణరాయల కళింగదిగ్విజయము వర్ణింపబడియున్నది. ఇతర గ్రంథములందు గానరాని రాయల యుమ్మత్తూరు దండయాత్ర ప్రస్తావన ఇందు గలదు. ఇంత వఱకును బేరొకానిన మూడు ప్రబంధములయందే కాక కృష్ణరాయల దండయాత్రలను గూర్చిన విశేషాంశములు తరువాత యాంధ్రగ్రంథములందచట నచట చెప్పబడియున్నవి. కాని వాని నన్నిటిని ఇచట పేరొకానదలపెట్టలేదు. అర్వాచీన గ్రంథములలో రెంటినిమాత్ర మిచట జెప్పక తప్పదు. ఇందొకటి రాయవాచకమను వచనగ్రంథము. దీనిని వచనకావ్యమనుట తప్పు. కావ్యలక్షణము లెవ్వియు నందు గానరావు. యత్కృతమో తెలియదు. మధురనాయకుడును, అడపము చిననాగినాయనికుమారుడైన కట్యమువిశ్వనాథనాయకుని స్థానాపతి యొకడు దాని రచయిత యైనట్లందు కలదు; కొందఱిది కృష్ణరాయల కాలమున విరచింపబడెనని తలచుచున్నారు; కాని యది క్రీ. శ. ౧౭ వ శతాబ్దారంభమునకు ముందు రచియింపబడియుండదని యందు వర్ణింపబడిన యంశములు కొన్నింటివలన రుజువగుచున్నది. (ఎ) రాయవాచకమందు భాగ్యనగర ప్రస్తావన గలదు. ఇది యిప్పటి హైదరాబాదునకు ప్రథమనామము. ఈ భాగ్యనగరమును క్రీ. శ. ౧౫౯౧ వ సంవత్సరమున గోలొకొండ రాజ్యమున కభిషిక్తుడైన మహమ్మదు కుల్లీకుతుబుశాహు తన రాజ్యారంభదశయందు నిర్మించియుండుటచేత నా పట్టణమును బేరొకాను రాయవాచక మంతకు పూర్వము రచియింపబడియుండదు. (ఏ) మఱియు రాయవాచక రచయితకు గృష్ణదేవరాయల సమకాలికుడును ప్రత్యర్థియు నైన గజపతి యెవ్వడో తెలియదు. పేరు జెప్పక విడిచియుండిన నతని యజ్ఞానము వెల్లడియై యుండదు; కాని యా గజపతిపేరు ముకుందబాహు బలేంద్రు లని చెప్పుటవలన రాయవాచకరచయిత కృష్ణరాయలవారికి సమకాలికుడుగాడని నిశ్చయమగుచున్నది. ఏలన కళింగరాజ్యమును పాలించిన గజపతులలో ముకుందబాహుబలేంద్రనామధారి యొక్కడే. ఇతడు క్రీ. శ. ౧౬ వ శతాబ్దపు చతుర్థపాదమున కళింగదేశమును పాలించెను. గోలొకొండ సుల్తానునకును నక్బరు పాదుశాహునకును కర్ణాటసామ్రాజ్యాధిపతి రెండవ వెంకటపతి రాయలకును నితడు సమకాలికుడు; కావున

ముకుందబాహుబలేంద్రుని బేరొక్కను రాయవాచకము కృష్ణరాయలనాడు రచియింపబడలేదని దృఢముగ జెప్పవచ్చును. క్రీ. శ. ౧౭వ శతాబ్ది ప్రారంభమున వీరచింపబడియుండవచ్చును. రాయవాచకమంతటి విశ్వాసపాత్రమైన యాధార గ్రంథముగాదు. రక్తసితంగడి యుద్ధానంతరము కావేరికి దక్షిణమందుండు రాయరాజ్యము నాక్రమించుకొనిన మధురనాయకులు కృష్ణరాయలచే దక్షిణ రాజ్యమున ప్రతిష్ఠింపబడిరననసత్యపుకల్పిత గాథను ప్రచారములోనికి దెచ్చుట ఈ గ్రంథము యొక్క ముఖ్యోద్దేశము. కాని యందు వర్ణింపబడియుండు కృష్ణరాయల త్రైత్రయాత్రాకథన మన్యచరిత్రాధారముల మూలమున వాస్తవమని తేలుచుండుటవలన దానినిమన మంగీకరించవచ్చును.

రెండవది కుమారధూర్జటికృత కృష్ణరాయ విజయము. పద్యకావ్యము. కాని దీనినొక ప్రత్యేక స్వతంత్రచరిత్రాధారగ్రంథముగ దలచుటకు వలనుపడదు. ఇది క్రీ. శ. ౧౬౩౦–౧౬౪౨ల మధ్య కర్ణాటకసామ్రాజ్యమును పాలించిన ముమ్మడివెంకటపతి రాయల కాలమున రచింపబడెను. మధుర నాయకుల ప్రస్తావన యందు గానరాకపోయినను రాయవాచకమున కిది పద్యప్రతి. కొన్ని సందర్భములందు రాయవాచకమును ముందుంచుకొనిన గాని సుబోధము గాదు. కుమారధూర్జటి యుద్దేశము కృష్ణరాయల విజయములను మాత్రమే వర్ణించుట యగుటవలన రాయవాచకమందలి యన్యాంశముల నాతడు విడిచిపుచ్చెను.

మహమ్మదీయచరిత్రలు : మనకు దెలిసినంత వఱకు విజయనగరచరిత్రకు సంబంధించిన విషయములను దెలుపు మహమ్మదీయచరిత్రగ్రంథములు మూడు. ఇవి కృష్ణరాయల సమకాలరచనలు గావు; అర్వాచీనములు. మొదట బేరొక్కనదగినది తారీఖిఫరిష్తా; క్రీ. శ. ౧౭వ శతాబ్దారంభమున రచింపబడెను. రెండవది బుర్హాన్–ఇ–మ అసీరు. కొంచెమించుమించుగ తారీఖిఫరిష్తాకు సమకాలిక రచన. ఈ రెండు గ్రంథములయందును కృష్ణ రాయల ప్రస్తావన లేదు. కాని ఆ రాయల రాజ్యకాలమున దక్కనీమహమ్మదీయ రాజ్యముల కును, విజయనగరసామ్రాజ్యమునకును గల పరస్పరసంబంధము వీనివలన గొంత తెలియ వచ్చుచున్నది. మూడవది తారీఖిమహమ్మదు కుల్లీకుతుబ్ శాహు. ఇదియు కొంచె మించుమించుగ పై రెండుచరిత్రల రచనాకాలమునసే వ్రాయ బడెను. ఇందువలన కృష్ణరాయలకును, గోలకొండ రాజ్యస్థాపకుడగు సుల్తాన్ కుల్లీకుతుబు శాహునకును నడచిన సమరవృత్తాంతము గొంత తెలియవచ్చు చున్నది.

పోర్చుగీసుగ్రంథకర్తలు : పోర్చుగీసువారు వర్తకముకొఱకు క్రీ. శ. ౧౪౯౦ వ సంవత్సర ప్రాంతమున హిందూదేశమునకు వచ్చిరి. వీరికి మహమ్మదీయులతో సహజవైరముగలదు. దీనికి గారణములు రెండు : మొదటిది మతద్వేషము; రెండవది ఇంతకంటె ప్రబలతరమైన వర్తక ప్రతిస్పర్ధ. పోర్చుగీసువారి రాకముందు పాశ్చాత్య దేశములకును హిందూస్థానమునకును మధ్య జరుగు చుండిన వాణిజ్యమంతయు నరబీపారశీ మహమ్మదీయ యోడవర్తకులమూలమున నడచు చుండెను. ఈ యోడవ్యాపారము దమ కాణయాచి యని పై బేరొక్కనిన మహమ్మదీయవర్తకులు దలచుటచేత పోర్చుగీసుల రాకను వీరు సహింప రైరి. వెక్కు నావికాయుద్ధము లిరుపక్షముల వారికిని నడచినవి. ఇందు తుదకు మహమ్మదీయు లోడిపోయిరి. పశ్చిమసముద్రతీరమందలి రేవు పట్టణములు కొన్నింటిని పోర్చుగీసు లాక్రమించు కొనిరి. మఱియు నప్పుడు గుజరాతు దక్కను దేశములు రెండును మహమ్మదీయప్రభువుల యధికారముక్రింద నుండిన కారణమున పోర్చుగీసుల కచట సులభముగ ప్రవేశము గలుగక పోవుటచేత, వారు తమవలెనే మహమ్మదీయులకు సహజశత్రువులైన విజయనగరచక్రవర్తులతో మైత్రిని గుదుర్చుకొనిరి. ఇందువలన పోర్చుగీసు రాయబారులు, వర్తకులు, ప్రయాణీకులు పెక్కండ్రు విజయనగరమునకు బలుమారువచ్చి వ్యాపారార్థమేమి, యన్యకారణములవలననేమి కర్ణాటసామ్రాజ్యమునం దంతటను సంచారముచేసి పోవుచుండిరి. ఇట్లు వచ్చిన పోర్చుగీసులం దనేకులు

గర్ణాటసామ్రాజ్యచరిత్రను గూర్చియు, మటియు నందు తాము కన్న విన్న విషయములనుగూర్చియు గ్రంథములను వ్రాసిరి. విజయనగరసామ్రాజ్య విషయములను దెల్పు గ్రంథములు పోర్చుగీసు భాషయందు పెక్కు కలవు. కాని పోర్చుగీసు భాష దెలిసిన చరిత్రపరిశోధకు లరుదగుటచే నివి మన కందుబాటున లేవు. పిసరులెంకారువంటి పోర్చుగీసు భాషావిదులుండినను వారి కాంగ్లము దెలియకపోవుటచే వారి పరిశోధన లమూల్యము లైనను చరిత్రపరిశోధకులకు నిరుపయోగము లైనవి. కాని కొన్ని ముఖ్యపోర్చుగీసు గ్రంథము లాంగ్లములోనికి పరివర్తనము గావింపబడియున్నవి. ఇవి కృష్ణరాయచరిత్ర రచియింపదలపెట్టువారికి కర ముపయుక్తములు. అందు ముఖ్యమైనవి నాలుగు. సంగ్రహముగ వాని నిచట జెప్పుట యొప్పు.

(౧) 'కామెంటరీస్ ఆఫ్ ది గ్రేట్ ఆఫాంసో అల్బూకర్కు'—ఇందు కృష్ణదేవరాయల రాజ్యారంభ దశయందు విజయనగరసామ్రాజ్యమందును, బహమనీరాజ్యమునను జరిగిన విషయములు వర్ణింపబడినవి. సమకాలికరచన యగుటచే దీని సాక్ష్య మత్యంత విశ్వాసపాత్రమైనది. అర్వాచీన మహమ్మదీయ చరిత్రలయందు గానవచ్చు కృత్రిమములు కొన్ని దీనిమూలమున వెల్లడి యగుచున్నవి. కృష్ణరాయల యుమ్మత్తూరు దండ యాత్రనుగూర్చియు, బహమనీసుల్తానుతోడి యుద్ధమును గూర్చియు, మఱి యొచ్చటను గానరాని యంశము లిందు కలవు.

(౨) 'ఈస్ట్ ఆఫ్రికా అండ్ మలబార్'—ఇది దురాతీ బర్బోసా అను పోర్చుగీసుప్రయాణీకుడు వ్రాసినది. ఇతడు కృష్ణదేవరాయల రాజ్యారంభ దశయందు దక్షిణహిందూదేశమునకు వచ్చి కర్ణాటసామ్రాజ్యమున సంచారము జేసెను. అతడు తానచట గన్న విషయములను దన గ్రంథమున వర్ణించియున్నాడు. కృష్ణరాయలను గూర్చి కాని, కర్ణాటకసామ్రాజ్యమునకు సంబంధించిన రాజకీయాంశములనుగాని యతడు ప్రస్తావించకపోయినను కర్ణాటకసామ్రాజ్య ప్రజల స్థితిగతులను, వారి యాచారవ్యవహారములను వర్ణించియున్నాడు. కావున కృష్ణరాయలనాటి విజయనగర చరిత్రను రచియించువారి కది మిక్కిలి యుపయుక్తమగు నాధారగ్రంథము.

(౩) 'క్రానికల్ ఆఫ్ డామింగో పయస్'—ఇతడు కృష్ణదేవరాయల రాజ్యకాలమున క్రీ. శ. ౧౫౨౨ ప్రాంతమున క్రిస్తవాడి ఫిగ్వెరెడోయను పోర్చుగీసు రాయబారివెంట విజయనగరమునకు బోయి యచట కొద్దికాలము నివసించియుండెను. ఇతడు బారాస్ అను పోర్చుగీసుచరిత్రకారుని కొఱకు విజయనగరమును గూర్చియు, కృష్ణరాయలనుగూర్చియు ముఖ్య విషయములను బెక్కింటిని తెలియబఱచియున్నాడు.

(౪) 'క్రానికల్ ఆఫ్ ఫెర్నావన్ న్యూనిస్'—ఇతడు పోర్చుగీసుగుఱ్ఱపువర్తకుడు; కృష్ణదేవాచ్యుత దేవరాయలకాలమున గుఱ్ఱముల నమ్మ్మటకు పలుమారు విజయనగరమునకు వచ్చి యుండెను. ఇతడును బారాస్‌కొఱకే తన గ్రంథమును వ్రాసిపంపెను. పయస్, న్యూనిసులచే రచియింపబడిన గ్రంథములు రెండును క్రీ. శ. ౧౫౩౨ ప్రాంతమున బారాసుకు జేరియుండుటచే నివి రెండును సమకాలిక రచనలనుట నిస్సంశయము. హిందూస్థాననివాసులగు హిందూ మహమ్మదీయుల యెడ సమాన దృష్టిగల పాశ్చాత్యుల రచన లగుటచే నివి విశ్వాసపాత్రములనుట యొప్పు. పయస్ గ్రంథముకంటె న్యూనిసు గ్రంథము గడు ముఖ్యమైనది. రాయరాజ్యస్థాపన మొదలుకొని యచ్యుతదేవరాయల రాజ్యకాలము వఱకు గల విజయనగరసామ్రాజ్యచరిత్ర యందు వర్ణింపబడియున్నది. కృష్ణరాయల విజయములను నచ్యుతరాయల పాలనావిశేషములును విపులముగ వర్ణింపబడినవి. కావున పయస్, న్యూనిసుల గ్రంథములు రెండును కృష్ణరాయచరిత్రకు మూలాధారములనుట యతిశయోక్తి కాజాలదు.

వంశానుచరితములు : ఈ తరగతి గ్రంథములలో లింగణకృత కేళదినృపవిజయ

మొక్కటియే నిచట బేరొక్కనదగినది. ఇది కన్నడ చంపూకావ్యము. కెళది నాయకరాజుల మూల పురుషుడు చౌడప్ప కృష్ణదేవరాయల నాయకుల యందొక్కడు; కృష్ణరాయలకు దురకలతో నైన యుద్ధములలో రాయల పక్షమున పోట్లాడెను. కెళదినృపవిజయమువలన గృష్ణరాయల కాలమున మలెనాడు దేశస్థితిగతులు దెలియవచ్చుచున్నవి.

గాథలు: కృష్ణరాయల రాజ్యాభిషేకమును గూర్చియు, మఱికొన్ని విశేషాంశములను గూర్చియు బెక్కు కథ లాంధ్రదేశమున ప్రచారమునందున్నవి. ఇందలి సత్యాసత్యములను నిర్ణయింపగల సాధనములు గానరావు; కాని గాథలని వీని సాక్ష్యమును ద్రోసివేయరాదు; చిరకాలమునుండియు జనస్మరణయందివి స్థిరమై నిలిచియుండుటవలన వీనియందు కొంతయేనియు సత్యముండవచ్చును. కావున జ్ఞాతచరిత్రాంశములకు విరుద్ధము గానియప్పుడు వీని సాక్ష్యము నంగీకరించుట తప్పుగాదు.

చాటూక్తులు: విజయనగర చక్రవర్తులలో కృష్ణరాయలకు సంబంధించినన్ని చాటూక్తులు మఱియెవ్వరినిగూర్చియు గానరావు. ఇందనేకములు రాయల విద్యావ్యాసంగములను దెల్పునవి; రాయల విజయములను వర్ణించునవి బెక్కు గలవు. సాధారణముగ నిందు రాయల కళింగవిజయములును, మహమ్మదీయులతోడి సమరములును ప్రశంసింపబడియున్నవి. ఇతర ఆధారగ్రంథములందీ విజయములు విపులముగ వర్ణింపబడియుండుటవలన నివి యంత ముఖ్యములు గావు. కాని ఇతర ఆధారగ్రంథాదులవలన తెలియరాని విజయములను వర్ణించు చాటువులు కొన్ని కలవు. కృష్ణరాయలు బెడదకోట(బీదరు)ను జయించిన శ్లేయాధార గ్రంథాదులయందు కానరాదు. కాని—

"సమరక్షోణిని కృష్ణరాయల భుజా
శాతాసిచే బడ్డదు
ర్దమదోర్దండ బెడందకోటయవన
వ్రాతంబు సప్తాశ్వమా
ర్గమునన్ గాంచి శబా సహో హరిహరం
గాఖూబుఘోడాకితే
తుముకీ బాయిలబాయి దేములికి యం
దు ర్మింటికిన్ బోవుచుఁ."

అను నల్లసాని పెద్దనార్యుని చాటు వొక్కటి రాయల బీదరువిజయమును దెల్పు చున్నది. ఇట్టివి ముఖ్యమైనవి.

గ్రామకవిలెలు, శ్రేఫీయతులు: పూర్వ మాంధ్రదేశమున ప్రతిగ్రామమునకును కవిలె లుండెడివి. ఇందు గ్రామముల పూర్వవృత్తములు వర్ణింపబడియుండును. ఇట్టి కవిలెలందును, వీని నాధారపడుకొని తయారుసేయబడిన శ్రేఫీయతులందును కృష్ణరాయల యేలుబడిని గూర్చి కొన్ని యంశములు వివరింపబడియున్నవి. కావున గృష్ణరాయల చరిత్రను రచించువారికి నివియు నుపయుక్తములు.

ఇంతవఱకు గృష్ణరాయల చరిత్రకు గల యాధారములను స్థూలముగ వివరించితిని. అన్నిటిని విపులముగ వర్ణించుటకు సాధ్యముగాదు; కాని రాబోవు ప్రకరణములయందు సందర్భాను సారముగ నన్ని యాధారముల నుదాహరించి వలసినట్లు పరిశీలించుచున్నాడను.

ఎ. వంశాదికము

కృష్ణరాయలు చంద్ర వంశాంతర్గతతుర్వసుకుల సంభూతుడగు ఉత్రియుడని యతని శాసనము లందు చెప్పియున్నది. క్రీ. శ. ౧౫౧౧-వ సం. నాటి నేర్లకెరెతామ్రశాసనమున—

"అస్తి క్షీరమయాద్ధైవె
మర్త్యమానా న్మహాంబుధేః
నవనీతమివోద్భూత
మపనీతతమో మహఃll

తస్యాసీ త్తనయ స్తపోభి
రతు ల్తె రన్వర్థనామా బుధః
పుణ్యైరస్య పురూరవా
భుజబ ల్తైరాయుర్ధ్విషాం నిఘ్నతః
తస్యాయుర్న హుషోఽస్య
తస్య పురుషోయుద్ధే యయాతిక్షి తౌ
ఖ్యాత స్తస్యతు తుర్వసు
ర్వసునిభః శ్రీ దేవయానీపతేఃll

తద్వంశే దేవకీజాని
ర్దిదీపే తిమ్మభూపతిః
యశస్వీ తుళవేంద్రేషు
యదోః కృష్ణఇవాన్వయే ll

తతోభూ ద్బుక్కమాజాని
రీశ్వరక్షితిపాలకః
అత్రాసమగుణోత్తంసం
మౌళిరత్నం మహీభుజాం ll

సరసా దుదభూ త్తస్మా
న్నరసావనిపాలకః
దేవోర్యిరివ నృసింహేంద్రా
త్తస్మా త్పంక్తిరథాదివ ll

వీరౌ వినయినౌ రామ
లక్ష్మణావివ నందనౌ
జాతౌ వీరనృసింహేంద్ర!
కృష్ణరాయమహీపతీ ll"[1]

అని కృష్ణరాయలవంశము వర్ణింపబడినది. ఇందువలన చంద్రవంశమునకు జెందిన తుర్వసుని సంతతివారిలో తుళవేంద్రులయందు యశస్వియగు తిమ్మభూపతి పుట్టెననియు, నతనికి దేవకియందు బుక్కమ భర్తయగు నీశ్వరక్షితిపాలకుడు గలిగె ననియు, వారికి నరసావనిపాలకు డుదయించె ననియు నతని భార్యలలో దిప్పాజియందు వీర నృసింహేంద్రుడును, నాగలాదేవియందు కృష్ణ రాయ మహీపతియు దశరథునకు గౌసల్య సుమి త్రలయందు రామలక్ష్మణులవలె జనించిరనియు దెలియవచ్చుచున్నది. ఈ వంశానుక్రమణికయే ఆ కాలమున రచింపబడిన సంస్కృతాంధ్రగ్రంథముల యందును నల్పభేదములతో గానవచ్చుచున్నది. అచ్యుతరాయాభ్యుదయమున కైశాసనమునందు వలె చంద్రుడు మొదలు తుర్వసునివఱకు గల వంశ క్రమము జెప్పబడియున్నది. మఱియు తుర్వసుని వంశమున నెక్కు రాజులు గలిగిరనియు, వారి యందు విఖ్యాతుడగు తిమ్మభూమిపాలకుడు జనించె ననియు గలదు.

"అజాయతా వ్యాజసుహృత్ప్రజానాం
సధూర్వహ స్తుర్వస్తురుర్వరాయాం

తదన్వయే పుణ్యఫలాదవన్యాం
ధన్యాబభూవు ర్ధరణీభుజోఽన్యే ll

. . . . . .

నాళీకినీనాయకవర్ధ్ర హేషు
నీహారభూమీధరవన్న గేషు

---

1. ఎపి. కర్ణా, సం. ౧౧, హోళె. నెం. ౯౪.

వలాసుహృద్వారణవద్గజేషు
తేషుప్రతీతో౽జని తిమ్మభూపః''2

ఇందు తుళవేంద్రుల ప్రస్తావములేదు: కాని కృష్ణరాయకృత ఆముక్తమాల్యద యందును, మఱియు నా రాయల కంకితము సేయబడిన యాంధ్రప్రబంధములు గొన్నింటియందును తుర్వసు వంశము తుళవాన్వయ మాయెననియు, నందు కృష్ణరాయల ప్రపితామహుడైన తిమ్మభూపాలు డుదయించెననియు జెప్పియున్నది. పైనుదాహృత మైన అచ్యుతరాయాభ్యుదయమున జెప్పినట్లు ముక్కుతిమ్మనార్యుని పారిజాతాపహరణము నందును:

"ఉర్వీశమౌళియగు నా
తుర్వసువంశంబునందు దుష్టారిభుజా
దుర్వారగర్వరేఖా
నిర్వాపకు డీశ్వరాఖ్యనృపతి జనించెన్."3

అనియే యున్నది. తుళవేంద్రుల ప్రశంస ఇందును లేదు. కాని కృష్ణరాయకృతాముక్త మాల్యద యందును పెద్దనార్యకృత మనుచరిత్ర యందును తుర్వసుని వంశమే తుళవాన్వవాయ మైనట్లు చెప్పియున్నది.

"అతనికి యదుతుర్వసులను
సుతు లుద్భవమంది రహితసూదనులు కళా
న్వితమతులు వారిలో వి
శ్రుతకీర్తి వహించె దుర్వసుడు గుణనిధియై
వాని వంశంబు తుళవాన్వవాయమయ్యె
నందు బెంకటద్రునృపు లుదయంబునొంది
నిఖిలభువనప్రపూర్ణనిర్మలకీర్తి
నధికు లైరి తదీయాన్వయమున బుట్టి."4

తామ్రశాసనమున తుర్వసువంశజుడగు తిమ్మ భూపతి తుళువేంద్రులలో యశస్వి యని యుండగా నాముక్తమాల్యద మనుచరిత్రలయందు తుర్వసుని వంశము 'తుళువాన్వవాయమయ్యే'నని చెప్పియున్నది. తుర్వసునివంశజులు తౌర్వసు లగుదురు కాని తుళువ లెట్లు కాగలరు? 'తుళువ' శబ్దము 'తులు' శబ్దభవమగు విశేషణము. దానికి అర్థము తులుదేశసంబంధమైన, లేక తులుదేశోద్భవ మైన అని. ఈ తులుదేశము పశ్చిమసముద్రమున విజయనగరసామ్రాజ్యములోని కణకుపాయెయుండిన యొక మండలము. ప్రస్తుతపు దక్షిణకన్నడజిల్లా ప్రాచీనతుళువమండలమున నొక భాగము. కావున తుళువవంశమునకు తుళువమండలముతో నేదో సంబంధ ముండెనని తోచుచున్నది. సాళువనరసింహ రాయల కాలమున (క్రీ. శ. ౧౪౮౬-౧౪౯౦) నందిమల్లయ్య ఘంటసింగయలచే రచింపబడి, నరసా నాయకుని కంకితమునేయబడిన, వరాహపురాణ పీఠికయందు తుళువవంశమునకు మూలపురుషుడగు తిమ్మధాత్రీరమణుడు తుళు దేశస్థుడని స్పష్టముగ జెప్పియున్నది.

"మిన్నుల మోచి భాగ్యముల
మీఱిన కోటల రమ్యహర్మ్యసం

పన్నత సస్యవాటగరి
మంబుల దోటల వాహవారణా

భ్యున్నతి గేలిదీర్చికల
నుగ్రభటావలి వన్నె కెక్కి వా

రాన్నిధి కాంచిపై దుళువ
రాజ్యము సంతతవీరభోజ్యమై.

ఆ తుళువరాజ్యమున వి
ఖ్యాతి వహించిరి దిగంతకరికటతటసం

భూతమదజాతనవి
ద్యాతత్పరకీర్తి బెండ్లియాడిన రాజుల్.

వారల కగ్రగణ్యుడు ని
వారితవైరివరూథినీధవ

శ్రీరమణీవిలాసుడు వి
చిత్రకళాకుశలుండు తిమ్మధా

---

2. అచ్యుత. ౧: ౧౮, ౨౨, ౨౩.
3. పారి. ౧: ౯.
4. ఆముక్త. ౧: ౨౨-౨౩

త్రీరమణుండు సంపద వ
రించె మరాటవరాటలాటగాం

ధారయుగంధరాదిపస
దఃప్రకటీకృతశాహుపీర్య్యుడై.'' 5

తుళువంశానుక్రమణిక మొట్టమొదట గాన వచ్చున దీవరాహపురాణమునందే. ఇందు చంద్ర వంశముమాటగాని, తుర్వసుని ప్రస్తావనగాని లేదు. తుళువవంశమునకు మూలపురుషుడైన తిమ్మ ధరణీశ్వరుడు తుళువరాజ్యమున ఖ్యాతివహించిన రాజులకగ్రగణ్యుడని స్పష్టము సేయబడినది. వరాహపురాణ పీఠికయందింకొక విశేషముగలదు. ఇందు కృతిపతియైన తుళువనరసనాయకుడును నతని పూర్వికులును ఉత్రియజాతికి సహజమైన సూర్య చంద్రవంశములలో దేనికిజెందినవారో వివరింపకున్నను నా నరసనాయకునికి ''బతియైన సాళువనరసింగరాజు ''రాజమౌళి పావనాన్వయ'' మునకు 'చంద్రుడు వంశకర్త' యని చెప్పి యున్నది. ఇంకను నా సాళువ నరసింగరాయ మహారాజు 'తుహి నాంశువంశపాథోరాశి మాణిక్య' మని పేర్కొనబడినాడు. సాళువ నరసింగరాయల వంశము చంద్రవంశమని తెల్పిన కవులు గృతిపతియైన నరసానాయకు డేఉత్రియశాఖకు జెందినవాడో విశదముసేయక మూకీభావము వహించి యా యంశమును సన్న సన్నగా జాఱవిడుచుటను జూడ తుళువరాజులు ఉత్రియులు గారని వీరి యభిప్రాయమేమో యను సంశయము గలుగుచున్నది. ఈ సంశయమును బలపఱచగల విషయమింకొక్కటి కలదు. సంస్కృతాంధ్రగ్రంథములందును, శాసనములలోని సంస్కృతప్రశస్తులందును ఉత్రియులకు నైజములగు రాజ, నృప, పార్థివాభిధలతో బేర్కొనబడియున్నను, దేశభాషలందు ప్రకటితములైన శాసనములు దేశభాషాగ్రంథములు మున్నగువానియందు కొన్నింటియందును రెండవ మూడవ తరముల తుళువ ప్రభువులు 'నాయకు' లనియే పిలువబడియున్నారు. ''ఇమ్మడి నరసింగరాజమహారాయర సేనాధిపతి ఈశ్వరనాయక వొడయర కుమార....నరసంణనాయకవొడయరు,'' ''ఇమ్మడి నరసింగరాయమహారాయర కార్యకర్తరాద నరసంణనాయక వొడయరు'' ఇత్యాదులు శాసనములందు గానవచ్చుచున్నవి.[6] ఇట్లే రాయవాచకమందును కైఫీయతులందును, 'ఈశ్వరనాయంకుడున్ను, నరసానాయంకుడున్ను, వీర నరసింహ్మరాయలవారున్ను యేలినందుకన్నా కృష్ణరాయలవారు యేలేది యేమున్నది;'[7] ''నరసింహదేవరాయలవద్ద కార్యకర్త అయిన నరసానాయనింగారు''[8] మొదలైన వాక్యములలో ఈశ్వరనాయకుడు, నరసానాయకుడనియే వారి పేరులు గానవచ్చుచున్నవి. సర్వసాధారణముగ నన్నియెడల నరసారాయని జ్యేష్ఠపుత్రుడు 'వీర నరసింహరాయ' లని వ్యవహరింపబడియున్నను, కాదాచిత్కముగ నీశ్వరనాయనింగారి మనుమడును నరసానాయనింగారి కుమారుడునైన ఇమ్మడినరసానాయనింగార'ని శాసనములందచట నచట గానవచ్చుచున్నది.[9] వరాహపురాణ పీఠికయందు తుళువవంశజులు ఉత్రియజాతియందేశాఖకు జెందినవారో చెప్పకపోవుటయు, శాసనాదులందీ వంశజులగు మొదటిప్రభువులు 'నాయకాంత' నామధారులగుటయు జూడ నీవంశమువారు ఉత్రియులు గారనియు, శూద్రులనియు తలంపు గలుగవచ్చును. కాని యట్లని దృఢముగ బల్కుటకు వీలులేదు. ఏలనగా, తుళువరాజులు ఉత్రియులు కారనియు, శూద్రులనియు నెచ్చటను జెప్పి యుండలేదు. మఱియు నీవంశపు మొదటిరాజులు నాయకులని పేర్కొనబడియున్నను అందువలన వారు శూద్రులని నిశ్చయించిచెప్పుటకు వీలులేదు. క్రీ. శ. ౧౫, ౧౬ శతాబ్దములందు బ్రాహ్మణాదిగ సర్వవర్ణములవారును నాయకనామమును ధరించెడువారు. కృష్ణదేవరాయలవారి కడపటి దినముల లోను, నచ్యుతరాయలవారి రాజ్యారంభదశ

---

5. వరాహ. ఆ. ౧ : ౨౫-౨౭.

6. *EC. X. In.* 259, *IX. Cp.* 52, *ARE* 143 *of* 1905, 719 *of* 1917.

7. *Further Sources. Vol. II. No.* 129(*b*)

8. *Ibid. No.* 91

9. *ARE* 54 *of* 1915.

అజునికి అత్రి ; అతనికి చంద్రుడు ; చంద్రునికి బుధుడు ; వానికి పురూరవుడు ; పురూరవునికి ఆయువు ; అతనికి నహుషుడు ; నహుషునకు యయాతి ; వానికి తుర్వసుడును జనించిరి. అతని వంశస్థులు కురుదేశమున వృద్ధినందిరి. తద్వంశజులలో కొందఱు సుగ్రీవునిచే బూజలుగొన్న రఘువంశోత్తముడగు సీతారాముని సేవింప గిష్కింధకు వచ్చి యచ్చటి దేశసౌందర్యమును మెచ్చి హేమకూటప్రాంతమున వసతులేర్పఱచుకొని యచ్చటనే నివసింపమొదలిడిరి.

వారిలో తుళువవంశాంబుధిచంద్రుడును, మహాపరాక్రమశాలియునగు దిలీపుడొక్కడు. దేవకీజానియగు నతనికీశ్వరుడు పుట్టెను. అతనికి నరసరాజు పుట్టెను.[11]

ఈ వంశానుక్రమణికయందు రెండుమూడు విషయములనుగూర్చి కొంత విమర్శ కెడమున్నది.

(౧) కురుదేశస్థులును తుర్వసువంశజులగు రాజులుకొందఱు సీతారాముని సేవింప కిష్కింధకు వచ్చి యచ్చట నివాసము లేర్పఱచుకొని స్థిరముగ నిలిచిపోవుట మఱి యేశాసనమునను గ్రంథమునను, గానరానివిషయము. ఇది ఈ శాసనములో గాన్పించు నూతనవిషయముల యందొకటి.

(౨) అట్లు కిష్కింధకువచ్చిన తుర్వసువంశజులందఱును తుళువరాజులు గారు. వారిలో గొందఱు మాత్రమే తుళువవంశమునకు జెందినవారు. ఇదియును గ్రొత్త సంగతియే. తుర్వసువంశజులే తుళువలైరని ఇందు చెప్పలేదు.

(౩) ఈశ్వరనాయకుని తండ్రిదిలీపుడట. అన్ని సంస్కృతాంధ్రగ్రంథములలోను శాసనములందును తిమ్మభూపతి యని యున్నది. 'దిదీపే తిమ్మభూపతిః' అనునదియే దిలీపు డనుటకు కారణమైయుండునేమో. ఈ పౌరాణిక వంశవృక్షము వాస్తవమైనది కాదు ; కేవలము కల్పన. ప్రఖ్యాతికివచ్చిన రాజన్యకుటుంబము లన్నియు దమ కులీనతను ప్రకటించుకొనుట కిట్టి కల్పిత పౌరాణిక వంశవృక్షములను వ్రాయించుకొని నిజవంశమున కతికించుకొనుట యందును రాయలవారికి ప్రధానమంత్రియైయుండిన వీరనరసింహనాయక సాళువదణ్ణాయకుడు బ్రాహ్మణుడు. ఇతని జన్మనామము సెల్లప్ప ; అతడు తాటివకుపెద్దన్నభట్టను కాంచీపుర బ్రాహ్మణుని కుమారుడు.[10]

కావున ఈశ్వరనాయక నరసనాయక ఇమ్మడి నరసనాయకాది తుళువప్రభువులు నాయక నామమును గలిగియుండినంతమాత్రమున వారు శూద్రులనియు, క్షత్రియులు గారనియు నిర్ధరించి చెప్పుటకు వలనుపడదు. లభ్యమైన సాక్ష్యమును పరిశీలించి చూడగా తుళువరాజులు శూద్రులనుట కంటె క్షత్రియులని చెప్పుట యొప్పు.

ఇట్లు తుళువరాజులు క్షత్రియులని తలచుట సమంజసమైనను, వారు రాయపదమును బడయుటకుముందు తమ క్షత్రియత్వమును ప్రకటించుకొని యుండలేదు. తుళువరాజులలో రాజ్యాభిషిక్తుడై మొదట మహారాయపదము నందినవాడు వీరనరసింహరాయడు. ఇతడు క్రీ. శ. ౧౪౦౬ వ సంవత్సరమున దనకు యజమానుడైన సాళువ ఇమ్మడినరసింహ ధర్మరాయని జంపించి సింహాసనము నాక్రమించుకొని రాజ్యాభిషేకము గావించుకొనెను. ఇతడే తుళువవంశము చంద్రవంశాంతర్గత మని మొదట చెప్పుకొనుట కారంభించినవాడు. ఇతని కాలమునసే శాసనములందగపడు తుళువవంశప్రశస్తి రూపందినది. వీరనరసింహరాయల శాసనములలో నీ ప్రశస్తి రెండువిధములుగ గాన్పించుచున్నది. అందొకటి నరసింహార్యకృతము. ఇది యిట్లున్నది.

---

10. *ARE.* 487 *of* 1920, 225, *of* 1916.

సాళువతిమ్మరసయ్యగారి కుమారుడు తిమ్మయ్యకు 'దణ్ణాయకుడ' నియు 'తిమదణ్ణాయకుడ' నియు బేర్లుండినట్లు న్యూనిసు వ్రాసియున్నాడు. (*For. Emp.* 360-61) నేటికిని మంగుళూరుప్రాంతముల నివసించు కొంకణి తులు బ్రాహ్మణు లనేకులు 'నాయక' నామాంతధారులు గలరు. వెలమలు కమ్మలు తెలగలు మొదలగు పలు శూద్రజాతులవారేకాక మాలలుగూడ నాయకు లనబఱగుచుండిరి.

11. *EC. X gd.* 77.

సాధారణమే. ఇందు వింత యేమియు లేదు. ఏ కారణమువలననో తుళువరాజులకు నరసింహోర్వ్యనిచే ప్రథమమున వ్రాయించుకొనిన ప్రశస్తి నచ్చక పోయినది. సభాపతి శాసనగ్రంథ రచయితయైన పిమ్మట నూతనప్రశస్తిని వ్రాయించుకొనిరి. ఈ సభాపతికృతనూతన ప్రశస్తియే సర్వసామాన్యముగ తుళువ శాసనములందు గానవచ్చును.

తుళువరాజులు చంద్రవంశాంతర్గతతుర్వసుకుల క్షత్రియులని దానశాసనాదులందు చెప్పబడియున్నను కొన్నియెడల వేఱువిధముగ నున్నది. సమకాలీన గ్రంథకర్తలందరిపలెను ముక్కుతిమ్మనార్యుడుగూడ తుళువరాజులు తుర్వసువంశజులని వ్రాసియున్నను పారిజాతాపహరణమునందు కృష్ణరాయలను వర్ణించుచు:—

"చకవర్తిమహాప్రశస్తి నాడును నేడు
చెలగి ధర్మక్రమస్థితి ఘటించె

భూభృదుద్ధరణవిస్ఫూర్తి నాడును నేడు
గోరక్షణఖ్యాతి గుదుఱుపటిచె

సాధుబృందావనసరణి నాడును నేడు
వంశానురాగంబు వదలడయ్యె

సత్యభామాభోగసక్తి నాడును నేడు
నాకల్ప మవని నింపార నిలిపె

నాడు నేడును యాదవాన్వయమునందు
జననమందెను వసుదేవ మనుజవిభుని

కృష్ణుడనుపేర నరసేంద్రుకృష్ణదేవ
రాయ డనుపేర నాదినారాయణుండు." [12]

అని కృష్ణరాయలు యాదవాన్వయమునందు పుట్టినట్లు వచించినాడు. కృష్ణరాయలు యాదవుడయిన నతని పూర్వికులందఱును యాదవులు గావలయును గదా. తుర్వసుని సంతతివారిని యాదవులనుట యెట్లు? ఈ ప్రశ్నకు దగిన సమాధాన మెద్దియో తెలియదు.

వాస్తవ మెట్లున్నను ప్రస్తుతము మనకు లభించిన సాక్ష్యమును బరిశీలించి విచారింపగా తుళువరాజులు క్షత్రియులని యంగీకరించుట సరియని తోచుచున్నది. కాని వారు క్షత్రియజాతికి సహజమైన సూర్యచంద్రాన్వయములు రెంటియందును దేనికి జెందినవారో నిశ్చయించి చెప్పుటకు దగు సాధనములులేవు. తాము చంద్రవంశమునకు జెందిన తుర్వసుకులజులమని వారు చెప్పుకొనిరి. వారి పౌరాణికవంశవృక్షము కల్పనయగుట వలన నది విశ్వాసపాత్రము గాదు. కాని దీని నంగీకరించినందువలన కలిగెడు లాభములేదు; త్యజించుట వలన వచ్చు నష్టమును లేదు.

౨

కృష్ణరాయలు తుళువక్షత్రియుడగు నరసానాయకునికి పుత్రుడు గావచ్చును. ఆకారణమువలన నతడును క్షత్రియుడే యని నిశ్చయించుటకు వలనుపడదు. ఆతని తల్లి క్షత్రియస్త్రీగాక క్రింది జాతులలో బుట్టినదైయుండిన నతనిది తల్లికుల మగునుగాని తండ్రికులముగాజాలదు. కృష్ణరాయల జన్మమును గూర్చిన గాథలు పెక్కు ఆంధ్రదేశమున ప్రచారమునందున్నవి. కృష్ణరాయల తల్లియగు నాగలదేవి నరసానాయకుడుద్వాహము జేసికొన్న కులవధువు గాదనియు, భోగకాంత యనియు, దత్కారణమున నతడు క్షత్రియుడు గాడనియు, దాసీ పుత్రుడనియు వీని సారాంశము. ఉదాహరణార్థ మొకటిరెంటి నిచట సంగ్రహముగ వివరించుట యుక్తము. కృష్ణరాయల తండ్రియగు నరసింహరాయడు ఒకనా డస్తమయమైనపిమ్మట కాలోచిత కృత్యముల దీర్చుకొనుటకు బహిర్దేశములకు జనియెను. ప్రఘాళనమునకై కొనిపోయిన యుదకపాత్రయం దొక్క తేజోవంతమగు చుక్క తెగిపడెను; అంతట నరసింహరాజా పాత్రను దనయఱచేతితో మూసి యా వర్తమానమును తిమ్మరసునకు జెప్పి పంపెను; తిమ్మరసామాట వినగనే రాజు నా నీరు ప్రాగమని ప్రత్యుత్తరమంపెను. తిమ్మరుసుసలహా ప్రకారము ఆ నీరు ప్రావి నరసింహరాయ లారాత్రి తన దేవితో నిద్రించుట

---

12. పారి. ౧: ౦౯.

కంతఃపురమునకు బోయెను. పట్టపుదేవి తిప్పాజి బహిష్ఠయెయుండినది. దానికి చింతించి యాతడా రాత్రి దేవి చెలిక త్తెలయందొక దాని సంగతి నుండెను. ఆ చెలిక త్తె గర్భవతియై కాలక్రమమున కృష్ణరాయల గనెను. ఈ కథప్రకారము కృష్ణరాయల తల్లి పట్టపుదేవి తిప్పాజి చెలిక త్తెలలో నొకతె. మఱియొకకథ దీనికంటె గొంచెము భిన్నమైనది :—

విజయనగర మేలిన వీరనరసింహరాయలకు చిరకాలము పుత్రసంతతి లేదు. ఒకనాడు రాజుదగ్గ ఱకు బ్రాహ్మణు డొకడు వచ్చి యారాత్రియొక సుముహూర్తము గలదనియు, నా ముహూర్తకాల మున బట్టపుదేవి సంగతి నుండిన సుపుత్రుడు గలుగ ననియు జెప్పెను. అంతట నరసింహరాయలు అంతఃపురమునకుబోయి తిప్పాజీదేవికివర్తమానమంపెను; కాని యామె సింగారించుకొనివచ్చు లోపల నా శుభ ముహూర్తము గడచి పోవుచుండెను. రాజందుకు విసిగి పడకటింటిలో నప్పుడు దీపములు బాగు సేయుచుండిన దాసిని నాగిని జూచి ముహూర్తమును వ్యర్థపడనీయక దానిగూడెను. నాగికంతట గర్భము గలిగెను. నవమాసములు నిండిన పిమ్మట నొక తేజశ్శాలి పుత్రు డుదయించెను. అతడే కృష్ణదేవరాయలు.

ఇట్టివి మఱికొన్ని కథలు గలవు. ఇవి విశ్వాసపాత్రములు గావు. న్యూనిస్ చరిత్రయందుగాని, రాయవాచకమునందుగాని, శాసనములయందుగాని కృష్ణరాయల తల్లియగు నాగాంబ కులస్త్రీ కాదనుట కేయాధారమును గానరాదు. [12a]

12a. కీ. శే. వీరేశలింగం పంతులుగారు ఇట్లు వ్రాసియున్నారు: "కృష్ణదేవరాయల తండ్రియైన నరసింహరాయనికి తిప్పాంబయనియు, నాగమాంబ యనియు ఇద్దఱు భార్యలు గలరు. ఆ యిరువురిలో తిప్పాంబ పట్టపురాణియనియు నాగాంబ భోగకాంత యనియు జెప్పుదురు. కొన్ని శాసనములందు గూడ నిట్లే కానబడుచున్నది." ఆం. క. చ. రెండవ భా. పుట ౧౧. ఇది కేవలము నిరాధారమైన వ్రాత.

13. సూయెల్. ఫర్‌గాటన్ యెంపైర్ పుట ౩౧౪.

న్యూనిసు నరసానాయకుని సంతతిని ఇట్లు వర్ణించి యున్నారు: "నరసానాయకునికి పుత్రులై దుగురు: ఒకడు బుస్వలరావు (భుజబలరాయలు); ఇంకొకడు క్రిస్మరావు (కృష్ణరాయలు); మఱియొకడు తెతరావు (అచ్యుతరాయలు); ఇంకొకడు రమిగప (రంగప్ప); ఇంకొకడు ఔమిసాయ(?)" [13] న్యూనిస్ కృష్ణదేవరాయల సమకాలికు డనియు, నతడు క్రీ. శ. ౧౫౪౨ నకు పూర్వము విజయనగర చరిత్రను రచించెననియు పూర్వ ప్రకరణమున జెప్పి యున్నాడను. కాని న్యూనిసు నరసనాయకుని పుత్రులను బేర్కొనెనేకాని వారి తల్లులు కులపాలికలో భోగకాంతలో తెలుపలేదు; కావున న్యూనిసు సాక్ష్యమువలన కృష్ణరాయలు భోగకాంతపుత్రుడుగాడనియు, ధర్మపత్నిగర్భమున బుట్టినవాడనియు రుజువుసేయుటకు వీలుగాదు అను నాక్షేపణ రావచ్చును. కాని న్యూనిసుచరిత్రయందు దాపరికములు గానరావు. కృష్ణరాయల చరిత్రమునకు గళంకమును గల్గించు సంశయములనుగూడ మొగమాట మించుకంతయు లేక నతడు వర్ణించియున్నాడు. చిన్నాదేవీ వృత్తాంతము దీనికి దార్కాణ.

"ఈ కృష్ణరావు పసివాడై బిన్నగపట్టణమున బెరుగుచుండినప్పుడు, చిన్నాదేవియను వెలయాలితో జంజాటము గలిగినది. దానిపై నతనికి నిర్భరమైన వలపు; మోహాతిశయమువలన దానొకవేళ రాయలైనపిమ్మట దానిని వివాహమాడెదనని చెప్పియుండెను. పరియాచకమున కతడట్లన్నను, వాస్తవముగ నతడు రాయలాయెను. అట్లు చరిత్ర తెల్పుచున్నది. సింహాసనము నధిష్ఠించినపిమ్మట నతడు దత్పూర్వము పసితన మందు జేసిన చేష్టలనన్నింటిని విస్మరించినను ఆ వెలయాలిమీది వలపును మరువలేదు; రాజమందిరమునుండి రహస్యముగ దాని యింటికి బోవువాడు. ఈ విషయమాతనిమంత్రి సల్లవతినిచ (సాళువ తిమ్మయ) యొక రాత్రి కనుగొని యతని వెంబడించి దాని యింటికిబోయి యచట నతని ఖండించి రాజమందిరమునకు మరల దోడ్కొనిపోయెను. అచట రాజు దానియందు దానెంత గాఢానురక్తుడైయుండినదియు, దానిని తానెట్లు వివాహ

మాడెదనని వాగ్దత్తముజేసినదియు జెప్పి యెట్లైనను దానాడినట్లు చేయ నిశ్చయించు కొంటిననియు బల్కెను. అతని సంకల్పము దృఢ మైనదని గ్రహించి మంత్రి యతని యిష్టాను సారము వర్తించుటమేలని తలచి యేలినవారి కపయశస్సు రానీయక నిర్వహించెదనని చెప్పెను. తాము చెప్పినట్లు సేయుటకొఅకతడు (మంత్రి) నరసింగదేశనృపాలుర యింటబుట్టిన సుందరాంగి యగు కన్యను దెచ్చి యతనికి (రాజునకు) వివాహముగావించి యుద్వాహోత్సవములు ముగిసినవెనుక నామెను నా భోగకాంతతో గూడ నొక్క మందిరమున నుంచెను. '' 14

కృష్ణరాయలు వెలయాలిని బెండ్లాడెనని చెప్పిన చరిత్రకారుడు వాస్తవముగ నతనితల్లి భోగకాంతయో, దాసియో యైయుండినయెడల నావిషయమును దెల్పకయుండడు. తన మాతృ దేశమగు పోర్చుగలందు పోర్చుగీసుచరిత్రకారుని యుపయోగార్థము పోర్చుగీసుభాషయందు వ్రాసి పంపిన వృత్తాంతమున గృష్ణరాయలు నిజముగ దాసీపుత్రుడేయైయుండిన నాయంశమును జెప్పక డాచవలసిన యవసరమేమియు గానరాదు. మరియు గృష్ణరాయలతని ద్వైమాతురజ్యేష్ఠభ్రాతయగు వీరనరసింహరాయల శాసనములందిట్లు వర్ణింపబడి యున్నాడు.

'' తిప్పాజీనాగలాదేవ్యోః
కౌసల్యా శ్రీసుమిత్రయోః

దేవ్యోరివ నృసింహేంద్రా
త్తస్మాత్పం క్తిరథాదివ॥

వీరా వినయినౌ రామ
లక్ష్మణా వివనందనౌ

జాతావీరనృసింహేంద్ర
కృష్ణరాయమహీపతీ॥''15

తస్మా న్నరసరాజేంద్రా
త్తిప్పాజీనాగమాంబయోః

క్రమాద్వీరనృసింహేంద్ర
కృష్ణరాయౌ బభూవతుః ॥

అన్యోన్యోపమయోస్సర్వ
సద్గుణౌ ఘసముద్రయోః

తయో ర్వీర నృసింహేంద్రః
పిత్ర్యం సింహాసనం శ్రితః ॥ ''16

పై నుదహరింపబడిన శ్లోకములందు తిప్పాజియు నాగలాదేవియు దశరథుని కౌసల్యా సుమిత్రలవలె దేవులు. అనగా పట్టాభిషిక్తులైన భార్యలు, వారొండురులకు సమానులు. కావునవే వారికి బుట్టిన పుత్రులు రామలక్ష్మణులతో బోల్పబడిరి. వీరనరసింహరాయలు కృష్ణరాయల తల్లిని నాగలాదేవిని తన తల్లిని బోలి నరసా నాయకుని 'దేవి' యని చెప్పుటవలన నామె కుల సతియేకాని భోగకాంతకాదని నిశ్చయముగ చెప్ప వచ్చును. ఇంకొక విశేషము. నరసానాయకునికి భార్యలు మువ్వురుండిరి. తిప్పాజీ నాగలా దేవులు గాక రంగ ఱితీంద్రాచ్యుత దేవరాయ జనని యోబాంబ యను మఱియొక భార్య నరసానాయ కుని కుండినను కృష్ణరాయని నతని తల్లియగు నాగలను దన శాసనములందు వేర్కొనిన వీర నరసింహరాయలు వారి మాట యెచ్చటను ఎత్తక పోవుట చిత్రము. నాగలాదేవియు ఓబాంబవలె నతనికి సవతి తల్లియేకదా. కృష్ణరాయలవలె రంగాచ్యుతులును సవతితమ్ములేకదా. నాగలా దేవిని కృష్ణరాయలను మహా గౌరవముతో వేర్కొనిన వీరనరసింహరాయలు వారి ప్రస్తావ మేల చేయలేదో ?

3

ఇంతవఱకు నడచిన చర్చవలన కృష్ణదేవ రాయలు జన్మించిన తుళువవంశము క్షత్రియవంశ

---

14. సూయెలు – ఫరగాటన్ యెంపైర్. పుటలు ౩౬-౩౭.

15. కంచికామకోటిపీఠస్థులగు శ్రీ శంకరా చార్యులవారి యొద్దనుండు తామ్రశాసనములు, నెం. ౨. పుట ౨౨.

16. ఎపి. కర్ణా. సం. ౧౦ గోరి. ౨౨.

మనియు నాద్యమున నావంశమువారు తుళుదేశ వాస్తవ్యులనియు నతనితల్లి నాగలాదేవి నరస నాయకుని కులవధువనియు దేలుచున్నది. ఈపట్టున విచారించవలసిన సమస్య యొకటి గలదు. కృష్ణ దేవరాయలు ఉత్రియుడనుటసరి. కాని యాతని జాతి యెద్ది? ఆంధ్రుడా? కర్ణాటకుడా? ఈ ప్రశ్నలకు సమాధానము జెప్పుట సులభకార్యము గాదు. ఒకదృష్టితో జూచిన కృష్ణరాయలాంధ్రు డును గాడు, కర్ణాటకుడును గాడు. తుళువరాజ వంశమునకు మూలపురుషుడును గృష్ణరాయలకు ముత్తాతయునైన తిమ్మరాజు తుళుదేశస్థుడని వరాహపురాణమున స్పష్టముగ జెప్పియున్నది. ఇతని వంశమున బుట్టినవారందఱు తుళుజాతి వారగుదురు కాని యన్యజాతివారు కాజాలరు; కాని మఱియొకదృష్టినిజూచిన వారాంధ్రులగు దురు గాని యన్యులు గారు. వారి ఆదిమ జన్మస్థానము తులుదేశమైనను, మూలపురుషుడైన తిమ్మరాజుదినములందే జన్మదేశమును ద్యజించి దక్షిణాంధ్రదేశమునకు వచ్చి చంద్రగిరియందు సాళువరాజుల నాశ్రయించి యచటనే స్థిరనివా సము లేర్పఱచుకొని నిలిచిపోయిరి. నాడాదిగ తుళువవంశమువారి కాంధ్రదేశము మాతృదేశ మాయెను. ఆంధ్రరాజ కుటుంబములతో సంబంధ బాంధవ్యములను గల్గించుకొనిరి. బుక్కమ్మ, తిప్పమ్మ, నాగమ్మ, ఓబమ్మ, తిరుమలమ్మ, చిన్నాదేవి, వరద రాజమ్మ మొదలగు తుళువరాణులందఱును నాంధ్ర నారీమణులే. ఆద్యమునుండి తుళుభాషను వర్జించి తెనుగునే మాతృభాషగ స్వీకరించి తెనుగుకావ్య ములను రచించి తెనుగుకవుల నాదరించి పోషించి యాంధ్రవాఙ్మయమును బెంపొందించిరి. నంది మల్లయ్య, ఘంటసింగయల నీశ్వర నాయకుడు పోషించెను. నరసానాయకుడు వరాహపురాణమును వరలక్ష్మీకల్యాణము నరసింహవిజయములను కావ్యముల నంకితముగొనెను. ప్రోలుగంటి రంగన పినతాతకుమారుడును ద్విపదనారసింహపురాణము వచన బాలభారతము సౌభరిచరిత్ర జక్కులకథ మొదలగు గ్రంథములను రచించిన యష్టభాషా కవివర్యుడగుచెన్నకవిని వీరనరసింహరాయలగ్రహార ములను వివిధార్థములనిచ్చి సత్కరించెను. కృష్ణ దేవరాయలు స్వయమాంధ్రకావ్యనిర్మాత. అష్ట దిగ్గజములను సంరక్షించి వారినుత్తమకావ్యరచనకు బురికొల్పెను. ఆంధ్రభోజుడని కీర్తివడసెను. అచ్యుతరాయలు ఆంధ్రకవిజనకల్పభూజము. ప్రతి వర్షమును నొక యుత్తమాంధ్రకావ్యమును రచియింపజేసి తన యిష్టదైవమగు శ్రీవేంకటా చలపతి కంకిత మిప్పించెడివాడు. ఇట్లు ఆంధ్రదేశ మును స్వదేశముగను, నాంధ్రభాషను మాతృ భాషగను స్వీకరించి, యాంధ్రరాజకుటుంబములతో తరతరములుగ సంబంధబాంధవ్యములను గల్గించు కొని, యాంధ్రస్త్రీల గర్భమున జనించి, యాంధ్రులతో గూడిమాడి జీవనముసల్పి, యాంధ్రమున గ్రంథరచనజేసి, యాంధ్రకవుల నాదరించి పోషించి యాంధ్రవాఙ్మయమును బెంపందించిన తుళువరాజు లాంధ్రులుగాక యన్యు లెట్లు కాగలరు? కావున కృష్ణరాయలాంధ్రుడనుట యొప్పును.

3. రాజ్యాభిషేకము

కృష్ణదేవరాయ లెప్పుడు జన్మమందెనో తెలియదు.[1]

కావలి వెంకట రామస్వామిగారు తమ దక్షిణ హిందూదేశకవులచరిత్రలో కృష్ణరాయలు తన నలు వదవయేట శాలివాహనశకాబ్దములు ౧౪౪౬ వ సంవత్సరమునం, దనగా క్రీస్తుశకము ౧౫౨౪ వ సంవత్సరమున మృతి నొందినట్లు వ్రాసియున్నారు. దీని నాధారపఱచుకొని వీరేశలింగంపంతులుగారు

---

1. "కృష్ణరాయల జనన మొకరు ౧౪౮౬ వ సంవత్సరమునం దనియు, ఇంకొకరు ౧౪౭౮ వ సంవ త్సరమునం దనియు వ్రాసియున్నారు. గాని యం దేది సత్యమయినదియు నిశ్చయించుట కాధారము లేవియు దొరకలేదు" అని కందుకూరు వీరేశలింగంపంతులుగారు వ్రాసియున్నారు. ఆంధ్రకవుల చరిత్రము. మధ్య కవులు. పుట. ౧౦. వీ రెవ్వరో పంతులుగారు పేర్కొనలేదు.

'రాయలవారు హూణశకము ౧౪౮౪ వ సంవత్సరమున బుట్టినశ్లేర్వడుచున్నది. అల్లసాని పెద్దన్న చెప్పినట్లు చాటుధారగా వచ్చుచున్న 'బోరన యాచకప్రతతి' యను పద్యమునుబట్టి కూడ కృష్ణదేవరాయల మృతికాల మించుమించుగా దీనితో సరిపోవుచున్నది. గనుక మన కింతకంటె మంచి యాధారము దొరుకువఱకును రాయలవారి జన్మకాలము ౧౪౮౪ వ సంవత్సరమని నమ్మవచ్చును."[2] అని వ్రాసినారు. ఇప్పటివఱకును దొరకినశాసనముల సాక్ష్యమునుబట్టి కృష్ణరాయలవారు శకాబ్దము ౧౪౩౭ అనగా క్రీ. శ. 1530 వఱకును రాజ్యభారము వహించి యుండిరని నిశ్చయముగ దెలియవచ్చుచున్నది. కావున " బోరనయాచకప్రతతి" యను చాటువున జెప్పినట్లు శకాబ్దము ౧౪౪౬ లో, అనగా క్రీ. శ. ౧౫౨౪ వ సంవత్సరమున కృష్ణరాయలు మృతినందెననుట విశ్వాసపాత్రమైన విషయము గాదు. కావుననీ చాటువు నాధారపఱచుకొని గణించిన రాయల జన్మకాలమును నమ్మదగినదికాదు. మఱియు నతడు మరణకాలమప్పుడు నలుబదియేండ్ల వాడని తలచుట కేయాధారమును గానరాదు ; ముసలి వాడగునంతవఱకు జీవించియుండె ననుటకు గొంత యాధారముకలదు. రాయల వయస్సును గూర్చిన ప్రస్తావన న్యూనిజు గ్రంథమున నొకటి రెండు తావుల గానవచ్చుచున్నది. కృష్ణరాయల కుమారుని విషయము జెప్పుచు న్యూని జిట్లు వ్రాసియున్నాడు :

"రాజు (కృష్ణరాయలు) దీనిని (కలుబరిగెదండయాత్రను) ముగించి, తన శత్రులందఱిపై భూరివిజయములను బడసిన పిమ్మట, తాను అప్పటికే వృద్ధుడగుటచేత దన వార్ధక్యమునందు విశ్రాంతి నందవలయు ననియు, దన మరణానంతరము దన పుత్రుడు రాజు గావలయుననియు గోరి యీత డాఱేండ్లబాలు డగుటవలన తాను గతించిన వెనుక స్థితిగతు లెట్లుండునో యని శంకించి బ్రతికియుండగనే యతని రాజును జేయ నిశ్చయించుకొనెను. ఆ కారణమువలన నతడు దన సింహాసనమును, యావదధికారమును, (రాజ) నామమును ద్యజించి వాని దన కుమారుని కిచ్చి తా నతనికి బ్రధానియై యంతకు ముందు తనకు బ్రధానియై యుండిన సాళ్వ తిమ్మను మంత్రిని గావించుకొని యతని పుత్రులయం దొక్కని (రాజ్యమున) మహాసామంతుని గావించెను."[3]

ఇందువలన కృష్ణరాయలు దన కుమారునికి రాజ్యాధికార మొసగినపుడు ముసలివాడని తెలియుచున్నది. రాజ్యాధికార మొసగినది కలుబరిగెదండయాత్రయైనపిమ్మట. కలుబరిగెదండయాత్ర నడచినది రాయచూరువిజయానంతరము. రాయచూరు విజయము చేకూఱినది క్రీ. శ. ౧౫౨౩ వ సంవత్సరమునకు సరిపోవు ౧౪౪౪ శకాబ్దమున. కావున కృష్ణరాయలు కుమారునికి రాజ్యాధికారము నిచ్చినది శకాబ్దము, ౧౪౪౪ నకు దరువాత నని నిశ్చయమగుచున్నది. ఎంతకాలమునకు దరువాతనో సూక్ష్మముగ దెలియవలయునన్న కృష్ణరాయల శాసనములను బరిశీలింపవలసియున్నది. మొదట పరిగణింపదగినది రాయసము కొండమరసయ్య గారి చోళసముద్ర శిలాశాసనము. ఇది శకాబ్దము ౧౪౩౯ ఈశ్వర సంవత్సరమునాటిది. చోళసముద్ర చౌడేశ్వరీయాలయమునకు గృష్ణరాయలవారికి సంతానము గలుగవలయునని కొండమరసయ్యగారు చేసిన దానమునిది తెలియజేయుచున్నది.[4] ఇందువలన శకాబ్దము ౧౪౩౯ వఱకు కృష్ణరాయలకు బిడ్డలులేరని నిశ్చయమగుచున్నది. తరువార వేర్కొనదగినది శకాబ్దము ౧౪౪౦ బహుధాన్య సంవత్సర కార్తిక శు. ౧౩ శని వారమునాడు కృష్ణదేవమహా రాయలవారును, నతని పట్టపురాణి తిరుమలదేవి గారును దమ పుత్రుని మేలు గోరి యంజనగిరి తిరువెంగడనాథునికి జేసిన భూదానమును తెలియజేయు కమలాపురశిలాశాసనము.[5] ఇందువలన కృష్ణరాయలవారికి శకాబ్దము ౧౪౪౦ వ సంవత్సరమున తిరుమలరాయలను కుమారుడు పుట్టెనని నిశ్చయమగుచున్నది. కృష్ణరాయలు తన కుమారునికి రాజ్యాధికార మొప్ప

---

2. ఆం. క. చ. మధ్య కవులు. పుట. ౧౦. బోరనయాచకప్రతతి భూరివిపద్దశ నొందుచుండఁగా నారయ శాలివాహనశకాబ్దములద్రియుగాబ్ధిసోములం చారణ వత్సరంబున నిదాఘదినంబున జ్యేష్ఠశుద్ధ షష్ఠి రవివాసరంబున నృసింహుని కృష్ణుడుచేరె స్వర్గమున్ ద్వారకనున్నకృష్ణుడవతారసమాప్తమునొందుకైవడిన్

3. *Sewell : For. Emp. p.* 359.
4. *ARE.* 87 *of* 1912.
5. *ARE,* 697 *of* 1922.

జెప్పినపు డాకుమారు డాజ్ఞేండ్లవాడని న్యూనిసు చెప్పియున్నాడు. కావున రాజ్యాధికార మొప్ప జెప్పినది శకాబ్దము ౧౪౪౬ వ సంవత్సరమునం దై యుండవలయును. ఈ యూహ సరియైనదని శకా బ్దము ౧౪౪౬ వ సంవత్సరమున కృష్ణరాయల పుత్రుడు తిరుమలదేవరాయలు విజయనగర సామ్రా జ్యమును పాలించుచున్నట్లు తెలియజేయు శాస నము లనేకములు రుజువుసేయుచున్నవి.[6] కావున కృష్ణరాయలు శకాబ్దము ౧౪౪౬ వ సంవత్సరమున కుమారునికి రాజ్యాధికార మొసగెననియు, నప్పుడు రాయలు వృద్ధుడనియు దేలుచున్నది.

శకాబ్దము ౧౪౪౪ వ సంవత్సరమున గృష్ణ రాయలు వృద్ధుడగుట సరి. ఎన్నియేండ్లవృద్ధుడో చెప్పుటకు వీలుగాదు. కాని న్యూనిసు తన గ్రంథ మునం దొకచోట వీరనరసింహరాయల మరణసమ యమున గృష్ణరాయల వయ సిరువదేండ్లకు పైబడి యుండెనని వ్రాసియున్నాడు.[7] వీరనరసింహ రాయలు శకాబ్దము ౧౪౩౧ వ సంవత్సరమున కాలధర్మము నందెను. అప్పుడు కృష్ణరాయలు ఇరు వదియేండ్లకు పైబడిన వయసుగలవాడైనచో నతడు శకాబ్దము ౧౪౧౧వ సంవత్సరమునకుముందు పుట్టి యుండవలయును. ఎంతముందో చెప్పుటకు వీలులేదు. కావలి వెంకటరామస్వామిగారు చెప్పినట్లు కృష్ణరాయలు దన నలువదవ యేట పరలోకగతు డాయెనని యెంచుటకు వలనుపడదు. ఏలన సమ కాలికుడైన న్యూనిసు రాయలు తన పుత్రుని రాజును చేసినప్పుడే వృద్ధుడని చెప్పియున్నాడు. నలుబదియేండ్ల వయసు గల మనుష్యు నెవ్వరును వృద్ధుడని చెప్పరు. ఏబది యేండ్ల వయసుగలవాని గూడ వృద్ధుడని చెప్పుట యరుదు. ఇంచుమించుగ నఱువది యేండ్ల ప్రాయముగలవానినే లోకులు వృద్ధు డందురు. శకము ౧౪౧౧ వ సంవత్సరమున న్యూనిసు కృష్ణరాయల వయస్సు ముప్పదియని చెప్పక ఇరువది యేండ్లకు పైబడియుండెనని చెప్పి యుండుటవలన నతని వయసపు డిరువది యేండ్ల కెక్కువగను, ముప్పదేండ్లకు దక్కువగను నుండెనని మనము గ్రహించవచ్చును. అతని ప్రాయమపుడిరు వది తొమ్మిదేండ్లో యుండెనని యనుకొన్నను, కుమారునికి రాజ్యాధికార మొసగినపుడు, అనగా శకము ౧౪౪౬ వ సంవత్సరమున నతడు నలుబది రెండేండ్లవాడై యుండును. అట్లయిన కృష్ణ రాయల జననకాలము శకాబ్దము ౧౪౦౪ వ సంవ త్సరము గావలయును. కాని నలుబదిరెండేండ్ల వయసుగల కృష్ణరాయలను న్యూనిసు వృద్ధుడని చెప్పుట యసంభవము ; కావున ఇరువదియేండ్ల పైబడిన వాడని చెప్పుటలో న్యూనిసు ఉద్దేశ్యము అతని వయసును లెక్కింపవలయుననికాదు; అతడు రాజ్యాధిపత్యమును వహించుట కర్హవయస్కుడని తెల్పుటయే. ఈ యభిప్రాయము సరియైనచో శకా బ్దము ౧౪౧౧ లో నిరువదేండ్లకు మించిన వయసు గల కృష్ణరాయలు మఱి పండ్రెండేండ్లు గడచిన తరువాత శకాబ్దము ౧౪౪౬ లో వృద్ధుడగుటలో వింతలేదు. అప్పుడతని వయసేబది సంవత్సరములని యెంచిన నతడు శకాబ్దము ౧౩౯౬ ప్రాంతమున బుట్టి యుండవచ్చును. కాని యిది కేవలము నిరా ధారమైన యూహ. లభ్యమైన సాక్ష్యము నాధార పఱచుకొని ఇంతకంటె కచ్చితముగ నతని జన్మ కాలమును నిర్ణయించి చెప్పుటకు వీలునులేదు.

రాజ్యాభిషేకమునకు పూర్వము రాయల స్థితి

రాజ్యాభిషేకమునకు ముందు కృష్ణదేవరా యల స్థితి ఇట్టిదని నిశ్చయించి చెప్పుటకు దగిన సాక్ష్యములేదు. నరసనాయకుని పాలనక్రింద వీరనరసింహరాయనివలె నితడును రాజ్యపరిపాలన మున బాల్లోనెనేమో తెలియదు. ఒకానొక కన్నడ శాసనమున గృష్ణరాయలు చంద్రగిరి పెనుగొండ దుర్గములకు పాలకుడైనట్లు వ్రాసియున్నది. కాని

---

6. *ARE* 101, 115, 116, *of* 1918.

7. *Sewell. For. Emp. p.* 315.
"*Sallvatina hearing this and seeing that Crisnarao was a man of over twenty years .....*"

రాజ్యాభిషేకము—గాథలు

కృష్ణరాయల రాజ్యాభిషేకమునుగూర్చిన గాథలనేకము లాంధ్రదేశమున బ్రచారమునందున్నవి. ముఖ్యమైనవాని నిచట సంగ్రహముగ బొందుపఱచుచున్నాను.

౧. నృసింహదేవరాయలు వీరనరసింహరాయనిపై జూపు ప్రేమకంటె గృష్ణరాయలపై నెక్కువ మక్కువ జూపెడివాడట. దానిగాంచి వీరనరసింహరాయనితల్లి తిప్పాజి కృష్ణరాయని జంపింప నుద్యమించెనట. ఆ సడి యెఱిగి తిమ్మరసాతని దాచి సంరక్షించుచుండెను. ఇట్లుండగా కొంతకాలమునకు నరసింహరాయలు వాపు జాడ్యముచే బీడితుడై మరణమునకు సిద్ధుడాయెను. ప్రాణావసానకాలమున గొడుకులనుబిలిచి తన ప్రేలిముద్రికను జూపి దాని దీసికొనినవాడు రాజ్యార్హుడని చెప్పెను. ప్రేలు వాచియుండుట వలన ఉంగరమును దీసికొనుటకు సాధ్యపడలేదు. ఉంగరము దీసికొన వెర వెఱుగక తక్కిన కొడుకులు ప్రొక్కట పడుచుండగా గృష్ణరాయలు ఖడ్గముచే దండ్రిప్రేలిని ఖండించి యుంగరమును గ్రహించెను. అతని సాహసమునకు సంతసించి నృసింహదేవరాయ లతనిని బట్టాభిషిక్తుని జేయ నియమించి స్వర్గస్థుడాయెనట.

౨. నృసింహదేవరాయలు దన మరణకాలమప్పుడు దన కొడుకులలో నర్హునికి రాజ్యమీయ నిశ్చయించి వారియం దర్హతముడెవ్వడో కని పెట్టుటకొక యుక్తిని బన్నెను. మందిరాంగణమున నొక వెడలైన పెద్ద జముకాణమును బఱపించి దానిమధ్య నొక ఖడ్గమునుంచి పుత్రుల నందఱి నచటికి బిలిపించి జముకాణముపై నడుగుపెట్టక పోయి యా ఖడ్గమును గైకొన్నవానికి రాజ్య మిచ్చెదననిచెప్పెను. జముకాణముపై నడుగిడక పోయి దాని నడుమ నుంచియుండు ఖడ్గమునుగొను నుపాయము నెఱుగక దన యన్నదమ్ములు దికమక పడుచుండగా గృష్ణరాయలు నేలపై బరుండి దొరలుచు జముకాణమధ్యమునకు బోయి ఖడ్గమును గొని మరల దొరలుచు వెలుపలికి వచ్చెనట.

ఈ శాసనము కల్పన.[8] కావున నిది విశ్వాస పాత్రము గాదు. 'కొంగుదేశ రాజాక్కళిన్ చరిత్ర' యను నరవఱితిహాసగ్రంథమునందు వీరనరసింహ రాయల యేలుబడిలో యన్నకు దన రాజ్యపాలన మున గృష్ణరాయలు దోడ్పడుచుండినట్లు చెప్పి యున్నది.[9] దీనిని రుజువుసేయగల సాక్ష్యమేదియు నింతవఱకు లభ్యపడకపోయినను ఇది కేవలము సంగతముగాదు. వీరనరసింహరాయల శాసనములు కృష్ణరాయలయెడ సౌహార్దమును సూచించు చున్నవి. మఱియు వీరనరసింహరాయల మరణ పర్యంతమును గృష్ణరాయాది సోదరులందఱును విజయనగరమందు స్వేచ్ఛతో నున్నట్లు న్యూనిసు గ్రంథమువలన దెలియవచ్చుచున్నది.[10] కావున కొంగు దేశరాజాక్కళిన్ చరిత్రయందు చెప్పినట్లు కృష్ణరాయలు రాష్ట్రపాలనయందు దనయన్న వీరనరసింహరాయలకు దోడ్పడుచుండినను నుండవచ్చును.

---

8. ఎపి. కర్ణా. సం. ౧౨. గుబ్బి. నెం. ౪౬. కల్పన యనుటకు ముఖ్యకారణములు రెండు. (౧) దానకాలము: 'శాలివాహనశకవరుషంగళు ౧౩౭౬ నే సంద వర్తమానద స్వభానునామ సంవత్సరద చయిత్ర శు. ౯ రామోత్సవకాలదలూ'. ఇందువలన కృష్ణరాయల జననమునకు ముందే యీ దానశాసనము పుట్టినట్లు తేలుచున్నది. (౨) రాయలవంశావళి: "కాస్యప గోత్రద ఆపస్తంబసూత్రద యజుశ్శాఖాధ్యాయిగళాద శ్రీమన్మహామండలేశ్వర చంద్రగిరి సింహాసనాంక పెను గొండపురవరాధీశ్వరరాద అనంతరాయర పౌత్రరాద అచ్యుతరాయర పుత్రరాద శ్రీకృష్ణరాయరవరు."

9. *Further Sources of Vijayanagara History Vol. II. Nos.* 97, 97-*a*.) "వీరనరసింగ మహారాయరెన్ను తన్నుడైయ తంబికళుడనేరాచ్చియం వెహునీతికళుడనే రెఱిచ్చుకొణ్డు...." "తనక్కు తసింబియా యిరుక్కర కిష్ణరాయరె విజయనగరిపట్ట ణత్తిలే వైచ్చు తానుం అచ్చుతరాయర్ శ్రీరంగరాయర్ ఇన్నుం అనేకరాజకుమారర్గళుడనే ఉమ్మత్తూరు సమీ పత్తిలే యెఅజ్గికొణ్డు...." "విద్యానగరిక్కు వన్దు కిష్ణ రాయరుడనే అన్ద ఉమ్మత్తూరు శ్రీరజ్గపట్టణం వెకు పేన్దోపస్తాయిరుక్కరపడియినాలే రొంబవుం నేనైకళ్ చేతుకొణ్డు.... యోచనైపణ్ణి...."

10. *For. Emp. pp.* 315-16.

అతని యుక్తికిమెచ్చి తండ్రి యతనికి రాజ్యము నొసగెనట.

౩. కుమారధూర్జటికృత కృష్ణరాయ విజయమందిట్లు కలదు. (౨: ౩౭–౩౮.)

"ఇవ్విధంబున నవ్వసుంధరారమణ చంద్రుండు (వీరనరసింహరాయ పృథివీపతి) మహేంద్రవైభవంబున ..... సామ్రాజ్యసంపన్నుడైయుండి యొక్కనాడు."

"తమరు పెద్దల రైతి రిత్తరిని గృష్ణరాయలను పేరి మత్పుత్రరత్నమునకు దనర బట్టంబు గట్టెద ఘనత మీఱ నను చు నప్పాజితోన మంతనము జేసి."

౪. క్రీ. శ. ౧౭వ శతాబ్దప్రారంభమున విరచింపబడిన రాయవాచకమునందు వీరనరసింహరాయలే కృష్ణరాయల పట్టాభిషేకము సేయ నాజ్ఞాపించినట్లున్నది:

"అని విన్నపం జేసి... యీ రాజ్యపట్టం కృష్ణరాయలవారికి కట్టవలెనని దళనాయకులతో పలకరించి, నందు....కృష్ణరాయలవారు[11] తాము పెద్దలమైతిమి తమ మర్యాదాగా రాజ్యపరిపాలనం జేసేటందులకు పట్టాభిషేకం అధిష్ఠానకర్తలు సేయమని మంచివేళ జూచి ముద్దు టుంగర మిచ్చినారు."

౫. కృష్ణరాయలకాలమున విజయనగరమునకు వచ్చియుండిన పోర్చుగీసు అశ్వవ్యాపారి న్యూనిసు క్రీ. శ. ౧౫౩౭ వ సంవత్సరమున కించుక పూర్వము రచించిన చరిత్రయం దిట్లు వ్రాసియున్నాడు—

"ఈ రాజు (బుస్సలరావు = వీరనరసింహరాయలు) జాడ్యగ్రస్తుడై బిస్నగపట్టణమున కాలధర్మమునందెను. ఆతడు తన మరణమునకు ముందు ప్రధాని సాల్వతిమ్మనను బిలువనంపి, యెనిమిదేండ్ల ప్రాయము వాడగు దన కుమారుని దన చెంతకు రప్పింపవలయునని యుత్తరువు జేసి,—యతనికి రాజ్యాధిపత్యము సేయదగిన వయసు లేకపోయినను, ప్రాయశః రాజ్యము దనసోదరుడగు కృష్ణరావుకు జెందవలసి యుండినను—నా బాలుని రాజ్యమున ప్రతిష్ఠింపవలయు ననియు; దనమరణానంతరము రాజ్యమున గలహాములు లేకుండుటకొఱకు దన తమ్ముని కన్నులను బీకించి తనకడకు దెచ్చి చూపవలయుననియు సాల్వతి(మ్మ)న కాజ్ఞాపించెను. సాల్వతి(మ్మ)నయట్లే చేసెదనని చెప్పివెడలిపోయి, కృష్ణరావును బిలిపించి యేకాంతముగనొక యశ్వశాలకుదోడ్కొనిపోయి, యతని యన్న యతని కన్నుల నూడబెటికించి నిజపుత్రుని రాజ్యమున కభిషిక్తుని సేయ నాజ్ఞాపించెనని తెల్పెను.

---

11. 'వీరనరసింహరాయలవారు' అనుటకు బదులు 'కృష్ణరాయలవారు'అని వ్రాయసకాడు తప్పు వ్రాసినాడు. కృష్ణరాయలవారు తమకు పట్టాభిషేకము జేయుటకొఱకు తమకు తామే ముద్దుటుంగర మిచ్చిరనుటలో నర్థము లేదు. కావున 'వీరనరసింహరాయలవారు' అనియే సరియైన పాఠము.

మఱి ఈ వీరనరసింహరాయ లెవ్వరు? ఈ ప్రశ్నకు సమాధానము రాయవాచకమునందే కలదు. పట్టాభిషేక మైనపిమ్మట అప్పాజి మొదలయినవారిచే రాజనీతులను విన తరువాత కృష్ణరాయ లిట్లు చెప్పెనని యున్నది. "ఈవరకున్ను యీశ్వరనాయడున్ను, నరసింహ్మనాయడున్ను, వీరనరసింహ రాయలవారు రాజ్యపరిపాలనం గావించినారు." (రాయ. పుట ౨౯) మఱి యొకపట్టున దొండోపండితులు మొదలగు నియోగుల అభిప్రాయమును విని యాగ్రహపడి యేదులశాహువాను, "కర్ణాటకంవారు తుంగభద్రదాటి వచ్చిరా యీవరకున్ను? యీశ్వరనాయకుండున్ను నరసానాయకుండున్ను, వీరనరసింహ్మరాయలవారున్ను యేలినందుకన్నా కృష్ణరాయలవారు యేలేది యేమున్నది?" అని యడిగినట్లున్నది (రాయ. పుట ౪౯). ఇందువలన రాయవాచకరచయితకు నరసింహ లేక నరసానాయకుడును వీరనరసింహ్మరాయలును భిన్న పురుషులని తెలియునని స్పష్టమగుచున్నది. గ్రంథమున కృష్ణరాయలకు పట్టాభిషేకము సేయదలపెట్టినవాడు వీరనరసింహరాయ లని యున్నదికాని నరసింహ్మ లేక నరసానాయకుడని లేదు. మఱియు కృష్ణరాయలకు బూర్వము దుళువవంశాధీశులైయుండినవారిని మువ్వురిని వరుసగ బేర్కొనియున్నాడు. (౧) ఈశ్వరనాయకుడు—ఇతడు కృష్ణరాయలపితామహుడు.(౨) నరసింహ లేక నరసానాయకుడు—ఇతడు కృష్ణరాయల తండ్రి. (౩) వీరనరసింహరాయలు—ఇతడు కృష్ణరాయల జ్యేష్ఠభ్రాత. కృష్ణరాయలపట్టాభిషేక మొనర్చినవాడు వీరనరసింహరాయలని యుండుటవలన నతడు కృష్ణరాయల యగ్రజుడేకాని తండ్రి కాజాలడు.

ఈ మాటలను వినగనె కృష్ణరావు హక్కుప్రకారము దనకు రాజ్యము జెందవలసి యుండినను దనకు రాజు గావలయునని గాని, రాజ్యమున నెట్టి పదవి యైన గావలయుననిగాని, యిచ్చలేదనియు, లోక మున జోగియై కాలక్షేపము సేయగోరుచున్నా డననియు దన యన్నయెడ కన్నులు బెకిలింపదగి నంతటియపరాధముదానుసేయలేదనియు జెప్పెను. దీనిని సాల్వతి(మ్మ)న విని, కృష్ణరావు ఇరువదేండ్లకు పైబడిన వాడగుటచేత నెనిమిదేండ్లప్రాయముగల బుస్సలరావు కుమారుని కంటె నతడు రాజ్యాధి పత్యము వహించుట కతిశయార్హుడని గ్రహించి, యొక యాడుమేకను దెప్పించి దాని కన్నుల బెక లించి యప్పుడె ప్రాణములు విడువబోవుచుండిన రాజునకు జూప గొనిపోయి యతని ముందుంచెను. రాజు ప్రాణములు విసర్జించిన క్షణమునకే, కీర్తి కాయుడైన రాజెవ్వని కన్నులను బెకలింప నాజ్ఞా పించెనో యా సోదరుడు కృష్ణరావు రాజపదమున సుప్రతిష్ఠితుడాయెను.[12]

పెనవివరించిన గాథ లెదింటిలో మొదటి మూడును విశ్వాసపాత్రములు గావు. అందు నరసింహరాయల (నరసానాయకుని) యనంతరము కృష్ణరాయలు రాజ్యాధిపత్యము వహించినట్లు చెప్పియున్నది. కృష్ణరాయవిజయమున వీరనర సింహరాయపృథ్వీపతియే కృష్ణరాయలకు రాజ్యా భిషేకము సేయ నాజ్ఞాపించినట్లు చెప్పియున్నను, 'కృష్ణరాయ లనుపేరి మత్పుత్ర రత్నమునకు' అని యుండుటచే నీ వీరనరసింహరాయ పృథివీపతి కృష్ణరాయల తండ్రియగు నరసానాయకుడేగాని అన్నయగు వీరనరసింహరాయలు గాజాలడు.[13] నరసానాయకు ననంతరము వీరనరసింహరాయ లును, నతని వెనుక కృష్ణరాయలును రాజ్యమును పాలించినట్లు తుళువవంశశాసనములవల్లను, కృష్ణ రాయల కంకితము సేయబడిన ఆంధ్రప్రబంధముల వల్లను దెలియవచ్చుచుండుటవలన నరసానాయ కుడు కృష్ణరాయలకు రాజ్యాభిషేకము సేయ నాజ్ఞయిచ్చెననుట విశ్వసింపదగిన విషయముగాదు. రాయవాచకమున జెప్పినట్లు వీరనరసింహరాయలే కృష్ణరాయలకు రాజ్యాభిషేకము సేయ నాజ్ఞా పించి యుండవచ్చును; కాని దీని యాదార్థ్యము స్థిరపరచగల సాక్ష్యము విశ్వాసపాత్రమైనది లభ్య పడలేదు. మఱియు న్యూనిజుచరిత్ర దీనితో ప్రత్య క్షముగ ప్రతిఘటించుచున్నది. వీరనరసింహ రాయలు దన మరణానంతర మెనిమిదేండ్ల బాలు డగు దన పుత్రుని పట్టబద్ధుని సేయ నిశ్చయించి, కృష్ణరాయలవలన నతని కాపద గలుగవచ్చునని శంకించి కృష్ణరాయల కన్నుల బీకింప నిజప్రధాని తిమ్మరసున కాజ్ఞాపించెననియు, నా ప్రధాని కృష్ణరాయల పక్షమవలంబించి తన యజమానుని మోసపుచ్చి యతనికి రాజ్యాభిషేకమొనర్చెననియు న్యూనిజుగ్రంథమువలన విదితమగుచున్నది. న్యూనిజు కృష్ణరాయలకు సమకాలికుడు. కృష్ణరాయల కాల మునను, దరువాతను నతడు పలుమారు విజయనగర మునకు వచ్చియుండెను. కృష్ణరాయల రాజ్యారంభ కాలమున జరిగిన యంశములను గూర్చి ప్రత్యక్ష జ్ఞానముగల వారిని జక్కగ విచారించి సత్యమును గనుగొని గ్రంథస్థము జేసియుండును; కావున వీర నరసింహరాయల కిష్టము లేకపోయినను మహా ప్రధాని సాళువ తిమ్మరసయ్యగారి సహాయమువలన కృష్ణరాయలు రాజ్యాధిపతి యాయెనని మనము నిశ్చయింపవచ్చును.

ఈ పట్టున విచారించదగిన ముఖ్యాంశ మొక్కటి కలదు. వీరనరసింహరాయల యనంత రము రాజ్యాధిపత్యపు హక్కు కృష్ణరాయలదై నట్లు న్యూనిజు సూచించియున్నాడు. ఈ క్రింది వాక్యముల యర్థము పరిశీలింపదగినది. వీరనర సింహరాయలు కృష్ణరాయల కన్నుల బెకలింపమని

---

12. *Sewell : For. Emp. pp.* 314-15.

13. క్రీ. శ. ౧౪౯౭ వ సంవత్సరము నాటి యొక శాసనమున (మైసూ. ఆర్క్. రిపో. ౧౯౪౫ నెం. ౪౬ ఎ) నరసానాయకుడు 'నృసింహో నృపః, అని పేర్కొనబడియున్నాడు. ఆముక్తమాల్యద మను చరిత్ర పీఠికలందు 'నారసింహేశ్వరుండు' అనియు వరదాంబికాపరిణయమందు 'నృసింహనామానం' అనియు గలదు. (సోర్సస్ ఆఫ్ విజయనగరహిస్టరీ, పుటలు ౧౧౦, ౧౪౨.) ఇత డర్వాచీన గ్రంథకర్తలచే నరసింహ, లేక వీరనరసింహరాయ అనియు బేర్కొన బడియున్నాడు.

తిమ్మరసున కాజ్ఞాపించు సందర్భమున 'రాజ్యము ప్రాయశః తన సోదరుడగు కృష్ణరావునకు జెంద వలసియుండినను' అని చెప్పినట్లున్నది. దీని కను గుణ్యముగ గృష్ణరాయలు వీరనరసింహరాయల యాజ్ఞను విన్నప్పుడు తిమ్మరుసుతో, 'హక్కు ప్రకారము దనకు రాజ్యము జెందవలసి యుండినను' అని యన్నట్లున్నది.[14] ఈ వాక్యములను బట్టి చూడగా వీరనరసింహరాయల పుత్రునకు రాజ్యము నేలు హక్కు లేదనియు, హక్కుప్రకారము గృష్ణ రాయలే రాజ్యాధిపతి కావలసియుండె ననియు విదితమగుచున్నది. కృష్ణరాయల కీ హక్కెట్లుపలబ్ధ మైనదో తెలియదు. సంగమవంశజులను వెడలనడిచి క్రీ. శ. ౧౪౨౫ వ సంవత్సరమున సాళువనరసింగ రాయలు విజయనగరసామ్రాజ్యము నాక్రమించు కొనెను. ఇతని తరువాత నితని పుత్రులు తిమ్మ రాజును, ఇమ్మడి నరసింహరాయలును క్రీ. శ. ౧౪౮౬ వ సంవత్సరము వఱకును పాలించిరి. పాలు రగుటచే నామకార్థము మాత్రమే వీరు ప్రభువులు; సర్వాధికారమును రాయలకును, సామ్రాజ్యము నకును రక్షకు డైన నరసానాయకునిచేత నుండెను. క్రీ. శ. ౧౪౦౩ వ సంవత్సరమున నరసానాయకుడు శివసాయుజ్యము నందిన పిమ్మట నతని జ్యేష్ఠపుత్రు డిమ్మడి నరసానాయకుడు రక్షకు డాయెను. క్రీ. శ. ౧౪౦౬ వ సంవత్సరమున నితడు దన స్వామియగు నిమ్మడి నరసింహరాయని జంపించి రాయ సామ్రా జ్యము నాక్రమించుకొని వీరనరసింహరాయలను నామము వహించి క్రీ. శ. ౧౪౦౯ వ సంవత్సరము వఱకు రాజ్యపరిపాలనము గావించెను. కావున వీర నరసింహరాయలు గతించిన తరువాత రాజ్యము క్రమప్రకారమతని పుత్రునికి చెందవలసియుండెను. విషయ మిట్లుండగా, 'హక్కునుబట్టి' రాజ్యము కృష్ణరాయలకు జెందవలసియుండెనను న్యాయము వాక్యముల కర్థమేమి? తండ్రిమూలమున గాకపోయిన కృష్ణరాయల కీ హక్కు తల్లివలన సంక్రమించి యుండగూడదా? యను ప్రశ్న రావచ్చును. తల్లి సంగవంశమునను, సాళువ నర సింగరాయల వంశమునను పుట్టియుండిన నట్లను కొనుట కవకాశము గలదు? కాని కృష్ణరాయల తల్లిని గూర్చి మనకు దెలిసిన విషయ మల్పిష్ఠము. ఆమె నరసానాయకుని ద్వితీయపత్ని యని తెలి యును; అంతకు మించి మఱియేమియు దెలియదు. దీపాలనాగి కథ యొక్కటి కలదు; కాని యది సత్యముగాదు. సత్యమే యనుకొన్నను అందుమూల మున కృష్ణరాయలకు రాజ్యాధిపత్యమున కెట్లు హక్కు గలిగెనో తెలియరాదు. ప్రస్తుతము మనకు గల చరిత్రజ్ఞానము నాధారపఱచుకొని న్యూనిజు వాక్యముల గూఢార్థమును నిర్ణయించుటకు వీలు గాదు. అందలి వాస్తవార్థము భావిపరిశోధనలవలన బయల్పడవలసియున్నది.

రాజ్యాభిషేక కాలము

ఇంతవఱకును కృష్ణరాయల రాజ్యాభిషేక మును గూర్చిన గాథలు వివరింపబడినవి. వీర నరసింహరాయల కిష్టములేకపోయినను ప్రధాని తిమ్మరసయ్యగారి యనుగ్రహమువలన కృష్ణ రాయలకు రాజ్యోపలబ్ధి గలిగెను. కాని యతని పాలన యెప్పుడు ప్రారంభమాయెనో, యెన్న డాతనికి పట్టాభిషేకము నడచెనో నిశ్చయముగ దెలియదు. శాసనముల నాధారపఱచుకొని వీనిని నిర్ధారించవలసి యున్నది. అనంతపురమండలము లోని తాడిపత్రియందలి శాసన మొకదానియందు శా. శ. ౧౪౩౧ పూర్తియైనపిమ్మట శుక్ల నామ సంవత్సర వైశాఖ శు. ౧౫ శుక్రవారము (అనగా క్రీ. శ. ౧౫౦౯. మే ౪ తేది) నాడు వీరనరసింహ రాయలు విజయనగరమునందు పాలించుచున్నట్లు చెప్పియున్నది.[15] దక్షిణ ఆర్కాటు జిల్లాలోని విక్రవాండిగ్రామమందలి యొక శాసనమున శా. శ. ౧౪౩౧ శుక్ల నామసంవత్సర కర్కాటక శు. ౫ శుక్ర. హస్త (క్రీ. శ. ౧౫౦౯ జూలై ౨౨ తేది) నాడు వీరనరసింహరాయలు విజయ నగరమందు పృథివీసామ్రాజ్య మేలుచుండినట్లు చెప్పియున్నది.[16] ఈ రెండుశాసనములవల్లను వీర నరసింహరాయలు క్రీ. శ. ౧౫౦౯ జూలై ౨౨

---

14. *For. Emp. p.* 315

"*Though the kingdom ought perhaps belong to his brother , Crisnarao.....*" "*Even though it (the kingdom) should come to him by right..*"

15. 342 *of* 1892.

16. 289 *of* 1915.

తేదివఱకును రాజ్యము సేయుచుండెనని యు, నందాక కృష్ణరాయల పాలన ప్రారంభము గాలేదని యు దెల్లమగుచున్నది.

బళ్ళారిమండలమందలి గుళ్యములో నొక శాసనమున శా. శ. ౧౪౩౧ శుక్ల శ్రావణ శు. ౧౦ బృహస్పతి వారము (క్రీ. శ. ౧౫౦౯ జూలై ౨౬ తేది) నాడు కృష్ణదేవరాయలు విజయనగరమున రత్నసింహాసనాసీనుడై పృథివీసామ్రాజ్యము పరిపాలించుచుండినట్లు చెప్పియున్నది.[17] మఱియు కడపమండలములోని పులివెందలయం దొక శాసనమున శా. శ. ౧౪౩౧ శుక్ల సంవత్సర కార్తిక మాసమున (క్రీ. శ. ౧౫౦౯ ఆగస్టు–సెప్టెంబరు) కృష్ణరాయలు విజయనగరమున పృథివీ సామ్రాజ్యము సేయుచుండెనని యున్నది.[18] ఇందువలన కృష్ణరాయలు క్రీ. శ. ౧౫౦౯ జూలై ౨౨-౨౬ తేదీలమధ్య నొకనాడు రాజ్యాధిపత్యమును వహించెనని తెల్లమగుచున్నది.

ఈ రెండుశాసనములందు కృష్ణరాయల పట్టాభిషేకప్రస్తావన లేదు. పట్టాభిషేకప్రస్తావము మొట్టమొదట శా. శ. ౧౪౩౨ సం. శుక్లసం॥ మాఘశు. ౧౪ కు సరియైన క్రీ. శ. ౧౫౧౦ జనవరి ౨౪ తేదినాడు నిలిపిన హంపిశాసనమున గాన వచ్చుచున్నది.[19] ఇందు కృష్ణరాయలు దన పట్టాభిషేకమహోత్సవకాలమున పంపావిరూపాక్ష స్వామివారి యాలయమునకు రంగమంటపమును గోపురమును గట్టించెనని యున్నది. దీనినిబట్టి చూడగా రాజ్యాధిపత్యమును వహించిన వెనుక యాఱునూనములవఱకు పట్టాభిషేకము జరుగ లేదని చెప్పవలసియున్నది. కాని రాజ్యాధిపత్యము వహించుటకును, పట్టాభిషేకమహోత్సవమున కింత యెడము గల్గుటకును గారణమేమియు గానరాదు. హంపిశాసనము కృష్ణరాయల పట్టాభిషేక మహోత్సవ సమయమున నిలిపినదికాదనియు, దరువాత నొక వార్షికోత్సవమునాడు నెలకొల్పిన దనియు కొందఱి యభిప్రాయము.[20]

క్రీ. శ. ౧౫౦౯ జూలై ౨౨ తేది వఱకును కృష్ణదేవరాయల పాలన ప్రారంభము గాలేదని పై నుదాహరించిన వీరనరసింహరాయల విక్రవాండి శాసనమువలన విశదమగుచున్నది. హంపిశాసన కాలమునకును దానికినిగల యెడ మాఱు మాస ములే యగుటవలన హంపిశాసనము నిల్పినది పట్టాభిషేక వర్ధంత్యుత్సవమప్పుడనుట సంగతము గాదు. కాని పట్టాభిషేక మంతకు కొన్నిమాసము లకు పూర్వమే జరిగెననుటకు గొంత యాధారము గలదు. శా. శ. ౧౫౩౬ పార్థివసంవత్సరమున వీరవేంకటపతిరాయలవారి యాజ్ఞప్రకారము వారి నగరి యఱవణీకర్తలు తయారుచేసిన 'విజయ నగర సామ్రాజ్య' మను పాళ్యపట్టుకడితమునందు "శాలివాహనశకం ౧౪౩౭ అగు నేటి శుక్ల సంవత్సరం ఆవణిమాసం శ్రీజయంతినాడు కృష్ణ దేవరాయమహారాయలు విజయనగరమందు పట్టాభిషిక్తుడై వేంచేసిరి" అని చెప్పి యున్నది.[21] ఇందుదాహరింపబడిన శకాబ్దము వర్తమానాబ్దము; గతాబ్దము గాదు. గతాబ్దము ౧౪౩౧. సామాన్య ముగ గతాబ్దము నుదహరించుట వాడుకయైనను వర్తమానాబ్దముగూడ ప్రాచీన శాసనములందును, లెక్కలందును దఱచుగ గానవచ్చుచున్నది. 'విజయ నగరసామ్రాజ్యము' బడి కృష్ణదేవరాయల పట్టాభిషేకము క్రీ. శ. ౧౫౦౯ ఆగష్టునెల ౭ తేది మంగళవారమునాడు జరిగియుండవలయును. కృష్ణదేవరాయలు శ్రీకృష్ణుని యవతారమని యప్పటివారి నమ్మకము. మఱియు నాతడు పరమ వైష్ణవుడు. కావున నతడు క్రీ. శ. ౧౫౦౯ జూలై ౨౨ తేది తరువాత రాజ్యభారము వహించినను నటుపిమ్మట నొకపదుము రోజులలో వచ్చుచుండిన శ్రీకృష్ణజన్మాష్టమి వఱకును దన బట్టాభిషేకము నాపుదల జేసికొనుటయందు వింత యేమియు లేదు. కృష్ణరాయల పట్టాభిషేకము వాస్తవముగ క్రీ. శ. ౧౫౦౯ ఆగష్టు ౭ తేది నాడు జరిగెనని మనము విశ్వసింపవచ్చును.

---

17. 703 *of* 1909.
18. 498 *of* 1906
19. *A R I.* 1907-8 *p.* 174.
20. *Sewell. For. Em. p.* 120.
21. భారతి. సం. ౬. పుట ౬౧౨.

ఉమ్మత్తూరు

"సమ్మర్దఋమ ధీ నిబంధనవిధాసంక్రందనాచార్యశూ
రమ్మన్యాచలవజ్రపాతజగతీరఙాంబుజాఙాశ ర
థ్యమ్మార్గస్థదశాస్యరాజ్యసమసహ్య ప్రోద్భవాతీర
భా గుమ్మత్తూరుశివంసముద్రపురవప్రోన్మాల
నాడంబరా."[1]

కృష్ణదేవరాయలురాజ్యాభిషేకముజేసికొనిన వెంటనే రాష్ట్రమున ముద్రశత్రువులను నిర్మూలముగావించి తనయాజ్ఞను నిర్వక్రముగ సామ్రాజ్యము నందంతటను జెల్లుబడి యగునట్లు చేయవలసి యుండెను. సంగమవంశ మంతరించినప్పటినుండియు దక్షిణ కర్ణాటకమున రాయల యధికారము సన్నగిలినది. కావేరీ తటమును బాలించుచుండిన ఉమ్మత్తూరు శివం సముద్ర శ్రీరంగపట్టణపాశెగాండ్రు కేంద్రప్రభుత్వమును సరకు సేయక స్వచ్ఛందమార్గమున ప్రవర్తించుచుండిరి. వీరు తాము ప్రాచీన కర్ణాటకరాజుల సంతతివార మనియు, విజయనగర ప్రభువుల యధికారమునకు లొంగి వారికి గప్పము కట్టవలసిన యావశ్యకత లేదనియు ప్రకటించి, తమ స్వాతంత్ర్యమును స్థాపించుటకు ప్రయత్నము సల్పుచుండిరి. మహామండలేశ్వర, జవాదికోలాహల, వేషణీహనుమంత, అరసాంగసూనెగాఱు, ఘేణాజ్క చక్రేశ్వర, గజబేటకాఱు, వెనుగొండచక్రేశ్వర యను బిరుదులు వీరికుండినటు వీరి శాసనములవల దెలియవచ్చుచున్నది. "తాము హొయసలరాజ్యాధిపతులమని చెప్పుకొనెడివారు; ప్రాచీనతేరకణాంబిరాజ్యమును గొంతకాలము వీరు పాలించినట్లున్నది. మఱియు నీయుమ్మత్తూరుప్రభువులు చిరకాలము నీలగిరి ప్రాంతమును బాలించిరనుటకు సంశయము లేదు; ఆపత్సమయముల యందచట తలదాచుకొనెడివారు."[2] వెనుగొండదుర్గము గూడ కొంతకాలము వీరి స్వాధీనమం దుండినదేమో! వీరి బలమంతయు గావేరిద్వీపములయం దుండిన యుమ్మత్తూరు శివంసముద్ర శ్రీరంగపట్టణములను జలదుర్గత్రితయముపై నాధారపడియుండినది. ఇంతవఱకు లభించిన శాసనసాక్ష్యమునుబట్టి వీరి వంశావతరణ మిట్లేర్పడుచున్నది.

వంశవృక్షము
హానుమప్ప ఉడయరు

సోమ లేక యిమ్మడిరాయ ఉడయరు

దేవణ్ణ లేక దేవరాజ ఉడయరు (క్రీ. శ. ౧౪౭౮-౧౪౮౪)

ఇమ్మడి దేవణ్ణఉడయరు (క్రీ. శ. ౧౪౯౨-౧౫౦౯)

గంగరాజ ఉడయరు (క్రీ. శ. ౧౫౧౧)

నంజరాయ ఉడయరు (క్రీ. శ. ౧౫౧౨-౧౫౪౦)

చిక్కరాయ ఉడయరు (క్రీ. శ. ౧౫౦౫-?)

నంజరాయ ఉడయరు (క్రీ. శ. ౧౪౯౨-౧౫౦౪)

చన్ననంజరాయ ఉడయరు (క్రీ. శ. ౧౪౯౨-౧౫౦౪)

1. పారి. ౨ : ౧౦౪.
2. ఎపి. కర్ణా. సం. ౩. పీఠిక పుట ౨౨.

ఈ వంశావళియందు పేర్కొనినవారిలో మొదటి యిద్దరిని గూర్చి మనకేమియు దెలియదు. సంగమవంశము క్రీ. శ. ౧౪౭౫ వ సంవత్సరముతో సమాప్తియైనది. క్రీ. శ. ౧౪౭౫ వ సంవత్సరమున సాళువగుండ నరసింహరాయలు సంగమవంశజులను విజయనగరమునుండి పాఱద్రోలి రత్నసింహాసనము నధిష్ఠించెను. అది మొదలు ఉమ్మత్తూరు ప్రభువులు దమ స్వాతంత్ర్యము నెలకొల్పుటకై విజయనగరరాయలతో బోరాడ నారంభించిరి. ఉమ్మత్తూరుప్రభువుల పేరు జెప్పకున్నను సాళువ నరసింగరాయలు వారి కిరవైన కొంగుదేశమును సాధించినట్లు సమకాలికాంధ్రవాఙ్మయమువలన దెలియవచ్చుచున్నది. జైమినిభారతమునందు—

"...కొంగుధారాపురీ
పెనుగొండాడాద్యఖిలైకదుర్గహరణ
ప్రేంఖత్ప్రతాపోదయా." అనియు—

"పెనుగొండకడప్రాలి పిక్కళ్లు మొదలైన
ప్రతిపక్షులను హతాహతముజేసి."

అనియు జెప్పియున్నది. మఱియు వరాహపురాణమున సాళువనరసింగరాయల సేనాధిపతియగు ఈశ్వరనాయకుడు 'పెనుగొండ సాధించె, బెంగళూరు హరించె' ననియు 'సీరంగపట్టంబు బారిసమరె' ననియు జెప్పియున్నది.[3] నీలగిరిప్రాంతమువఱకును ఉమ్మత్తూరుదొరల యధికారము జెల్లుచుండినందున కొంగుధారాపురి వారి యేలుబడిక్రింద నుండియుండవలయును. సీరంగపట్టణము వారి దుర్గత్రితయమునందొక్కటియైన శ్రీరంగపట్టణమే. బెంగుళూరు వీరి పాలనయందుండియుండవచ్చును. కావున సాళువ నరసింగరాయల కాలమునసే యుమ్మత్తూరుప్రభువులతో సమరము ప్రారంభమాయెనని నిశ్చయముగ జెప్పవచ్చును; కాని యతని ప్రతిపక్షి యెవ్వడో తెలియదు. మొదటి దేవణ్ణయొక్క తమ్ముడు నంజరాజఉడయరు క్రీ. శ. ౧౪౮౨—౧౪౯౪ ల మధ్య రాజ్యపాలన మొనర్చినట్లు శాసనసాక్ష్యము వలన రుజువగుచుండుటవలన సాళువనరసింహరాయలతో బోరినవాడు ప్రాయశః యతడై యుండవచ్చును.

సాళువనరసింహరాయలు క్రీ. శ. ౧౪౯౦ వ సంవత్సరమున గాలధర్మము నొందెను. తదనంతర మతని కుమారుడగు నిమ్మడి నరసింహ—దమ్మరాయలు రాజ్యాధిపతియైనను నతడు బాలుడై నిర్వాహకత లేకపోవుటవలన సర్వాధికారములును రాజ్యమునకును, రాయలకును సంరక్షకుడైన నరసానాయకునిచేత నుండినవి. రాజ్యమునందచట నచట పొడసూపిన క్షుద్రోపద్రవములను సందుచేసికొని ఉమ్మత్తూరుప్రభువులు మరల తలలెత్తిరి. కాని నరసానాయకుని ప్రతాపము నోర్వజాలక నమ్రులై కప్పముగట్ట నీయకొనవలసివచ్చెను. నరసానాయకుని విజయము అప్పటిశాసనములందును, సంస్కృతాంధ్రగ్రంథములందును వర్ణింపబడియున్నది.

"కావేరీ మాళు బద్ధ్వా బహులజలధరాం
తాం విలంఘ్యైవ శత్రుం
జీవగ్రాహం గృహీత్వా సమితిభుజబలా
త్తంచ రాజ్యం తదీయం
కృత్వా శ్రీరంగపూర్వం తదపినిజవశే
పట్టణం యో బభాసే
కీర్తిస్తంభం నిధాయ త్రిభువనభవన
స్తూయమానాపదానః."[4]

అను సుప్రసిద్ధమైన శ్లోకము తులువరాజుల తామ్రపట్టికలయం దన్నిటియందును గానవచ్చును. ఈ యంశమును రాజనాథడిండిముడును, తిరుమలాంబయును వర్ణించియున్నారు.

---

3. సోర్సస్. పుటలు ౮౭, ౮౯.
4. భారతి సం. ౯. భా. ౨. పుట ౪౨౩.

"అందుమీదట కర్ణాటదేశములోనుండు పాళెగాండ్రును దండనాయకులును కప్పమీయక పోయినందువలన నుద్దండుడను మంత్రి రాజుగారి యుత్తరువు ప్రకారము చతురంగసేనలతోగూడ కర్ణాటదేశమునకు బోయి వారితో యుద్ధముజేసి జీవగ్రాహుని పట్టుకొని యాదేశములో దానే పట్టముగట్టికొని యా పాళెగాండ్రచేత గప్పమును గొని..."[8]

ఇందు ఉద్దండుడను విజయనగరమంత్రిచే జీవగ్రాహుడు పట్టుబడినట్లు చెప్పియున్నది. ఈ యుద్దండుడెవ్వడో తెలియదు. జీవగ్రాహుడు శ్రీరంగపట్టణాధిపతియగు హొయ్సణేంద్రుడే కాని యన్యుడు గాడు. 'జీవగ్రాహం గృహీత్వా' యను శాసనవాక్యమునకు సరియైన యర్థమును గ్రహింప జాలక కొంగుదేశరాజాక్కళ్ చరిత్రరచయిత యదియొక వ్యక్తియొక్క నామమని తలచి 'జీవగ్రాహు' డని వ్రాసెను. ఒక శ్రీరంగ పట్టణమునుమాత్రమే కాక ఉమ్మత్తూరునుగూడ జయించినట్లు ఈ గ్రంథమున మజీయొక సందర్భ మున జెప్పియున్నది. 'అట్లా వుండగా మీ తండ్రి నరసింగరాయడు బలంచాత జయించి కప్పం తీస్కునిపోయెను' అని 'త్యాపరాజు' (ఇమ్మడి దేపణ్ణ) నుడివెనట.[9]

పైనుదాహరింపబడిన శాసనాద్యాధార ముల వలన నరసానాయకుని కాలమునగూడ ఉమ్మత్తూరుదొరలు గప్పమీయక తిరుగబడిరనియు, వారిని బలముచే నిర్జించి నరసానాయకుడు కప్పము గొనెననియు దెల్లమగుచున్నది. నరసానాయకునిచే శ్రీరంగపట్టణమున బరాజయమంది జీవగ్రాహుడైన ప్రతిపక్షి పే రెందును జెప్పియుండలేదు; కాని క్రీ. శ. ౧౪౯౨ మొదలు క్రీ. శ. ౧౫౦౯ వఱకును ఇమ్మడిదేపణ్ణఉడయ రుమ్మత్తూరురాజ్యము నేలి నట్లు శాసనములవలన దెలియవచ్చుచుండుటచేత నరసానాయకుని కోడి పాదాక్రాంతుడై కప్పమును గట్టినవా డతడే కావలయును.

"ప్రాయోఽర్ణవే సేతుకృతోఽవతారః
ప్రాగ్జన్మసంస్కారవశా దివైషః
సేతుం విధాయాంభసి సహ్యజాయాః
శ్రీరంగపూర్వం నగరీం జహార."[5]

"సమగ్రతరాత్యుగ్రశౌర్యసూర్యోదయః
సాగరాన్తరావాసదుర్లంఘ్యాం లంకామివ రఘు
పుంగవః కావేరీపరివేష్టితాం శ్రీరంగపట్టణాభిధాం
ఆవరిష్టపురీమ్.

స్థిరే జలే సేతు రకారి పూర్వం
త దద్భుతం నేతి కవేరజాయాః
సేతుంప్రవాహేషు గుణాభిరామః
చిత్తే సతా మద్భుత మప్యబధ్నాత్.

.....నిస్తర్దయర్తస్త శిలాచక్రనిఖాత
నిపాత్యమానవిజయపార్థివ శృఙ్గసంఙ్కాశవిశంకట
శృఙ్గసఙ్ఘాటాం పురీ మిమాం సమాక్రమ్య విత్రాసభ
రపుర స్థాపితసమస్తవిత్తజాతమ్ అపత్యకలత్రాదిభిః
మిత్రాదిభిస్సమాగత్య పదయోర్ని పత్య ఆత్మనో
గత్యన్తరభావం ఉద్యోతయన్తం మహావీరం పార్థివం
ప్రత్యగ్రకృపా రసాభిషిక్తం తత్ర పురి స్థాప
యిత్వా..."[6]

మజీయు నీవిషయమునే ముక్కుతిమ్మన్న గారు "శ్రీరంగపట్టణ సీమ ఖడ్గనటీ వినోదంబు హొయ్సణేంద్రునకు జూపె."[7]

అను సీసపాదమున సూచించియున్నారు.

కొంగుదేశరాజాక్కళ్ చరిత్రయందీ ప్రస్తావన కొంత కలదు.

---

5. సోర్సస్. పుట ౧౦౯.
6. సోర్సస్. పుట ౧౭౪.
7. ఫర్దర్ సోర్సస్. సం. ౧ పుట ౧౬౦. అథోజ్ఞాపిక.
8. ఫర్దర్ సోర్సస్. సం. ౨. నెం. ౯౫ రు.
9. ఫర్దర్ సోర్సస్ సం. ౨. నెం ౯౭

నరసానాయకుని యనంతరమువీరనరసింహ రాయలు సామ్రాజ్యాధిపత్యము వహించెను. ఇతని యేలుబడియందు క్షుద్రోపద్రవములు ప్రబలి సామంతు లనేకులు గప్ప మీయక తిరుగబడిరి. అదియె తరి యని యెఱిగి యుమ్మత్తూరుప్రభువు ఇమ్మడిదేపణ్ణఉడయరు తన స్వాతంత్ర్యమును ప్రకటించి పెనుగొండదుర్గమును స్వాధీనపఱచుకొనెను.[10] వీరనరసింహరాయల కాలమున జరిగిన యుమ్మత్తూరువృత్తాంతమంతయు కొంగుదేశరాజాక్కళిఁ చరిత్రయందు వర్ణింపబడియున్నది.

"కర్ణాటకదేశము కొంగ (కొంగు) దేశమును రక్షించు ఉన్మత్తూరు తలైక్కాడు మొదలగు కోటలయందుండు పాళెగాండ్రు కప్పము యిచ్చి పంపక పోయినందున వీరనరసింగరాయలు మిక్కిలియు గోపించి, అనేకసేనలను చేర్చుకొని, యేనుగులు, గుఱ్ఱములు మొదలగు దండు సన్నాహము గావించుకొని, తనకు తమ్ముడైయుండిన కృష్ణరాయలను విజయనగరి పట్టణములోనుంచి, తానును అచ్యుతరాయలు శ్రీరంగరాయలు ఇంకను అనేక రాజకుమారులతోగూడ ఉన్మత్తూరు సమీపమున విడిసి, "మాకు పూర్వము ఇచ్చుచుండిన ద్రవ్యమును ఇచ్చిపంపినయెడల మిమ్ము యిచ్చటనే రాజ్యమును రక్షించుటకు నిశ్చయము జేసివేసి పోయెదము. కప్పము ఇచ్చి పంపకపోయినయెడల మీ కోటలను మేము పెఱికికొని మా మనుష్యులను ఉంచి రాజ్యమును రక్షింతుము" అని చెప్పి మనుష్యులను పంపించినారు.

అప్పుడు ఉన్మత్తూరు (నందుండు) త్యాపఁ రాజా (దేపణ్ణ లేక దేవరాజు) యనువాడు చెప్పి పంపిన వైనము :

"మేము ఈ దేశములో బహుదినముల నుండి రాజ్యమును రక్షించుకొనుచుంటిమి. మా వంశములో నుండినవారుగాని, యీ దేశములలో కొంకణవర్మ రాజులుకాని చాలకాలము రాజ్యమును పరిపాలనముజేసిరి. వారైనను వేఱొక రాజులకు గప్ప మిచ్చి యుండలేదు. అట్లుండగా మీ తండ్రి నరసింగరాయలు బలముచేత జయించి కప్పమును దీసికొనిపోయెను. వ్యవహారపడినయెడల మీకు మేము కప్ప మీయవలసిన న్యాయము లేదు. కావున మేము కప్ప మిచ్చిపంపజాలము "అని చెప్పిపంపెను.

అటుపిమ్మట ఆ సమాచారమును వీరనరసింగరాయలు విని మిక్కిలియు గోపించుకొని, "ఈ పాళెగాండ్రు మనయొక్క రాజ్యములో బట్టాభిషేకము జేసికొనియుండిన హరిహరరాయలు మొదలైనవారికి కప్ప మిచ్చుచుండి, ఇప్పుడు ఇంత వ్యవహారము జేయవలసిన కార్య మేమి యున్నది?" అని యా ఉన్మత్తూరుకోటను ముట్టడించి మూడు మాసముల పర్యంతము యుద్ధము సేయగా ఆ పాళెగాండ్రు బహుబలమును జేర్చుకొని వీరిని కోటసమీపమునకు జేరనీయక కొట్టిరి. అప్పుడు నరసింగరాయలుఆ కోటను సాధింపజాలక దండు ద్రిప్పుకొని శ్రీరంగపట్టణమునకు వచ్చి ముట్టడి వేయగా, పూర్వము పెద్దనరసింగరాయలు జీవగ్రాహునికి పట్టము గట్టియుండిరి. ఆ జీవగ్రాహుని కొడుకు బహుబలముతో శ్రీరంగపట్టణకోటను గట్టిచేసికొని, ఉన్మత్తూరు తలైక్కాడు పాళెగాండ్రకు జెప్పి పంపి యచటినుండి బహుసేనలను బిలిపించుకొని, కోటనువిడిచి బయటికివచ్చి వీరనరసింగరాయల దండుపై బడి యుద్ధముజేసిరి. అప్పుడు వీరనరసింగరాయలు కొంచెమపజయమును బొంది దండు ద్రిప్పుకొని విద్యానగరికివచ్చి కృష్ణరాయలతో నా యున్మత్తూరు శ్రీరంగపట్టణములు మిక్కిలియు బందోబస్తుగనుండుటవలన సేనల నధికముగ జేర్చుకొని యనేకవస్తుసామగ్రులను గొని యా దేశమును సాధింపవలయు నని యోచనచేసి రాజ్యపరిపాలనము జేయుచుండిరి."[11]

ఉమ్మత్తూరు ప్రభువు వీరనరసింహరాయలను బ్రతిఘటించినది నిశ్చయము. ఏలన, కృష్ణరాయలు

---

10. *Sewell. Forgotten Empire, p.* 126
11. *Further Sources Nos.* 97-(*a*). *of No.* 97.

రాజ్యమునకు వచ్చినవెంటనే యుమ్మత్తూరును జయించి స్వాధీనపఱచుకొనుటకు దండు వెడలవలసి వచ్చెను; కావున ఉమ్మత్తూరుప్రభు వంతకు పూర్వమే, అనగా వీరనరసింహరాయల రాజ్యకాలమునసే తిరుగుబాటుచేసి యుండవలయును. కొంగుదేశ రాజాక్కళ చరిత్రయందు చెప్పిన రీతిగనే వీర నరసింహరాయలు ఉమ్మత్తూరు దేశమును స్వాధీన పఱచుకొని యచట దన యధికారమును మరల నెలకొల్పుటకు బ్రయత్నము సల్పియుండినచో నత డోడిపోయె ననుటకు సంశయపడవలసినది లేదు.

ఇట్లు పరాజితుడై వీరనరసింహరాయలు వెనుదిరిగి పోయినపిమ్మట ఉమ్మత్తూరు ఇమ్మడి దేవ రాజు (త్యాపరాజు) వెనుగొండను స్వాధీనముచేసి కొనెనని తోచుచున్నది. వెనుగొండ నతడు జయించి నట్లెచ్చటను జెప్పియుండలేదు. కాని, సమకాలిక పోర్చుగీసురాయబారి ఫ్రయ్యర్ లూయి కృష్ణ రాయల రాజ్యారంభ మప్పటికే రాయలను ధిక్కరించిన సామంతుడొక్కడు వెనుగొండను జయించె నని వ్రాసియున్నాడు. ఉమ్మత్తూరుప్రభువు 'వెను గొండచక్రేశ్వర' బిరుదాంకితుడగుటచేతను, నతని యధికారము బెంగుళూరు తుంకూరు మండలముల పర్యంతము వ్యాపించియుండినందునను, మఱియు నా ప్రాంతమున రాయలకు మా ఱొడ్డియుండిన సామంతు డతడొక్కడే యగుటచేతను వెనుగొం డను బట్టుకొనిన సామంతుడతడే కావలయును.

వీరనరసింహరాయలపై నిమ్మడి దేవరా జెప్పుడు తిరుగబడెనో అతని శిక్షించుటకు రాయ లాతనిపై దండు ఎపుడు వెళ్లెనో నిశ్చయించుటకు దగిన సాక్ష్యమింతవఱకు లభ్యపడలేదు; కాని క్రీ. శ. ౧౫౦౬ డిసెంబరు ౧౫ వ తేదీనాటి మైసూరుజిల్లా మళవళ్లి తాలూకా ముట్టహళ్లిగ్రామశిలాశాసన మున 'ఉమ్మత్తూరు దేవణ్ణొడయల కుమారుడైన మల్లరాజను పేరు గల చిక్కరాయలు' శ్రీమన్మ హారాజాధిరాజ రాజపరమేశ్వర భుజబలప్రతాప నర సింహమహారాయల సామంతుడుగ రాష్ట్రపాలన నేయుచుండినట్లు చెప్పియుండుటవలన[12] నుమ్మ త్తూరుప్రభువు తిరుగుబాటును, వీరనరసింహరాయల దండయాత్రయు, ప్రాయశః క్రీ. శ. ౧౫౦౭ వ సంవత్సరముననో యించుక తరువాతనో నడచి యుండవలయును. ఉమ్మత్తూరు ప్రభువు వెనుగొండ దుర్గమును సాధించినది దానికి తరువాతనై యుండ వలయును. ఫలనగా, ఇమ్మడినరసింహరాయలు క్రీ. శ. ౧౫౦౬ వఱకును వీరనరసింహరాయలచే వెనుగొండయందు కారాగారమున బంధింపబడి యుండి యచ్చట నా సంవత్సర మతనిచే వధింప బడెను. కావున వెనుగొండ యప్పటివఱకును వీర నరసింహరాయల స్వాధీనమందుండెనని నిశ్చయ ముగ జెప్పవచ్చును. వీరనరసింహరాయల పరా జయమునకు ముందు ఇమ్మడి దేవణ్ణకు వెనుగొండ స్వాధీనపడియుండదు. కావున క్రీ. శ. ౧౫౦౭ ననో, ఇందుకు తరువాతనో దేవణ్ణ వెనుగొండను సాధించియుండవలయును.

అల్పరాష్ట్రాధిపతియైన ఉమ్మత్తూరు దేవరాజు రాయల నింత సులభముగ నెట్లోడింపగల్గెనో కను గొనవలసియున్నది. వీరనరసింహరాయలు సామ్రా జ్యాధిపత్యమును వహించిన పిమ్మట కొందఱు మండ లాధిపతులును, పలువురు సామంతులును నతనిపై దిరుగుబాటుచేసినట్లు న్యూనిసు వ్రాసియున్నాడు.[13] అట్లు తిరుగుబాటుచేసినవారిలో నిమ్మడి గాచప్ప ఉడయరు ముఖ్యుడు. నరసానాయకుని సేనాధిపతు లలో నితడొక్కడు. ఇతడు ఆదవాని దుర్గాధీశుడగు గాచప్పనాయకుని కుమారుడు. క్రీ. శ. ౧౪౯౭ వ సంవత్సరమున రాయదుర్గచావడికి జెందిన అగళిస్థల మును పాలించుచుండెను.[14] అనంతపుర మండలము లోని యురువకొండయందలి శిలాశాసనమువలన క్రీ. శ. ౧౫౦౪ న నితడు యాదవగిరి దుర్గమును పాలించుచుండినట్లు తెలియుచున్నది. యాదవగిరి బళ్లారిమండలములోనియాదవనిదుర్గమునకునామాం

12. ఎపి. కర్ణా. సం. ౩. మల. నెం. ౯౫

13. *Forgotten Empire, p.* 314.

14. *ARE.* 719 *of* 1917.

తరము.[15] ఇమ్మడి కాచప్ప బిజాపురసుల్తాను యూసఫు ఆదిల్ ఖానునితో మైత్రి వాటించి యతని బలము నూతకొని వీరనరసింహరాయలను బ్రతి ఘటించెను. ఈ కాచప్ప ఉడయనికి ఉమ్మత్తూరు దొరలతో సంబంధముగలదని కొందఱి యభిప్రాయము. ఈ యభిప్రాయమును స్థిరపఱచగల సాక్ష్యమెద్దియు లభింపకపోయి నను, అది యసమంజసము గాదు. కాచప్పయధి కారము పెనుగొండ ప్రాంతదేశము వఱకును వ్యాపించియుండెనని పై నుదాహరింపబడిన శాసన సాక్ష్యమువలనరుఱువగుచున్నది. ఉమ్మత్తూరుదొరలు పెనుగొండను సాధించినట్లు పోర్చుగీసు రాయబారి ఫ్రయ్యరులూయి ఉత్తరములవలన దెలియుచున్నది. కాచప్పకును, ఉమ్మత్తూరువారికిని వీరనరసింహ రాయలు సామాన్యశత్రువు. మఱియు స్వాతంత్ర్య స్థాపనకై ఏకకాలమున వీరిరువురును రాయలతో బోరుచుండిరి. కావున కాచప్పకు ఉమ్మత్తూరు వారితో మైత్రికలుగుట యసహజము గాదు. దీని నిజానిజము లెట్లుండినను ఉమ్మత్తూరుపై వీరనర సింహరాయ లెత్తిపోయిన కాలముననే యాదవని యందు కాచప్ప రాయల యధికారమును ద్రోసి పుచ్చి స్వతంత్రధ్వజమును లేవనెత్తెను. అతనికి ప్రాపుగనతని మిత్రుడు బిజాపురప్రభువు యూసుఫు ఆదిల్ ఖానుడు గొప్పదండుతో రాయరాజ్యముపై నెత్తివచ్చి తుంగభద్రను దాటి కందనవోలునకు ముట్టడి వేసెను.

వీరనరసింహరాయల యాజ్ఞమీద అరవీటి బుక్కరాజు రామరాజును, నతని పుత్రుడగు తిమ్మ రాజును కందనవోలుదగ్గరను, ఆదవానిచెంతను నాదిల్ ఖాను నోడించి తఱుమగొట్టిరి. కాచప్ప నోడించి బందీకృతుని గావించి యాదవాని దుర్గ ముతోగూడ నతని రాయల కొప్పగించెనని ఆర వీటిరాజుల తామ్రశాసనములవలనను వారంకితము గొనిన యాంధ్ర గ్రంథముల వలనను దెలియవచ్చు చున్నది.[16] బుక్కరాజు రామరాజును నతని పుత్రు

---

15. *ARE.* 409 *of* 1920. శాసన శాఖవారి ౧౯౨౦ వ సంవత్సరపు వార్షికనివేదికయందు *'Kacha-Rajendra ruling at Devagiri'* అని యున్నది. మఱియు నీ దేవగిరి యాదవవంశనృపాలుర రాజధాని యగు నౌరంగబాదుజిల్లాలోని దేవగిరియనియు, గాచ రాజేంద్రు డా వంశమునకు జెందినవా డనియు శాసన శాఖవా రభిప్రాయపడియున్నారు. (*ARE.* 1921 *Part II para* 12) ఇది పొరబాటు. శాసన ప్రతిబింబమును బరిశీలించిచూడగా నందు 'దవగిరి' యని యున్నది కాని దేవగిరి యని లేదు. మఱియు 'ద'కుముందు శాసనశిల పేడెత్తిపోవుటవలన నొక యక్షరము మాసి పోయియున్నది. ఆరవీటివంశజుల శాసనములందును, పద్యద్విపదబాలభాగవతములందును 'కాచప్ప' ఆద వానిదుర్గపాలకుడని యున్నది. ఆదవనిదుర్గకై ఫితున దానికి యాదవగిరి యను నామాంతర ముండినట్లు చెప్పియున్నది. కావున శాసనములోని 'దవగిరి'ని [యా] దవగిరి యని సంపూర్తిచేసితిని. ఇది యంగీ కార్యము గాకపోయినను, దేవగిరి యను పాఠమే సరి యైన దనుకొన్నను, అప్పుడు అహమదునగర రాజ్యాంతర్గతమును బిజాపురరాజ్యమునకు జాల యుత్తరమునం దుండిన ప్రాచీనయాదవరాజుల రాజ ధాని యది కాజాలదు. పెనుగొండకు సురగిరి దేవగిరి యను నామాంతరము లుండుట సుప్రసిద్ధము. కావున పెనుగొండయే ఈ దేవగిరి కావచ్చును.

16. ఆరవీటి రాజుల తామ్రశాసనములందు సామాన్యముగ గానవచ్చు నీ క్రింది శ్లోకము లిచ్చట స్మరింపదగినవి.

౧౧. సహస్రైస్సప్తత్యా సహితమపి యస్సింధుజనుషాం
సపాదస్యానీకం సమితి భుజశార్యేణమహతా,
విజిత్యాదత్తే స్మాదవనిగిరిదుర్గం విభుతయా
విధూతేంద్రః కాళప్పడయమపి విద్రావ్యసహసా.

౧౨. కందనవోలిదుర్గ మురుకందళదభ్యుదయో
బాహుబలేన యో బహుతరేణ విజిత్యమహేశ
సన్నిహితస్య తత్ర చరణాంబుషు భక్తతయా
జ్ఞాతిభి రర్పితం సుధయతిస్మ నిసేవ్య విషం.
(ఎపి. ఇండి. సం. ౧౬ పుట ౩౪౮)

మఱియు కోనేరునాథుని బాలభాగవతములయం దీ విషయములు వర్ణింపబడియున్నవి.

"ఎందునెన్నగ జాలు నిర్ధార్యమున
గందనవోలి దుర్గంబులోనుండి
బుక్కయరామభూభుజు డెల్లనృపులు
నెక్కువ యిది యని యెన్నంగజాలి

డగు తిమ్మరాజును జిన్న సామంతులు. డెబ్బదివేల గుఱ్ఱపుదళములతో గూడ నెత్తివచ్చిన యూసుపు ఆదిల్ ఖానుని నిర్జించి పాఱదోలుటకు వారికిస్వయం శక్తి లేదు. రాయసైన్యములు తోడు లేక యా కార్యమును వారు నిర్వహించి యుండజాలరు. తమ యాధిపత్యముక్రింద శత్రువులతో రాయ రాణువ పోరాడి పొందిన విజయములను కేవలము దమ పరాక్రమము వలననే కలిగినట్లు రాయసామం తులును, దళనాయకులును ప్రకటించుకొనుట యాచారమగుటచే నారవీటి రామరాజును, నతని కుమారుడును పొందిన విజయములును నట్టివెయ్యై యుండవలయును. కావున వీరనరసింహరాయ లుమ్మత్తూరుపై నెత్తిపోయిన సమయమునసై యూసుపు ఆదిల్ ఖానుడు విజయనగర సామ్రాజ్య ముపై నెత్తివచ్చుటవలన రాయరాణువయందు జాల భాగమాతని నెదిర్చి తఱుముటకు బోవలసి వచ్చెను. అందువలన నుమ్మత్తూరును సాధించుటకు దగినంత బలములేక పోయెను. వీరనరసింహరాయల అపజయమున కిదియె ముఖ్యకారణమని తోచు చున్నది.

ఏకారణముచే వీరనరసింహరాయల కప జయము గలిగినను, గృష్ణదేవరాయల పట్టాభిషేక కాలమున దక్షిణ కర్ణాటకమున జాల భాగము రాయల యధికారము నంగీకరింపక స్వతంత్రనుగ

వీరులు డెబ్బదివేవురాశ్వికులు
జేరి కొల్వంగవచ్చిన సవా నెదిరి
కలనంది పంచబంగాళంబు జేసి
గెలిచె దచ్చరితంబు గీర్తింప దరమె?

వినుతింపదగు నాదవేనిదుర్గమున
ననతుడై యుండుకాచాధీశు గెలిచి
అరుదుగా సప్తాంగహరణంబు నేసె
గరిమోన్నతుండు బుక్కయరామవిభుడు."

"పద్యబాలభాగవతమున,

గబ్బుల్ డెబ్బదివేవు రాశ్వికులువే
డక్కన్ గొల్వగా గిక్క పె
న్మబ్బుల్ గప్పగ గందనోలు గొనువే
డక్కన్ జుట్టుముట్టన్ సవా
బిబ్బీనుబ్బణగించె తోలె నరిరా
డ్భీముండు లంకాసర
ణ్యబ్బంద్రాభుడు బుక్కభూవిభునిరా
మాధీశు డాహా యనన్."

అను పద్యముగూడ నీ విషయమును విశదపఱచు చున్నది.

రామరాజు తిమ్మరాజుసయిత మాదవనిదుర్గ మును సాధించుటకు దన తండ్రికి సహాయ మొనరెను.

"విక్రమంబున నాదవేనిదుర్గంబు
విక్రాంతు లెన్న వేవేగసాధించి
సిరులతో వీరనృసింహరాయలకు
బరుషాత్మ దుర్గాధిపతి నొప్పగించి
గరిమ స్వామిద్రోహగండపెండెర
మరిభీకరముగ రాయ లొసంగ నొందె."

—ద్విపదబాలభాగవతము (భారతి. సం. ౬ పుటలు. ౫౨౭, ౫౩౫).

వీరనరసింహరాయలచే రామరాజు తిమ్మరాజు 'స్వామిద్రోహరగండపెండెరము' ను గొన్నవిషయము పద్యబాలభాగవతమునందును నుడివియున్నది.

"శ్రీవీరనరసింహుచే బ్రతిద్రోహర
గండపెండెర'మేఘనుడు గాంచె."

"శ్రీమద్వీరనృసింహరాయనృపతి
శ్రేయోదయాసాధిత
'స్వామిద్రోహరగండనూపుర'విరా
జద్రామరాట్తిమ్మ—"
(భారతి. సం. ౬ పుట.౫౩౫, అదో. ౩౦.)

రామరాజీయమునందును పై విజయప్రస్తావము గలదు.

"మదకరి కొకటి కిర్వది గుఱ్ఱములు
గుఱ్ఱమునకు విలుకాండ్రు ముగురు విచ్చు
కత్తులవా రీపెకాండ్రట్ల వర్తిల్ల
నిట్టి యేనుగులను జుట్టు మూడు

వేలయేనూరు సద్వృత్తితో నడవంగ
గందనోల్సాధింపగా దలంచి

మొనడించి గట్టిగా ముట్టడి దిగిన నా
బిబ్బని మిక్కిలి యుబ్బణంచి."—

(*Sources. p.* 104)

నుండినది. కావున ఉమ్మత్తూరుప్రభువులను జిదుగ గొట్టి వారి స్వాధీనమందుండిన దుర్గములను, రాష్ట్రమును మరల రాయసామ్రాజ్యమున జేర్చు కొనుట కృష్ణరాయలకు ప్రథమకర్తవ్యమాయెను. బిజాపురసుల్తాను దమీమువేసిన వెనుక రాయలు దనపై మరల నెత్తిరాగలడని యుమ్మత్తూరిదేవరా జెఱుగును. కావున నతడు రాయసైన్యము లెప్పుడు వచ్చినను దగురీతిని ప్రతిఘటించుటకు వలసిన ప్రయత్నములు సేయగడగెను. ఈ ప్రయత్నములు కొంగుదేశరాజాక్కళిక చరిత్రయం దిట్లు వర్ణింప బడి యున్నది :

" అప్పుడు కర్ణాటకదేశపు రాజులలో నున్న త్తూరు రాజులు శివసముద్రమును కైవసముజేసికొని ఆ కోట రెండుప్రక్కలను కావేరి ప్రవహించు చుండుటవలన ఆ కోటను జక్కగా కట్టి అనేక ఫిరం గులు మొదలగు నాయుధములవల్లను బలపఱచి ఆ త్యాపరాజు (దేవరాజు) స్వర్గమును బొందినవా డాయెను. అంతట వానికుమారుడు గంగరాయడు అచట రాజ్యమును రక్షించుకొనుచు ఆ కోటను పెక్కు ఆయుధములవల్లను అనేకజనులవల్లను బహుభద్రము జేసికొని యుండెను.[17]

కృష్ణదేవరాయలు మొట్టమొదట ఉమ్మ త్తూరు మొదలుగ సర్వకర్ణాటకరాజ్యమును సాధింప నిశ్చయించుకొనెను.[18] వీరనరసింహరాయల పరా భవమొకప్రక్కను, అంతశ్శత్రువర్గమును నిర్మూ లము గావించి రాజ్యమును నిష్కంటకము గావింప వలయునను ఇచ్ఛ యొకప్రక్కను ప్రేరేపింప కృష్ణ రాయలుమ్మత్తూరిపై దండయాత్ర వెడలెను.[19] ఉమ్మత్తూరు దండయాత్ర వృత్తాంతము పెక్కు గ్రంథములందు వర్ణింపబడియున్నది. ముక్కు తిమ్మన్నగారు—

'ఉమ్మత్తూరు శివన్ సముద్ర పురవ
ప్రోన్మ్మలనాడంబరా'[20]

అని యొక్కమాటతో దండయాత్రపర్యవ సానమును సూచించినారు. అష్టే సంగీతసూర్యో దయ కర్త బండారు లక్ష్మీనారాయణ ముక్కు తిమ్మన్నగారి భాగములో సగము నొక శ్లోకమున నిమిడ్చినాడు.

" బాల్యే సౌ సకలకలాకలాప్రయుక్తం
సప్రాణం సపది విజిత్య గంగరాజం,

---

17. *Further Sources, I, No.* 123.

18. కొంగుదేశరాజాక్కళిక చరిత్రలో కృష్ణదేవరాయలు ఉమ్మత్తూరు దండయాత్రకు ముందు ద్రావిడదేశమును జయించినట్లు చెప్పియున్నది.

"అటుపిమ్మట విజయనగరికోటను జక్కగ గట్టి, పెనుగొండ చంద్రగిరి ఇవి మొదలగు కోటలు గట్టించి చాలమందిని చేర్చుకొని యనేకగజాశ్వములు మున్నగు వానిని గూర్చుకొని రాజ్యములను గట్టుకొనవలయునని ద్రావిడదేశమునకు బోయి యచట కాంచి చెంజి వేలూరు కోటలను కైవసముజేసికొని వేలూరుకోటను బహుభద్రముగ గట్టి దానియందు తమ మనుష్యులను, రాజకుమారులను గావుంచి రాజ్యమును ధర్మనీతిగ రక్షించుకొనుచుండిరి." (*Further Sources*, I. *No.* 113.)

దీని నాధారపఱచుకొని కీ. శే: డాక్టరు యస్. కృష్ణస్వామిఅయ్యంగారు "*A Yet-remembered Ruler of a Long - forgotten Empire*" (*pp.* 7-9) అను గ్రంథమున నుమ్మత్తూరురాజ్యమే కళింగ దిగ్విజ యానంతరము న్యూనిజుచరిత్రబడి కృష్ణదేవరాయలు జయించిన కాటూరురాజ్య మని వాదించి యచట నతడు సాధించిన నదీశాఖలమధ్యపట్టణమే శివన్ సముద్ర మని చెప్పి, గంగరాజురాష్ట్రము చోళమండ లాంతర్గతమని నిర్ధారించినారు. మఱియు న్యూనిజు పేర్కొన్న కాటూరుదేశమే కాడవరాయదేశ మని సాధించి దానిని కృష్ణరాయలు జయించెనని రుజువు సేయుటకు కొంగుదేశరాజాక్కళిక చరిత్రయందలి పై వాక్యముల నుదాహరించిరి.

కాని కృష్ణస్వామయ్యంగారు వాదించునట్లు ఉమ్మత్తూరు చోళమండలాంతర్గతము గాదు; మఱియు కాటూరురాజ్యమును, ఉమ్మత్తూరు రాజ్యమును నొక్కటి కావు. కృష్ణరాయల కాలమునకు కాడవుల పేరు సంపూర్ణముగా మాసిపోయినది. కావున కృష్ణ రాయలు ద్రావిడదేశమును జయించె నని రుజువుసేయ గల విశ్వాసపాత్రమైన సాక్ష్యము గానరాదు.

19. *Forgotten Empire p.* 126

20 పారిజాతహరణము.

భంక్త్వా తచ్ఛివనసముద్ర ముత్కటం ద్రా
గావాసం వ్యతనుత నిర్భరం శివానాం.''21

రాయవాచకమున నింతకంటె విపులముగ,—

''గుర్రం యెక్కుకొని పయనం గతుల కదలి వుమ్మత్తూరు శివసముద్రానకు వచ్చి గంగా రావు వూడెముమీంద కార్యము నేసి వుదరదోలి ఆ స్థలాలు వక్కనాటనె సాధించి అక్కడ వూడిగాలవార్లను వుంచి అందునుండి శ్రీరంగపట్టం కోట కెచినికోట కొత్తళములు జూచి మీద ఆది రంగనాయకుల నేవించి'' అని వర్ణింపబడి యున్నది.22

కృష్ణరాయ విజయమున ''ఒక్క హురు మత్తున నుమ్మత్తూరు శివసముద్రస్థలంబుల నెసంగు గంగరాజునొడయల నోడించి తదీయస్థలంబున కాణెంబులు బలియించి శ్రీరంగపట్టణంబు నిరీక్షించి'' అని రాయవాచకములోని విషయమునే సంగ్ర హించి చెప్పియున్నది.23

కాని కొంగుదేశరాజాక్కళ్ల చరిత్రయం దొక్కదానియందు మాత్రమే దండయాత్ర విపులముగ వర్ణింపబడినది :

''అటుతరువాత రాయ కృష్ణరాయలు కర్ణాటకదేశపు పాళెగాండ్రు రాజులతోడయుద్ధము జేసి జయించి ఆ దేశమును గట్టుకొనవలయునని, ముందు తనయొక్క అన్నగారగు వీరనరసింగ రాయలు జయము లేక వచ్చియుండుటచేతను, వారు కప్పమీయక నుండుటచేతను వారిపై మిక్కిలి కోపమును బొంది, ఏనుగు, గుఱ్ఱము, పదాతి (దళముల తోడను) ఫిరంగి మున్నగు నాయుధములతోడను గొందఱు పాళెగాండ్ర తోడను గూడి బయలువెడలి కర్ణాటకదేశమున కావేరితీరమున పశ్చిమరంగమునకు దూర్పున శివ సముద్రకోటను ముట్టడివేసి వానికి (గంగరాజు నకు) శత్రువుగా నుండిన చిక్కరాయని చేర్చుకొని యింకను సన్న పాళెగాండ్రతో గూడ శ్వేత పర్వతము, గౌరియనె కొండ యను స్థలముల యందు దండు దిగి యొక సంవత్సరము గడచిన వెనుక ఒత్తిన కడప కావేరి మార్గమున కోటను లగ్గలు పట్టినంతట ఆ గంగరాయడు గంగనశుచ్చి యనెడు కావేరిమడుగులో బడిపోయెను.

''తరువాత కృష్ణరాయలు ఆ కోటను గైవసము చేసికొని దానియందు తమ మనుష్యుల నుంచి శ్రీరంగపట్టణమునకు వచ్చి యాపట్టణము గూడ జయము జేసికొని శ్రీరంగపట్టణములో కంప గవుడు వీరప్పగవుడుల వశమున గొంత దేశమును విడిచి చిక్కరాయని వశమున మఱికొంత దేశమును విడిచి యచట నచట నుండు పాళెపట్టుల నన్నిటి జయించి యచటనచట (పాలించుటకు దన) మను ష్యులను నియమించి కర్ణాటక దేశము కోటిద్రవ్య మని కట్టుబడిచేసి తమ దస్త్రములో లెక్క దాఖలు చేసికొని కర్ణాటదేశమునకు ముఖ్యపట్టణముగ శ్రీరంగపట్టణము గట్టిచేసికొని యుండిన శకవర్షము ౧౪౩౪ ప్రభవవర్షము...''24

గ్రంథాధారమువల్ల కృష్ణరాయల యుమ్మ త్తూరు దండయాత్రనుగూర్చి తెలియవచ్చు విషయ మంతయు నింతయే. ఇందు విశ్వాసపాత్రములుగాని యంశములెవ్వియు గానరాకపోయినను, గొన్ని యెడల విమర్శ కెడ మున్నది. మొట్టమొదట దండయాత్ర నడచినదెప్పుడో నిశ్చయింపవలసి యున్నది. పోర్చుగీసు గవర్నరు అల్బూకెర్కు క్రీ. శ. ౧౫౧౦ సెప్టెంబరు మాసమున గోవాకర పట్టణమును బిజాపురప్రభువు నోడించి గైకొనెను. ఆ విజయవార్త విజయనగరమునకు వచ్చినంతటనే కృష్ణరాయలు పోర్చుగీసుగవర్నరుకు దన సాను భూతిని తెలియజేయుచు రాయబారులను గోవా కంపెను. వారిచే విజయనగరమందుండిన పోర్చుగీసు రాయబారి ప్రథమ్యరు లూయి యాల్బూకెర్కున కంపిన లేఖలో కృష్ణరాయలు దనకెదురు తిరిగి వెనుగొండను స్వాధీనపఱచుకొనిన సామంతునిమీది కంపుట కేడువేల మందిగల యొక చిన్న దండును సిద్ధముసేయుచుండెనని వ్రాసెను. విజయవార్త

---

21. *Further Sources, I, No.* 116 - (*a*) *v.* 4.
22. రాయ. పుట ౮౪.
23. కృష్ణ. ౩: ౬.
24. *Further Sources I. No.* 113.

విజయనగరము చేరుటకును, నచటినుండి రాయబారులు గోవాకు బయలుదేరుటకును నొక్క మాసము పట్టియుండునని యనుకొనిన క్రీ. శ. ౧౫౧౦ చివఱకు నుమ్మత్తూరు దండయాత్ర బయలువెడలలేదని చెప్పవచ్చును. కొంగుదేశ రాజాక్కళ్ఈ చరిత్రయందు శా. శ. ౧౪౩౪ ప్రభవవర్ష మప్పటికి ఉమ్మత్తూరు మొదలుగాగల సకలదక్షిణకర్ణాటకదేశమును కృష్ణరాయలు జయించి స్వాధీనపఱచుకొనె నని చెప్పియున్నది. కాని ఇచట శతాబ్దమును ప్రభవాద్యబ్దమును సరిపోవు. శా. శ. ౧౪౩౪ నకు సరియైన ప్రభవాది వర్షము ప్రభవకాదు; ఆంగీరస. శుక్లవర్షము వఱకును వీరనరసింహరాయలు రాజ్య మొనర్చుచుండెను. శా. శ. ౧౪౩౧ శుక్ల శ్రావణమునందు కాని కృష్ణరాయల రాజ్యాభిషేకము గాలేదు. కావున శా. శ. ౧౪౩౪ సరియైన వర్షము ప్రభవ యనుట తప్పు. ప్రభవ సంవత్సరమున నింకను వీర నరసింహరాయలు రాజ్యము సేయుచుండెను. ఇక శా. శ. వర్షమే సరియైనదని తలచితిమేని క్రీ. శ. ౧౫౧౭–౧౩ నకు ఉమ్మత్తూరు దండయాత్ర సంపూర్ణమాయెనని యొప్పుకొనవలసియున్నది. క్రీ. శ. ౧౫౧౭ వ సంవత్సరము ఆగష్టుమాసమున కృష్ణరాయ లింకను శివన్ సముద్రమందే యుండెనని అనంతపురమండలములోని బుక్క పట్టణగ్రామమున నుండు నొక శిలాశాసనమున జెప్పియుండుటవలన[25] కొంగుదేశ రాజాక్కళ్ఈ చరిత్రయందు నమూదు సేయబడిన శకాబ్దము సరియని యొప్పుకొనవచ్చును.

మఱియు రాయవాచకమున జెప్పినట్లు కృష్ణరాయలు ఉమ్మత్తూరు శివసముద్రములను 'ఒక్కనాటనె సాధింప' లేదు. క్రీ. శ. ౧౫౧౧ వ సంవత్సరమున విజయనగరమునుండి బయలువెడలిన రాయలు క్రీ. శ. ౧౫౧౭ ఆగస్టున నింకను శివ సముద్రము ముందుండుట చూడగా నొక శివ సముద్రముమట్టడియె యొక సంవత్సరమునకంటె నధికకాలము సాగెనను కొంగుదేశరాజాక్కళ్ఈ చరిత్రవాక్యమెక్కుడు విశ్వాసపాత్ర మని తోచెడిని. లభ్యమైన యాధారము లన్నిటిని చక్కగ బరిశీలించి చూడ నుమ్మత్తూరు దండయాత్ర దాదాపు రెండు సంవత్సరములకాలము నడచిన ట్లున్నది.

సేవాసంఖ్యానిరూపణ:—ఫ్రయ్యరు లూయి అల్బుకెర్కునకు వ్రాసిన యుత్తరమందు కృష్ణరాయ లేడువేల మందిగల చిన్నదండును పెను గొండను సాధించుటకు సిద్ధము పఱచియున్నాడని వ్రాసెను[26]; ఉమ్మత్తూరు శివసముద్రము మొదలగు బలిష్ఠములైన దుర్గములను సాధించుట కీ దండు చాలదు. న్యూనిజు చరిత్రమున కృష్ణరాయలు రాజ్యాభిషేకమయిన తరువాత ఒకటిన్నర సంవత్సరమువఱకు రాజధానియందే నివసించుచు రాజ్యపాలనా విధానమును గఱచుచుండెననియు, నా కాలమందు ౩౪౦౦౦ కాల్బలమును, ఎనిమిదివందల యేనుగులుగల బలమును సమకూర్చెననియు వ్రాసియున్నాడు.[27] రాయవాచకమునందు గూడ రాజ్యాభిషేకమైనతరువాత కృష్ణరాయలు కొంతకాలము రాజధానియందే యుండి యుద్ధప్రయత్నములు సేయుచుండెనని చెప్పియున్నది. కాని యుమ్మత్తూరుపై రాయలు దాడి వెడలినపు డతని వెంట నడచిన దళములు న్యూనిజు చెప్పిన సంఖ్యకంటె జాల పెద్దదని తెలుపుచున్నది. తనతోగూడ యుద్ధమునకు నడచుటకు రాయలు బిలిపించిన అమర నాయకుల దళములలో ౩౪౦౦౦ గుఱ్ఱములును, ౧౨౦౦ ఏనుగులును, ౨౦౦,౦౦౦ కాల్బలమును, అమరనాయకు లీయవలసిన కప్పమునకు బదులు రాయలకు స్వాధీనముజేసిన దండులో ౧౨౦౦౦ గుఱ్ఱములును, ౪౦౦ ఏనుగులును, ౧౦౦,౦౦౦ పదాతులును నుండెననియు, నివిగాక రాయలకై జీత బలగమును పాలెపట్టు ఫౌజులును యుద్ధమునకు దరలె ననియు వ్రాసియున్నది.[28] న్యూనిజు ఉమ్మత్తూరు దండయాత్రను జేర్కొనలేదు. కాని రాయవాచకమునం దీ ప్రచండసైన్యముతో గూడనే రాయలుమ్మత్తూరుపై నెత్తిపోయెనని

25. *ARE* 180 *of* 1913.
26. *Forgotten Empire p.* 126.
27. *Forgotten Empire p.* 316.
28. రాయ. పు ౩౪ తరువాయి. *Further Sources II, No.* 138.

యున్నది. ఫ్రయ్యరు లూయి యుమ్మత్తూరు దండ యాత్రయపుడు విజయనగరమున నివసించుచుండిన వాడు. న్యూనిజు కృష్ణరాయల యేలుబడియందు పలుమారు విజయనగరమునకు వచ్చుచు బోవు చుండినవాడు. ఇరువురును గృష్ణరాయల సమకాలి కులు. కావున వారు వ్రాసిన వ్రాతలను ద్రోసి పుచ్చదగదు. కాని వారు చెప్పిన వృత్తాంతము సమగ్రము గాదు. ఫ్రయ్యరు లూయి వేరొక్కని యేడువేల సేన వెనుగొండ దుర్గమును సాధించు టకుగూడ చాలదు. కాల్బలమును ఏనుగులను లెక్క పెట్టిన న్యూనిజు అశ్వబలము మాటతైన ఎత్తలేదు. ఉమ్మత్తూరును జయించిన సైన్యమే బహమనీరాజ్య ముపై జైత్రయాత్రను సాగించియుండుటవలన ఫ్రయ్యరు లూయి న్యూనిజుల సైన్యపరిగణనకంటె రాయవాచకపు గణుతియే వాస్తవమునకు చేరు బడియగుచున్నట్లు తోచుచున్నది.

ఇంతటి ప్రబల సైన్యమును వెంటబెట్టుకొని యుద్ధమునకు బయలువెడలినను విజయలబ్ధికి రాయలు కేవలము దన పరాక్రమముమీదనే యాధారపడి యుండలేదు. నయశాస్త్రమర్మజ్ఞు డగుటచేత మొదట శత్రువులను భేదోపాయము వలన వేర్పఱచి వారి బలమును దగ్గించుట యుక్త మని తలచి గంగరాజునకు జ్ఞాతియైన చిక్కరాయని చేరదీసి రాజ్య మిచ్చెదనని యాసచూపి తనయండను జేర్చుకొనెను. విభీషణుడు శ్రీరామునికివలె చిక్క రాయలు గృష్ణరాయల కుమ్మత్తూరు రాజ్యమును సాధించుటయందు తోడ్పడెను.

దండయాత్రయందలి విశేషాంశములు: ప్రథ మమున బేరొక్కనదగినది వెనుగొండ విజయము. పై నుదాహరింపబడిన యాధారగ్రంథములయందు గాని, మఱియెచటగాని కృష్ణరాయలు వెనుగొం డను జయించినట్లు చెప్పియుండలేదు. కాని ఫ్రయ్యరు లూయి యాకోట క్రీ. శ. ౧౫౧౦ వ సంవత్సరాంతమందు శత్రువుల స్వాధీనమందుండి నట్లు వ్రాసియున్నాడు. మఱియు వెనుదాహరింప బడిన బుక్కపట్టణ శిలాశాసనమువలన క్రీ. శ. ౧౫౧౭ వ సంవత్సరమున వెనుగొండ మరల రాయల యధికారము క్రిందికి వచ్చినట్లు తెలియుచున్నది. మఱియు నప్పుడింకను కృష్ణరాయలు శివసముద్ర మును ముట్టడించియే యుండుటవలన నుమ్మత్తూరు దండయాత్రయొక్క ప్రారంభదశయందే వెను గొండ నాతడు సాధించియుండవలయును.

రెండవది యుమ్మత్తూరు : ఇది యుమ్మత్తూరు రాజ్యమునకు రాజధాని; ఆ రాజ్యములోని ప్రధాన దుర్గముల యందొక్కటి. రాయలవారు సాధించిన దుర్గములలో నది యొక్కటి యని రాయవాచక మునందున్నది. ఉమ్మత్తూరుపురవ్రములను నిర్మా లించెనని ముక్కుతిమ్మనగారు సాభ్యము బల్కు చున్నారు. కావున గృష్ణరాయలవారీ కోటను సాధించుటతో దృప్తినందక యా కోటగోడలను నేలమట్టమునకు జదరము గావించినట్లున్నది.

ఉమ్మత్తూరు తరువాత శివసముద్రము. ఇది యుమ్మత్తూరురాజ్యమునందలి బలవత్తమదుర్గము. కావేరి రెండుపాయల మధ్యనుండు ద్వీపముపై నిర్మింపబడుటచే నది శత్రులకు దుస్సాధ్యము; వర్షాకాలమునందు దుర్గమము. మఱియు నీ కోట కిరుప్రక్కల ప్రేతగిరి, గౌరనమలె యను కొండలు రెండు పెట్టని గోడలై సంరక్షించుచుండినవి. తక్కిన వైపుల కావేరీ వాహిని యగాధకందకము వలె ప్రవహించుచుండినది. ప్రకృతిచే నిట్లా కోట సంరక్షింపబడుచుండినను దృప్తినందక యుమ్మ త్తూరు ప్రభువులు దానిని బలిష్ఠమైన గోడలచే మఱింత దృఢపఱచి ఫిరంగులు మొదలగు నధు నాతన ఆయుధసమితిచే సురక్షితముగ జేసికొని యుండిరి. కావున కృష్ణదేవరాయల కీ దుర్గమును బట్టుకొనుటకు జాలకాలము పట్టినది. ప్రేతపర్వత గౌరనమలెమీద దన ముఖ్య స్కంధావారమును స్థాపించి కావేరి వైపు బలములను గాపుంచి కోట లోని వారిని వెలుపలికిని, వెలుపలివారిని కోట లోనికిని బోనీయక నరికట్టెను. గంగరాజొక సంవ త్సరమున కధికముగ రాయరాణువకు బోటు సూపి యటు పిమ్మట నిలువజాలక కోటనుండి పారి పోవుచు గంగళుచి మడువునపడి మృతుడాయెను. అంతట విజయనగర సైనికులు కోటను లగ్గవట్టి స్వాధీనము జేసికొనిరి. ఉమ్మత్తూరు కోటనుబోలి శివసముద్రదుర్గముయొక్క వ్రమములను రాయలు

విరుగ ద్రోయించెనని ముక్క తిమ్మనగారును, నక్కల కునికిపట్టుగ జేసెనని భండారు లక్ష్మీనారాయణుడును ద్రావియున్నారు.

శివసముద్రనిర్మూలముతో గర్ణాటక విద్వేషుల వెన్నెముక విరిగినది. కాని వారి యుపద్రవము సంపూర్ణముగ దొలగిపోలేదు. శ్రీరంగపట్టణ మింకను శత్రులచేతనేయుండినది. వెక్క పాళెగాండ్రు ద్రోహమార్గమును విడనాడలేదు. వారిని జిదుగ బొడిచినగాని రాష్ట్రము సంపూర్ణముగ స్వాధీనము గాదు. కావున గృష్ణరాయలు శివసముద్రమునుండి దండు దరల్చుకొని శ్రీరంగపట్టణముపై నడచి యా కోటను ముట్టడించెను. కోట బలిష్ఠమైనదే. శివసముద్రమువలె నదియు గావేరిమధ్యద్వీపముపై నుండినది. కాని యీ ముట్టడినిగూర్చి విశేషాంశము లెవ్వియు దెలియవు. కోట రాయలకు గైవశమాయెను. శ్రీరంగపట్టణము వశపడిన పిమ్మట కృష్ణరాయలా పరిసరప్రాంతములందుండిన చిల్లరపాళెగాండ్రను జయించి వారి పాళెపట్టు సీమలనన్నిటిని స్వాధీనము జేసికొనెను.

కృష్ణరాయలిట్లు దక్షిణకర్ణాటకమందలి క్షుద్ర శత్రువుల నందటిని సమూలముగ బెకలించివైచి తన యధికారమును స్థిరముగ నెలకొల్పుటకొఱకు దేశపాలనవిధానమున గొన్ని మార్పులను గావించెను. ఈ మార్పులలో ముఖ్యమైనది ప్రధాననగరనిర్ధారణ. సంగమ వంశజులకాలము నుండియు హొయ్సలదేశమునకు ముందటివలెనే ద్వారసముద్రమే ప్రధాన నగరమైయుండినది. క్రమక్రమముగ దాని ప్రాముఖ్యము సన్నగిలినది. కేంద్రప్రభుత్వపు టధికారము క్షీణించుకొలది సామంతులు బలిసి యఱుపరాని కడ్డులైరి. సాళువచక్రవర్తులకాలములో గర్ణాటక సామంతుల యడావుడి హెచ్చె సమయము చిక్కినప్పుడెల్ల కేంద్రప్రభుత్వమున కెదురుతిరుగుచు వచ్చిరి. రాను రాను కర్ణాటకమున కేంద్రప్రభుత్వమునకు ముఖ్యస్థానమైన ద్వారసముద్రము వెనుకబడిపోయినది. కావున కృష్ణరాయలు మారుమూలనుండిన ద్వారసముద్రమును వదలి విప్లవకారుల కునికిపట్టగు కావేరీతటదేశమున కాయపట్టైన శ్రీరంగపట్టణమును కేంద్రాధికారవర్గమునకు ముఖ్యస్థానమును గావించెను. మఱియు గర్ణాటకమున దాను జయించిన రాష్ట్రములో నొక భాగమునకు గెంపగవుడు, వీరప్పగౌడు లనువారిని పాలకులుగ నియమించెను. ఇంక కొంత దేశమును నమ్మత్తూరు దండయాత్రయందు తనకు సహాయుడును, గంగరాజునకు జ్ఞాతియు నగుచిక్కరాయల కొసగెను. శత్రువుల కడగొన్న పాళెపట్టు లన్నిటిని విశ్వాసపాత్రులగు దన యాశ్రితుల కిచ్చెను. వీరి యందనేకులు గర్ణాటకులు గారు. పూర్వదేశమునుండి వచ్చిన తెనుగువారు. మఱియు గర్ణాటకదేశమునుండి రాయభండారమునకు జెందవలసిన కప్పము కోటిద్రవ్యమని నిశ్చయించి నగరియర్థవణచిహ్నాలలో దాఖలు చేయించి యచటినుండి తరలిపోయెను.

కృష్ణరాయ లొనర్చిన మార్పులవలన కర్ణాటకమున శాంతి నెలకొనెను ; మఱి నూఱేండ్లదాక స్థిరమై నిర్వక్రముగ సాగినది. అచ్యుతరాయల రాజ్యారంభ కాలమున నమ్మత్తూరు దొరలు మరల తలయెత్తిరి. కాని వారి యాటలు సాగలేదు. శ్రీరంగపట్టణదుర్గాధ్యక్షులు స్వామిభక్తి పరాయణులై దేశమున కే విపత్తు రానీయక గాపాడుచువచ్చిరి. కృష్ణరాయలచే గర్ణాటకమున స్థాపింపబడిన తెనుగునాయకులును, పాళెగాండ్రును గర్ణాటక సామంతులను, రాజవిద్వేషులను నణగద్రొక్కి రాయల యధికారము నిలబెట్టుటయం దప్రమత్తులై యుండిరి.

౫. కృష్ణరాయలు—మహమ్మదీయులు

"వీరాగ్రేసరకృష్ణరాయ భవతా
కృత్తా రణప్రాఙ్గణే
ప్రౌఢాః కేచన పారసీకపతయః
ప్రాప్తాః పురీ మామరీం,
పీరుత్తేతి గురౌ బలద్విషి సుర
త్రాణేతి శచ్యామ్ పున
ర్బబ్బీతి ప్రణతా సలామితి సురా
స్మేరాననాఁ కుర్వతే"

౧ బహమనీ సుల్తాను

క్రీ. శ. ౧౫౧౦ జనవరి ౨౮ తేదినాటి కృష్ణరాయల హంపిశాసనమున రాయల ప్రతాపాతిశయమును వర్ణించుచు శాసన గ్రంథకర్త యతనిచే సురత్రాణుడొకడు పరిభవింపబడె నని వ్రాసియున్నాడు.[1] రాయలచే నట్లు పరాభూతుడైన సుల్తా నెవ్వడో శాసన గ్రంథమువలన విదితమగుట లేదు. కాని యతడు బహమనీసుల్తాను ఇమ్మడి మహమూదుశాహ యని దృఢముగ జెప్పవచ్చును. ఏలన, (౧) కృష్ణరాయల రాజ్యాభిషేకకాలమునను, దరువాత కొంతకాలమువఱకును బహమనీ రాజ్యమును పాలించుచుండిన ప్రభువు ఇమ్మడి మహమూదుశాహు. ఇతడు ముహమ్మదుశాహులష్కరీయను నామాంతరము గల ఇమ్మడిముహమ్మదుశాహుబహమనీయొక్క కుమారుడు. తన తండ్రి మరణానంతరము క్రీ. శ. ౧౪౮౨ వ సంవత్సరమున రాజ్యాధిపత్యము వహించి క్రీ. శ. ౧౫౧౮ వ సంవత్సరమువఱకు ముప్పదియారేండ్లు ప్రజాపాలన మొనర్చెను. కాని పేరునకుమాత్రమే ఇతడుసుల్తాను. ముహమ్మదుశాహు లష్కరీ గతించినవెనుక బహమనీ సుల్తానుల అధికారము సన్నగిల్లినది. రాజ్యము నందలి అమీరులు తిరుగబడి యెవ్వరి జాగీరులందు వారు స్వతంత్రులైరి. వీరియందు ముఖ్యులు నలుగురు: అహమదనగరనిజామనమలుక, గోలకొండ కుతుపనమలక, విజాపురపదులఖానును, గావిల్‌ఘడ ఇమాదనమలక. వీరితోగూడ బెడదకోట బరీదనముల్కును జేర్చుట యుక్తము. బరీదు తక్కినవారివలె అధికారమును దనపేర జరుపుకొనజాలక సర్వవ్యవహారములను సుల్తానుపేరనే సాగించవలసియుండెడిది. ఇది యతని హృదయమున గంటకప్రాయమై బాధించుచుండెను. కావున సుల్తానును దొలగించి తానే యతని స్థానము నాక్రమించుకొనవలెనని యతడు ప్రయత్నమెడతెగక సల్పుచుండువాడు; కాని యతని కడక సులభముగ నెఱవేరదాయెను. బహమనీసామంతులందఱును ఎవ్వరికి వారే స్వతంత్రులైనను, వారిలో నొండొరులకు పోఱు తప్పినదికాదు. స్వాతిశయస్థాపనకొఱకు నిరంతరము యుద్ధము సేయుచుండుటవలన నామకార్థమందఱును సుల్తానునాధిపత్యము నంగీకరించి యెవ్వరికి లాభకరమని తోచినప్పుడు వారతని సముఖమునకు బోయి యతని యాజ్ఞకు బద్ధులైనట్లు కపటనాటక మాడుచుండువారు. అందువలన అప్పటికింకను వారెవ్వరును 'సుల్తా'నను రాజబిరుదమును ధరించలేదు. మఱియు గృష్ణరాయలేమి, సమకాలిక పోర్చుగీసులేమి బహమనీసామంతుల ప్రస్తాపము వచ్చినపుడు వారిని 'సుల్తాను' లని యనక ఖానములు కాదిబిరుదులతోడనే పేర్కొనెడివారు. కావున హంపిశాసనములో గృష్ణరాయలచే బరాభూతుడైనట్లు చెప్పబడిన సుల్తాను బహమనీసుల్తానగు నిమ్మడిమహమూదుశాహే కావలయును.

(౨) ఈ యభిప్రాయమును స్థిరపఱచగల సమకాలిక పోర్చుగీసుసాక్ష్యము గొంత కలదు. క్రీ. శ. ౧౫౧౦ జనవరిమాసమున పోర్చుగీసు గవర్నరు అఫ్ఫాంసో అల్బూకెర్కు కృష్ణరాయల కడకు ప్రయ్యరు లూయి యనునతని రాయబారమంపుచు, దనతోగూడి కల్లికోటమీద యుద్ధము సేయ నొడంబడిన పక్షమున, 'దక్కనురాజు' (అనగా బహమనీ సుల్తాను)తో రాయలపుడు జేయు

1. *EP. Ind. I. p.* 363 'పరిభూతసురాత్రాణేన' అని.

చుండిన యుద్ధమున దాను దొడ్డవెడ నని చెప్పి పంపెను. ఇందువలన క్రీ. శ. ౧౫౧౦ జనవరిమాసమున, ననగా గృష్ణరాయల రాజ్యాభిషేకమైన పిమ్మట నైదాఱు నెలలలో నాతడు బహమనీ సుల్తానుతో యుద్ధము సేయుచుండెనని తెల్లమగుచున్నది.[2] హంపిశాసనకాలమప్పటికి యుద్ధమింకను ముగియకపోయినను రాయలకు జయము చేకూడెను.[3]

౨. యూసుఫు ఆదిల్ ఖాను

కృష్ణదేవరాయలు ఆముక్తమాల్యదలో దానుత్తరదిక్కున కేకథాటి జనినపుడు ఏదులఖానుని జంపినట్లు చెప్పియున్నాడు.

"అలుకన్ ఘోటకథట్టికాఖుర
పుటీహల్యా ఖురాసానిపు
చ్చలువో దున్ని చలచ్చమూ
గజమదాసారప్లుతి న్నిర్హిపు
ష్కలసస్యం బిడి యేకథాటి
బళిరా! కట్టించి తౌ దృష్టి కే
దులఖానోగ్రకపాలమర్థపహరి
ద్భూజాంగలశ్రేణికిన్." [4]

ఈ పద్యమువలన మూడువిషయములు తెలియవచ్చుచున్నవి :—

(౧) కృష్ణరాయలుత్తరదిశపై నేకథాటి వెడలెను. 'ఏకథాటి' యనగా నఖండితమైన దండయాత్ర, లేక అడ్డమాకలేక నిరంతరాయముగ నడచిన దండయాత్రయని యర్థము. అనగా గృష్ణరాయల కీదండయాత్రయందు శత్రునిరోధమెచ్చటను గలుగలేదు. (౨) అవిచ్ఛిన్నమైన ఈ థాటియందు రాయలకు ఖురాసానుదేశజులైన తురకలతో యుద్ధము గలిగినది. కృష్ణరాయలు విజయుడాయెను. (౩) యుద్ధమున గృష్ణరాయ లేదులఖానుని వధించెను.

ఈ దండయాత్ర యెప్పుడు నడచెనో అందు రాయలచే వధింపబడిన యేదులఖా నెవ్వడో కను గొనవలసి యున్నది. మొదటి ప్రశ్నకు సమాధానము రెండవదానిపై నాధారపడి యుండుటవలన నాద్యమున రెండవప్రశ్నకు సమాధానమును వెదకుట యుక్తము.

'ఏదులఖా' ననునది బిరుదు. ఇది 'ఆదిల్ ఖా' అను పారసీమాట కాంధ్రరూపము. కృష్ణదేవరాయల కాలమున మనకు దెలిసినంతవఱకు ఆదిల్ ఖాను నామధారులు తురకప్రభువులు మువ్వురుండిరి. వీరియందు ప్రథమగణ్యుడు యూసుఫు ఆదిల్ ఖానుడు. ఇతనికి 'సవాయీ' యను సుప్రసిద్ధ నామాంతరము గలదు. దీనినుండియే తెనుగు 'సవా', 'సపాద' శబ్దములును, పోర్చుగీసు 'సబైయో' 'సబైయసు' శబ్దములును ఏర్పడినవి. ఇతడు బహమనీసుల్తాను ఇమ్మడిమహమ్మదుశాహు కొలువున ప్రవేశించి పెక్కు యుద్ధములందు దన పరాక్రమప్రదర్శనమువలన పేరుప్రఖ్యాతులు గడించెను; కాని ఇమ్మడిమహమ్మదుశాహు మరణానంతర మతని పుత్రుడిమ్మడి మహమూదుశాహును సరకుసేయక స్వతంత్రముగ దన సంస్థాన వ్యవహారములు నడుపుకొనుచు ననుకూలపడినపుడిరుగుపొరుగు సంస్థానాధిపతులను గొట్టి వారి రాజ్యముల నాక్రమించుకొనుచుండువాడు. విజాపుర రాజ్యసంస్థాపకు డితడే. ఇతడు క్రీ. శ. ౧౪౮౯ మొదలు క్రీ. శ. ౧౫౧౦ వఱకు ప్రజాపాలనగావించెను. ఇతని తరువాత పేరొక్కనదగినవాడు ఇతని పుత్రుడు ఇస్మాయీలు ఆదిల్ ఖానుడు. ఇతడు క్రీ. శ. ౧౫౧౦ మొదలు ౧౫౩౪ వఱకు రాజ్యము జేసెను. మూడవవాడు ఖాన్దేశప్రభువు ఆజమ్ హుమాయూ బిరుదాంకుడగు ముమ్మడి ఆదిల్ ఖానుడు. ఇతడు క్రీ. శ. ౧౫౧౦ మొదలు క్రీ. శ. ౧౫౩౦ పర్యంతము ప్రజాపాలన మొనర్చెను.[5]

---

2. *Commentaries of Affonso Dalbuquerque, II. pp.* 74-77.

3. చూ. ఈ ప్రకరణముచివర అనుబంధము ౧. పుటలు 44 తరువాయి

4. ఆముక్త. ౧: ౪౨.

5. *Briggs' Ferishta, IV. p.* 307. కాని ఇతడు క్రీ. శ. ౧౫౧౮ వఱకే రాజ్యము జేసినట్లు గుజరాతు దేశపు అరబీ చరిత్రయం దున్నది. (*Arabic History of Gujarat, III. p* 22.)

3. ఇస్మాయిల్ ఆదిల్ ఖానుడు

తురకలపై కృష్ణరాయల యుద్ధము యూసుఫుఆదిల్ ఖానుని వధతో ముగియలేదు. యూసుఫుఆదిల్ ఖానుడు దన జీవితకాలమున విజయనగర సామ్రాజ్యమునకు జెందిన కృష్ణా తుంగభద్రల మధ్య యంతర్వేదియందు జాలభాగమును రాయచూరు ముదుగల్లు దుర్గములతోగూడ నాక్రమించుకొనియుండెను. కృష్ణరాయల పూర్వికులు బలుమా రీయంతర్వేదిభూములను దుర్గములను సాధించుటకు బ్రయత్నము సల్పిరి; కాని వారి మనోరథము నెఱవేఱదయ్యె. మఱియు సాళువనరసింగరాయలు దన మరణశాసనమునందు తన యధికారము క్రిందికి రాక యన్యాక్రాంతములై యుండిన రాచోలు ఓదగిరి కొండలగి యను ముఖ్యదుర్గములు మూడింటిని వానిక్రిందిరాష్ట్రము లను మరణ మాసన్నమగుటచే దాను జయింప జాలకపోతి ననియు, దనయనంతరము రాయపీఠ మధిష్ఠించు ప్రభువు లెట్లైనను వానిని గైవసము జేసికొనవలయుననియు నాదేశించియుండెను.[8] కావున రాయచూరు ముదుగల్లు దుర్గములను వాని క్రిందిదేశమును సాధించుట కృష్ణరాయలకు ప్రథమకర్తవ్య మాయెను. సమయముగూడ ననుకూలపడినది.

యూసుఫుఆదిల్ ఖానునిమరణానంతరమతని కుమారుడు ఇస్మాయిల్ ఆదిల్ ఖానుడు విజాపుర సంస్థానమున కధిపతి యాయెను. అతడు తరుణవయస్కుడగుటచే నతని తండ్రి కార్యఖడ్గములకు గర్తయైయుండిన కమాల్ ఖానుడు అతనికి ప్రతిగ రాజ్యపాలన సేయ దొడగెను. కీర్తికాయుడైన తన యజమానుడగు యూసుఫుఆదిల్ ఖానుని మార్గము నవలంబించి యతడిరుగుపొరుగు సామంతుల సీమలను గబళించి విజాపురరాష్ట్రమును విస్తరించుటకు ప్రబలప్రయత్నములు సేయగడగెను. అతని రాజ్యతుధకు బహమనీసుల్తానుల ప్రాచీనరాజధాని కలుబరిగ ప్రథమకబళ మాయెను. అప్పు డాదుర్గమును, దాని కనుబంధమైయుండిన రాష్ట్రమును మల్లిక్ దస్తూరుదీనా రను హబిసీ

ఈ మువ్వురు ఆదిల్ ఖానులలో రెండవవాడగు నిస్మాయీలుఆదిల్ ఖానుని ప్రస్తాపము నిచట జేయవలసిన యావశ్యకత లేదు. ఏలన నతడు కృష్ణరాయల మరణానంతరము నాలుగేండ్లకాలము జీవించి యుండెను; కావున కృష్ణరాయలచే నితడు వధింపబడెననుట తగదు; ఆజమ్‌హుమాయూఁ ముమ్మడియాదిల్ ఖానుడు కృష్ణరాయల రాజ్యకాలమున మృతి నందినను, అతడు రాయలతోడి యుద్ధమున రణశయ్య నలంకరించెనని తలచుటకు వీలులేదు. ఏలనగా క్రీ. శ. ౧౫౧౮ వఱకును కృష్ణరాయలు కళింగదండయాత్రయందు నిమగ్నుడై యుండెను; తరువాత కాటూరిపై దాడి. అటు పిమ్మట క్రీ. శ. ౧౫౨౦ వ సం. న రాయచూరు దండయాత్రయు, నిస్మాయీలు ఆదిల్ ఖానునితో యుద్ధము జరిగెను. కావున క్రీ. శ. ౧౫౨౦ సం. న కృష్ణరాయలు ఖాఁదేశముపై దండువెడలె ననికాని ఆజమ్‌హుమాయూఁ ముమ్మడియాదిల్ ఖానుని వధించెనని కాని తలచుటకు వలనుపడదు. ఇక మిగిలియుండువాడు యూసుఫుఆదిల్ ఖానుడు; ఇతడు క్రీ. శ. ౧౫౦౯-౧౦ న మృతి నందెను; కోవెలకొండలో జచ్చెనని తారీఖ ముహమ్మదుకుల్లీకుతుబుశాహందును, గోవెలకొండ కనుచూపుమేర నుండగ మృతి నందెనని బుర్హాఁ-ఇ-మ ఆసీరునందును జెప్పియున్నది.[6] కోవెలకొండ విజాపురగోలకొండరాజ్యముల సరదుస్థలములందుండిన బలిష్ఠమైన దుర్గము. కృష్ణరాయలు బహమనీసుల్తానుతో నిర్ప్రాంతమున యుద్ధము సేయుచుండిన కాలమునసే యూసుఫుఆదిల్ ఖాను మృతి నందియుండుటచేతను, రాయ లాతని రణరంగమున వధించితినని చెప్పియుండుటచేతను బహమనీసుల్తానుతోడి యుద్ధమునసే యాదిల్ ఖానుడును నిహతుడాయె నని తోచుచున్నది.[7]

---

6. *Briggs' Ferishta III (App) p.* 350. *Burhan-i-Maasir, IA-XXVIII, p.* 319.

7. చూ. ఈ ప్రకరణముచివర అనుబంధము-౨. పుటలు 51 తరువాయి

8. *Numiz, See F.E. pp.* 308, 316.

సామంతుని పాలనక్రింద నుండెను. కమాల్ ఖా నాతనిమీద యుద్ధము ప్రకటించి కలుబరిగపై గూచిచేసి రెండునెలలపర్యంత మాకోటను ముట్ట డించి స్వాధీనము జేసికొనెను.9 దస్తూరుదీనారు కలుబరిగనుండి పాఱిపోయి బీదరుజేరి యచట సుల్తానుకు ప్రతిగ ప్రభుత్వము సల్పుచుండిన బరీదు మమాలి కను మంత్రిని శరణుజొచ్చెను. బరీదు అతని కాశ్రయమిచ్చి యాదిల్ ఖానుని కలుబరిగె నుండి పాఱదోలుటకు సైన్యముతోగూడ బయలు వెడలెను; కాని యుద్ధమున బరాజితుడాయెను; సైన్యముతో గూడ వచ్చిన బహమనీసుల్తాను ఇమ్మడిమహమూదుశాహు కమాలుఖానునిచే జిక్కి బందీకృతు డాయెను.10 తరువాత కమాలుఖానుడు బీదరుపై నడచి దానిని స్వాధీనముజేసికొని మహ మూదుశాహు నతని మందిరమునసే చెఱబెట్టి యతని యధికారమునంతటిని నాచికొని యజ్మత్-ఉల్-ముల్కను నాదిల్ఖానుని సామంతు నాతనిపై గా పుంచెను.11

ఆదిల్ ఖానుని విజయవార్తయు, సుల్తాను బంధన వృత్తాంతమును దెలియవచ్చినంతటనె బహ మనీరాజ్యమునం దంతటను గొప్ప సంచలనము గలి గినది. ఆదిల్ ఖానుచే బందీకృతుడైన పిదప సుల్తా నతనికి వశవర్తి యగుటతథ్యము; సుల్తానుపేర బహమనీరాజ్యముపై నతడు దనయధికారమును సాగింపగడగుననుట నిస్సంశయము. స్వాతంత్ర్య మును రుచిమాచిన బహమనీ సామంతుల కాదిల్ ఖానుని యుత్సేకముగిట్టలేదు. కావున వారియందు ప్రముఖులగు బరీద్-ఇ-మమాలిక్, మల్లిక్ అహ మద్ భైరీ నిజామ్-ఉల్-ముల్కు, కుతుబ్-ఉల్-ముల్కు, దస్తూర్-ఇ-దీనారు మున్నగువారలేకమై బీదరుపై నడచి యా కోటను ముట్టడించిరి. కొంత కాలము ముట్టడి సాగినది. కోటలోనివారనేకులు మడిసిరి. జనసామాన్యమునకు రానురాను జీవనము దుర్భరము గాజొచ్చినది. కావున అజ్మత్-ఉల్-ముల్కు బరీద్-ఇ-మమాలికును గలిసికొని సంధి గావించుకొనెను.12 అటుతరువాత సంయుక్త బహమనీసామంత సైన్య మాదిల్ ఖానుని రాష్ట్ర ముపై నడచెను; భీమాపూర్వతటమునందలి కలు బరిగ మున్నగు దుర్గములనేకములును వానిక్రింది రాష్ట్రములతోగూడ వారు వశపఱచుకొని కడపట ఆదిల్ ఖానుని రాజధానియగు విజాపురమును జయించు నుద్దేశ్యముతో బయలువెడలిరి.

శత్రువులు రాజధానిపై నెత్తివచ్చుచున్నా రనువార్త విజాపుర రాజ్యమందంతటను సంక్షోభము గలిగించినది. అప్పటి విజాపురరాజ్యస్థితిని పోర్చు గీసుగ్రంథకర్తలు జక్కగా వివరించియున్నారు. అల్బూకెర్కు కామెంటరీసునందిట్లున్నది: "సఫైయో (సహాయా = సహాద) గతించిన పిమ్మట నతని కుమా రుడగు హిదల్ ఖానుడు బాల పసివాడగుటచే దక్కను రాజ్యసామంతుల మధ్య గొప్ప కలహ ముప్పతిల్లినది. గోవాపాలకుడగు మల్లిక్ సూఫర్ గూగి, సఫైయో మృతినందిన తరువాత నెవ్వరిని సరకు సేయలేదు. ఇతని కొలువున వేవురు ఆయుధో పజీవు లుండిరి. దేశములోని ప్రజలొండొరులతో గలహించుచు బోట్లాడుచుండిరి. బెల్గాములోని హిందువులు హిదల్ ఖానునిపై దిరుగబడి, పట్టణము నుండి మహమ్మదీయులను వెడలనడచి, కృష్ణదేవ రాయలను వచ్చి తమ పురము నాక్రమించుకొన వలయునని యాహ్వానించిరి.13

పుర్చాసు 'పిల్గ్రిం' నను గ్రంథమున నిట్లు కలదు: "సఫైయసు (సవాయి = సహాద) మర ణించినపు డతనికి మిక్కిలి పసివాడు ఇదల్కానను కుమారు డుండెను. అందువలన ప్రజలతనిపై దిరుగ బడిరి. ఆతని రాజ్యమును హరించుటకొఱకు నర సింగదేవపురాజు దండెత్తివచ్చెను. అదే సమయమని యెంచి యాల్బూకెర్కు గోవాను ముట్టడించి స్వాధీనముజేసికొనెను; కాని యనంతర మచిర కాలమునసే ప్రచండ సైన్యముతో నదల్కాను

---

9. *Commentaries of Affonso Dalbuquerque III, Ch., VIII. p.* 36.

10. *Commentaries of Affonso Dalbuquerque, See, 'Yavanarajya Sthapanacharya' JOR. X, pp.* 168-171.

11. *Ibid III Ch. VIII p.* 36, *Burhan-i-Maasir I.A. XXVIII. p.* 319

12. *Burhan-i-Maasir, IA. XXVIII. pp.* 319-20.

13. *Commentaries of Affonso Dalbuquerque II. Ch. XVIII. p.* 82, *Ch. XIX p.* 85 ; *JOR. X. p.* 160.

వచ్చెను. రాతిరికి రాతిరే పోర్చుగీసులు పారి పోయిరి. నరసింగదేశపు రాజు మరల యుద్ధమునకు రాగా ఇదల్కానుడు గోవాపట్టణమున బలిష్ఠమైన శాణ్యమును గాపుంచి బలాధికుడైన శత్రునిపై గవయబోయెను. కాని యాల్బూకెర్కా శాణ్యము నోడించి పట్టణము జూఱగొనెను."[14]

ఫ్రయ్యరు లూయి క్రీ. శ. ౧౫౧౦ డిసెంబరు మాసమం దాల్బూకెర్కుకు విజయనగరమునుండి వ్రాసిన యుత్తరమున దక్కనురాజ్య రాజకీయ స్థితి నిట్లు వివరించియున్నాడు :

"హిదల్కాను గొప్ప సైన్యముతో దక్కను రాజ (సుల్తాను) సామంతుడగు మెలిక్‌దిస్తూరను హబిసీయూబ దొర పాలనక్రింద నుండు కల్బర్గేటు (కలుబరిగ) ను సాధించుటకొఱకు బయలుదేరెనని తనకు నమ్మకమైన వార్త వచ్చిన దనియు ; నా దుర్గము ముట్టడి కాగజాలకపోవుటవలన రెండు మాసములైన తరువాత కొన్ని షరతులపై నతనికి గైవశమాయె ననియు; హిదల్కాను దక్కను రాజు (సుల్తాను) యొక్క సకలాధికారములను నాచికొని యతని జెఱగొని పోవుటవలన నా రాజ్యములోని సామంతులు నలుగురు ఆతనిని వ్రతిఘటించి యతని నిర్మూలించు నుద్దేశముతో నతనిపై నెత్తిపోయిరనియు; మార్గమున నొక నది కడకు వచ్చి దాని దాటు వెఱ వెఱుగక నచట విడిసి విశ్రాంతి నంది యుండిరనియు" దెలియ పఱచెను.[15]

పై నుదాహరించిన పోర్చుగీసుగ్రంథకర్తల రచనల వలన యూసుఫుఆదిల్ ఖానుని మరణానంతరము విజాపురరాజ్య మెట్లు సంక్షోభమందియుండెనో చక్కగ దెలియవచ్చుచున్నది. యూసుఫు ఆదిల్ ఖాను డాక్రమించుకొనియుండిన కృష్ణాతుంగభద్రల నడిమి విజయనగరరాష్ట్రమును మరల స్వాధీనపఱచుకొనుట కంతకంటె సరియైన సమయము మరల లభింపదు; కావున కృష్ణదేవరాయలు వెంటనే సైన్యముతో గదలి పోయి రాయచూరు దుర్గమునకు ముట్టడివైచెను.

విజాపుర సంస్థాన మిట్లంతఃకలహాములచే గలగుండువడి పరసైన్యసమావృత మాయెను ; సంస్థానమే నిలువకపోవునేమోయను సంశయము గలిగినది. కాని రాజ్యసంరక్షకుడైన కమాలుఖానుడు ధైర్యము విడనాడలేదు. సంస్థానము నెట్లైన నిలుపవలయునని పట్టుబట్టెను. గోవా మొదలగు దుర్గములకు గాపుండిన సైన్యములను బిలిపించి, బరీద్-ఉల్-ముల్కు మొదలగు బహమనీసామంతుల నోడించి తఱుమగొట్టెను; కాని యతడు కృష్ణరాయల నెందును ఎదిర్చినట్లు కానరాదు. కృష్ణరాయలయెడ కమాలుఖాను డేల తటస్థుడై యుండెనో తెలియదు; కాని, కారణము దురూహ్యము గాదు. కృష్ణరాయలకును పోర్చుగీసుగవర్నరు కునుగల స్నేహము నత డెఱుగును. రాయలును పోర్చుగీసులును నేకమైనచో గోవాను వ[illegible] జయించుట సులభ సాధ్యముగాదు. మఱియు [illegible] ప్రక్క నుత్తరదిక్కున బహమనీ సామ[illegible] యుద్ధము సేయ నారంభించిన పిమ్మట [illegible] రాయలతో గూడ పోట్లాటబెట్టుకొని [illegible] చోటనేనియు గలుగకపోవచ్చు [illegible] కమాలఖానుని హృదయమున [illegible] మంకురించినది. పసివాడగు [illegible] దొలగద్రోసి సంస్థానమునకు దానే [illegible] లయునను నాస యతని హృద[illegible] కొనినది. తన యుద్యమమును

---

14. *Sewell, F.E. p.* 125. *n.* 1.
"పుర్చాసుగ్రంథము (ఫోలియో) మొదట క్రీ. శ. ౧౬౨౬ వ సంవత్సరమున వ్రకటింపబడెను. అతడు బ్యారాసు (*Dec. I. l. VIII Cap.* 10) ననుసరించుచున్నాడు." బ్యారాసు దన చరిత్రయందలి మొదటి డికాడాను క్రీ. శ. ౧౬౫౩ వ సంవత్సరమున వ్రకటించెను. అతడు క్రిస్టవాన్ డి ఫిగ్వీరెడో, డామింగో పయస్, ఫెర్నావన్‌న్యూనిజు మొదలగు కృష్ణరాయల సమకాలికులగు పోర్చుగీసుగ్రంథకర్తల రచనలనాధార పఱచుకొని దన చరిత్రను వ్రాసెను. (*See F.E. p. V. f*)
"నరసింగరాజ్యము అనునది విజయనగర సామ్రాజ్యమునకు పోర్చుగీసురచయితలును నన్యులును తఱుచుగ వాడు నామాంతరము." (*F. E. P.* 236 *n.* 1)

15. *Commentaries of Affonso Dalbuquerque, III. Ch. VIII. p.* 66.

కతడు మొదట బహమనీ సుల్తాను పేర బీదరును బాలించుచుండిన బరీద్-ఇ-మమాలికునకు గలుబరిగ మున్నగు భీమా పూర్వతటదుర్గములను రాష్ట్ర మును వశపఱచి సంధి జేసికొనెను. అట్లే కృష్ణ రాయలకును గృష్ణకు దక్షిణమున నుండు దుర్గము లను సీమలను ఇచ్చివేసి సంధి చేసికొనియుండ వచ్చును. మహమ్మదీయ చరిత్రలవలన కమాలు ఖాను కృష్ణరాయలతో సంధి గావించుకొనినట్లు తెలియరాకపోయినను, పోర్చుగీసు రచయిత లిట్టి సంధి కలదని చెప్పియున్నారు. క్రీ. శ. ౧౫౧౦ వ సంవత్సరమున గృష్ణరాయలు రెండు పర్యా యము లాదిల్ ఖానుమీదికి దండువెడలెనని పుర్చాసు దన 'పిల్గ్రింసు'లో వ్రాసియున్నాడు. మొదటిదండయాత్ర క్రీ. శ. ౧౫౧౦ ఫిబ్రవరిలో నల్బాకెర్కు గోవాను మొదటిసారి బట్టుకొనుటకు పూర్వము నడచెను. రెండవది క్రీ. శ. ౧౫౧౦ మే నెలలో నల్బాకెర్కు నోడించి యాదిల్ ఖానుడు గోవాను స్వాధీనపఱచుకొనినతరువాత జరిగెను. ఈ రెండు దండయాత్రల మధ్యకాలమున విజా పురవిద్యానగరరాజ్యములకు గల పరస్పరసంబంధ మును పుర్చాసు వివరించియుండలేదు; కాని కృష్ణ రాయల సమకాలికుడగు కాస్టన్‌హీడా, ఆదిల్ ఖాను కృష్ణరాయలతో సంధిచేసికొనెనని వ్రాసి యున్నాడు; మఱియు క్రీ. శ. ౧౫౫౬ సం.మున బ్రకటితమైన మొదటి డికాడాయందు ఆల్బూకెర్కు మొదటి పర్యాయము గోవాను జయించి స్వాధీన పఱచుకొనినవెంటనే గ్యాస్పరుచనోకాయనువానిని విజయనగరమునకు రాయబారమంపెననియు, [illegible] రాయలు దర్శనమిచ్చి విశేషముగ గౌర [illegible]ను ఆల్బూకెర్కు వేడికోలు నంగీకరింపక [illegible]వాక్యముల నంటియు నంటనియట్లు [illegible]పెననియు, దానికి గారణ మాదిల్ [illegible]తో జేసికొనిన యొడంబడికయే [illegible]ననని బ్యారాసు వ్రాసియు [illegible]ను పోర్చుగీసులకడనుండి జయిం [illegible]గల్గించుట కొఱకె కృష్ణరాయ

F. E. P. 124.

F. E. P. 124.

లాదిల్ ఖానునితో నీ సంధి కొడబడియుండునని సూయె లభిప్రాయపడుచున్నాడు.[17]

ఆదిల్ ఖానునితో నిట్లు సంధి చేసికొన్నను, అత్యల్పకాలమునసే కృష్ణరాయ లతనిపై మరల నేల దండు వెడలెనో కనుగొనవలసియున్నది. కమాలుఖానుడు బరీద్-ఇ-మమాలికుతో సంధిచేసి కొనిన పిమ్మట షోలాపురముపై నెత్తిపోయి యా పట్టణమును మూడునెలలకాలము ముట్టడించి కైవసము గావించుకొనెను. తరువాత విజాపుర మునకు దిరిగివచ్చి యచట దన ప్రభువైన ఇస్మాయీలుఆదిల్ ఖానుని నాతని తల్లియగు బూబూజీఖానమును దుర్గమునందు చెఱబెట్టెను. ఆసమయమునందే కమాలుఖానుని మిత్రుడగు బరీద్-ఇ- మమాలికు దన యజమానుడగు నిమ్మడి మహమూదుశాహును గుల్బర్గదుర్గమున చెఱయం దుంచి రాజ్యము నాక్రమించుకొనెను.

తా నొకటి తలచిన దైవ మొకటి తలచు నను నార్యోక్తి కమాలుఖానునియెడ సార్థక మైనది. సింహాసనము నధిష్ఠించుటకు వలసిన ప్రయత్నములు సల్పుచుండ నకాలమృత్యు వాతని వాత వేసికొనెను. చెఱయందు బందీకృతురాలై యుండినను బూబీజీఖానము ద్రోహమున కొడి గట్టిన కమాలుఖానుని దుదముట్టించు మార్గమును వెదకుచుండినది. చిట్టచివరకు స్వామిభక్తి పరాయణులైన యనుచరులను బురికొల్పి యతని జంపించెను. కమాలుఖానుని హత్యామూలమున నిస్మాయీలాదిల్ ఖానుడు కారాగారవిముక్తుడై మరల రాజ్యాధిపత్యమును బొందెను; కాని రాష్ట్రమున శాంతిమాత్రము గుదరలేదు. ఆదిల్ ఖానుదర్బారు నాశ్రయించియుండిన అమీరులంద ఱును రెండుకక్షలుగ జీలిరి. కమాలుఖానుడు జాతిచే పారసీకుడు. పారసీకురాసానియమీరుల కతడు నాయకుడు. తమ నాయకునిహత్య చేయించినందుకు గినిసి పారసీకురాసానియమీరు లేకమై తురకరూమీదొరలతో బోరాడ దొడగిరి. ఇట్లుండ రాయచూరు ముదుగల్లు మొదలగు దుర్గ ములను కృష్ణాతుంగభద్రల నడిమిరాష్ట్రముతో గూడ జయించి స్వాధీనము జేసికొని ప్రచండ

సైన్యమును వెంటగొని కృష్ణదేవరాయలు కలుబరిగదుర్గముపై గూచిచేసెను.[18]

కృష్ణరాయల కలుబరిగెదండయాత్ర ప్రస్తావము మహమ్మదీయచరిత్రలయం దెచ్చటను గానరాదు. ఇంతే కాదు; ఫెరిష్తా యప్పటి కలుబరిగ వృత్తాంతము నిట్లు వర్ణించియున్నాడు. "ఇస్మాయీల్ ఆదిల్ ఖానుడు బంధవిముక్తు డాయె ననువార్త చెవి సోకినంతటనే, అమీర్ బరీదు (బరీదు-ఇ-మమాలికు) గుల్బర్గను ద్వజించి బీదరునకు వెడలిపోయెను."[19] కాని ఫెరిష్తామాట విశ్వాసపాత్రము గాదు. ఆదిల్ ఖానుడు చెఱనుండి విముక్తుడాయె ననువార్తను వినగనే అమీరు బరీదు కలుబరిగను విడిచి పాటిపోవలసిన యావశ్యకత యెద్దియుగానరాదు. చెఱనుండి విముక్తుడాయెనే కాని, శత్రులకు భయము గలిగించు శక్తి యతనికెక్కడిది? నిజరాజ్య మంతఃకలహాములతో సంక్షోభించుచుండినది; తన యధికార మింకను నెల్లయెడల సాగుట లేదు. అశక్తుడైన రాజు నెవ్వరు సరకుసేయుదురు? అంతశ్శత్రుల నణచి వారిని దన యధికారమునకు బదులను గావింపజాలనివాడు పరుల నెట్లు భయపెట్టగలడు? ఇంటగెలచికదా రచ్చ గెలువవలయును. కావున బరీదుపలాయనము వాస్తవమైనచో దాని కన్య కారణ ముండియుండవలయును.

౪. నిజాము

కృష్ణరాయ లీ సమయమున గలుబరిగెపై దండెత్తినట్లు ఆంధ్రగ్రంథములవలన దెలియవచ్చుచున్నది. క్రీ. శ. ౧౬౦౪-౫ వ సంవత్సరమున ఇమ్మడి వెంకటపతిదేవమహారాయలు వ్రాయించిన విజయనగరసామ్రాజ్య మను నక్షత్రపత్రమున గృష్ణరాయల కలుబరిగదండయాత్ర సంగ్రహముగ నిట్లు వర్ణింపబడియున్నది:

"ప్రజోత్పత్తి సంవత్సరం తయిమాసం కుతప్ప శాహనిజాంశాహమీదికి కూచిచేసి వెలిగుడారం వేసి తరలిపోయిరి. మూడుయేండ్లు దండు జేసి మూడు సంస్థానాలమీద కార్యంచేసి కలుబరిగె వద్ద విజయస్తంభంవేయించి మూడుసంస్థానాల వారివద్ద పగుదీ తీసుకొని ముగ్గు....తో (?) పిలిపించుకొని విజయనగరపట్టణం ప్రవేశించి వుండి..."[20]

నడిమిదొడ్డిపాళెపు క్షేపియతునందు కలుబరిగ ముట్టడి విపులముగ వర్ణింపబడియున్నది:

"కొన్నిదినములకు కల్యాణంకలుబరిగల మీదికి యుద్ధసన్నద్ధులై సమస్తమైన జహగీరుదార్లను పిలుపించగా కడవకొలనుగ్రామంలో ముసిలిచన్నమనాయడు తన జమీయతుతో కూడా విజయనగరానకు కృష్ణరాయలవారి సముఖానకు పోయిన తదనంతరం రాయలవారు సైన్యముతో కూడా ప్రయాణమై కలుబరిగెమీదికి వెళ్లగా సమస్తమైన నిజాములు ఆ కలుబరిగదగ్గిరికి భారీ ఫౌజులు స్తోమంగా కూడివున్నందున, రాయలవారు సమస్తమైనవారిని పిలిపించి, 'యీ యుద్ధమందు వెనుకకు తిరుగక లడాయిచేసి శత్రుపలాయనం చేస్తే మీకు సకలబహుమానాలు యిప్పిస్తున్నారము' అని వీరకంకణాలు తాంబూలాలు యిచ్చినంతలోగా, లడాయికి షురుషు అయి యుద్ధము సేయగా అప్పుడు బహుమంది సర్దారులు మెసాము సిలిచన్నమనాయడు సొన్నలాపురంహండేవారు

---

18. రాయచూరిదుర్గపతనమునుగూర్చి ఫెరిష్తా ఇట్లు వ్రాసియున్నాడు: "కాని, తిమ్మరాజు సమయమునుకూలమై యుండుటను గని రాజు (ఆదిల్ఖాను)గారి రాష్ట్రముపై నెత్తినచ్చి, రాయచూరుముట్టడి నింకను (ఆదిల్ ఖానుడు చెఱనుండివిడుదలయైనపిమ్మటగూడ) సాగింపుచుండెను; తుద కది యతనికి లోబడెను. రాజ్యముపై దన యధికారమును మరల నెలకొలుపు ప్రయత్నములలో నిమగ్నుడై యుండినందున ఇస్మాయీలు ఆదిల్ ఖానుడు సకాలమున ముట్టడిని తొలగించుటకు దగిన బలముల నంపజాలకపోయెను."

(*Briggs' Ferishta III. pp.* 44-45)

ఫెరిష్తా కప్పటి విజయనగరరాయల పేరు తెలియదు. కావున నతడు 'తిమ్మరాజు'ను గల్పించినాడు. రాయచూరు క్రీ. శ. ౧౫౧౧ ఏప్రిలు ౨౯ తేదికిని క్రీ. శ. ౧౫౧౪ నకును మధ్య నడచె నని చెప్పియున్నాడు.

19. *Briggs' Ferishta II. p.* 44

20. భారతి సం. ౬. భాగ ౨. పుట ౬౯౧.

యింకా పాళేలవారు యేకస్తులై యుద్ధానకు నడచినంతలో అగాధయుద్ధప్రసరిణిఅయి కృష్ణ రాయలవారిఫౌజు విరిగినందున రాయలవారు చెయ్యెత్తి ఘల్లున కూసి, 'యీసమయమందు యవ్వరు యెదు రెక్కి శత్రుపలాయనం చేస్తున్నారో వారికి సకలబహుమానాలు బిరుదులు యిప్పిస్తున్నా' మని చెప్పినందున ముసిలి చన్నమ నాయడు యింకా కొంతమంది సర్దార్లతోకూడ తురుష్కులవారి లష్కరుమీదికి యెదురెక్కి తరుముకొని వస్తూవుండిన నిజామాది ఫౌజులమీదికి దూరి చిత్తాస్వాతి సంధించినట్టుగా యుద్ధముచేసి మొదటికోపు విరుగగొట్టినందున యావత్ఫౌజు యేకరాశిన దూరగా నిజాములఫౌజు విరిగి శానా హతమై పోయినందున కలుబరిగలో వరాహధ్వజ మెత్తించి జయభేరి వేయించి.....''[21]

ఈ దండయాత్ర నడచిన దెప్పుడో కనుగొన వలసియున్నది. కృష్ణదేవరాయలు క్రీ. శ. ౧౫౨౦ సం. న ఆదిల్ ఖాను నోడించి రాయచూరుదుర్గమును జయించిన పిమ్మట నొకసారి కలుబరిగపై దాడి వెట్టి యాదిల్ ఖానుని మరల పరాజితుని గావించి కలుబరిగను లగ్గలువట్టెనని న్యూనిజు వ్రాసి యున్నాడు. కాని పైనవర్ణింపబడిన దండయాత్ర యది కాదు; దానికంటె భిన్నమైనది. ఇట్లు చెప్పుటకు రెండు కారణములు గలవు: (౧) నడిమిదొడ్డి పాళెము కయిఫీయతుప్రకారము కలుబరిగను స్వాధీనపఱచుకొనుటకొఱకు కృష్ణ రాయలు పోట్లాడినది యాదిల్ ఖానునితో గాదు, నిజామాది ఫౌజులతో. హిదల్కాను బహమనీసుల్తాను నోడించి చెఱబట్టినందులకు గోపించి నలుగురు ముఖ్యబహమనీ సామంతు లేకమై యతనిపై నెత్తివచ్చి కలుబరిగ మున్నగు దుర్గములను జయించిరని సమకాలికపోర్చుగీసురచయితలు జెప్పియున్నారు కదా. ఇట్లేకమైన నలుగురు బహమనీసామంతుల పేర్లు మల్లిక్ బరీద్-ఇ-మమాలిక్, మల్లిక్ కుతుబ్-ఉల్-ముల్క్, మల్లిక్ దస్తూర్-ఇ- మమాలిక్ మల్లిక్ దీనారు, మల్లిక్ అహమద్ భైరీ నిజామ్-ఉల్ ముల్క్ లని మహమ్మదీయచరిత్రకారులు జెప్పుచున్నారు.[22] వీరికి నాయకుడు మల్లిక్ అహమద్ భైరీ నిజామ్-ఉల్-ముల్క్. సమకాలికాంధ్ర ప్రబంధకర్త లితనిని 'నిజా' మనియు, 'నిజాము' డనియు బేరొక్కనియున్నారు. మఱియు నప్పుడు నిజామ్-ఉల్-ముల్క్ కుతుబ్-ఉల్-ముల్క్‌లు బరీద్-ఉల్-ముల్క్ పక్షమువహించి యతనికి శత్రులతో బోరాడుటకు దోడ్పడుచుండువారు. కృష్ణరాయలు కలుబరిగపై నెత్తివచ్చు నను శంక బరీదునకు గలుగకపోయినను, కారాగార విముక్తు డైనపిమ్మట సాధ్యమైనంతత్వరలో నిస్సాయీలు ఆదిల్ ఖాను డాకోటను స్వాధీనపఱచుకొనుటకు దండెత్తిరాగలడని యాత డెఱుగును. కావున కోటను ఆదిల్ ఖానునికి హస్తగతముగానీయక సంరక్షించుటకై తన మిత్రులగు నిజామ్-ఉల్-ముల్క కుతుబ్-ఉల్-ముల్క్‌లకు వర్తమాన మంపి వారికడనుండి దళములను రప్పించుకొని యుండును. ఆదిల్ ఖానుకంటె ముందే కృష్ణ రాయలు కలుబరిగమీద నెత్తిపోవుటచే దాని సంరక్షణార్థము వచ్చియుండిన నిజామాదిఫౌజు లతో రాయలు యుద్ధము సేయుటయందు వింత లేదు. ఈ విషయములను జక్కగ బరికించి చూడగా వెవర్ణింపబడిన కలుబరిగదండయాత్ర న్యూనిజు చెప్పినదానికంటె భిన్నమైనదని నిశ్చయమగు చున్నది. (౨) రాజ్యారంభకాలమున రాయలొక సారి కలుబరిగపై దండయాత్ర సలిపినట్లు 'విజయ నగరసామ్రాజ్యము' వలన దెలియవచ్చుచున్నది. కృష్ణదేవరాయలు ప్రజోత్పత్తి తయిమాసం ౧౨వ తేది, అనగా క్రీ. శ. ౧౫౧౨ జనవరి ౯వ తేది నాడు దండయాత్ర ప్రారంభముచేసి మూడేండ్లు దండుచేసి కలుబరిగకడ జయస్తంభము వేయించి తిరిగి విజయనగరమునకు వచ్చి, యచటనుండి శ్రీముఖసంవత్సరం చిత్రిమాసము శ్రీరామదశమి, అనగా క్రీ. శ. ౧౫౧౩ వ సంవత్సరం మార్చి నెల ౧౬ వ తేది నాడు గజపతివారిమీద దండుయెత్తి తరలిపోయినట్లు చెప్పియున్నది. కాని క్రీ. శ. ౧౫౧౨ జనవరి ౯-వ తేదికిని క్రీ. శ. ౧౫౧౩ మార్చి ౧౬ వ తేదికిని మధ్యగల యెడము ఒక

---

21. *Local Records. Vol.* 39. *p.* 11. *f*

22. *Burhan-i-Maasir, IA. XXVIII pp.* 319-20

సంవత్సరముపై మూడునెలలు ఆఱుదినములు మాత్రమే. కావున నీ దండయాత్ర కాలము మూడేండ్లనుట తప్పు. దండయాత్ర నడచిన కాల వ్యవధి తప్పైనను ప్రారంభకాలమైనను సరియగు నేమో కనుగొనవలసియున్నది. కృష్ణరాయలు దన రాజ్యాభిషేకమైనవెంటనే విజాపురముపై రెండు మారులు దండయాత్రవెడలె ననియు, నందొకటి క్రీ. శ. ౧౫౧౦ ఫిబ్రవరి ౩౦ వ తేదిన యాల్బూ కెర్కు గోవాకు వచ్చినపుడును మఱియొకటి కమాలుఖానుని మరణానంతరమును నడచె ననియు నింతకుముందు చెప్పియున్నాడను. క్రీ. శ. ౧౫౧౧ మే నెలలో గమాలుఖానుడు వధింపబడె నని ఫెరిష్తా వ్రాసియున్నాడు. కమాలుని వధ ఫెరిష్తా చెప్పినట్లు వాస్తవముగ క్రీ. శ. ౧౫౧౧ మే నెల యందే జరిగియుండినపక్షమున, 'విజయనగర సామ్రాజ్యము' న బేర్కొనబడిన కలుబరిగ దండ యాత్ర క్రీ. శ. ౧౫౧౨ జనవరి ౯ వ తేది నాడు ప్రారంభమైయుండవచ్చును. ఇం దసంగత మెద్దియు లేదు.

నడిమిదొడ్డిపాళెపు కైఫియతందును, 'విజయ నగరసామ్రాజ్యము' నందును వర్ణింపబడియుండు కలుబరిగదండయాత్ర యొక్కటియే. లభించిన సాక్ష్యములు బరికించిచూడగా గృష్ణరాయలు కలు బరిగమీద రెండు పర్యాయములు మాత్రమే దండ యాత్ర వెడలెనని తెలియవచ్చుచున్నది. న్యూనిజు జెప్పిన దండయాత్ర నడిమిదొడ్డిపాళెపు కైఫియతు లోని దండయాత్రకంటె భిన్నమైనదని పైని నిరూ పింపబడియున్నది. నడిమిదొడ్డి పాళెపు కైఫియతు నందు కలుబరిగె కోటపై వరాహధ్వజ మెత్తక ముందు రాయలు నిజామాదిఫౌజుల నోడించినట్లు వ్రాసియున్నది; 'విజయనగరసామ్రాజ్యము'నందు కుతప్పశాహనిజాంశాహలపై గూచిచేసిపోయి మూడుయేండ్ల పర్యంతము దండుచేసి మూడు సం స్థానాలమీద కార్యంజేసి కలుబరిగెదగ్గర విజయ స్తంభం వేయించినట్లు చెప్పియున్నది. ఈ రెండు గ్రంథములలో వర్ణింపబడిన దండయాత్రలయందు నిజాము గృష్ణరాయలకు బ్రతివఱిగ గానవచ్చు చున్నాడు. నిజాముతో గృష్ణరాయలు మఱియెచ్చ టను నెక్కడను యుద్ధముజేసెనని తలచుట కాధా రము లేదు; కావున నడిమిదొడ్డిపాళెపు కైఫీయ తందును, విజయనగరసామ్రాజ్యమునందును వర్ణింప బడియుండు కలుబరిగ దండయాత్రయొక్కటియే యని తలచుట యుక్తము.

కలుబరిగ యుద్ధమెట్లు నడచెనో నడిమిదొడ్డి పాళెపు కైఫీయతందు చక్కగ వర్ణింపబడియున్నది. మొదట రాయరాణువ శత్రువుల తాకునకు దాళ జాలక విఱిగి వెన్నిచ్చెను. తురకలు విఱిగి పాఱు విజయనగరదళములను వెన్నంటి తఱుమ నారం భించిరి. అపజయము సిద్ధమని యందఱకు దట్టినది. కాని రాయలు ధైర్యమును విడనాడలేదు. పఱు గిడుచుండిన సైన్యమునడుమ నచలుడై నిలిచి చేయెత్తి ప్రళయకాల రుద్రునివలె గర్జించెను. నాయకులను పాళెగ్రాండను దొరలను బిలిచి సకల విధములైన బహుమానముల నిచ్చెదనని యాస చూపి యుద్ధమునకు బురికొల్పెను. రామనామము విన్న పిశాచమువలె వారి హృదయమున బాదు కొనియుండిన భయము మాయమైనది. రాయ రాణువ మరల శత్రుముఖమైనది. మెసావారికి హండేవారికి ఇతర పాళెములవారికి వీరావేశము పెరిగినది. జయము చేకూడెగదా యని తలచి వ్యూహమును విసర్జించి చిల్లాపొల్లుగ దఱుముకొని వచ్చుచుండిన తురకదండున కడ్డపడి నఱుక నారం భించిరి. తలవని తలంపుగ పిడుగులవలె బైనురికిన హిందూవీరుల ధాటికి జెదరి పాఱు తెంచుచుండిన తురకదళ మాగజాలక వెన్నుజూపెను. అంతట రాయ సైన్యమంతయు నొక్కుమ్మడి వారిపై నురువడించి వారిని ఖండతుండెములుగ నఱుక సాగెను. తురక సేనయందు చాలభాగము మడిసినది. హతశేషులు కొందఱు పట్టువడిరి. తక్కినవా రడ పొడ గానరాక పరారియైరి. సమకాలికకవి యొకడు రాయలచే నిర్జితులైన మహమ్మదీయుల స్థితి నిట్లు వర్ణించియున్నాడు:

"చెడిపిరాలో త్తిన యడుగుదమ్ములకును
గట్టుపయ్యెద జించి కట్టుకొనుచు
బయలైన కుచకుంభపాళులకును జంటి
శిశువుల మాటుగా జేర్చుకొనుచు

గసుగందలకు వడగాలికి జాటుగా
గచభరంబుల విప్పి కప్పుకొనుచు
వీడిన తురుము నీవియదాక సడలించి
చేలాంతము ముసుంగు జేర్చుకొనుచు
ఖానమల్కవజీరుల మానవతులు
పాటుపరువున నీవు కల్బరిగ గొనిన
భ్రమసి నలుగడ దెసచెడి పఱతు రార
ఆహవోపేంద్ర! కృష్ణరాయక్షితీంద్ర!''[23]

౫. బరీదు

కలుబరిగదండయాత్ర జయప్రదముగ ముగిసినది. కాని కృష్ణరాయలు యుద్ధము చాలించుకొని నిజరాజధానికి మరలిపోలేదు. బహమనీసుల్తానుల రాజధానియగు బెడదకోట (బీదరు) పైపు సైన్యములతో గూచిచేసెను. దీనికి వాస్తవమైన కారణము దెలియదు. బరీదుచే బంధితుడై కారాగారమున నుండిన ఇమ్మడి మహమూదుశాహును చెఱనుండి విడిపించి సింహాసనముపై నతని పునఃప్రతిష్ఠ సేయుట రాయల ముఖ్యోద్దేశమని తోచుచున్నది. బెడందకోట దండయాత్రను సమకాలిక కవులు బేర్కొనియున్నారు. ఒక యజ్ఞాతకవి—

''గవకుల్ బల్లిదమయ్యె ఢిల్లికిని మ
క్కాకోట మేలయ్యె మం
డువకున్ గ్రొత్తగ క్రొత్తడంబు లమరెఁ
బోలేరు చందేరులఁ
దవసంబెక్కె బెడందకోట పురకాం
తా గర్భనిశ్ఛేదన
ప్రవణంబైన భవత్ప్ర యాణజయవా
ర్తఁ గృష్ణరాయాధిపా.''

అని బెడందకోట దండయాత్రను ప్రకటించియున్నాడు. రాయరాణువబెడదకోటను జేరెను; బరీదుదళముల గూర్చుకొని వచ్చి మాఱొడ్డి నిలచెను. భీకరసంగ్రామము పొసగినది. మహమ్మదీయబలము లోడిపాటిపోయెను. కృష్ణరాయల బెడందకోట విజయము నల్లసాని పెద్దనగారిట్లు ప్రశంసించియున్నారు:

''సమరక్షోణిని గృష్ణరాయలభుజా
శాతాసిచే బడ్డదు
ర్దమదోర్దండ బెడందకోటయవన
వ్రాతంబు సప్తాశ్వమా
ర్గమునం గాంచి 'శబాసహో!
హరిహరం గాఖూబుఘోడాకితే
తుముకీ బాయిలబాయిదే ములకియం
దు ర్మింటికిన్ బోవుచున్.''

ఈ విజయము సంపూర్ణమైనది. బెడందకోట హస్తగతమాయెను. క్రీ. శ. ౧౫౨౨ నాటి యొక తామ్రశాసనమున కృష్ణరాయలకు 'బెడదకోట సప్తాంగహరణ' యను బిరుదుండినట్లు చెప్పియున్నది.[24] స్వామ్యమాత్యసుహృత్కోశ రాష్ట్రదుర్గ బలము లేడును రాజ్య సప్తాంగము లనబడును. బెడదకోటసప్తాంగహరణు డనగా బెడదకోట సంస్థానమును సంపూర్ణముగ జయించినవాడని యర్థము.

ఇచట స్మరింపవలసిన విషయ మొకటికలదు. కృష్ణదేవరాయలకు 'యవనరాజ్యసంస్థాపనాచార్య' యను బిరుదు కలదు. విజయనగరరాయలయందు మఱియెవ్వరికిని ఈ బిరుదు లేదు. రాయల కీబిరుదెట్లు కలిగెనో స్పష్టముగ దెలియబఱచు సాధ్యమెద్దియు నింతవఱకు దొరకలేదు. కాని, న్యూనిజ్ చరిత్రయందు కృష్ణరాయలు కలుబరిగ గొన్నపుడు, దక్కనుసుల్తాను పుత్రులను మువ్వురిని యాదిల్ ఖానుచే బందీకృతులైన వారిని చెఱనుండి విడిపించి, వారియందు జ్యేష్ఠుని యతని తండ్రిసింహాసనము నెక్కించి తక్కిన ఇద్దరిని తనతోగూడ విజయనగరమునకు గొనిపోయెనని యున్నది.[25] దీని నాధార పఱచుకొని పరిశోధకులు కొందఱు కృష్ణరాయలకు 'యవనరాజ్యస్థాపనాచార్య'యను బిరుదు బహమనీసుల్తానుకుమారుని సింహాసనము నెక్కించుటవలన

23. *Further Sources, I no.* 114. (*b*).
24. *A.* 9 *of* 1912-13.
25. *F. E. p.* 358.

గలిగెనని యూహింపుచున్నారు. ఇది సంగతము గాదు; ఫలనగా న్యూనిజుప్రకారము రాయలు కలుబరిగను సాధించినది క్రీ. శ. ౧౫౨౦ వ సంవత్సరమున, ఇస్మాయీలు ఆదిల్ ఖాను నోడించి రాయచూరును స్వాధీనము జేసికొనినపిమ్మట. కావున కలుబరిగవిజయమును, బహమనీసుల్తానుపుత్రుని గద్దె యెక్కించుటయు క్రీ. శ. ౧౫౨౦ వ సంవత్సరమునకు పిమ్మట నడచియుండవలయును. కాని రాయల కీబిరుదు రాయచూరిదండయాత్రకు జూల పూర్వమునుండియు గలదని శాసనసాక్ష్యమువలన రుజువగుచున్నది. ఈక్రింది శాసనము లీ సందర్భమున జ్ఞప్తియందుంచుకొనదగినవి :

NDI. Kr. 27	1*st September* 1514	*Yavanarajyasthapanacharya*
ARE 272 *of* 1897	8*th July* 1515	,,
ARE 243 *of* 1899	29*th March* 1516	,,
ARE 381 *of* 1907	1517	,,
ARE 244 *of* 1899	8*th August* 1519	,,

వీనివలన కృష్ణరాయలకు 'యవనరాజ్య స్థాపనాచార్య' యను బిరుదు కనీసము క్రీ. శ. ౧౫౧౪ వ సం. నుండి యుండెనని తెల్లమగుచున్నది. ఇది 'అష్టదిగ్రాయమనోభయంకర' 'మూరురాయరగండ' యను బిరుదులవలె పరంపరగ వచ్చినది కాదు. రాయల పూర్వికులకు గాని, యతనిముందు వజ్రసింహాసనము నధిష్ఠించిన విద్యానగరసార్వభౌములకుగాని లేదు; కావున క్రీ. శ. ౧౫౦౬ వ సంవత్సరమున రాయలు విద్యానగర సింహాసనము నెక్కినతరువాతను, ౧౫౧౪ వ సంవత్సరమున కందుకూరు శాసనమును జెక్కించుటకు ముందును యవనరాజు నెవ్వరినో రాజ్యమున ప్రతిష్ఠించుటవలన గలిగి యుండవలయును. ఈ మధ్యకాలమున స్థానభ్రష్టులయి నిజరాజ్యపీఠము నధిష్ఠించుట కన్యుల సహాయము గావలసిన యవన రాజు లిద్దరుండిరి. ఒకడు ఇస్మాయీలు ఆదిల్ ఖానుడు. రాజ్యసంరక్షకుడైన కమాలుఖానునిచే బంధీకృతు డాయెనని పూర్వప్రకరణమున జెప్పి యున్నది. కాని ఇస్మాయిల్ ఆదిల్ ఖానుడు రాయ సహాయమువలన దన రాజ్యమును మరల సంపాదించుకొనలేదు. అతని తల్లి బూబూజీఖానము దన యనుచరులచే కమాలుఖానుని జంపించి క్రీ. శ. ౧౫౧౧ మే నెలలో దనకుమారుని చెఱనుండి విడిపించెను. రెండవవాడు బహమనీసుల్తాను ఇమ్మడి మహమూదుశాహు. క్రీ. శ. ౧౫౧౧ లో కమాలుఖానునితో సఖ్యముగుదుర్చుకొని యాతనికి బ్రతిగ బెడదకోట (బీదరు) రాజ్యమును బాలించుచుండిన బరీద్-ఇ-మమాలి కాతని జెఱబెట్టి సింహాసనము నాక్రమించుకొని తానె ప్రభువై స్వతంత్రముగ బ్రజాపాలనము సేయగడగెను. అతనికి నిజామ్-ఉల్-ముల్క్ కుతుబ్-ఉల్-ముల్క్ మొదలగు బహుమనీసామంతులు తోడగుటవలన యతడే స్థిరముగ బీదరురాజ్యమున కధిపతి యగునను నభిప్రాయ మతనికి గలిగెను. కృష్ణరాయలు క్రీ. శ. ౧౫౧౭ వ సంవత్సరమున ఆదిల్ ఖానుని జయించి రాయచూరు దుర్గమును సాధించినపిమ్మట బరీదు స్వాధీనమందుండిన కలుబరిగె బీదరుదుర్గములను గైవసము జేసికొనియుండుటవలనను క్రీ. శ. ౧౫౧౪ వ సంవత్సరము నుండి 'యవనరాజ్యస్థాపనాచార్య' యను బిరుదతని కుండుటవల్లను, బీదరును జయించినప్పుడిమ్మడి మహమూదుశాహును చెఱనుండి విడిపించి సింహాసనము నెక్కించుటవలననే యా బిరుదాతనికి గలిగెనని మనమూహింపవచ్చును.

బహమనీసుల్తాను విజయనగరరాయలకు ప్రకృతిచే నమిత్రుడు. అతని నాశనము విజయనగర సామ్రాజ్యమునకు శ్రేయస్కరము. విజయనగర బహమనీ సంస్థానముల పరస్పరసంబంధ మిట్లుండ, ఖిలమైపోవుచుండిన బహమనీసంస్థానమును బున రుద్ధరించుటకు గృష్ణరాయ లేల పూనుకొనెనో తెలియదు. రాయలు కేవలయోధుడును, దళ

అనుబంధము ౧

ఇమ్మడి మహామూదుశాహు కడపటి జిహాదు

రాయవాచకమునందు ఉమ్మత్తూరు శివసముద్ర ములను జయించిన పిమ్మట కృష్ణదేవరాయలు శ్రీరంగపట్టణమునకు బోయి యచటినుండి ఇక్కేరి ఆరంగాలకును దరువాత విజాపురసరదు స్థలాలమీదుగ గోలకొండ సరదు స్థలాలకును జేరగా అచ్చట మూడు తెగల రౌతులున్ను యెదిరించి యేరు దాటి వచ్చి మోర్చావేసి పాళ్యము దిగిరనియు, వారిని రాయలు భీకర సంగరమున నోడించి విజయు డాయెననియు చెప్పియున్నది.[1] కృష్ణరాయవిజయమునందు పేర్కొనబడిన మూడు తెగల రౌతు లెవ్వరైనదియు వివరింపబడియున్నది.

"ఆహా గణుతింపశక్యమె !
యహర్నిశము భయమందియుండి ర
య్యాగరనాముదానగరియందు
విజాపురి గోలకొండలో."

"లక్షగుఱ్ఱంబుతోడను లక్షణంబు
మెఱయబీరాన మూడిండ్ల తురకదొరలు
కృష్ణవేణికి నీవల గృష్ణరాయ
నృపునకెదురుగ జనుదెంచి నిలిచిరపుడు."

కావున గృష్ణరాయలు గోలకొండ సరదుస్థల ములయందు యుద్ధము జేసినది అహమదానగర గోలకొండ విజాపుర సైన్యములతోనని తెలియు చున్నది.

ఈ యుద్ధము జరిగిన కాలమెప్పుడో మొదట నిశ్చయింపవలసి యున్నది. రాయవాచక మునను గృష్ణరాయ విజయమునను కృష్ణరాయ లుమ్మత్తూరు శివనసముద్రములను సాధించిన పిమ్మట శ్రీరంగపట్టణమునకును దరువాత ఇక్కేరియారంగ లకును నచటినుండి కృష్ణా తుంగభద్రల యంతర్వేది లోని ముదుగల్లు రాయచూరు దుర్గములమీదుగ గోలకొండ సరదు స్థలములకును బోయి చేరెనని యున్నది. కృష్ణరాయవిజయమున గూడ నిట్లే కలదు. ఉమ్మత్తూరు జైత్రయాత్ర క్రీ. శ. ౧౫౧౭-౧౩ లో ముగిసెనని ఇంతకుముందు దెల్పబడి యున్నది. దీనినిబట్టి కృష్ణరాయలు గృష్ణాతీరమున నాయకుడునుమాత్రము గాదు. రాజ్యతంత్రమును నడుపుటయం దాతని ప్రజ్ఞ యఖండమైనది. కావున యవనరాజ్యస్థాపన సేయుట కెద్దియో ప్రబల కారణ ముండియుండవలయును. స్థానభ్రష్టు డైన సుల్తానును మరల గద్దె నెక్కించిన నతనివలన భావి కాలమున బహమనీసామంతులతో దనకు గలుగ బోవు యుద్ధములందు లాభము గలుగవచ్చు నని యెంచి యట్లు చేసియుండవచ్చును.

ఈ దండయాత్రల మూలమున విజయనగర సామ్రాజ్యపు కీర్తిప్రతిష్ఠలు వాసికెక్కినవి. యుద్ధము నడపుటయందు కృష్ణరాయ లద్వితీయ శక్తిసామర్థ్యములుగల సేనాధిపతి యని యందఱ కును విదితమాయెను. సింహాసనము నెక్కిన మూడేండ్లలోపల బహమనీసుల్తాను నోడించెను; యూసఫుఆదిల్ ఖానుని వధించెను; ఇస్మాయిల్ ఆదిల్ ఖానుని జయించి రాయచూరు ముదుగల్లు దుర్గములను కృష్ణాతుంగభద్రల మధ్య సీమలను స్వాధీనపఱచుకొనెను; కలుబరిగమీద దండువెట్టి నిజామాదిబహమనీసామంతుల నిర్జించి వరాహ ధ్వజము నా కోటయలంగములపై స్థాపించెను. బరీ దును పరాజితుని గావించి యతని సప్తాంగములను హరించి, యతనిచే బంధీకృతు డైన యిమ్మడి మహామూదుశాహుబహమనీని చెఱనుండి విముక్తుని జేసి మరల సింహాసనాధిష్ఠితుని జేసి 'యవనరాజ్య స్థాపనాచార్యు'డను బిరుదును వహించెను. ఇంతటి యల్పకాలమున నింతలేసి ఘనకార్యముల నొనర్చిన మహారాయల శక్తిసామర్థ్యములను గాంచి విద్యానగరసామ్రాజ్యప్రజ లబ్బురపడుట యందు వింత యేమి కలదు ?

---

1. *Sources of Vijayanagara History.* *pp.* 118-119.

గోలకొండ సరదుస్థలములందు మూడు తెగలతురక రౌతులతో యుద్ధము జేసినది క్రీ. శ. ౧౫౧౭-౧౩ నకు తరువాత నని తోచగలదు; కాని ఈ యూహ సరియైనది కాదు. ఏలన, రాయవాచక రచయిత కాని యతని గ్రంథమును బద్యకావ్యముగ వ్రాసిన కుమార ధూర్జటికాని తమ గ్రంథములందు బేర్కొ నిన రాయల విజయములన్నిటిని పూర్వాపర కాల క్రమమును దప్పనీయక వర్ణించిరని విశ్వసించుటకు వలనుపడదు. వారు కావ్యసరణి ననుసరించి కృష్ణ రాయల దిగ్విజయ వర్ణనను బశ్చిమదిశయం దారం భించి ప్రదక్షిణముగ నుత్తర పూర్వ దక్షిణవిజయ ములను వర్ణించి యుండవచ్చును. ఈ యను మానము కేవలము నిరాధారము గాదు. ఉమ్మ త్తూరు దండయాత్ర నడచుచుండిన సమయమునసే కృష్ణరాయలు 'దక్కనురాజు'తో ననగా బహమనీ సుల్తానుతో బోఱుచుండెనని సమకాలిక పోర్చుగీసు రచయితల వ్రాతలవలన దెలియుచున్నది. క్రీ. శ. ౧౫౧౦ జనవరి నెలలో గృష్ణరాయలు దక్కను రాజుతో బోఱుచుండెనని యల్బూకెర్కు కామెంట రీసులో వ్రాసియున్నది.[2] క్రీ. శ. ౧౫౧౦ జనవరి తేది మొనాటి కృష్ణదేవరాయల హంపీశాసనమున నతడు సుల్తానును బరాభూతుని గావించినట్లున్నది.[3] ఇదిగాక, క్రీ. శ. ౧౫౫౬ లో రచింపబడిన డి బ్యారా సనునతని 'డికాడా' సను చరిత్రగ్రంథ మున, సవాయి యనగా విజాపురసంస్థానస్థాపకుడగు యూసుఫు ఆదిల్ ఖానుడు మృతిచెందిన వెంటనే నరసింగ (విజయనగర) రాజ్యాధిపతి విజాపుర ముపై దండు వెడలెననియు, నాల్బూకెర్కు అదియె యదనని యెఱిగి గోవాపట్టణముపై నెత్తి పోయి దానిని జయించెననియు వ్రాసియున్నాడు. డి బ్యారాను కృష్ణరాయల కాలమున విజయనగర మునకు వచ్చియుండిన పోర్చుగీసులు వ్రాసిపంపిన వృత్తాంతముల నాధారపఱచుకొని చరిత్రను రచి యించియుండుటవలన నందు వివరింపబడిన విజయ నగర దక్కను రాజ్యములకు సంబంధించిన చరి త్రాంశములన్నియు విశ్వాసపాత్రములని పరిశోధక పండితుల యభిప్రాయము. కావున కృష్ణరాయలు రాజ్యాభిషిక్తుడై నవెంటనే బహమనీసుల్తానుతోనొక ప్రక్కను ఉమ్మత్తూరి ప్రభువులతో మఱియొక ప్రక్కను నేకకాలమున యుద్ధము సేయుచుండె నని తెల్లమగుచున్నది. మఱియు క్రీ. శ. ౧౫౧౯-౧౦ వ సంవత్సరమునకు దరువాత బహమనీసామంతులు —వారియందును ముఖ్యముగ నేదులఖాన నిజా మనమలక కుతుపనమలకలు—మత్సరగ్రస్తులై పర స్పరము బోట్లాడుచుండిరి. లభించిన మహమ్మదీయ చరిత్రల నన్నిటిని బరిశీలించి చూడగా క్రీ. శ. ౧౫౧౯-౧౦, ౧౫౬౪ వ సంవత్సరముల మధ్య మూడిండ్ల తురకలును ఏకమై విజయనగరముతో యుద్ధము జేసినట్లు కానరాదు. కావున రాయవాచ కమున జెప్పినట్లు గోలకొండ సరదుస్థలములలో గృష్ణరాయలు మూడిండ్ల తురకలతో బోరాడి యుండిన, నది క్రీ. శ. ౧౫౧౯-౧౦ న బహమనీ సుల్తానుతో జేసిన యుద్ధమునందై యుండవల యును. అగునేని హంపీశాసనమున జెప్పబడిన సుల్తానుపరాజయ మీ యుద్ధమునసే సంఘటిల్లెనని యనుకొనవచ్చును. రాయవాచకము బట్టి యా యుద్ధవృత్తాంతమును సంగ్రహముగ నిట్లు చెప్ప వచ్చును.

''గోలకొండవారి సరదుస్థలాలకై నడవంగా అక్కడ మూడుతెగల రౌతులున్ను, మోర్చావేసి పాళ్యము దిగినారు. వేగర్లువచ్చి రాయలదేవునితో తురకలు లఱగుజ్జాలుతోడట్టున్ను వెయ్యేసుగుల తోడట్టున్ను కృష్ణదాటివచ్చి పాళ్యం దిగినారని విన్నపంసేయంగా రాయలవారు విని 'తురకలు కృష్ణవేణి దాంటివచ్చి డెరిజావేసి దిగేట్టా ?' అని ఆగ్రహించుకొని అమరనాయకంవారలలో పెమ్మ సాని రామలింగమనాయణ్ణి బిలిచి, 'తురకలు కృష్ణవేణి దాంటివచ్చి డెరిజావేసి పాళ్యం దిగి నారట. ఇందులకు యేరీతున నడవవలెనో?' అని అడిగినందులకు, 'తురకల కార్యమనంగా యెంత మాత్రం? దేవరవారి ప్రతాపంవల్ల డెరిజాతాళ్ళు తెగకోసేను. అప్పుడు భేరి తాడనంసేసి నడిస్తేను తురకలు మూడుతెగలున్నూ విరిగి యథాయథలై

---

2. *Commentaries of Affonso Dalbuquerque. II. pp.* 74-77.

3. *EI. I. p.* 363

తమతమ స్థలాదులకు పొయ్యేటట్టు సేసేను' అని విన్నపంశాయగా రాయలవారు చాల సంతోషపడి రామలింగమనాయనికి పట్టీలు యిచ్చి అంపగా రామలింగమనాయడు వెలువడిని వచ్చెను.

"తురకలు ఈ వార్తలువిని డెరిజావద్ద జీరా సంజ్ఞోగంతో విచ్చుకత్తులరౌతులు అరవైవేలున్ను వారిని చుట్టుకనిండు సంజోకం గుఱ్ఱాలు పది వేలున్ను వార్లను అనుసరించ్చుక యుండే మద హత్తులు, వెయ్యింటికిన్ని యీ రీతిని డెరిజావద్ద ఉంచి మూడు తెగల తురకలున్ను తమతమ పాళ్య ములో ఆయత్తపాటుతో జాగ్రత్త గలిగియుండిరి.

"రామలింగమనాయడు తురకల పాళ్యం వారి సమీపానకుపోయి యేనుగుల బారుమీద తొక్కి నడచి మదహత్తిల తొండముల ఖండము లుగా నరికి మావటీలను యీఁటెలతో కుమ్మితోసిరి. గుఱ్ఱాల పక్కెరలెత్తి కురచయీఁటెలతోనున్ను పిడి యీఁటెలతోనున్ను పందిబల్లెములతోనున్ను గుచ్చి తోసేదిన్ని దోసకాయల చందాన వేటారుతునక లుగా నరికేదిన్ని యీరీతి నొప్పించగా గుఱ్ఱాలు వెనుకముందై పారసాగెను. అప్పుడు నాలుగువేల గుఱ్ఱం చావకట్టగా పడగా అటువెనుక విచ్చు కత్తుల రవుతులమీద జగడ మియ్యంగా సరిచావు లుగా ఆరువేలకు నాలుగువేల రవుతులు పడిరి. అంతట రామలింగమనాయుడు డేరిజుతాళ్ళు తెగ కోయించగా డెరిజా నేలకూలెను. ఆ ఱచాన్నె కృష్ణరాయలవారు, భేరితాడనం సేయించి మద హత్తి నెక్కుకొని ఉభయచత్రములతోనున్ను, మకలపెక్కెములతో నూట యిరవైఘట్టముల యేనుగలున్ను అరవై వేల గుఱ్ఱాలున్ను అయిదు లక్షల పాయదళమున్ను పొట్లముగ నడచిరి.

"ఆఱచాన్నె కృష్ణవేణి వుభయతీరాలున్ను ప్రవాహంనిండి రాసాగెను. జగడముఖానకు తుర కల యేనుగల మొనచేస్తె గ్రీష్మకాలం యెండ చేతను డస్సిన యేనుగులు గనక దగదప్పివుట్టి చల్లగాలిచేత కాలుజారి కృష్ణవేణిలో బోయి పడెను. గుఱ్ఱాల రౌతులు "యేరునీళ్లువచ్చెను. యివతలనుండి కార్యంకాదని గుఱ్ఱాలవారు యేనుగలవెంబడినె తిరిగిరి. మొదటి దొరలు ముగ్గు రున్ను 'దైవికంగా పెడతలపోటుగా ప్రవాహం వచ్చెగనక యిక్కడను పాళ్యందిగి జగడమిచ్చే మంఱే రస్తుసామగ్రీలును అమరదు. అన్నింటికిన్ని యేఱుదాటి ఆవలనిల్చి సరిపోయినట్లు నడిపించు కొందాము.' అని సీమకు తిరుగగానె యేరునిండా రుగా వచ్చెను. రాయలవారున్ను వెంబడించినడచి జగడంసేయగా అందరున్ను విరిగి పారిపోయిరి. మూడుతెగల తురకలున్ను హతశేషులైన వారి గూర్చుక విజయాపురం గోలకొండ, అహముదా నగరం చేరబోయినారు.

"కృష్ణరాయలవారు కృష్ణవేణి వొడ్డుకు వచ్చి మూడుతెగల తురకల యేనుగ గుఱ్ఱాలున్ను నగర కట్టిపెట్టమనిన్ని గుడారులు, నిశానులు, నగరా మొదలైనది మొదట జగడానదొరికిందిగనక అదంతా నగరకట్టమని అప్పాజి మొదలైన నియ్యోగులతో నున్ను చెప్పి ముక్కుతిమ్మన్న మొదలైన కవీశ్వరుల దిక్కు జూచి 'నేటిజయం యేరీతు?' అని అడిగినందులకు ముక్కు తిమ్మన్న చెప్పిన పద్యం :—

నరసింహకృష్ణరాయా
దురమున నీ పేరుచేటు దురకలద్రుంచెఁ
కరిరాజవరదుడని యీ
కరిఘటలు న్నినున్నజూచిగ్రక్కునదిరిగెఁ. "[4]

రాయవాచకమునందలి ఈ యుద్ధవర్ణనను గూర్చి విశేషించి వివరించి చెప్పవలసిన యంశము లెవ్వియు లేవు; కాని యించుకంత పరిశీలింప దగినవి రెండు మూడు విషయములు గలవు.

(ఁ) డెరిజావేయుట :—ఈ యుద్ధవర్ణన యందు 'డెరిజా' కత్యంత ప్రాముఖ్యతగలదు-ఉ. 'తురకలు కృష్ణవేణిదాంటివచ్చి డెరిజావేసి దిగేట్టా?'; 'డెరిజా తాళ్లు తెగకోసేను'; 'డెరిజా

4. సోర్సస్ ఆఫ్ ది విజయనగర హిస్టరీ, పుటలు ౧౧౯-౧౨౨. రాయవాచక ముద్రిత ప్రతులలో నీకంద పద్యద్వితీయపాదమున 'నీపేరుపేరం' అనియు తృతీయ పాదము 'కరిరాజవరదుడవనీ' అనియు ముద్రితమై యున్నవి.

వద్ద జీరాసంజోకంతో'; ఒకచోట 'డేరీజుతాళ్లు' అనికలదు. ఈ యుద్ధవర్ణనయందే కృష్ణరాయ విజయమున 'దేరిజత్రాళ్లు' 'దేరిజపుత్రాళ్లు' అని యున్నది. కావున డెరిజా, డేరీజు, దేరిజయనునవి సమానార్థకపదములనుట స్పష్టము. అవి యన్నియు హిందీభాషలోని 'డేరా' యను పదమునకు భ్రష్ట రూపములు. వీనికన్నిటికిని 'గుడారము' లేక 'పట గృహము' అని యర్థము.

డెరిజా యర్థము విశదమైనది. ఇక డెరిజాను వేయుటయందు గల విశేష మేమో కనుగొనవలసి యున్నది. కాని డెరిజా యెవ్వరిదో మొదట తెలిసి కొనినగాని దాని నెత్తుటయందుగల విశేషము దెల్లముకాజాలదు. కృష్ణానదిని దాటివచ్చి పాళ్యముదిగి డెరిజా వేసినవారు మూడుతెగల (అనగా ఆహమదానగర విజాపురగోలకొండ) తురక రౌతులగుటచేత, డెరిజా వారిదని కాని వారి మొదటి దొరలదనికాని యభిప్రాయము సహజముగ గలుగవచ్చును; కాని ఇది సరికాదు. ఏలన 'డెరిజా వద్ద జీరాసంజోకంతో విచ్చుకత్తులరౌతులు అరవై వేలున్ను వారిని చుట్టుకనిండు సంజోకం గుఱ్ఱాలు పదివేలున్ను వార్లనుఅనుసరించుకయుండె. మద హత్తులు వెయ్యింటికిని యీరీతిని డెరిజా వద్దవుంచి మూడుతెగల తురకలున్ను తమతమపాళ్యములో ఆయత్తపాటుతో జాగ్రత కలిగి యుండగా' నను వాక్యము వలన డెరిజా మూడు తెగల తురకలకు గాని వారి నాయకులకుగాని చెందినది కాదనియు, వారికి వేఱువేఱు పాళ్యములుండెననియు స్పష్ట మగుచున్నది. అట్లయిన డెరిజా మఱియెవ్వఁటిది? అను ప్రశ్నకలుగుచున్నది. రాయవాచకమునం దెచ్చటను బేర్కొనబడకపోయినను, ఆ డెరిజా పైమూడు తెగల తురకరౌతులకును యేలికయైన బహమనీ సుల్తానుదనుటకు సంశయింపబనిలేదు. ఇమ్మడిమహమూదుషాహు అందరు బహమనీ సామంతులచే నింకను దమయధిపతిగ నంగీకరింప బడుచుండెను. విజయనగరముపై నతడు చేయు చుండిన జిహాదులన్నిటియందును పై వచింపబడిన మూడు తెగలతురకలును పాల్గొనుచు వచ్చిరి.

కావున నీయుద్ధముగూడ సర్వసామంతులతో నెత్తివచ్చిన సుల్తాను నాధిపత్యముక్రిందనే నడచెను.

మహమ్మదీయరాజులు స్వయముగ దండ యాత్రలను నడపునప్పుడు తమ 'తొగటిగుడా రము'ను స్కంధావారమధ్యమున నెత్తించికొనెడి వారు; ఆ గుడారమున కిరువంకలను సేనాధిపతు లును నుమ్రాలును నాయకులును విడియువారు. ఇది సుప్రసిద్ధము. అప్పటి కర్ణాటసామ్రాజ్యజనుల కిది సుపరిచయమే. ఆంధ్రకవు లీ యంశమును దమ గ్రంథములందు బొందుపఱచి యున్నారు. ఒక యుదాహరణము.

"చలమొప్ప మరుపాదుశాహి
జగముల్ సాధింప దండెత్తి మ
త్తిల బ్రహ్మాండపు గెంపుదళ్కు
బురుసా దేరీజ నెత్తింప నం
దలి యస్తాచల పూర్వశైల
శిఖర స్తంభాగ్ర భాగంబుల
గల మాణిక్యపు బిళ్లలో యన
దగె గంజాప్త చంద్రాకృతుల్."[5]

ఈ పద్ధతి మొదట ఢిల్లీసుల్తానుల కాలమున వాడుకయందుండినది; వారి ననుసరించి బహమనీ సుల్తానులు గూడ నీ పద్ధతి నవలంబించినట్లు ఫెరిష్తా చరిత్రవలన దెలియుచున్నది. డెరిజా వేయుట యందు విశేషమేమనగా, శత్రులపై జయమో వారిచే బరాజయమో గలుగునంతవఱకు సుల్తా నచ్చట స్థిరుడై నిలచునని సూచన. డెరిజాను శత్రువుల చేబడనీయక గాపాడుచు జయము జేకూర్చుట దండనాయక సామంతాదుల విధి. డెరిజా కూలిన సుల్తాను పరాజయమందె నని యర్థము. విజయనగరమున నిది వెలిగుడారమను పేర ప్రసిద్ధికెక్కినది.

ఇచట పరిశీలనార్హమైన విషయ మింకొకటి కలదు. ఇది కృష్ణరాయలకు మొదటి జగడమట. అనగా రాయ లంతకు పూర్వ మే శత్రువుతోడను జగడించలేదని యర్థము. అట్లయిన కృష్ణరాయ లుమ్మత్తూరి దండయాత్రకు ముందే మూడు తెగల తురకలతో గోలకొండ సరదుస్థలమున యుద్ధము

---

5. భాను. పరి. 4 : 34.

జేసెనని తేలుచున్నది. అనగా క్రీ. శ. ౧౫౦౯-౧౦ సం॥న గృష్ణరాయల రాజ్యాభిషేకమైన క్రొత్తలో నీయుద్ధము జరిగినట్లున్నది.

మహమ్మదీయచరిత్రలయం దీ యుద్ధప్రస్తా పము గానరాదు; కాని బహమనీసుల్తాను రెండవ మహమూ దొక పర్యాయము విజయనగరముపై జిహాదువెడలి యుద్ధమున బలముగ గాయపడి పరాజితుడై పాఱిపోయెనని కొందఱు మహమ్మ దీయ చరిత్రకారులు వ్రాసియున్నారు. ఈ జిహాదు వృత్తాంతము తారీఖమహమ్మదు కుతుబుశాహీయను చరిత్రయం దిట్లు వర్ణింపబడియున్నది.

"మరుసటియేడు, హి. ౯౧౧ (క్రీ. శ. ౧౫౦౬) వ సం॥ న, బీదరు సంధిప్రకారము సుల్తాను ఉమ్రాల నందఱిని వారివారిదళములతో గూడ రాజధానికి రానుత్తరవు లంపెను. అట్లే యుమ్రాలందఱును వచ్చి యతని గూడుకొనినం తట మరల విజయనగరము వైపున నడచెను. సుల్తానుదండు దెప్పివచ్చి చేరగనే హిందూదళములు వారి కడ్డపడినవి; ఘోరసంగ్రామము జరిగినది. శత్రుసైన్య వామపక్షమును మల్లిక్ కుత్బుల్ ముల్కు భగ్నము గావించెను; కాని మధ్యభాగము నెదిర్చి పోరాడుచుండిన మహమూదుశాహువిఱిగి గుఱ్ఱముమీదినుండి క్రిందికిద్రోయబడి క్రొక్కుడువడి మృత్యువునోటబడ సిద్ధుడాయెను. కాని యత డదృష్టవశమున నిజాశ్వికులు గొందఱిచే గుర్తింప బడి పల్లకియందు శాహుమొహిబుల్లా కుమారుడగు మీరు లుత్ఫుల్లా శిబిరమునకు గొంపోబడెను. అచటి నుండి సైన్యము రాజధానికి వెనుదిరిగి పోయెను. ఉమ్రాలందఱు యెవరి సీమలకు వారు పోయి చేరిరి."[6]

సయ్యదు అలీ ఇబ్న అజీజుల్లా తబాతబా కృత బుర్హాన్-ఇ-మఆసిర్ అనుచరిత్రయందీ జిహాదు మఱికొంత విపులముగ వర్ణింపబడియున్నది.

"బహిరుఖుదావిందు ఖానునికి మరణశిక్ష జరుగుటకు పూర్వము (హి. ౯౨౩ = క్రీ. శ. ౧౫౧౭), విప్లవకారుల బాఱదోలుటకొఱకు, గొప్ప సైన్యముతోగూడ నాస్థానమునకు రావలయునని రాజ్యమునందెల్లయెడల నుండు నమీరులకును గొప్పవారికిని [సుల్తాను] ఫర్మానాయొకటి సాదరు చేయబడెను. ఉత్తరువుప్రకారము అమీరులెల్ల యుద్ధసామగ్రులను సేకరించుటయందు నిమగ్నులై తమ సైన్యములను గూర్చుకొనిరి; కాని వా రాస్థానమునకు వచ్చిచేరుటకు ముందే సుల్తాను హృదయమున విప్లవకారులమూలమున పొడమిన భయము తీరిపోయినది. అమీరులు సుల్తానుసేవకు రానాజ్ఞాపింపబడినవా రగుటచేత, నందఱును అత నికి మొక్కుటకు సత్వరముగవచ్చిరి. అందఱికంటె ముందు సుల్తాన్ అహమదు బహరీ తన సైన్య ముతో గూడ వచ్చి రాజదర్శనమునుజేసి యతని మన్నన కత్యంతపాత్రుడాయెను; అతని తరువాత పరెండా నుండి నూరిఖానుఖ్వాజా-ఇ-జహాను వచ్చి దర్శన మొనర్చుకొనెను. మఱ్ఱిసి రఫీఅ ఆదిల్ ఖానుడు, మస్నద్-ఇ-అలీ ఇమా-దుల్-ముల్క్, దస్తూర్-ఇ-మమాలిక్ మున్నగు తక్కిన అమీరు లును దొరలును, వీరుగాక ఇతరులు కొందఱమీరు లును మల్లికులును, సుల్తానువచ్చి యాస్థానమును జేరెనని వినినంతటనె, లెక్క కెక్కువయైన దళము లతోగూడ బయలుదేరి రాజధానికివచ్చి సుల్తానుకు నమస్కరించి సేవకు దాము సంసిద్ధులమని విన్న వించుకొనిరి.

తనపతాకపు గ్రీనీడ గూడిన యా మహా సైన్యమును జూడగనె, విగ్రహారాధకులపై మత యుద్ధముజేసి పుణ్యమును సంపాదింపవలయునను కోరిక సుల్తానుచిత్తమున గాఢముగ బాదుకొనెను. కావున దుర్జనులగు విగ్రహారాధకులను గూల ద్రోయుటకు ధ్వజమెత్తి రాజధానినుండి బయలు వెడలెను. దెప్పి కడకు సుల్తాను జేరునప్పటి కతని యాగమనము శత్రువు లెఱిగి యుద్ధమునకు సంసిద్ధులై యతని సైన్యముతో బోరాడ సత్వరముగ వచ్చిరి. యుద్ధము సంఘటిల్లినది. కాని యాకస్మిక ముగ సుల్తానుసేన ఘోరవిపత్తు పాలైనది.

---

6. *Briggs' Ferishta, III. pp.* 350-51.

సుల్తాను నిలిచి యుద్ధము సేయుచుండిన సేనా మధ్యము తక్కిన భాగములనుంచి వేర్పడెను. అశ్వికులక్రందువలనను, ముందు వెనుకలకు బఱచు కాల్వార సంచలనమువలనను ఇస్లామియాపాదు శాహు గుఱ్ఱముపైనుండి క్రిందబడెను. ఉభయ సైన్యము లొండొంటిని తారసిల్లినపుడు దుమ్ము వెల్లు రేగినది. ఇరువాగులవారును కలగా పులగముగ గలియుటవలన మిత్రులనుండి శత్రులను వేర్పఱచు టకు సాధ్యము గాదాయె. కావున పూతశరీరుడైన సుల్తాను నుత్తమాంగము బగిలి పలుతావుల గాయ పడువఱకును నత డేమైపోయినదియు నెవ్వరు నెఱుగ జాలరైరి; కాని యాసందడిలో గొందఱు నవుకరులు దమ యేలికను బొడగని, వెంటనె యాతని చెంతకుబోయి, గుఱ్ఱముల మధ్యనుండి వెలుపలకి గొనివచ్చి పల్లకియం దుంచి శాహు మహ-బ్బుల్లా కుమారుడగు మీర్జా లుత్ఫుల్లా శిబి రమునకు గొంపోయిరి.

"అమీరులును దొరలును సుల్తాను గాయ పడుట నెఱిగిన వెంటనె కయ్యము సాలించి యతని దర్శనము జేసికొనబోయిరి. సుల్తానుగాంచి దుఃఖ తులై కన్నులనుండి జైహూన్‌నదీ ప్రవాహమువలె రక్తాశ్రువులను గార్చిరి. తరువాత యుద్ధమును విరమించుకొని రాజధాని ముఖమై తిరిగిపోయిరి. బీదరుప్రాంతమును జేరగనె యమీరులును దొర లును సుల్తానునాజ్ఞచే సత్కారమును బొంది యెవ్వరి సీమకు వారు వెడలిపోయిరి." 7

---

7. *Burhan-i-Maasir, I. A. XXVIII. P.* 321.

8. క్రీ. శ. ౧౫౦౪ వ సంవత్సరమున వర్థేమా యను పాశ్చాత్య ప్రయాణికుడు గోవాకువచ్చి యుండి నపుడు, సవాయి (అనగా, యూసుఫు ఆదిల్ ఖానుడు) నరసింగరాజుతో యుద్ధము సేయుచుండె నని వ్రాసి యున్నాడు. నరసానాయకుడు క్రీ. శ. ౧౫౦౩ వ సం. న శివసాయుజ్య మందెను. తరువాత ఇమ్మడి నర సింహరాయలు నామకార్థము సింహాసనాధిపతియై యుండినను, రాజ్యకార్యమంతయు నరసానాయకుని జ్యేష్ఠపుత్రుడు వీరనరసింహరాయలు మూలమున నె జరుగుచుండినవి. కావున యొకవేళ హిందూచరిత్రా థారగ్రంథములు వివరించు యుద్ధ మిదియైనను గావచ్చును. (వర్థేమా యొక్క ఐటినెరరీ. పుట ౩౧౯.)

తారీఖ్-ఇ-ముహమ్మదు కుల్లీకుతుబుశా హందును, బుర్హాన్-ఇ-మ ఆసీరులోను వర్ణింపబడిన జిహాదొక్కటియే; కాని యది జరిగిన కాలము రెండు చరిత్రములందును రెండువిధములుగ వ్యత్యస్తముగ వర్ణింపబడియున్నది. తారీఖ్-ఇ-ముహమ్మదుకుల్లీ కుతుబుశాహులో హి. ౯౧౧ (క్రీ. శ. ౧౫౦౬) లో జరిగినట్లును, బుర్హాన్-ఇ-మ ఆసీరునందు హి. ౯౨౩ (క్రీ. శ. ౧౫౧౭) సంనకు ముందర నడచినట్లును వ్రాసియున్నది. కాని ఈ రెంటియందును జెప్పబడినకాలము అంగీకరింప దగినదికాదు. ఏలనగా, తారీఖ్-ఇ-కుల్లీ కుతుబు శాహు రచయిత కుల్లీకుతుబుశాహు మొదలయిన బహమనీయుత్రమా లందఱును హి. ౯౧౨ (క్రీ. శ. ౧౫౦౭) సంనన సుల్తాను మహమూదుశాహు మరణాంతరమే స్వతంత్రులైరని ప్రకటించు నుద్దే శము గలవాడగుటచే నీ జిహాదు తత్పూర్వము హి. ౯౧౧ (క్రీ. శ. ౧౫౦౬) లో జరిగెనని వ్రాసెను; కాని మహమూదుశాహు హి. ౯౧౨ న మృతినందలేదు; వాస్తవముగ నతడు కాలధర్మ మందినది హి. ౯౨౪ (క్రీ. శ. ౧౫౧౮) వ వర్షమున నని ఫెరిష్తా, సయ్యద్ అలీ మున్నగు చరిత్రకారులు వ్రాసియున్నారు. మఱియు హిందూ చరిత్రాధార గ్రంథములం దెచ్చటను క్రీ. శ. ౧౫౦౬ లో బహమనీసుల్తానుపై నింతటి ఘనవిజయమును విజయనగరరాయలు పొందినట్లు చెప్పియుండలేదు; కాని వీరనరసింహరాయల యేలుబడియందు మహమ్మదీయులతో నతడొకపర్యాయము యుద్ధముచేసినట్లు కలదు; కాని యతని ప్రతిపక్షి యేదులఖానుడు గాని సుల్తానుఇమ్మడి మహమూదు శాహుబహమనీకాదు.[8] ఇకబుర్హాన్-ఇ-మఆసిరులో- హి. ౯౨౩ (క్రీ. శ. ౧౫౧౭) నకు ముందని చెప్పి యున్నను ఎంతముందో నిశ్చయించుటకువీలులేదు. కాని యాజిహాదు కాలనిర్ణయమునకు దోడ్పడగల చరిత్రాంశమొకటి యందు గానవచ్చుచున్నది. ఈ జిహాదునందు సుల్తాను మహమూదుశాహుతో గూడ యుద్ధమునకు నడచిన యుత్రమాలలో మల్లిక్ అహ్మదుబహరీ నిజామ్-ఉల్ - ముల్కొక్కడని సయ్యద్ అలీ చెప్పియున్నాడు. మల్లిక్ అహ్మద్ బహరీ నిజామ్-ఉల్ -ముల్కు హి. ౯౧౬ (క్రీ. శ.

౧౫౧౦-౧౧) వఱకు జీవించియుండెను.9 కావున నతడు పాల్గొనిన జిహాదతని మరణకాలమునకు ముందే నడచియుండవలయును.

పై వివరించిన యంశములను బట్టి చూడగా నీ జిహాదు క్రీ. శ. ౧౫౦౯-౧౦ వ సంవత్సరమున, ననగా మల్లిక్ అహమదు భైరినిజామ్-ఉల్-ముల్కు మరణమున కించుక పూర్వము నడచినట్లు తోచు చున్నది. ఈ యూహ సరియైన పక్షమున అల్బూకెర్కు కామెంటరీసులో చెప్పినట్లు కృష్ణరాయలతో దక్కనురాజు క్రీ. శ. ౧౫౧౦ వ సంవత్సరమున ప్రారంభమున జేయుచుండిన యుద్ధమిజిహాదే కావలయును. మఱియు రాయవాచకమున గృష్ణ రాయలు గోలకొండ సరదుస్థలమునందు కృష్ణా తీరమున మూడు తెగల తురకలతో జేసినట్లు చెప్పి యుండు సమరము ఇదియ కావలయును. ఈ యభిప్రాయ మంగీకార్యమేని, రాయవాచక కృష్ణ రాయవిజయములలోని ఈ యుద్ధవృత్తాంతము తారీఖ్-ఇ-ముహమ్మదు కుతుబుశాహీ, బుర్హాన్-ఇ-మ ఆసీరులలో బేరొక్కనబడిన సుల్తాన్ ఇమ్మడి మహమూదుశాహుయొక్క జిహాదు వర్ణనకు హిందూపాఠాంతరముగ గ్రహింపవలసియున్నది.

హిందూమహమ్మదీయ వృత్తాంతములలో వర్ణింపబడియుండు ముఖ్యాంశముల నొండొంటితో బోల్చిచూచినయెడల నీ యభిప్రాయమందలి లోటు పాటులు జక్కగ విశదముగాగలవు.

హిందూగ్రంథములు :

౧. గోలకొండ సరదుస్థలమున కృష్ణ దక్షిణ తీరమున యుద్ధమునడచినది.

౨. మూడు తెగల తురకలు, అనగా నహమదానగర విజాపుర గోలకొండ దొరలు రాయల నెదిర్చిరి.

౩. యుద్ధరంగమున సేనా మధ్యమున (సుల్తాను?) డేరాయుండినది. మూడుతెగల తురకలకును వేర్వేరు పాళెము లుండినవి. డేరాచుట్టును అశ్వదళములును యేనుగులును గాల్బలమును గాపుండెను.

మహమ్మదీయ చరిత్రలు :

౧. విజయనగర బహమనీ రాజ్యముల గడి ప్రదేశమున దేవ్గి లేక దేవ్లీయను స్థలమున యుద్ధము నడచినది.

౨. సుల్తాన్ ఇమ్మడి మహమూదుశాహు బహమనీ నాయకత్వమున బహమనీ సామంతులందఱును ముఖ్యముగ-నహమదానగర మల్లికు అహమదు భైరీ, నిజామ్-ఉల్-ముల్కును, విజాపుర ప్రభువు ఏదుల్ ఖానుడును, గోలకొండ పాలకుడు కుతుబ్-ఉల్-ముల్కును—ఏకమై హిందువులతో బోరిరి.

౩. యుద్ధరంగమున సేనామధ్యమున సుల్తాను ఇమ్మడి మహమూదుశాహు బహమనీ నిలిచియుండెను. ఆతని చుట్టును గుఱ్ఱపు ఫౌజు మెండుకొని యుండెను. కుడిప్రక్క కుతుబ్-ఉల్-ముల్కు దళము నడపుచుండెను.

---

9. సయ్యదు అలీ తన బుర్హాన్-ఇ-మ ఆసీరులో నీ మల్లిక్ అహమ్మదు క్రీ. శ. ౧౫౧౫-౬ న కించుక ముందు మృతి నందినట్లు వ్రాసియున్నాడు; ఫెరిష్తా ప్రకారమతని మరణము క్రీ. శ. ౧౫౧౮ లోనో, మఱి కొంచెము దరువాతనో సంభవించినది. ఆతడు క్రీ. శ. ౧౫౧౦ వ సంవత్సరమున జీవించియుండెననుటకు గొంత సాక్ష్యము గలదు. అత డా వర్షమున దస్తూర్-ఇ-మమాలికునకు ఇస్మాయిలు ఆదిల్ ఖానునితో యుద్ధము సేయుటకు సాయమొనర్చెను. (*Burhan-i-Maasir, I. A. XVIII. p.* 318). గుజరాతు దేశపు (అరబీ) చరిత్రయందు మల్లిక్ అహ్మదుల్బహరీ హి. ౯౧౬ (౧౦ ఏప్రిలు ౧౫౧౦ మొదలు ౩౧ మార్చి, ౧౫౧౧, వఱకు) లో కాలగతి నందెనని వ్రాసియున్నది. (*Arabic History of Gujerat III. Index. p.* 84)

ళ. రాయల కమ్మ ఫౌజు తురక సేనపైబడి వారి యశ్వసేనను జిందరవందర గావించి, యేను గుల దటిమి కాల్బలముల నేలపాలు గావించి, డేరాత్రాళ్ళను గోసి డేరాను గూల ద్రోసిరి. అంతట మూడు తెగల తురకలును నోడి రణరంగమును విడిచి పాఱిపోయిరి. హిందువులు విజయులైరి.

ఈపట్టికలు రెంటి నొండొంటితో బోల్చి చూడగా వానియందు భేదములకంటె బోలికలె యధికముగ గానవచ్చుచున్నవి; కావున రాయవాచక కృష్ణరాయవిజయములును దారీఖ్-ఇ-ముహమ్మదుకుల్లీకుతుబుశాహా, బుర్హా౯-ఇ-మ ఆసీరులు వర్ణించు యుద్ధమొక్కటియే యని మనము నిశ్చయము సేయవచ్చును.

అనుబంధము ౩

యూసుఫు ఆదిల్ ఖానుని మరణకాలము

క్రీ. శ. ౧౫౦౯-౧౦ వ సంవత్సరమున బహమనీసుల్తానుతో నైసయుద్ధమున గృష్ణరాయలు యూసుఫుఆదిల్ ఖానుని వధించెనని చెప్పితిని. ఈ యభిప్రాయ మాముక్తమాల్యదలోని 'అలుకన్ఘోటక ధట్టికా ఖురపుటీ' యనుపద్యముపై నాధారపడి యున్నదని తెల్పితిని. ఈ విషయమున జక్కగ కీ. శే. శ్రీ కొమఱ్ఱాజు వెంకటలక్ష్మణరావు పంతులుగారు ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక సప్తమ సంపుటమున కృష్ణరాయలకొన్ని 'దిగ్విజయయాత్ర' ను వ్యాసమున జర్చించియున్నారు. ఈ వ్యాసమును లక్ష్మణరావుగా రొకముఖ్యాంశమును జర్చింపక విడిచిపెట్టిరి. అందువల్ల నీవిషయమును మరల పరిశోధింపవలసివచ్చినది.

యూసుఫు ఆదిల్ ఖానుని మరణమునుగూర్చి ముహమ్మదు కాసిమ్ ఫెరిష్తా తన చరిత్రయం దిట్లు వ్రాసియున్నాడు.

ళ. కుతుబ్-ఉల్-ముల్కు శత్రుసైన్య దక్షిణ పక్షమును భగ్నము గావించెను. కాని మధ్యమున సుల్తానాశ్వికుల క్రందువలన గ్రిందపడి యశ్వములచే ద్రొక్కుడు వడెను. బలమైన గాయములు దగిలినవి. అతని యుద్ధరంగమునుండి వెలుపలికి గొనిపోయిరి. బహమనీ సేనలు విరిగి యుద్ధమును వ్యజించి వెడలిపోయెను. హిందువులు విజయులైరి.

"హిజరీ ౯౧౫ వ సంవత్సరమున క్రైస్తవులు (పోర్చుగీసులు) ఏమఱుపాటున గోవాపైబడి పురపాలకుని, పెక్కు మహమ్మదీయులను వధించి దానిని స్వాధీనము జేసికొనిరి. ఈ విషయము దెలియవచ్చి నంతటనె యూసుఫు ఆదిల్ ఖాను మూడువేల దిట్టల దక్కనీలను లాతివారిని గూర్చుకొని కడువేగముతో గూచిచేసిపోయి యైరోపీయు లాదమరచి యుండ పెక్కుమందిని చంపి యాకోటను దిరుగ వశపఱుచుకొనెను; కొందఱు ఓడలనెక్కి సముద్రముపై దప్పించుకొనిపోయిరి. గోవాసంరక్షణకు దగిన యేర్పాటులను గావించి యూసుఫుఆదిల్ ఖాను బిజాపూరునకు మరలివచ్చి తన డెబ్బది యైదవయేట మహావైభవముతో నిరువదియొక సంవత్సరములు రాజ్యపాలనము జేసిన పిమ్మట వాపుచే నగరులో మృతినందెను."[1]

కృష్ణరాయ లేదులఖానుని దన యుత్తర దిగ్విజయ యాత్రయందు వధించితినని చెప్పుచుండ, దీనికి విరోధముగ ఫెరిష్తా యతడు విజాపురమున శోఫజాడ్య పీడితుడై మృతినొందెనని వక్కాణించుచున్నాడు. వీరిలో నెవ్వరు నిజమాడుచున్నారో విచారించవలసియున్నది. ఫెరిష్తా చెప్పునట్లు యూసుఫు ఆదిల్ ఖానుడు విజాపురమున మృతినందలేదని రుజువు సేయగల సాక్ష్యము గొంతకలదు. తారీఖ్-ఇ-ముహమ్మదుకుల్లీకుతుబుశాహా నందు 'యూసుఫు ఆదిల్ ఖానుడు కోవెలకొండయందు మృతినందె' నని వ్రాసియున్నది.[2] అట్లే బుర్హాన్-ఇ-మఆసీరునందుగూడ 'మజ్లిస్-ఇ-రఫిఅ ఆదిల్ ఖానుడు కోవెలకొండ కనుచూపుమేరలో నుండగ మరణించె'నని యున్నది. పై బేర్కొ

---

1. *Briggs' Ferishta, III. pp.* 29-30.
2. ,, ,, *III. p.* 350.

నిన మహమ్మదీయచరిత్రకారులిరువురును ఫెరిష్తాకు సమకాలికులే. వారిద్దరును యూసుఫు ఆదిల్ ఖానుడు కోవెల కొండలోనో దాని పరిసరములందో జచ్చెనని చెప్పుచుండగ, ఫెరిష్తాయొక్కనిమాట పై నాధారపడి యతడు విజాపురమున కాలధర్మము నందెనని నమ్మట యెట్లు? కృష్ణరాయలు యూసఫుఆదిల్ ఖానునికి సమకాలికుడును బ్రతి పక్షియు. అతడు తా నాదిలు ఖానుని యుద్ధమున జంపితినని ఘంటాపథముగ జెప్పుచుండగ దరువాత డెబ్బది యెనుబది సంవత్సరములకు చరిత్రరచనకు గడంగిన ఫెరిష్తాబ్రాతను నమ్మి యతడు రోగ పీడితుడై నిజరాజధానియందు దేహము చాలించె నని యొప్పుకొనుట యెట్లు?

మహమ్మదీయచరిత్రకారుల బ్రాతలను బట్టి యూసుఫు ఆదిల్ ఖానుని మరణకాలమును నిర్ణయించుటకు సాధ్యముగాదు. అతని మరణకాలము నొక్కొకరొక్క విధముగ జెప్పియున్నారు. వీరిచ్చు భిన్నకాలములను జబీరీ యిట్లు సంగ్రహముగ బొందుపఱచియున్నాడు. 'యూసుఫు ఆదిల్ ఖానుని మరణము తబకాత్-ఇ-యక్బరీ రచయిత ప్రకారము, హి. ౯౧౩ ను, ముహమ్మదుకాసిమ్ ఫెరిష్తాప్రకారము, హి. ౯౧౬ ను, రఫీఉ-ద్దీన్ పిరాజీ, మీర్ ఇబ్రాహిమ్ అసద్ ఖానీలప్రకారము, హి-౯౩౫ ను సంభవించెను.''[3] మఱియు సయ్యద్ ఆలీ బిన్ అజీజుల్లా తబా తబా యాదిల్ ఖానుడు మృతినందినది హి. ౯౧౭ నకు దరువాతయనియు, తారీఖ్-ఇ-ముహమ్మదు కుల్లీకుతుబుశాహు రచయిత హి. ౯౧౦ లో ననియు[4], కాఫీఖా నొక చోట హి. ౯౧౬ లో ననియు, మఱియొకచోట హి. ౯౧౪ లో ననియు వ్రాసియున్నారు.[5]

మహమ్మదీయ చరిత్రకారు లిట్లు యూసుఫు ఆదిల్ ఖానుడు భిన్నకాలమున మృతినందెనని తెలుపుచున్నను, సమకాలిక పోర్చుగీసు రచయితల వ్రాతలవలన స్పష్టముగ నిర్ణయింపవచ్చును. పోర్చుగీసు గవర్నరు అల్బూకెర్కు గోవాను బట్టుకొనుటకొఱకు కొచ్చినుండి క్రీ. శ. ౧౫౧౦ సం. జనవరి ౧౦ తేదినాడు బయలుదేరెను. కొన్నిదినములు సముద్రప్రయాణము జేసి యతడు అంజదీవా ద్వీపమును జేరెను; అచట నతడు విజయనగర నావికదళాధిపతియగు తిమ్మోజును గాంచెను. తిమ్మోజువలన గోవాపట్టణాధిపతి సబై యో మృతినందెనని తెలిసికొనెను. అంతట నాల్బూకెర్కు గోవామీద కార్యము నడపుటకు నిశ్చయించి, క్రీ. శ. ౧౫౧౦ ఫిబ్రవరి ౨౫ తేదివఱకు జరిగిన చర్చలో దన దళనాయకుల సహకారమునుబడసి, గోవావైపు నావల నెక్కిపోయెను. శింతకోర దుర్గసమీపమున లంగరు వేసియుండగా దిమ్మోజు మరల నతనియొద్దకువచ్చి, 'గోవాపట్టణమందలి హిందువులు సందేశములవల్లను, ఉత్తరములవల్లను సబై యో మరణించెననియు, మల్లిక్ సూఫర్ గూగియను దళవాయి గోవాయందున్నాడనియు, నతడు సబై యోమరణానంతర మెవ్వరిని లక్ష్యపెట్టుటలేదనియు దనకు దెలియజేసిరనియు జెప్పెను.[7] అతనినిఏల గోవాను బట్టుకొనవలయునని యాల్బూకెర్కును ద్వరపెట్టుచున్నావని యడుగగా 'సబై యో మరణము వాస్తవమనియు నతనిచే దోపుడువడిహింసితులైనగోవాప్రజ లందుకుమిక్కిలి సంతసించి తిరుగుబాటు చేసి'రనియు జవాబు చెప్పెను.[8] సింతకోరదుర్గమును బట్టుకొనిన పిమ్మట తిమ్మోజుచే బట్టుబడిన ఫకీరొక్కడు సబై యో మృతినందెననియు నతని పుత్రుడు రాజ్యమధ్యభాగమునకు బోయి యున్నాడనియు గోవార్తలని వచించెను.[9] ఈ విధముగ నిశ్చయమును దెలిసికొని ఆల్బూకెర్కు క్రీ.శ. ౧౫౧౦ మార్చి ౧ తేది నాడు గోవాపై బడెను; యుద్ధముగూడ జేయనవసరము లేకయే యతనికది హస్తగత మాయెను. కావున నాల్బూకెర్కు కామెంటరీసు వలన నతడు క్రీ. శ. ౧౫౧౦ ఫిబ్రవరి ౨౦ తేది నాడు గోవాకు రాకపూర్వమే సబై యో, లేక

---

3. *Busatin-us-Salatin p.* 22.

4. *Burhan-i-Maasir*, 2A[1]*XXVIII p.* 319.

5. *Muntakhab-ul-lubab*, *III* (*Biblio indnofo*) *pp.* 128, 280

7. *Commentaries of Affonso D. Albuquerque.* 1. *pp.* 81-82.

8. " " *p.* 85.

9. " " "

యూసుఫు ఆదిల్ ఖానుడు చనిపోయెనని తెల్లము సేయుచున్నవి.

ఇంకొకసంగతి. ఆల్బూకెర్కు గోవాపట్టణమును జయించినది యూసుఫు ఆదిల్ ఖానునుండి కాదనియు నతని కుమారుడగు నిస్మాయిల్ ఆదిల్ ఖాను దగ్గరనుండియనియు బై నుదాహరింపబడిన కామెంటరీసు సాక్ష్యమువలన రుజువగుచున్నది.[10]

పై చర్చవలన ఆల్బూకెర్కు క్రీ. శ. ౧౫౧౦ ఫిబ్రవరి ౨౦ తేది నాడు గోవామీద నెత్తివచ్చుటకు ముందు యూసుఫుఆదిల్ ఖానుడు మృతినందెనని తేలుచున్నది. అంతకుముందెన్న డాతడు మృతినందెనో ఖచ్చితముగ నిశ్చయించి చెప్పుటకు వీలులేదు; కాని యాతనిమరణము సంభవించి యప్పటికింకను జాలకాలముగాలేదని గట్టిగ జెప్పవచ్చును. ఆల్బూకెర్కు మొదటితడవ గోవామీద యుద్ధము సేయప్రారంభించినపుడు, తిమ్మోజతనితో 'నిరుడు రెండువందల కధికసంఖ్యాకులైన గోవా వర్తకుల విత్తమును హరించి సబై యోవారిని వధించె'నని చెప్పెను.[11] అంతకు గొంతముందు, ఆలెమ్మడాచే నోడిపోయిన ఈజిప్టు సుల్తాను, నౌకానాయకులందొక్కడు నిజపరాజయానంతరము గోవాయందు తలదాచుకొనెననియు, చానినే దన ముఖ్యస్థాన

---

10. ఆల్బూకెర్కు కామెంటరీసు సం. ౩ పు. ౧౮౩ నందు గానవచ్చు నీ వాక్యము గొంత సంశయమున కెడ మిచ్చుచున్నది. "అప్పానోస్డాల్బూకెర్కు (గోవానదిలో నతడు లంగరు వేసినిలిచి యుండినపుడు) గోవాపట్టణము క్రైస్తవులకు వశము గాగలదనియు దానిని మిల్హర్ రావు అనుహిందువు పాలింపగిలడనియు దానాడినమాట ఇంకను నిక్కము కాగలదని' దన తండ్రితో నాడిన వాక్యములను హిదల్కానును స్మరణకు దెచ్చుకొనెను." ఎప్పుడు ఆల్బూకెర్కట్లు శపథము చేసెనో తెలియదు. కాని యాల్బూకెర్కునకు(గోవాను గూర్చి) హిదల్కానుని యనుచరుడగు ముస్తఫాఖానునితో జరిగిన సంవాదము తుదనతడు కొన్ని బెడసుమాటల నాడెను; కాని వాని సరణి వేరు. "ఆ వేసగి కాలము గడచిపోవుటకుముందే తాను గోవాయందలి ప్రాసాదమున మరల విశ్రాంతినందెదననియు, దక్కను రాజ్యమున దిమ్మోజు నొకగొప్ప ప్రభువును జేయుదుననియు ప్రతిజ్ఞ జేసెను." (ఆల్బూకెర్కు కామెంటరీసు సం. ౩. పుట. ౧౮౩). కావున నాల్బూకెర్కు యూసఫు ఆదిల్ ఖానునితో జేసిన శపథమునకంటె నిది భిన్నమైనది. ఆల్బూకెర్కు శపథమును గోవాపై దానింక నెత్తిరాక పూర్వ మొకవేళ జేసియుండినను ండవచ్చును. ఈ సందర్భమున జ్ఞప్తియందుంచుకొన దగిన విషయమొకటి కలదు. సబై యో మలబారు ప్రజలకు మిత్రుడు; వారు పోర్చుగీసులమీద యుద్ధము సేయుటకు కావలసిన ధనమును బలమును సరఫరాజేసి సకలవిధములదోడ్పడుచు నతనిదమకుసర్వసేనాధిపతిగ నెన్నుకొనిరి. పోర్చుగీసులను హిందూమహాసముద్రము నుండి పాఱదోలు నుద్దేశముతో యూసుఫు ఆదిల్ ఖానుడు గోవానదియందు పెద్దవియు జిన్నవియు బలవిధముల యోడలుగల గొప్ప నావికాదళమును దయారుచేసెను. (ఆల్బూకెర్కు కామెంటరీసు. సం. ౨. అ. ౨౦. పుట ౯౭); అచటినుండి బయలువెడలి పోర్చుగీసుల యోడలమీదను మలబారులోని వారి మిత్రుల కరపట్టణముల మీదను బడి పోట్లాడువాడు. తానెందుకు యూసుఫు ఆదిల్ ఖానుని పెంకి యగు గోవాపై యెత్తిరావలసివచ్చెనో ఆల్బూకెర్కు హిదల్కానుకంపిన సందేశములోని ఈ క్రిందివాక్యమున విశదపరచియున్నాడు. "మీతండ్రి సబై యో యెట్లు మారాజుగారిమలబారు రేవుపట్టణములందలి యోడలను బట్టుకొని పోవుచుండువాడో మీకు జక్కగ దెలిసి యుండవలయును; కావున నేను గోవాపై నెత్తిపోయి దాని గైవసము జేసికొనవలసి వచ్చినది; ... మీ తండ్రి నేటివఱకును బ్రతికియుండకపోయెనే యని నేను వాస్తవముగ వగచుచున్నాడను; బ్రదికియుండిన చెప్పినంత సేయువాడనని నన్నత డెరిగియుండును." (ఆల్బూకెర్కు కామెంటరీసు. సం. ౩. పుటలు ౨౦–౨౧). కావున ఆల్బూకెర్కు యూసుఫు ఆదిల్ ఖాను మరణానంతరము జయించెననియు, బై జెప్పిన ప్రతిజ్ఞ నతడు మలబారుతీరమందుండిన పోర్చుగీసు రేవుపట్టణములమీద యూసఫు ఆదిల్ ఖాను దాడినడపుచుండిన కాలమున జేసియుండవలయుననియు దృఢముగ జెప్పవచ్చును.

11. ఆల్బూకెర్కు కామెంటరీసు సం. ౩. పుట ౯౫.

ముగ జేసికొమ్మని సబైయో యతని వేడుకొనె ననియు దెల్పెను.[12]

ఆల్బుకెర్కు క్రీ. శ. ౧౫౦౯ ఫిబ్రవరి ౩ వ తారీఖున నీజిప్టునౌకాదళము నోడించెను. అతనిచే నిర్జితుడైన ఐగుప్తు నౌకాదళపతి నొక్కని గోవా యందే నిలుకడగనుండవలయునని సబైయో ప్రార్థించియుండిన నతడప్పటికింకను సజీవుడై యుండెననుట నిశ్చయము. కావున సబైయో లేక యూసుఫు ఆదిల్ ఖానుడు క్రీ. శ. ౧౫౦౯ ఫిబ్రవరి ౩ వ తారీఖునకును క్రీ. శ. ౧౫౧౦ ఫిబ్రవరి ౨౦ వ తారీఖునకును మధ్య, అనగా క్రీ.శ. ౧౫౦౯-౧౦ వ సంవత్సరమున మృతినందెనని నిస్సంశయముగ జెప్పవచ్చును.

ఇంతవఱకు జేసిన చర్చవలన తేలిన సారాంశమిది :—

౧. ఫెరిష్తాచెప్పినట్లు యూసుఫు ఆదిల్ ఖానుడు హిజరి ౯౧౬ అనగా క్రీ.శ. ౧౫౦౯-౧౦ వ సంవత్సరమున మృతినందెను ; కాని,

౨. అతడు ఫెరిష్తాచెప్పినట్లు విజాపురమున కాలగతి నందనేలేదు.

౩. గోలొ్కండ సరదుస్థలముననుండు కోవెల కొండయందో, లేక యాదుర్గము కనుచూపు దూరమునందుండగనో యసువులు విడిచెను.

౪. మఱియు క్రైస్తవులు అనగా పోర్చుగీసు వారు యూసుఫు ఆదిల్ ఖానుని జయించలేదు ; వారినోడించి యూతడా రేవు పట్టణమును మరల స్వాధీనపఱచుకొనను లేదు.

౫. పోర్చుగీసువారు ప్రప్రథమమున గోవా పట్టణమునాక్రమించుకొనినది యూసుఫు ఆదిల్ ఖానుడు గతించినపిమ్మట నతని కుమారుడు ఇస్మాయిల్ ఆదిల్ ఖానుని రాజ్యారంభకాలమునందు ; వారిదగ్గరనుండి దాని మరల జయించి స్వాధీన పఱచుకొనినదియు నిస్మాయీలాదిల్ ఖానుడే.

ఇందువలన ఫెరిష్తాచరిత్ర యబద్ధకల్పనయని విదితమగుచున్నది. ఫెరిష్తా బుద్ధిపూర్వకముగా నబద్ధములు వ్రాయలేదనియు, నత డాధారములుగ గ్రహించిన గ్రంథములలోని విషయముల నెట్లుండినవానినట్లే పరిశీలింపక తనగ్రంథములోని కెక్కించుకొనెననియు గొందఱు చెప్పుదురు. మఱికొందఱు దీని నంగీకరింపక నతడు బుద్ధిపూర్వకముగ నబద్ధపురాణమును గల్పించెనందురు. ఇందేది సత్యమైనను ఫెరిష్తాచరిత్ర విజయనగరమునకు సంబంధించినంతవఱకు తప్పులకుప్ప. విశ్వాసార్హముగాదు.

౬. కృష్ణదేవరాయల దేవేరులు

గోలకొండ సరదుస్థలమందు తురకలపై విజయమును బొందిన పిమ్మట కృష్ణదేవరాయలు కళింగదేశముపై దండయాత్ర బయలువెడలినట్లు రాయవాచకమునను, గృష్ణరాయవిజయమందును జెప్పియున్నది. గజపతి తన కుమార్తెను దనకిచ్చి పరిణయము సేయ నిరాకరించుటవలన గోపించి కళింగముపై గృష్ణరాయలు దండువెడలెనని కొన్ని యైతిహ్యములవలన దెలియుచున్నది ; కావున నీ యైతిహ్యముల నిచట సంగ్రహముగ బొందుపఱచి వాని సత్యాసత్యములను బరిశీలించి తెలిసికొని యవ్వల కృష్ణరాయల కళింగ యాత్రా చరిత్రను వివరించుట యుక్తము.

(౧) కృష్ణరాయలు దాసీపుత్రుడను నపవాదము గల్గినది ; ఈ త్రియు లెవ్వరును దమ కూతు నాతనికిచ్చి వివాహముసేయ నొల్లరైరి. తిమ్మరుసెట్టైన సత్కులజాతయగు ఈ త్రియకన్యను దెచ్చి రాయలకు వివాహముసేయ నిశ్చయించి సేనాపరివృతుడై వినుకొండకు బోయి యచ్చట దమకరిగాపై రాజ్యము సేయుచుండిన గజపతిని గలిసికొని, తన యుద్దేశ్యము నతని కెఱుకపఱచక, నత

---

12. ఆల్బూకెర్కు కామెంటరీసు. సం. ౩. పుట. ౯౩.

నిచే దాను చెప్పినట్లు చేసెదనని మాటగొని, యటు పిమ్మట గృష్ణరాయల కాతని కూతునిచ్చి యుద్వాహము సేయవలయునని యానతిచ్చెను. ఆడినమాట తప్పజాలక యత డందుల కంగీకరించి గృహమునకు వచ్చెను; సమాచారమంతయు విని రాణి కోపించి తక్కువజాతివానికి గూతు నిచ్చుట తగదని పల్కెను; కాని గజపతి దన మాటచొప్పున నడ చెదనని పట్టుబట్టెను; రాణివాస స్త్రీ లందుల కీయ కొనక కృష్ణరాయలను జంపియైన పెండ్లిని జరుగ నీయక నిలిపివేయుటకు నిశ్చయించిరి.

ప్రధానతాంబూలము గొనుటకు తిమ్మరుసు పరివారముతోగూడ పెనుగొండనుండి తరలివచ్చి వినుకొండను జేరెను; అడపగానివలె గృష్ణరాయ లతనితో గూడ మారువేషముతో కోటను బ్రవేశించెను; తిమ్మరుసు దమకు రాణిగాబోవు నాకన్యను జూడ గోరెను; గజపతియాజ్ఞపై సర్వాలంకార భూషితయై యామె యచటికి వచ్చినది; చూచినది; అడపగాడే కృష్ణరాయలని గ్రహించినది. వెంటనే లోపలికి బోయి యా వృత్తాంతము నంతఃపురమందు ప్రకటించినది. కృష్ణరాయలను కోటవెలుపలికి బోనీయక వధించుటకు అంతఃపురస్త్రీజనము ప్రయత్నము సేయగడగిరి; కాని తిమ్మరుసుచే సంరక్షితుడైన కృష్ణరాయలు వారిచేజిక్కునా? గజపతికుమార్తె యంతఃపురములోనికి బోవ నెప్పుడు వెనుదిరిగెనో యప్పుడే తిమ్మరు సామెచిత్తవృత్తిని గ్రహించి రాయలకు గనుసన్న జేసి, యడపముపాడు తాంబూలమున సున్న మెక్కువ వేసినాడను మిష మీద వానిపై నాగ్రహించి తఱుముకొనుచు నంతఃపుర స్త్రీల యాజ్ఞచొప్పున గోట దర్వాజా మూయ బడుటకు ముందే వెలుపలికి బోయెను. కృష్ణరాయల కపాయ మిట్లు తప్పిపోయినది.

లగ్నము నిశ్చయమైనది; కృష్ణరాయలుద్వాహమునకు రాజధానికి బోయి తిమ్మరుసు సలహాప్రకారము దన బాకును పెండ్లాడబంపెను; సుముహూర్తమున బాకునకు బాపికము గట్టించిరి. పెండ్లి ముగిసినది. గజపతికూతు రత్నవారింటికి కాపురము సేయవచ్చినది. పునస్సంధానమునాటి రాత్రి రాయలను గడతేర్చుటకు నిశ్చయించి కత్తుల మొలనూలు ధరించి పడకటింట ప్రవేశించినది; కృష్ణరాయ లాకాంత కట్టుకొని యుండిన పావడను దన కాలిబ్రేళ్లతో నొడిసిపట్టి చెంతకు జేరదీసెను. కత్తులమొలనూలూడి క్రిందబడినది. ఆశ్చర్యముతో గృష్ణరాయలు 'అప్పాయేమి చిత్రము' అని యఱచెను. చెంతనే డాగియుండిన తిమ్మరుసు 'జాగ్రతో భయం నాస్తి' యని ధైర్యముజెప్పెను.

అంతట గృష్ణరాయలు దన్ను జంపనుద్యుక్తురాలైన భార్యను విసర్జించి సైన్యముతోగూడ నామెను తండ్రియింటి కంపెను; కాని యామె పుట్టింటికి బోలేదు. తన దుష్కృత్యమునకు బశ్చాత్తాపమంది భర్తయనుమతి వడసి మార్గమధ్యమునందొక వనమున నివసించుచు భగవద్ధ్యానపరాయణురాలై కాలము గడపుచుండెను. ఆమె పేరు వరదరాజమ్మ; విశేషధనము వెచ్చపెట్టి కర్నూలు జిల్లాలో కంభముకడ నొక చెఱువును గట్టించెను. ఆమెకే తుక్కాజీ యను నామాంతరము గలదు. ఆమె తుక్కాపంచక మను నైదుశ్లోకములను రచించి కృష్ణరాయల కంపెనట; రాయలందులకు సంతచించి యామెను దన యనుగ్రహమునకు బాత్రురాలిని గావించెనట.

ఇట్టిదే మఱియొక కథ కలదు:—

(౨) కృష్ణరాయలు తక్కళదేశముపై దండెత్తిపోయి యా దేశాధిపతిని జయించెను; ఉత్కళరాజు సంధిని గోరెను; కూతు నిచ్చి తన కుద్వాహము గావించిన సంధి కొడబడెదనని కృష్ణరాయలు వర్తమానమంపెను; అతడందుకంగీకరించి వివాహప్రయత్నములు జేయగడగెను; కాని కులహీనుని బెండ్లాడ నొల్లక యా రాజకుమార్తె యతనిని వధించి తానును జచ్చుటకు నిశ్చయించెను. ఆమె మనోనిశ్చయము క్రమక్రమముగ దిమ్మరుసు కెఱుకపడినది. అతడు కృష్ణరాయలకు దెల్పి రాయల సమ్మతిమీద పునస్సంధాన గృహము మంచముపై దేనెతోనింపినకృష్ణరాయలవిగ్రహమును బండబెట్టి, యుత్తరీయమును గప్పి 'రాయలు డస్సి నిద్రించుచున్నాడు. అతని నిదురలేప వల'దని దాసీజనములతో జెప్పెను. అది విని వారెవరి దారిని వారు

పోయిరి. అంతట దిమ్మరుసు మంచము క్రింద దాగి యుండెను. ఉత్కలేశ్వరుని పుత్రిక పడుకటింట ప్రవేశించినది ; మంచముమీద పండబెట్టియుండిన విగ్రహమే కృష్ణరాయలని భ్రమించి, చేతనున్నచిక్కటారితో నొకపోటు పొడిచినది. ఆ పోటుగంటునుండి తేనె వైకెగజిమ్మి యామె నోట కొన్ని బిందువులు పడెను ; తేనెను రక్తమని యెంచి, 'ఈరాజురక్తమెంత తియ్యగనున్నది ! ఇట్టి వాని ననుభవింప జాలక చంపితినికదా' యని చింతించెనట ! అప్పుడు మంచముక్రిందనుండి తిమ్మరుసు వెలువడివచ్చి యామెకు ధైర్యముజెప్పి, ప్రక్కగదిలో రహస్యముగ బరుండీయుండిన కృష్ణరాయలను దోడ్కొనివచ్చి వారికి మైత్రి గల్గించెను. ఆ యుత్కళ రాజు కుమార్తె పేరు తిరుమలదేవి. [1]

వైగాథలకంటె భిన్నమైనది ఇంకొక కథ కలదు: —

"రాయలొకనాడు యేనుగువై నెక్కి నగరమున విహారము సేయుచునొక భోగకత్తియ (గాండ్లసంగ) ను జూచి మోహించి దానిని తన యంతఃపురమునకు రప్పించి భోగించుచుండెను. ఇట్లుండ నొకతరి రాయలు పట్టపుదేవితో సంభాషింపుచు దన భోగకాంత నామెతో సరిగాబోల్చి యేదో ప్రశంసించెను. అందుల కాయమ రోషమూని, 'తెచ్చినది గజపతివారి కుమార్తె కాదు. భోగకాంతయెకదా' అని నిరసనభావము సూచించెను. అది రాజు గ్రహించి పౌరుషావేశమునొంది 'గజపతి పుత్రికను దేజాలనా ? తెచ్చెదనుగాక' యని ప్రతిజ్ఞ బలికి మంత్రియగు సాళువతిమ్మరసును బిలిపించి 'పూర్వ దిగ్విజయయాత్రకుం బోదలంచితిమి. ముహూర్తము నిశ్చయించి సేనల రావింపు' మనెను...సుముహూర్తమని రాజున కెటిగించి సేనల గూర్చి తాను సేనానియై దండు వెడలించెను."[2]

పైనుదాహరింపబడిన కథలు మూటిలో మొదటిది ఎంతమాత్రము విశ్వాసపాత్రము గాదు. ఈ కథ ననుసరించి కృష్ణదేవరాయల రాజధాని పెనుగొండ, గజపతిరాజధాని వినుకొండ; మఱియు నతడు గృష్ణదేవరాయలకు గప్పముగట్టు సామంతరాజు ; అతని కుమార్తె పేరు వరదరాజమ్మ; ఆమె కంభము చెఱుపు ద్రవ్వించినది ; తుళ్ళూయ నియామెకు మూఱుపేరు. తుళ్ళూపంచక మను శ్లోకపంచకమువ్రాసి కృష్ణరాయల కంపినది. ఇందొక్కటియు నిజముగాదు. కృష్ణదేవరాయల రాజధాని విజయనగరముగాని పెనుగొండకాదు ; వినుకొండ గజపతి సామ్రాజ్యములోని దుర్గమేయైనను అది అతని రాజధాని కాదు ; మఱియు గృష్ణరాయలకు గజపతి యరిగాపు కాడు ; గజపతి కుమార్తె పేరు వరదరాజమ్మకాదు ; వరదరాజమ్మ యను పేరుగల రాణి కృష్ణరాయలకు లేదు; వరదరాజమ్మ యచ్యుతదేవరాయల పట్ట మహిషి. ఆమెకుగాని, యప్పటి విజయనగరాంతఃపురస్త్రీలయం దెవ్వరికిగాని తుళ్ళూయను మాఱుపేరుండెనని తలంచుట కెట్టి యాధారమును గానరాదు. తుళ్ళూపంచక శ్లోకములు తుళ్ళూ వ్రాసినవికావు ; ప్రాచీన అలంకార గ్రంథములనుండి కూర్చిన శ్లోకములు. కావున నీ కథ సత్యమైనది కాదు ; కల్పన. చరిత్ర రచనకిది యుపయోగించదు.

రెండవకథ చాలవఱకు సత్యమైనదే. కృష్ణదేవరాయలచే బరాభూతుడైన యుత్కళభూపాలుడు ప్రతాపరుద్రగజపతి. పరాజయమందినపిమ్మట నతడు సంధి గోరినది వాస్తవమే. ఈ యంశములు సమకాలికాంధ్రగ్రంథములందును, న్యూనిజుచరిత్రయందును బేర్కొనబడియున్నవి.[3] గజపతికుమార్తె వివాహవిషయమునుగూర్చి న్యూనిజిట్లు వ్రాసియున్నాడు :

"అతని (వీరభద్రుని) తండ్రి (ప్రతాపరుద్రగజపతి) తన కుమారుని మరణవార్తనువిని, యతని మరణానంతరము కృష్ణరాయల చెఱయందింకను

---

1. చూ. గురుజాడ శ్రీరామమూర్తి 'కవిజీవితములు' పుటలు. ౫౪౬–౫౫౭.

2. కొండవీటి దండకవిలె. చూ. మద్దులపల్లి గురుబ్రహ్మశర్మ: కొండవీటి సామ్రాజ్యము, పుటలు: ౯౨–౯౭.

3. *Sources. p.* 145.

బంధీకృతురాలైన దన భార్య చెఱను వదలించుటకు 'దా నేమి చేయవలయునో తెల్పవలయు'ననిసాళ్వ తిమ్మయ కుత్తరము వ్రాసెను ; దానికతడు 'మీ పుత్రికను మా రాజుగారికిచ్చి యు ద్వా హ ము నేయునట్లేర్పాటు జేసితిరేని, తరువాత మీ సతిని విడిచిపెట్టి మీ రాష్ట్రమును మీకు మరల నిచ్చివేయుదుము' అని జవాబు వ్రాసెను. ఈ సలహానతడు (గజపతి) అంగీకరించి, రాయలకు దన కూతునిచ్చి వివాహము సేయుటకు దగిన యేర్పాటులను గావించుటకు దన రాయభారులను విజయనగరమున కంపెను. కృష్ణరాయల కీ వివాహమువలన సంతుష్టి కలిగినది. ఉత్కళేశ్వరునికి గృష్ణరాయలయభి ప్రాయము దెలియవచ్చినంతటనే యతడు దన కుమార్తెను రాయలకడ కంపెను. ఆమెరాకతో వారిరువురికి మైత్రి గల్గినది... అంతట గృష్ణరాయ లుత్కళరాజుతో సంధిజేసికొనియాతని కుమార్తెను బెండాడెను.''[4]

ఈ వివాహప్రస్తావన యల్లసాని పెద్దనామాత్యుని చాటువులందు గలదు :—

'ఘనతరనిర్భరగండపెండెర మిచ్చి కూతు రాయల కొడగూర్చునాడు' అను సీ స పా ద మీ వివాహము నుద్దేశించి చెప్పినదే. మఱియు నాదిండ్ల గోపమంత్రి తన ప్రబోధచంద్రోదయవ్యాఖ్యయం దిట్టి వివాహవిషయమును బ్రస్తావించియున్నాడు :

'ప్రతాపరుద్రస్య గజేశ్వరస్య
పుత్రీం పవిత్రీకృతభూతధాత్రీం,
ప్రత్యగ్రహీ ద్యః ప్రకటప్రతాపో
భద్రాం సుభద్రామివ పాండవేయః'[5]

అర్వాచీనగ్రంథములగు విజయనగర సామ్రాజ్య రాయవాచక కృష్ణరాయవిజయము లలో గూడ నీ పెండ్లి విషయము గలదు.[6] కావున పూర్వోక్తకథయందలి వృత్తాంత మింతవఱకు సత్యమనుటకు సందేహము లేదు ; కాని పునస్సంధానము నాటి రాత్రి కృష్ణరాయల నామె పొడిచి చంపబ్రయత్న పడినట్లుగాని, కృత్రిమ ప్రతిమమూలమున దిమ్మరు సాతనికి జావు తప్పించి యవ్వల నా సతీపతులకు సఖ్యము గల్పించినట్లుగాని తెలుపు సాధనాంతరము లెవ్వియు గానరావు ; న్యూనిజు గాని, రాయవాచకకృష్ణరాయవిజయ రచయితలు గాని ఈ విషయము నెఱుగరు. కావున నిదియంతయు దర్వాతివారి కల్పన యని తోచుచున్నది. మఱియు నీకథయందు గజపతికుమార్తె పేరు తిరుమలాంబ యని కలదు. ఇదితప్పు. కృష్ణదేవరాయల పెద్దభార్య పేరు తిరుమలాంబయె ; కాని ఆమె గజపతికుమార్తె కాదు. 'భద్రాం సుభద్రామివ పాండవేయః' అను నాదిండ్ల గోపమంత్రి మాటల నాధారముజేసికొని కొందఱామెపేరు 'భద్ర'యని యభిప్రాయపడుచున్నారు. బలరామకృష్ణులతో పాటు సుభద్రయు గజపతుల కిష్టదైవమే యగుట వలన నొకవేళ నామె కాపేరు తలిదండ్రులు పెట్టి యుండవచ్చును ; కాని నిశ్చయమని తలచుటకు వీలులేదు. ఏలనగా నిచట 'భద్రాం' అను మాటను వ్యక్త్యాత్మకనామధేయముగ గాక 'సుభద్రాం' అను మాటకు విశేషణముగ నన్వయము జేసికొనవచ్చును.

రాయవాచకమునందు గజపతికుమార్తె పేరు 'జగన్మోహిని' యని చెప్పియున్నది. 'గనక గజపతి వారు తమ కుమార్తెఅయిన జగన్మోహిని అనేకన్యకను దారపోసి యిచ్చే సమయాన,' అని.[7] కుమారధూర్జటి తన కృష్ణరాయవిజయమును రాయవాచకము ననుసరించి రచియించినను, గజపతి కుమార్తె పేరు జగన్మోహినియని చెప్పలేదు ; తుఖ్కయని వక్కాణించినాడు.

''అమ్మ కర్ణాటసింహాసనాధ్యు డగుచు
జెలగు శ్రీకృష్ణరాయల జెట్టవట్టి
మాదృశాశ్రితజనులు నీ మహిమ నుతులు
సేయ వర్ధిల్లుమని పల్కె జెలువుమిగుల.

4. *Nuniz (Sewell : Forgotten Empire.) p.* 320
5. *Sources p.* 145.
6. కాని, న్యూనిజు చెప్పునట్లు విజయనగరమందు కాక గజపతి రాజధానియగు కటకమునందే వివాహమునడచిన ట్లీ గ్రంథములందు కలదు. సమకాలికుడగు న్యూనిజువార్తయే విశ్వాసపాత్ర మని తలచెదను.
7. రాయవాచకము, పుట. ౧౦౯.

అల తుఖ్మారమణీమణి
జలజాస్యలు వెంటగొల్వ జనకుని యాజ్ఞన్
వెలయగ నంతఃపురికిన్
విలసితగతి నరిగె నపుడు వేడుక మీఱన్.''8

క్రీ.శ. ౧౫౨౫వ సంవత్సరముననో, యించుక తరువాతనో రచియింపబడిన విజయనగరసామ్రాజ్యమున కృష్ణదేవరాయలు 'గజపతిమీదికి దండు యెత్తి తర్లిపోయి గజపతికుమార్తె లక్ష్మీదేవమ్మ వారిని హవాలా చేసుకొని, విజయనగరమునకు మరలివచ్చినట్లు చెప్పియున్నది.9 ఈ గ్రంథముల సాక్ష్యమునుబట్టి గజపతి కుమార్తె వాస్తవనామ మెద్దియో తెలియరాకపోయినను తిరుమలాంబ మాత్రము గాదని విస్పష్టమగుచున్నది. కృష్ణరాయలు పెండ్లాడిన గజపతికుమార్తెయొక్క వాస్తవనామధేయము లక్ష్మీదేవి యగునేమో యను సంశయము గల్గుచున్నది. ఆముక్తమాల్యద పీఠిక యందలి,

''కూరిమి కృష్ణరాయనృప
కుంజరు జేరె గళింగరాజ్య ల
క్ష్మీరమణీలలామ నిను
మిన్నులుముట్టిన మోహనాలతో
గారణమట్ల లక్ష్మి గసు
గందని వేడుక గృష్ణరాయనిం
జేరునకాక, వావినెడ
జెందునె సోదరుండైన రుద్రున్.''

అను పద్యములోని 'లక్ష్మికసుగందని వేడుక గృష్ణరాయనిం జేరునకాక' అను వాక్యమున రాయలు పెండ్లాడిన గజపతికుమార్తెపేరు లక్ష్మీదేవి యని సూచన కలదనితలచెదను. కాని ఈయూహ నిర్బాధకముగాదు. 'వావినెడ సోదరుండైన రుద్రునిన్' అను మాటలవలన లక్ష్మికి సోదరుడు రుద్రుడని విదితమగుచున్నది. వాస్తవముగ కృష్ణరాయలుద్వాహము జేసికొన్న గజపతికూతురి పేరు లక్ష్మియేయైనచో 'రుద్రు'డనుమాటకు వాఖ్యాత లందరివలె 'ప్రతాపరుద్రు' డని యర్థము జెప్పక 'వీరభద్రు' డని చెప్పవలెను. ఈ సందర్భమున గమనింపవలసిన ముఖ్యవిషయమొకటి కలదు. కృష్ణరాయల దండయాత్రకు బూర్వమే 'కళింగరాజ్యలక్ష్మీరమణీలలామ' ప్రతాపరుద్రగజపతిని గూడియుండెను. వ్యాఖ్యాతలు జెప్పునట్లు 'రుద్రుడు' ప్రతాపరుద్రుడగునేని యామె యప్పటికే వావిసెడనాతనిగూడి చిరకాలము భోగించు చుండెను. ఇకనప్పుడు వావి సెడనీయక కృష్ణరాయనిగూడెనను టయందేమి స్వారస్యముగలదు ; వీరభద్రుడప్పటికింకను రాజు గాలేదు? ప్రతాపరుద్రుని యనంతరము రాజ్యమతనికి జెందవలసియుండెను ; కాని రాజ్యమునతనికి జెందనీయక కృష్ణరాయలు జయించెను. తత్కారణమున లక్ష్మి వావిసెడనీక కృష్ణరాయని గూడినది. కావున పద్యములోని 'రుద్ర' శబ్దమునకు 'వీరభద్ర' అని యర్థము జెప్పుకొనుట యుక్తమని తలచెదను.

ఇక మిగిలియుండునది గాండ్లసంగకథ. సంగపేరు వినుకొండ దండకవిలె యందుతప్ప మఱి యెచ్చటను గానరాదు ; కాని కృష్ణరాయలకు ప్రియురాలు భోగకాంత యొక్కతె యుండెనని రుజువు సేయు ప్రబలమైనవి సమకాలికాధారములు గలవు. ఆకాలమున విజయనగరమునకు వచ్చి యుండిన పోర్చుగీసువర్తకుడగు దోమింగో పయసు రాయల భార్యల వృత్తాంతము నిట్లు వర్ణించి యున్నాడు :—

''ఈ రాజునకు ధర్మపత్నులు పన్నిద్దఱు గలరు ; అందు ముఖ్యులు ముగ్గురు.....ముఖ్యభార్యలయందొక్కతె యుత్కలరాజపుత్రిక ; మఱి యొక్కతె యీరాజుసామంతులలో నొక్కడగు శ్రీరంగపట్టణ ప్రభువుకుమారిత ; ఇంకొక భార్య వేశ్య ; రాజ్యమునకు రాకముందాతని కామెయుంపుడుగత్తెగ నుండినది ; రాజైనపిమ్మట దన్ను భార్యగ జేకొందునని యతనిచే వాగ్దానము గొన్నది ; ఈరీతిగ వేశ్యయొక్కతె రాజమహిషి యగుట సంభవించినది. ఆమెయందు గల యనురాగాతిశయముచే నత డామె పేర నొక పట్టణము గట్టించెను.''10

8. కృ. రా. విజయము. ౪ : ౨౪—౫.
9. *Further Sources, II. No.* 123.
10. *Sewell : Forgotten Empire. pp.* 247-8.

న్యూనిజుచరిత్రయం దీ భోగ కాంతవిషయ మింకను విపులముగ వర్ణింపబడియున్నది:

" ఈ కృష్ణరాయలు పసివాడుగ విజయ నగరమున బెరుగుచుండిన కాలమున జిన్నాదేవి యను వేశ్యతో నతనికిదగులాటము గలిగి యామె యందత్యంతానురక్తుడై యుండెను; ఆమెయెడ నతనికి గల ప్రేమాతిశయముచే దానే రాజగు పతమున నామెను దప్పక బెండ్లిచేసికొందునని పెక్కుమారులు వాగ్దానము జేసెను. పరియాచక మున కట్లతడు జెప్పినను దరువాత నది నిజమాయె నని చరిత్రవలన దెలియవచ్చుచున్నది. ఎట్లన, సింహాసనము నధిష్ఠించినపిమ్మట పసితనమం దాసక్తి గొనియుండిన వ్యాపారములన్నిటిని నతడు విడ నాడినను, ఆమెమీదివలపును మఱవజాల డాయెను; కావున రహస్యముగ రాజమందిరమును విడిచి యామెయింటికి బోవువాడు. ఒకరాత్రి యా రహస్యమును అతని మంత్రియగు సాలువతిమ్మయ కనుగొనెను; ఆ భోగకాంత యిలు సేరువఱకును నతని వెంబడించి పోయి, యతని కది తగదని బుద్ధి చెప్పి మరల రాజమందిరమునకు గొనిపోయెను. అపుడు రాజు దానా కాంతపై నెంత గాఢముగ మరులుగొనియున్నదియు నతనికి దెలిపి, తా నామెను వివాహముజేసికొందునని వాగ్దానము జేసితి ననియు, దానిచ్చిన మాట నెట్లైన నెఱవేర్ప నిశ్చయించితిననియు జెప్పెను. అంతట మంత్రి రాజుయొక్క పట్టుదలను గాంచి యతని యిష్ట ప్రకారము నడచుకొన నీయకొని యేలినవారి కపనింద రానీయక దా నాకార్యమును నిర్వ హింతునని పల్కెను. అట్లు చేయుట కతడు రాయలకొఱకు, నరసింగదేశరాజకుటుంబమునకు జెందిన సౌందర్యవతియగు కన్య నొక్కతెను వెదకి తెచ్చి పెండ్లిచేసి, వివాహకార్యములన్నియు ముగిసినపిమ్మట, భోగకాంతను దోడ్కొనివచ్చి యామెతోగూడ నొక్క సౌధమునందే కావురము సేర్చి, యా సౌధముపై నున్నతమైన గోపురమును గట్టించి యందా భోగకాంతకు నివాస మేర్పఱ చెను. తరువాత.....కృష్ణరాయలు నలుగురు భార్యలను బెండ్లాడెను; కాని వారందఱికంటెను నతని కీమెపై మక్కువ యెక్కువ. "[11]

సమకాలిక పోర్చుగీసురచనలవలన గాండ్ల సంగకథ చాలవరకు సత్యమైనదని తేలుచున్నది. రాయలు భోగకాంతను మోహించుట వాస్తవము; రాజమందిరమునకు దెచ్చి యామె కచట నివాసమేర్పఱచుట వాస్తవము. అటు తరువాతి విషయము సత్యమని వేఱుగ జెప్పవలసిన యావశ్యకత లేదుకదా. కాని యొక భేదము గలదు. కథయందలి భోగకాంత పేరు సంగ; పోర్చుగీసు రచనలలోని భోగకాంత పేరు చిన్నాదేవి. ఈ భేదమునకు సమన్వయ మెట్లు? రాయలను బెండ్లాడుటకు బూర్వము ఆమె పేరు సంగయై యుండవచ్చును; రాజమహిషియైన పిమ్మట చిన్నాదేవి యని పేరును మార్చుకొనియుండవచ్చును. ఇట్టి మార్పు లింకను జరుగుచున్నవి; కావున సంగయే చిన్నాదేవి కావచ్చును.

సంగకథయందు గమనింపదగిన విశేష మొకటి కలదు. కృష్ణరాయలు సంగను బ్రళంసించినందులకు గినిసి పట్టమహిషి, 'తెచ్చినది గజపతి వారి కుమార్తెకాదు. భోగకాంతయేకదా' యని యెత్తిపొడిచినదట. గజపతికుమార్తె యననేల? మఱియొక రాజపుత్రికను బేర్కొనరాదా? గజపతి కూతును బేర్కొనుటకు గారణము లేకపోలేదు. గజపతి విజయనగరరాయలకు బద్ధశత్రువు; బల సంపదలయందు సమానుడు; రాయరాజ్యములోని భాగములను జయించి స్వాధీనపఱచుకొన్నవాడు; నాల్గైదుతరముల విజయనగరప్రభువు లాతనితో బోటీయు విజయులు కాజాలరైరి. ఇంతకు మించిన విశేష మింకొకటి కలదు. ఆ పట్టమహిషి నరసింగ దేశాధీశ్వరుల యింటి యాడబడుచు; పూర్వము గజపతిపురుషోత్తముడు దక్షిణదిగ్విజయార్థము వచ్చియుండినప్పుడు వారి యింటి యాడబడుచు నొక్కతెను—సాళువనరసింగరాయల కుమార్తెనే ఏమె—బలాత్కారముగ గొనిపోయి వివాహ మాడియుండెను. తనపుట్టింటివారి దగు వ్యక్తిసింహాసనముపై గూర్చునియుండు కృష్ణరాయలు

---

11. *Nuniz, See Sewell Forgotten Empire, pp.* 362-3.

గజపతికుమార్తెను బలాత్కారముగ దెచ్చి పెండ్లాడి పాతసూడును దీర్చుకొన్న మురియ వచ్చును ; కాని భోగకాంతను—వెల కమ్ముడు బోవుదానిని—దెచ్చినందున కింతగ నుప్పొంగవల యునా ? యని యామె భావము. ఆ మాటలకు నొచ్చి కృష్ణరాయలు కళింగదిగ్విజయార్థము వెడలుట సంగతమే.

పైనుదాహరించిన కథలవల్లను, సమకాలిక పోర్చుగీసు రచనలవల్లను కృష్ణరాయలకు తిరుమల దేవి, చిన్నాదేవు లనుభార్య లిరువు రుండిరని తెల్ల మగుచున్నది. మఱియు గళింగ దిగ్విజయయాత్ర ప్రారంభమగునప్పటికి కృష్ణరాయలు గృతిగొన్న యాంధ్రప్రబంధము లీ యంశమును స్థిరపఱుచు చున్నవి :

మనుచరిత్రయందు—

" తిరుమలదేవీచరణో
దరలాక్షాకల్పకల్పితస్థలకమల
స్ఫురదిందీవరబంధుర
హరిహయమణిమలయకూటహర్మ్యవిహారీ. "12

పారిజాతాపహరణమునందు—

" శ్రీ వేంకటగిరివల్లభ
సేవాపరతంత్రహృదయ చిన్నమదేవీ
జీవితనాయకకవితా
ప్రావీణ్యఫణీశ కృష్ణరాయమహీశా. "13

అని తిరుమలదేవీ చిన్నాదేవులు వేర్కొన బడియున్నారు. కృష్ణరాయల కపఖ్యాతి రానీయక సాళువతిమ్మయ నరసింగనృపాలుర యింట బుట్టిన కన్యకను—తిరుమలదేవిని—దెచ్చి యతని కుద్వా హము గావించినను 'నతడు చిన్నాదేవినే తన పట్ట మహిషిగ గ్రహించినట్లున్నది. ఈ విషయ మీక్రింది మనుచరిత్రయందలి పద్యమువల్లను, శాసనముల వల్లను దెల్లమగుచున్నది.

" ఆవిభు ననంతరంబ ధ
రావలయము దాల్చె గృష్ణరాయడు చిన్నా
దేవియు శుభమతి తిరుమల
దేవియునుఁ దనకు గూర్చు దేవేరులుగాన్. "14

ఇందు పెద్దన మొదట చిన్నాదేవిని, యటు పెనుక తిరుమలదేవిని బేర్కొనియున్నాడు ; ఇందు వలన జిన్నాదేవియే పట్టమహిషి యని యూహా పోడముచున్నది. శాసనములందుకూడ నిట్లే మొదట చిన్నాదేవియు దరువాత తిరుమలదేవియు, బేర్కొనబడియున్నారు.

" శ్రీకృష్ణరాయమహారాయలు విజయ నగరాన నుండి పూర్వదిగ్విజయయాత్రకు విచ్చేసి.....కృష్ణవేణ్యాతీరమందు అమరేశ్వరదేవుని సన్నిధిని తులా పురుషమహాదానమును శాయ నవధరించి తమ దేవుళ్లు చిన్నాజిదేవమ్మ తిరుమల దేవమ్మగారిచేతను మహాదానాలు సేయించ నవధరించి..... "15

" శ్రీకృష్ణదేవమహారాయలు విజయ నగరాన నుండి పూర్వదిగ్విజయయాత్రకు విచ్చేసి.....కృష్ణవేణ్యాతీరమందు అమరేశ్వరదేవుని సన్నిధిని తులాపురుషమహాదానంశేయ నవధరించి తమదేవులు చిన్నాదేవమ్మచేతను రత్నధేను మహా దానమున్ను తిరుమలదేవి అమ్మవారిచేతను సప్త సాగర మహాదానమున్ను నేయించ నవధరించి.... "16

ఈ శాసనవాక్యములవల్ల చిన్నాదేవియే కృష్ణదేవరాయల పట్టపురాణి యను నూహ బల పడుచున్నది ; కాని కాలక్రమమున చిన్నాదేవి గతించినది. మనుచరిత్ర పారిజాతాపహరణములు

---

12. మను. ౩ : ౧౪౩. వావిళ్లవారి ముద్రిత ప్రతియందు 'వలయకూట'యని యున్నది. వ్యాఖ్యాత "వలయ=గుండ్రని, కూటహర్మ్య=యంత్రాల మేడ యందు, విహారీ=విహరించువాడా"యని యర్థముద్రాసి యున్నాడు. 'మలయకూట'మని యుండవలయును. ఆ హర్మ్యముపేరు 'మలయకూటము.' నందితిమ్మన గూడ ఈ సౌధమును బేర్కొనియున్నాడు. 'మలయ కూట ప్రాసాదనివేశ' పారి. ౨ : ౧.

13. పారి : ౪ : ౧.

14. మను. ౧ : ౩౩.

15. *Tirupati Devasthanam Inscriptions. Vol. III., No.* 76.

16. *South Indian Inscriptions, Vol. VI. No.* 248

రెంటియందు నామె బేరొక్కనబడియున్నను, ఆముక్తమాల్యదయం దామె ప్రస్తావము గాన రాదు. అప్పటి కామె స్వర్గవాసినియైనది. ఆవల తిరుమలదేవి పట్టపురాణి యాయె. ఆముక్త మాల్యదయందలి—

"ఆవిభుననంతరంబ ధ
రావలయము బూని తీవు రహిమై దిరుమ
ల్దేవియును నన్న పూర్ణా
దేవియు గమలాబ్జముఖులు దేవేరులుగాన్. "17

అను పద్యమువలన విదితమగుచున్నది. ఇది మనుచరిత్రనుండి గైకొన్న పద్యమే. రచయిత పెద్దనయే; సందర్భము ననుసరించి మార్చి వ్రాసినాడు. చిన్నాదేవి గతించిపోయినది. అందుచే నామెమాట యెత్తలేదు. ఇందు తిరుమలదేవిని మొదట బేరొక్కనియుండుటవలన నామె యప్పుడు పట్టపురాణి యాయెనని యూహకలుగుచున్నది. తిరుమలదేవితోగూడ బేరొక్కనబడియుండు నన్న పూర్ణాదేవీకమలాబ్జముఖుల వృత్తాంతము దెలియదు. న్యూనిజు చెప్పిన రాయల నలుగురు ధర్మపత్నులలో వీరిద్దఱనుటకు సంశయ మంద బనిలేదు. వీరిద్దఱిలో గజపతి కుమార్తె యొక్కర్తుక. ఆమె యెవ్వరు? అన్నపూర్ణాదేవియా, లేక కమలాబ్జముఖియా? నిర్ధారించి చెప్పుటకు వీలులేదు; కాని విజయనగరసామ్రాజ్యమున నామెపేరు లక్ష్మీదేవి యని యుండుటచే గమలాబ్జముఖయే గజపతికుమార్తె కావలయును. కృష్ణరాయవిజయ మందలి 'తుఖ్ఖా' వ్రాయసగాండ్రు ప్రసాదించిన పేరని తలచెదను. 'లఖ్ఖా' (లక్ష్మి) యనునది సరియైన రూపమైయుండవచ్చును. అగునేని కృష్ణరాయలు బెండ్లాడిన గజపతికుమార్తె పేరు 'లక్ష్మీదేవి' యని యంగీకరింపవచ్చును.

రాయల కళింగ క్షేత్రయాత్ర

౨

గజపతి సామాన్యశత్రువు గాడు. రాష్ట్రకోశబల సంపదలం దతని కధికులగు రాజు లప్పటి భరతఖండమున నెందరో లేరు. తనతోపాటు దక్షిణభారతావని పాలించుచుండిన యశ్వపతినరపతులకు అతడుసమానస్కంధుడు. రాష్ట్రవైశాల్యమునగాని, కలిమి బలములలోగాని, శక్తిసామర్థ్యములందేమి వారి కెంతమాత్రమును దీసిపోయెడివాడు కాడు. ఈ యంశము ఆముక్తమాల్యదలోని ఈక్రింది పద్యమునందు సూచింపబడియున్నది :

"రయమున వృష్టికి యొదిగి
రచ్చలపై విధియింతు రుగ్రతన్
హయపతిమీద దంతిపతి
నాతనిపై నృపతిన్ గజాదిని
ర్ణయముల మొత్తులాడుదురు
గ్రమబ్రోకయించుక విప్ప విచ్చు మొ
గ్గయి మఱిపాసిపోదురు స
మస్తదిశాగతులైన యధ్వగుల్." (౪-౧౩)

ఈపద్యముపై వాఖ్యాన మనదగిన చర్చ యొకటి రాయవాచకమున గలదు. ఇందు విజాపుర రాజసౌధమున కృష్ణరాయలు విజాపురముపై నెత్తిరాబోవుచున్నాడను వర్తమానము తెలియవచ్చినంతటనె యచట గూడియుండిన నానా సంస్థానముల స్థానాపతుల మధ్యజరిగిన చర్చ వర్ణింపబడియున్నది.

"దాదిమహాలుముందు ముందరదివాణంలో ముందర ఆయావజీర్లు దొండోపండితులు మొదలయినవారు నియోగులు వారివద్ద కుతసనమలక వారి హేజీబులు ముకుందపండితులు మొదలైనవారు కూర్చుండి ఆలోచన జేసినది :—

'అశ్వపతి గజపతినరపతులలో నరపతిసింహాసనమే అధికము. కడమ రెండుసింహాసనములున్నూ

---

17. ఆముక్త. ౧:౩౩.

వారి వెనుకను' అని పిన్న పెద్దలు ఆలోచనగా చెప్పినందులకు గోలకొండవారి ముద్దాపండితులు, సింహాసనాలంచె మూడున్ను సరి. ఇందులో సింహాసనాధిక్యములు కలవా ?' అని ఆగ్రహపడగా, 'నిజాంరవుతులు మా వుత్తులు లశికిరీతనాన సరికదా; ద్రవ్యసామాగ్రియందు దుర్గములయందు కొదవ; అట్టిపట్ల అధికమని జెప్పవలసిన కారణమెంది? అన్నందులకు గోలకొండవారి ముద్దాపండితులు వ్యంగ్యోక్తముగా, 'కాకయేమి? మకేమి? యిందులో న్యూనాధిక్యములు యెంచ అవకాశమేమి వున్నది? వొకరి కొకరు ఏకవాక్యముగా ఆడుకొన్నందులకు, బాహుబలేంద్రునివారి బ్రంహ్మపంత్తులు వారలతోను, యీ మూడు సింహాసనములనగా బ్రంహ్మవిష్ణుమహేశ్వరుల అంశలుగా వుండును. అందున తారతమ్యములు యేరీతో ఆరీతువలెనే అశ్వపతి గుర్రాలకున్ను, గజపతియేనుగులకున్ను నరపతికర్నాటకసింహ్మాసనాసకున్ను ; గనక నరపతియే హెచ్చు. అది యేలాగంటేను—భగవద్వాక్యం, 'నరాణాంచ నరాధిపం'అనే వచనము వల్లనున్ను : ఆ రాజ్యములోను దేవాదాయం బ్రంహ్మదాయం పుణ్యతీర్థములు నదులు పుష్కరుణులు గల్గివున్నది. ఇదిగాక విష్ణువు ప్రత్యక్షమై వెంకటాచలానవున్నారు ; ఆ రాజ్యములో వుండే స్వామికి కడమ రాజ్యములో పెద్దలు బుద్ధిశాలులు బ్రాంహ్మలు యతీశ్వరులు మఠాధిపతులు రాజులు మొదలైనవార లందరున్ను కానుక కప్పములు కొంచుపోయి స్వామికి సమర్పించి వస్తావున్నారు; గనక కర్నాటకసింహ్మాసనాధిపతులు పుణ్యశ్లోకులు. ఆ పిమ్మట గజపతిసింహ్మాసనమంద్దు జగన్నాయకులు వేంచేసియున్నారు ; గనక రెండోపర్యాయం. అశ్వపతివారున్ను గంగాతీరాన విశ్వనాథులరాజ్యములో వున్నారు; వారి తెగలవారి మొదులసాహు, కుతపనమలక, నిజాంశాహుయీమూడుతెగలవారున్ను కర్నాటకం సరుదున వున్నారు. మీరు కర్నాటకాధిపతులతో సరియన నగునె ? అని మధ్యస్థభావముగా అన్నందులకు దొండ్డోపండితులు ముద్దోపండితులు దాదోపండితులున్ను దొడ్డనియ్యోగులుగనక తెలుసుకొని తమ దొరలు మద్యపానులు ; దేవబ్రాహ్మణ విశ్వాసములు లేవు, మ్లేచ్ఛులు, గోహింసకులు, వారిని గొలిచినవారము ; గనక దూరదృష్టి విచారించ అవకాశమంత లేక అహంకారగుణమువల్ల ఆనవలసిన దంటిమి. బ్రంహ్మపంతులవారు పలకరించినది యథార్థమని యెంచినవారై ఆ తర్వాత మంత్రాలోచనగా వార్తలాడినవి."[1]

పైనుదాహరింపబడిన యాముక్తమాల్యద మున్నగు గ్రంథముల సాక్ష్యములవలన కృష్ణరాయల కాలమున గజపతికలిమిబలమును గూర్చి జన సామాన్య మెట్టి యభిప్రాయమును గలిగియుండెనో తెలియవచ్చుచున్నది. అంతటి ప్రబలునితో బోఅ నిశ్చయించినపు డతని నోడించి జయమును బొందుటకు వలసిన ప్రయత్నము సేయుట యుక్తము. విజయనగరసంస్థానము సేనాబలమున దక్కువయైనదికాదు. 'గజపతిపై దండువెడల నిశ్చయించి యతడు (కృష్ణదేవరాయలు) ముప్పదినాలుగువేల కాల్బలమును, ఎనిమిదివందల యేనుగులును గల సైన్యమును సమకూర్చి, యాసేనతో గూడ ఉదయగిరిని జేరె'నని న్యూనిజు వ్రాసియున్నాడు.[2] కాని యర్వాచీనగ్రంథములగు రాయవాచకమునందు రాయరాణువసంఖ్య యెనిమిదిలక్షలను మించిపోయినది. గణుతిప్రకారము రాయరాణువయందు 'కైజీతంగుఱ్ఱాలు పండ్రెండువేలున్ను', అమరనాయకంగుఱ్ఱాలుయిరువైనాలుగువేలున్ను, కైజీతం యేనుగులు యాభైఘట్టాలును అమరపు యేనుగులు నూటయిరువైఘట్టాలును (౧౭౦౦,

---

1. రాయ. పుటలు ౪౭–౪౯.

2. *Sewell, F.E. p.* 316.

ఘట్ట మనగా ౧౦) ; కైజీతం రాణువనూతనం సహాగా మూడులక్షలున్ను, అమరంవగను అయిదు లక్షలబలమున్ను' ఉండెనని కలదు. ఈ మహాసైన్య మును వీరితోగూడ ఆరగపదునెనిమిదికంపణాల బోయదొరలను గదల్చుకొని యుమ్మత్తూరిపై నడచి యా రాజ్యమును జయించి తురకలమీదను గజపతి మీదను నెత్తిపోయెనని చెప్పియున్నది.[3]

సైన్యమంతయు రాజధానియందు గూడిన పిమ్మట దండువెడలుటకొఱకు మంచి ముహూర్త మును నిశ్చయించుటకు జోస్యులను రప్పించెనట; వారు నిశ్చయించిన లగ్నమున వెలిగుడారము వేయించి సకల సైన్యములతోగూడ బయలువెడలెనట.

"దండ్లుయాత్రలకు లగ్నం వుంచ్చేటందుకు జ్యోస్యులను పిలిపించ్చి ముహూర్తం వుంచమని ఆనతియ్యగా ఆతీరుననే అప్పాజిగారు జ్యోస్యుల రప్పించ్చి సుదినం సుముహూర్తం సులగ్నం కూడిన వేళ వెలిగుడారం వేశేటట్టుగానున్ను పాళ్యంకదలి పొయ్యేటందులకున్ను ప్రవేశానకున్ను లగ్నం నిశ్చ యించ్చుక రాయలవారికి యెరుకశేయగా, ఆతీరు ననే వెలిగుడారం వేయించ్చమని ఆనతిచ్చినారు... సకల సన్నాహముతోడట్టు బయలుమెరశి వెలిగుడా రమునకు వచ్చినిలిచి దొరమన్నీలనున్ను, రవుతుల మావతులనున్ను, నియోగం వైకంవార్లనున్ను, మునుపటివారు, వెనుకటివారు, యెడవంక్కంవార లనున్ను, అందరినిన్ని రప్పించుక వారివార్లతో

---

3. రాయ. పుట ౫౩, ౮౪, ౮౬. కాని రాయ వాచకమునందే మఱియొకచోట రాయరాణువసంఖ్య కొంచెము వ్యత్యాసముగ గానవచ్చుచున్నది. ౩౪ వ పుటయందు గుఱ్ఱములు ౨౪౦౦౦, ఏనుగులు ౧౫౦౦, బంట్లు ౨,౦౦,౦౦౦, అమరనాయకంగుర్రాలు యేనుగు లును పండ్రెండువేలున్ను, కాల్బలములు ౨౦౦౦౦౦, (పుట. ౫౦) అని లెక్కింపబడియున్నది. కాని ఇది విశ్వాస్యము గాదని తోచుచున్నది. ఏలనగా, రాయ వాచకమర్వాచీనగ్రంథము; మఱియు రాయవాచక మున కృష్ణరాయలతోగూడ 'అయ్యనమలక, అంకుశ ఖానుండ్డు, రాణాజగదేవు, గని తిమ్మప్పనాయడు, రాచూరిరామనాయడు, పెమసాని రామలింగమ నాయడు, హండేమల్లరావు, బోయిరామప్ప, హరివాణం కొమాళ్ళయిన పదునెనిమిది కప్పణాలవారున్ను, దళ నాయకులు అప్పరపిళ్ళ, కుప్పరపిళ్ళ, సాళువనాయడు, కొమారతిమ్మప్ప, సంగ్గరాజు, చేర్వుప్రధాని, తిప్ప రసు, అయ్యప్పనాయడు, కొటికవిశ్వనాథనాయడు, చెవ్వప్పనాయడు, అక్కప్పనాయడు, కృష్ణప్ప నాయడు, వెలిగోటి యాచమనాయడు, కన్నడ బసవ ప్పనాయడు, సాళువ మేకరాజు, మట్ల అనంతరాజు, తిమరాజు, వీరమరాజు మొదలయినవారున్ను' దండయాత్రకు బయలువెడలినట్లు చెప్పియున్నది. కాని పైబేర్కొన్న దొరలలో అయ్యనమలక, అంకుశ ఖానుడు వీరిరువురు సదాశివరాయల కాలమున నుండిరి. చెవ్వప్పనాయడచ్యుతరాయల కాలమువాడు; వీ రెవ్వరును కృష్ణరాయల కాలమునం దుండి రని నిరూ పించుట కెట్టియాధారమును లేదు. కొటికమువిశ్వ నాథనాయకుడు కృష్ణదేవరాయల కడపటిరాజ్యవర్ష మున నుండినట్లు శాసనాధారము గలదు; కాని తత్పూర్వ మతడు రాయల కొలువున నుండె ననుట సంశయాస్పదము; క్రీ. శ. ౧౫౬౩–౬౪ వఱకు నతడు జీవించియుండుటవలన, కృష్ణరాయలకళింగ జైత్ర యాత్రయందు అతడు పాల్గొనెనని నమ్ముటకు వీలు లేదు. రాణాజగదేవుడు కృష్ణరాయల కాలమున రాయలకొలువునలేడు; గోలకొండసుల్తాను కుల్లికుతుబు శాహుకొలువున నుండెను. జమ్షీదుకుతుబుశాహు మరణమువఱకును నతడు కుతుబుశాహుల నాశ్రయించి యుండెను; ఇబ్రాహింకుతుబుశాహు గోలకొండసింహాస నము నధిష్ఠించినపిమ్మటగాని విజయనగరరాజ్యమును జేరలేదు. సాళువ మేకరాజును, మట్ల అనంతరాజును ఇమ్మడి వేంకటపతిరాయల కాలమున నుండిరి. ఇందు వలన రాయవాచకరచయిత చెప్పిన సైన్యసంఖ్య సమకాలికుడగు న్యూనిజు చెప్పినదానికంటె విశ్వాస్య మని దోచకపోవచ్చును; కాని గజపతివంటి బలాఢ్యుని జయించి యతని యేలుబడిక్రింద నుండిన దుస్సాధ్యస్థల జలగిరిదుర్గములను గైవసము గావించుకొనుటకు న్యూనిజు చెప్పిన బలసంఖ్య చాలదు; మఱియు గజపతి కంటె బలాధికుడుగాని విజాపురసుల్తాను నోడించి రాయచూరు మున్నగు దుర్గములతోగూడ కృష్ణాతుంగ భద్రల మధ్యదేశమును స్వాధీనపఱచుకొనుటకై కృష్ణ దేవరాయలు ౫౫౧ ఏనుగులును ౩౭౬౦౦ గుఱ్ఱములును ౭౦౩౦౦ కాల్బలమును సమకూర్చె నని న్యూనిజు చెప్పియున్నాడు. (*Sewell, F. E. p.* 147,326-328); కావున గజపతిని జయించుటకు కృష్ణరాయలు రాయ వాచకమున వర్ణించినంతటి బహుళసంఖ్యాకమైన సైన్యమును సిద్ధముజేయుట యసంభవము గాదు.

మాటపలుకులు ఆడి మీమిస్తోమములతో ఆయత్త పాటుతో రమ్మని బలవంక్కం అమరనాయకం వార్లతోనున్ను నగరిసంప్రతులవారితోనున్ను నగరి లెఖ్ఖప్రకారనకు యేనుగ, గుర్రాలు, రౌతు రాణువ, గలట్టుపైదళంవారినింన్ని గణితితీసుకొనికర్ణాటకాన గలస్వతంత్రస్వామ్యంకావలిగట్లుగుంపులవారినింన్ని, పాళ్యగాళ్లనున్ను నగరిలెక్కప్రకారానకు అందరినిన్ని రప్పించి పయనంతర్లడా అని కరణీకులతో నుంన్ను రాయసం, కటికం, దినసరి, అవసరం, విని యోగపైకం వార్లతోనున్ను ఆనతిచ్చి.....దండ యాత్రకు జయధ్వనిగా దిక్కులు పిక్కటిల్లేటందుకు భేరితాడనము శేశి డమామిటోకించ్చమని ఉత్తరవు శేశి రౌతులకు మావుత్తులకు అమరనాయకంవార్లను అళ్లుండ్లు, కొనూళ్లకు, రాజులకు, జట్లకు, కమ్మనాయకులకు అందరినిని పయనంజెప్పి రమ్మని కటికాలవారికి వుత్తరువుయిచ్చి తాముంన్ను భోజనంజేసుకొని మూడోనగారా టోకించమని ఆనతిచ్చి గుర్రం యెక్కుకొని బయలువెడలిరి.''[4]

---

4. రాయ.పుటలు ౮౨-౮౪.కృష్ణరాయలనాటి యాంధ్రవాజ్మయమును పాశ్చాత్యపోర్చుగీసుప్రయాణీకుల వృత్తాంతములను బరిశీలించిచూడగా రాయవాచకమున వర్ణింపబడిన ప్రయాణారంభసన్నాహము సరియైన దని తెలియుచున్నది.

యుద్ధయాత్ర బయలుదేరుటకు ముందు కృష్ణరాయలు ఉపశ్రుతిని విని యది విజయసూచక మగుటకు సంతసించి ప్రయాణోన్ముఖు డాయె నని కొండవీటి కైఫీయతునందు గలదు.

''అంతఃపురము వదలి ఆస్థానప్రవేశమై మహాప్రధానులైన సాళ్వతిమ్మప్పగారిని పిలిపించి పూర్వదిగ్విజయయాత్ర వెళ్లవలసినది; గనుక యేతత్ప్రీయత్నములు చేయమని సెలవుయిచ్చి శుభసూచనార్థమై ఆరాత్రి రజకగృహముమీద నఱుతలు చల్లినంతలో ఆ రజకుడు అన్నం తిని తన యింటిపందిటిలో పండుకొని కుషామతిచేతను,

'కొండవీడు మనదేరా కొండపల్లె మనదేరా
కాదని యెవ్వడు వాడుకువచ్చిన కటకముదాకా
మనదేరా'

అని అన్నాడు; గనుక ఆమాట విని రాయల వారితో చెప్పినంతలో అదే శుభసూచన చేసుకొని ప్రధానసేనాపతి సైన్యసమేతముగా పూర్వదిగ్విజయయాత్ర విచ్చేసిరి.

(*Kaifiyat of Kondavidu Mac. Mss.* 15-4-40 *pp.* 18 *f.*)

రానున్న శుభాశుభముల నుపశ్రుతుల మూలమున నూహించి కనుగొనుట రాయలకాలపు ప్రజలకు గరము ప్రియమైన కార్యము. కావున సమకాలిక సాంఘికమర్యాద ననుసరించి కృష్ణదేవరాయలు పైజెప్పినట్లుపశ్రుతిని విని యది శుభసూచక మని గ్రహించి కళింగత్రైతయాత్రకు బయలువెడలియుండవచ్చును. సంగతముకాని దిం దేమియు లేదు; కాని ఈకథయం దెంత సత్యము గలదో నిశ్చయించిచెప్పుటకు వీలులేదు.

కృష్ణదేవరాయలు దన రాజ్యముపై నెత్తివచ్చుటకు ఘనప్రయత్నము సేయుచున్న సంగతి గజపతి కెఱుకపడకపోలేదు. తనరాష్ట్రమును సంరక్షించు కొనుటకతడు దగునేర్పాటులను గావించెను. రాయవాచకమునం దీయేర్పాటులు సంగ్రహముగ వివరింపబడియున్నవి. కృష్ణరాయలు రాజ్యాభిషిక్తుడైన పిమ్మట దమరాజ్యములపై నెత్తిరాదలపెట్టుచున్నాడనియు, దమకందఱికతడు సామాన్యశత్రువగుటవలన దామందఱు నేకమై యతని నెదుర్చుట యుక్తమనియు మూడిండ్లు దక్కనుసుల్తానులును దమస్థానాపతులమూలమున సందేశమంపిరట! గజపతివారందుల కంగీకరించి తదనుగుణముగ నిజరాజ్యసంరక్షణకు దగు నేర్పాటులను గావించిరట.

''గజపతివారు...షోడశపాత్రులతో నున్ను పరస్థలనియోగులతోనున్ను సంభాషణ శేయగా నిజాంశాహువారి నీలాద్రిపంత్తులు వారుంన్ను యెదులశాహుకుతపనమలకవారి స్థానాపతులు అంపించ్చిన కాకితములు :

'' 'కర్ణాటకాధీశ్వరులు కార్యముఖానకు నడిచేవారై చతురంగబలమున్ను జతశేసుక బయలు మెరసి సరుదులకు వచ్చి కనుపించ్చుకొనేవారై వున్నారు; యీవరకు ఉత్తరం దక్షిణందొరల కార్యాలకు హానివృద్ధులకు సహాయంసంపత్తి నడపుదురు. ప్రబలమైన కార్యాలఱితే అందర్నున్ను ఏకగ్రీవమై ఉత్తరం అహుపురంవారి కార్యాలకున్ను నిర్వహింత్తురుగా. యిప్పుడు అంతేశి కార్యాలు యేమి వున్నది? సరదున వుండ్డేవారు, గనుకయితరం గాదుకదా? యెదులశాహున్ను నిజాంశాహున్ను

కుతుపనమలక వారున్ను సరదుస్థలాలు స్థోమళుద్ధిగా యోచనశాయగా పనిలేదు. అందుకు మించిన కార్యాలఱితె అహాముదునగరం పర్యంత్తం వత్తురు' అని ఘనంగా వ్రాశి అంప్పినారు.

'''మనుష్యయత్నమునఅపజయమనియెంచ్చరాదు. కర్నాటకంవారికి జయం నిశ్చయం అఱినప్పటికిన్ని సరదుల మూడుతెగలవారున్న విరిగినట్లైతే మీసీమలన్నిన్ని కోలుబోయి మీకున్ను అవధివచ్చును; కాబట్టిదీర్ఘ యోచనవిచారించుకొని యాదిహెచ్చరికలు గలిగి నడిపించ్చుకోవలెను' అని మంత్రాలోచనగా అన్నందులకు, గజపతివారు—

'''అన్నింటికిన్ని మనపాలిటి జగన్నాయకులు వున్నారు' అని మందలించ్చినందులకు మూడుతెగలవారి నియోగులున్ను, 'మీకు జగన్నాయకులున్ను తమ దొరలకు కర్తరున్ను వున్నారుకా. కర్నాటకంవారు యేరుదాటి రాకుండా మూడుతెగలకలిమిబలములున్ను కృష్ణదాటిరాకుండా పాళ్యం దిగివుండ్డేటట్టు అంపుతున్నారు. మీ తెగ నామజాదులున్ను సరదుస్థలాల బలవంత్తులైయుండేటట్టు కట్టడశేయండా' అని తెలుపగా గజపతివారున్ను 'ఆరీతి అమరకశేశే' మని కొండ్డవీడు, ఉదయగిరి, బెల్లంకొండ్డ, నాగార్జునకొండ్డ, కందుకూరు మొదలైన స్థలాదులకు యాదిహెచ్చరికలు కలిగివుండ్డదగ్గ దనేటట్టుగా నామజాదులు పంపినవారె షోడశపాత్రులతోనున్ను వారి దుర్గాలున్న శీమ భూములయందున్ను యాదిహెచ్చరికలు గలిగివుండ్డమని మంద్దలించ్చగా వారువార్లు సరుదులకున్ను దుర్గాలకున్ను రస్తుసామగ్రీలు అంప్పినారు.''[5]

మూడిండ్ల సుల్తానుల పక్షమున వారి స్థానాపతులు గజపతివారికి నివేదించిన 'కాకితము'లను బట్టి చూడగా కృష్ణరాయలను కృష్ణానదిని దాటి రానీయక యడ్డుపెట్టుటయే వారి ప్రధానోద్దేశమని విశదపడుచున్నది. కావున మూడిండ్లవారేకమై కృష్ణాతీరమున రాయల మార్గము నరికట్ట దమలో దాము నిశ్చయించుకొన్నను గజపతితో నేకీభవింప దలపెట్టలేదు! కాని యతని సహాయము లేక వారి మనోరథము సిద్ధింపదు. ఏలన వారియెడవంకనున్న తెలింగాణతీరాంధ్రరాష్ట్రముల కాత డధిపతి; కావున నతని యౌదాసీన్యము వల్లగాని యజాగ్రతవల్లగాని యాప్రాంతములను సంరక్షింపగల దళములు లేనిచో కృష్ణరాయ లచటి దుర్గముల నాక్రమించుకొని ముంగలనుండియు వామపార్శ్వమునుండియు నేకకాలమున బైగొన వచ్చును. అప్పుడు తమకు జయము గలుగుట సందేహాస్పదము. తత్కారణమున వారికి గజపతి సహాయసానుభూతు లావశ్యకములాయె. ఒక వేళ గజపతి తాము కోరినట్లు నేయడేమొయను సంశయమొకప్రక్క వారిని బాధింపగడగెను. కావున వారు గజపతి కిట్లు రాయబారము సంపిరి.

కర్ణాటకు లెత్తివచ్చుచున్నారు. వారు మీకును మాకును సామాన్యశత్రులు. మనమందఱమేకమై వారితో బ్రతిఘటించుట యుక్తమని మీరెంచవచ్చును. మీయభిప్రాయము సరియైనదే; కాని మనమందఱు మేకీభవింపవలసినంత యావశ్యకత లేదు. ఆవశ్యకత గలిగిన మీర లహమదానగర పర్యంతము రావచ్చును; అంతటి యాపద ఇప్పుడు కలుగలేదు. మా మూడిండ్ల ఫౌజులును రాయలను గృష్ణను దాటి రానీయక మరల గొట్టుటకు చాలును. మీరు మమ్ముబోలి కర్ణాటకమున నుండువారు గావున మే మొకవేళ పరాజితులమైనచో వారు మీరాజ్యముపై యురవణింపవచ్చును; తత్కారణమున మీకు రాజ్యనష్టము గలుగవచ్చును; కావున మీరు సరదుస్థలసంరక్షణకై తగు ఏర్పాటులను గావించుట యుక్తమని పెచ్చరించుచున్నారము.

3

కృష్ణదేవరాయల కళింగదండయాత్రవలెనంత విపులముగ వర్ణింపబడిన చరిత్రాంశము మఱియొకటి మధ్యయుగ దక్షిణభారతచరిత్రయందు గానరాదు. ఇది పెక్కండ్రచే బలుతావుల వర్ణింపబడియున్నది. ప్రప్రథమమునబేరొక్కనదగినవి కృష్ణరాయల శాసనములు. ఇవి రాయల దండయాత్ర సాగుచున్నపుడు చెక్కించినవి. ఇందు రాయల విజయములు సంగ్రహముగ బేరొక్కనబడియున్నవి.

5. రాయ. పుటలు ౭౩–౭౪.

(౧) ఉదయగిరిశాసనము: (నెల్లూరుశాసనములు-సం. ౩. ఉద. నెం. ౪౦.):

"శ్రీ వీరకృష్ణరాయలు వుదయగిరిదుర్గం మీద విడిసి ప్రతాపరుద్రగజపతిని కొండవీడు పర్యంతం విరుగంబొడిచి వుదయగిరిదుర్గానకు మేనతవేయించి దుర్గం పుచ్చుకొని ప్రతాపరుద్ర గజపతివారి పిన్నతండ్రి తిరుమలకాంతరాయనిని పట్టుకొని తిరిగివిచ్చేసి...."

(౨) తిరుపతిశాసనము. (తిరుపతి దేవస్థాన శాసనములు. సం. ౩. నెం. ౬౯, ౭౧ ర్లు).

"శ్రీ వీరప్రతాప శ్రీ వీరకృష్ణదేవమహారాయలు ప్రతాపరుద్రగజపతిని కొండవీటిదనకాను విరుగంబొడిచి ఉదయగిరిదుర్గమున్ను కైకొని తిరిగి విజయనగరంరాజధానికి విచ్చేస్తున్ను....."

(౩) అమరావతిశాసనము: (*S. I. I. Vol. VI. No.* 248).

"శ్రీకృష్ణదేవమహారాయలు విజయనగరాననుండి పూర్వదిగ్విజయయాత్రకు విచ్చేసి వుదయగిరిదుర్గం సాధించి తిరుమల రౌతరాయ మహాపాత్రునిం బట్టుకొని అద్దంకి వినికొండ బెల్లం కొండ నాగార్జునుని కొండ తంగేడకేతవరం మొదలైన గిరిదుర్గస్థలదుర్గాలన్ని న్ని యేకదాడిం గైకొని కొండవీటిదుర్గం లగ్గలంబుచ్చుకొని ప్రతాపరుద్రగజపతికొమారుండు వీరభద్రరాయ నిన్ని కొమారహంవీరమహాపాత్రుని కొడుకు నరహరిపాత్రుండు రాచూరిమల్లవఖానుండు వుద్దండఖానుండు పూసపాటి రాచిరాజు శ్రీనాథ రాజు లక్ష్మీపతిరాజు జన్యాలకసవాపాత్రుండు పశ్చిమబాలచంద్రమహాపాత్రుండు మొదలుగాను పాత్రసామంతులాను మన్నెవారిన్ని జీవగ్రాహంగాను పట్టుకొని వారికి అభయదానం ఇచ్చి ధరణికోట అమరేశ్వరానకు విచ్చేసి"

(౪) అహోబలశాసనము. (*L. R.* 15. *pp.* 314-33) దిగువ అహోబలంమంటపంలో శాసనము.

".....పాత్రసామంతులను మన్నెవారిని జీవగ్రాహంగా పట్టుకొని వారికి అభయదానం ఇచ్చి

ఒక్కొక ముఖ్యస్థలమును సాధించినపిమ్మట నా విజయములను బ్రసాదించినందుకు భగవంతునికి దన కృతజ్ఞతను జూపుటకు ఆ యాస్థలములందో, లేక సుప్రసిద్ధపుణ్యక్షేత్రములందో వెలసిన దేవతల పూజాపురస్కారములను నడపుటకు జేసిన దానాదుల వివరమిం దుల్లేఖింపబడియున్నది. దండయాత్ర నడచిన మార్గము పొడవునను ఎప్పుడెచ్చట గలిగిన విజయమును దెలుపుట కప్పుడే యవి యచట నిలుపబడిన వగుటచేత చిట్టచివరను వ్రాయించిన శాసనమునందుగాని దండయాత్రవృత్తాంతము సమగ్రము గానరాదు; కాని అన్నిటిని మొత్తముగ జేర్చి చూచిన దండయాత్ర నడచిన మార్గమును సాధించిన దుర్గములును వశపఱచుకొన్న రాష్ట్రములును జక్కగ దెలియరాగలవు. శాసనములందేకాక సమకాలికసంస్కృతాంధ్రగ్రంథ కర్తల రచనలలోను, పాశ్చాత్యపోర్చుగీసై తిహాసికుల చరిత్రలలోను, ప్రయాణీకుల వృత్తాంతములందును కృష్ణరాయల కళింగజైత్రయాత్రప్రస్తావము గలదు; మఱియు నర్వాచీనరచనలగు రాయవాచక కృష్ణరాయ విజయములందును నీ కళింగవిజయము విపులముగ వివరింపబడియున్నది. వీని నన్నిటిని సమకూర్చి చక్కగ బరిశీలించి చూచిన నీదండయాత్రయొక్క చరిత్ర విశదము కాగలదు.

కృష్ణదేవరాయల కళింగజైత్రయాత్ర యేకఘాటిగ సాగలేదు. క్రీ. శ. ౧౫౧౩ మొదలు ౧౫౧౮ వ సంవత్సరమువఱకును విడుమర లేక సంగ్రామము నడచినను నందైదాఱు ప్రత్యేకఘట్టము లుండినట్లు శాసనములందును, సమకాలికాంధ్రగ్రంథములందును సూచింపబడియున్నది. ఒక్కొకముఖ్యదుర్గమును సాధించిన పిమ్మట కృష్ణరాయ లంతవఱకును జరిగిన యుద్ధాంశములను సంగ్రహముగ శాసనమందు ప్రకటించి విజయనగరమునకు మరలిపోవువాడు. సింహాచలపర్యంతము గల రాజ్యమును జయించునప్పటి కిట్టి ఘట్టములు నాలుగు వ్యక్తపడుచున్నవి.

ఈక్రింది శాసనములవలన నీవిషయము దెల్లము కాగలదు.

ధరణికోటకు విచ్చేసి అమరేశ్వరమహాదేవుని సన్నిధిని తులాపురుషదానము సేయ నవధరించి...తిరిగి విజయనగరానకు విచ్చేసి రత్నసింహాసనారూఢుడై సామ్రాజ్యము సేయుచును మఱిన్ని కళింగదేశానకు దిగ్విజయార్థమై యిచ్చటికి విచ్చేసి....."

(౫) తిరుపతిశాసనము. (తిరుపతిదేవస్థాన శాసనములు. సం. ౩. నెం. ౯౦).

"ధరణికోట అమరేశ్వరానను తులాపురుష మహాదానమును శాయనవధరించి తిరిగి విజయనగరానకు విచ్చేసి సామ్రాజ్యంచేస్తున్ను మరిన్ని కళింగదేశదిగ్విజయార్థమై బెజవాడకు విచ్చేసి కొండపల్లి దుర్గమున్ను సాధించి ఆదుర్గంమీదనున్న ప్రహరరాజు శిరశ్చంద్రమహాపాత్రుండు బోడజనమహాపాత్రుండు బిజిలిఖానుండు వీరు మొదలైనవారినిని జీవగ్రాహంగాను పట్టుకొని వారికి అభయదానంఇచ్చి అనంతగిరి ఉండ్రకొండ ఉర్లకొండ ఆరువపల్లి జల్లిపల్లి కందికొండ కప్పలు వాయి నల్లగొండ కంభంమెట్టు కనకగిరి శంకరగిరి ఇవి మొదలయిన తెలుంగాణ్యపుదుర్గాలు ఏకథాటిని కైకొని సింహాద్రి పొట్నూరికివిచ్చేసి అక్కడను జయస్తంభం వేళి రాజమహేంద్రవరానకు విచ్చేసి తమదేవుళు చిన్నాదేవంమ తిరుమలదేవంమగారిచాతను మహాదానాలు శేయించ నవధరించి విజయనగరానకు విచ్చేసి"

పై శాసనగ్రంథములవల్ల కృష్ణదేవరాయలు కళింగదిగ్విజయము ప్రారంభించినతరువాత మూడు పర్యాయములు విజయనగరమునకు యుద్ధరంగమునుండి మరలిపోయినట్లు తెలియవచ్చుచున్నది. ఉదయగిరి కైవసమైనపిమ్మట నొకమారు, కొండవీడును సాధించిన తరువాత నొకసారి, సింహాద్రి పొట్నూరికడ జయస్తంభమును ప్రతిష్టించినవెనుక నొక్కతడవ, మొత్తము మూడుమార్లు యుద్ధరంగమునుండి రాజధాని విజయనగరమునకు బోయియచట రాజకార్యమును విచారించుచు గొంతకాలముండి మరల బయలువెడలిపోయి సైన్యమును గలిసికొనెనని విస్పష్టమగుచున్నది. ఇందువలన రాయల కళింగదండయాత్రయందు మూడు ముఖ్యఘట్టములు గలవను తలంపు గలుగవచ్చును; కాని మనకు లభించిన శాసనాదిచరిత్రసాధనసామగ్రిని బరిశీలించిచూచితిమేని దండయాత్రలోని ఘట్టములు మూటికంటె నెక్కువగలవని తేలగలదు.

(౬) సింహాద్రిశాసనము (*S. I. I. Vol. V. No.* 694)నందు కళింగదండయాత్రలో కృష్ణరాయలు సింహాద్రినిజేరకముందు ఉద్దగిరి, కొండవీడు, కొండపల్లి, రాజమహేంద్రవరము మున్నగు నాలుగు దుర్గములను సాధించినట్లు చెప్పియున్నది.

"శ్రీ వీరప్రతాప కృష్ణదేవమహారాయలు విజయనగరసింహాసనారూఢుండై పూర్వదిగ్విజయయాత్రకు విచ్చేసి ఉద్దగిరి కొండవీడు కొండపల్లి రాజమహేంద్రావరం మొదలైన దుర్గాలు సాధించి సింహాద్రికివిచ్చేసి."

ఒక్కొక ముఖ్యదుర్గమును నొక్కొక థాటి కవధియగుటవలన సింహాచలపర్యంతము సాగిన దండయాత్రయందైదు ముఖ్యఘట్టము లుండెనను నూహ కెడము గలుగుచున్నది. దీని కనుగుణముగ నాముక్తమాల్యదయందు ప్రథమాశ్వాసాంతమున నుదయగిరివిజయమును, ద్వితీయాశ్వాసముచివర కొండవీటివిజయమును, తృతీయాశ్వాసముతుద కొండపల్లివిజయమును, చతుర్థాశ్వాసముకడపట పొట్నూరుసింహాచలమునందు విజయస్తంభ ప్రతిష్ఠయు వరుసగ వర్ణింపబడియున్నవి.[6] ఇట్లే పోర్చుగీసైతిహాసికుడు న్యూనిజు ఉదయగిరి, కొండవీడు, కొండపల్లి సింహాద్రివిజయములను వరుసగా వర్ణించియున్నాడు.[7] కృష్ణరాయల ఆస్థానసంగీతవిద్వాంసుడు బండారులక్ష్మీనారాయణుడు సైతము మొదట ఉదయగిరి యటుపిమ్మట కొండవీడు కొండపల్లెల విజయమును కడపట పొట్టనూరికడ విజయస్తంభస్థాపనను వర్ణించియున్నాడు.[8] కాని కృష్ణదేవరాయల తిరుపతి సింహాచలశాసనములందు

---

6. *Sources of Vijayanagara History, pp.* 137-8.
7. *Swell, F. E. pp.* 147, 316,-319.
8. *Further Sources of Vijayanagara History. I. No.* 166-(*a*).

దప్ప మఱియెచ్చటను రాజమహేంద్రవరవిజయ ప్రస్తావన గానరాదు. ఈశాసనములైనను రాయలెప్పుడు రాజమహేంద్రవరమును జయించినదియు నిర్ణయించుటకు దోడ్పడవు. ఏలన సింహాచల శాసనమున కృష్ణరాయలు రాజమహేంద్రవరమును సాధించినపిమ్మట సింహాద్రికి బోయినట్లు చెప్పి యున్నది; కాని తిరుపతిశాసనమున దీనికి విరుద్ధముగ నతడు సింహాద్రియందు విజయస్తంభమును స్థాపించినపిమ్మట నచటినుండి విజయనగరమునకు మరలిపోవుచు రాజమహేంద్రవరమునకు వచ్చినట్లు కలదు. ఆముక్తమాల్యదయందుగాని, మఱి యేసమకాలికగ్రంథమునందుగాని చరిత్రయందు గాని రాజమహేంద్రవరవిజయప్రస్తావన గానరాక పోయినను దత్పరిసరరాష్ట్రము నతడు జయించి నట్లు అల్లసానిపెద్దనగారు మనుచరిత్రయందు చెప్పి యున్నారు.

'అట సాగి జమ్మిలోయబడి వేగి దహించె
కోన బిట్టేర్చె కొట్టాన దవిలె'[9]

అని మనుచరిత్రపీఠికయందు గలదు. కృష్ణా గోదావరుల మధ్య నుండు తీరాంధ్రభూమి వేగి యనుట నంద లెఱిగిన విషయమే. కోనకొట్టాములు రెండును గోదావరికి తూర్పున నున్నవి. కృష్ణ రాయల వేంగి విజయప్రస్తావన మనుచరిత్ర తృతీయాశ్వాసాంతమునందును గలదు.

'సై,న్యస్తోమోత్తరజో ప్రవిస్థగితకృ
ష్ణాగౌతమీమధ్యభూ
మ్యస్తోకోత్క- ళరాట్పురీహరణ,లీ
లావార్య శౌర్యోదయా'[10] అని.

కావున కృష్ణరాయలు గోదావరిఉభయ తటములందలి రాష్ట్రమును జయించె ననుట తెల్లము. ఇట్లుభయతటములను జయించిన రాయలు గోదావరి తూర్పుగట్టున వేంగికి రాజధానియైన రాజ మహేంద్రవరమువంటి ముఖ్యదుర్గమును శాసనము లందు చెప్పినట్లు జయించినాడనుట నిస్సంశయము; కాని దానిని జయించినదెప్పుడో నిశ్చయింపవలసి యున్నది. సింహాద్రిశాసనమున జెప్పినట్లు సింహాచలాగమనమునకు పూర్వమా? లేక తిరుపతి శాసనమున నుడివినట్లు పిమ్మటనా? సూక్ష్మముగ విచారించిచూడగా కృష్ణరాయలు సింహాచలమును జేరకపూర్వమే రాజమహేంద్రవరమును సాధించి యుండునని తోచుచున్నది. రాయలవంటి యుద్ధ కలామర్మజ్ఞుడైన దళనాయకుడు రాజమహేంద్ర వరమును బోలిన ప్రబలస్థలదుర్గమును, సారవంత మైన బంగారుపండు గౌతమీతీరదేశమును జయింపక శత్రుని యధీనమున విడిచిపెట్టి యంత కింకను దూర్పుననుండు సింహాచలప్రాంతమున దండు నడుపుకొనిపోయియుండడు. కావున నతడు గోదావరీఉభయతటదేశమును రాజమహేంద్రవర దుర్గమును సాధించిన తరువాతనే సింహాచలమునకు బోయెనని యెంచుట యుక్తము. అగునేని, సింహాచలమునుండి రాయలు రాజమహేంద్ర వరమునకువచ్చినట్లు తిరుపతిశాసనమున జెప్పి యుండుటకు గారణ మేమను ప్రశ్నకు సమాధాన మేమి? వాస్తవస్థితిని తెలుపు చరిత్రాధార మింకను లభ్యపడలేదు; కాని కారణము దురూహ్యము గాదు. కృష్ణరాయలు కృష్ణాగౌతమీ మధ్యస్థతీరాంధ్రమును స్వయముగ జయించలేదు. కొండపల్లికి లగ్గలువట్టినపిమ్మట రాయరాణువ రెండువాహినులుగ చీలినది. ఒకపాయ రాయల నాయకత్వముక్రింద తెలిగాంణరాజ్యమును బ్రవే శించినది; మఱియొకటి తూర్పుగ బయలుదేరి కృష్ణాగౌతమీమధ్యదేశమును జొచ్చినది. రెండును సింహాద్రిచెంతనో, తత్పూర్వమో కలిసికొని యేకమైనవి. కృష్ణాగౌతమీమధ్యదేశమును కోన కొట్టాము ప్రాంతములను జయించిన సైన్యము రాజమహేంద్రవరదుర్గమును సాధించినది. ఈ కారణమువలన నేమొ న్యూనిజు మున్నగు సమకాల చరిత్రకారులును, గ్రంథకర్తలును రాయలు సాధించిన దుర్గములలో రాజమహేంద్రవరమును జేర్పకపోయిరి. కృష్ణరాయలంతకుముం దెప్పుడును రాజమహేంద్రవరమును జూచియుండకపోవుట వలన పొట్నూరుసింహాచలమందు విజయస్తంభ మును స్థాపించినపిమ్మట విజయనగరమునకు మరలి

---

9. మను. ౧-౩౭.

10. మను. ౨-౭౯.

పోవునపు డామార్గమున బోయియుండును. ఇది కేవల మూహయే; కాని యన్యథా తిరుపతి సింహాచల శాసనములందు గానవచ్చు విపర్యాసము నకు సమన్వయము కుదురదు.

ఇంతవఱకు వివరింపబడిన శాసనాదిసాక్ష్యమును బరిశీలించిచూడగా గృష్ణరాయల పూర్వ దిగ్విజయ మేకధాటి కాదనియు నంచెలమీద సాగిన దీర్ఘదండయాత్ర యనియు దేలుచున్నది. ఇందు ముఖ్యఘట్టములు నాలుగు గానవచ్చెడిని :— (౧) ఉదయగిరి, (౨) కొండవీడు, (౩) కొండపల్లి, (౪) సింహాచలము.

సింహాచలమున జయస్తంభస్థాపనతో గళింగ జైత్రయాత్ర ముగిసెననియు, నంతట గజపతి దన కుమార్తె నిచ్చి రాయల కుద్వాహమొనర్చి సంధి జేసికొనెననియు కీర్తిశేషులైన డాక్టరు యస్. కృష్ణస్వామి అయ్యంగార లభిప్రాయపడి యున్నారు. తమ యభిప్రాయమును దృఢపఱచుట కొఱ కీక్రింది కారణములను జూపియున్నారు: (౧) రాయవాచకమునను గృష్ణరాయవిజయ మందును సింహాద్రికడ జయస్తంభప్రతిష్ఠతో కళింగ దండయాత్ర ముగిసినట్లు చెప్పియున్నది. (౨) రాయలవంటి యుద్ధమర్మజ్ఞుడగు దండనాయకుడు దన కెలకున నుండు ప్రబలశత్రులను సరకు సేయక ఉత్తరదిక్కునకు సాగిపోయియుండడు. (౩) కాని యల్లసాని పెద్దన మనుచరిత్రయందు కృష్ణరాయల ప్రతాప ముదయగిరి జయమువలన ప్రజ్వలించి క్రమక్రమముగ వృద్ధినంది పొట్నూరి కడ పెనుమంటయై నుండి యొడ్డాదిని మసిచేసెను; ఆతోకచుక్క యొక్క వేడికి గజపతి కటకమున నిలువజాలక వింధ్యాద్రికి పాఱిపోయి యందలి గుహాలయందు తలదాచుకొనెనని ప్రాసియున్నాడు. మనుచరిత్ర కావ్యము; కావ్యపద్ధతి ననుసరించి యావర్ణన హృదయంగమముగనెయున్నది. కావ్య మునకు జరిత్ర యెంత చేరువగ నుండవలయునో పైవర్ణనయు జరిత్రాంశముల కంత చేరువయందే యున్నది. కాని యది చరిత్రకాదు. గజపతి రాజధానికి జిచ్చంటించుట యతని కుమార్తెను బెండ్లాడుట కనుకూలమార్గము గాదు. కావున కృష్ణరాయల కళింగ దండయాత్ర సింహాద్రి నిదాటి యుత్తరముగ సాగియుండుట యసంభవము.[10a]

కాని కృష్ణస్వామిఅయ్యంగారు చూపిన కారణములు ప్రబలమైనవి కావు. రాయవాచకమునగాని, కృష్ణరాయవిజయమునగాని సింహాద్రితో రాయల కళింగదండయాత్ర ముగిసినట్లు చెప్పియుండలేదు. పొట్నూరిసింహాద్రియొద్ద పాళ్యము దిగినపిమ్మట కొంత యుద్ధము నడచినట్లు కలదు. "కర్ణాటకంవారు కనమలదాటి అహముదానగరాసకు వచ్చి నిపాతంజేసి పొట్లూరిసింహాద్రివద్ద శిబిరం దిగినారు. యిక్కడికి నాలుగుక్రోశముల మేర వచ్చివున్నారు. రేపట మర్నాట ఘాటిమార్గంగా గుర్రంరాణువ వచ్చును." అని కృష్ణరాయలు సింహాద్రికడ విడిసినపిమ్మట నా వృత్తాంతమును విన్నపుడు గజపతి యనుచరులతో జెప్పినమాటలివి. ఇందువల్ల గృష్ణరాయలు సింహాద్రిని దాటి గజపతి వారు నివసించుచుండిన పట్నమునకు నాలుగు క్రోశములదూరమువఱకు కూచిచేసి పోయినట్లు తెలియవచ్చుచున్నది. ఇచటనే రాయల విడిదియందు సాళువతిమ్మరసయ్య భేదోపాయమవలంబించి షోడశమహాపాత్రులపై గజపతి హృదయమున సంశయమును గల్పించి యతనిని 'పట్నంవిడిచియేక దేశాన...యేడెనిమిది ఆమడపొడవు ఉత్తరంగా పారిపోవు'నట్లు యుక్తిపన్నినది.[11] కావున డాక్టరు కృష్ణస్వామి అయ్యంగారు రనుకొన్నట్లు రాయవాచక కృష్ణరాయవిజయములు కృష్ణరాయల కళింగదండయాత్రను సింహాచలమున సమాప్తముసేయలేదు. మఱియు గృష్ణరాయల ప్రతాపము వేడికి చాళక గజపతి నిజరాజధానినుండి వింధ్యాద్రిగుహాలలోనికి బాఱిపోయినట్లు చెప్పినాతడు పెద్దనగాదు, నందితిమ్మన. 'కటకమును గాల్చె గజరాజు గలగి పఱవ' యని యతడు కటకమును దగులబెట్టినట్లు స్పష్టముగ పెద్దన నుడివి

10*a*. *Yet-remembered ruler of a Long-forgotten Empire p.* 17.

11. రాయ. పుట ౧౦౭; *cf* కృ. రా. వి. ౩: ౭౬-౧౧౩.

యున్నాడు.[12] గజపతి రాజధానిని తగులబెట్టుట యతని దుహితాకరగ్రహణముసేయు నుత్తమ పద్ధతి కాకపోవచ్చును; కాని గజపతిని యుద్ధమున నోడించి యతని రాష్ట్రమును దుర్గములను హరించుట యంతకంటె నెక్కుడు హృదయరంజకము గాదు. ఇటువంటి వివాహము లెన్నియో జరిగినట్లు చరిత్ర తెల్పుచున్నది. రాయల దండు మార్గమునకు వామపార్శ్వమున దురకరాజ్యము లుండుట వాస్తవమే. కాని యప్పటికే కృష్ణ రాయలు మూడిండ్ల తురకరాజుల నోడించినట్లు రాయవాచకమునందే చెప్పియున్నది. 'ఈ వర్త మానం గజపతివారు విని యేదులసాహు, కుత పనమలక, నిజాంశాహువారు ముగ్గురున్ను నిలువ లేక తిరిగి స్థలాలు వచ్చిరి. గనుక ముగ్గురుదునేదార్లనున్ను పిగతోలిన బలవంతులతో తాము ఏకదేశాన పోరాడేది యేరీతు?' అని గజపతివారు ఆప్తులనడిగి నట్లు కలదు. ఇందువలన రాయరాణువకు పార్శ్వమునుండి శత్రుల యుపద్రవము కలుగునని యాశంకించుట కవకాశము లేదు. మటియు నుదయాద్రినుండి సింహాద్రివఱకు గల రాష్ట్రములును దుర్గములును రాయలకు హస్తగతములై యతని యనుచరులపాలనక్రింద నుండుటవల్ల గర్ణాటము నుండి వస్తుసామగ్రులు రాకపోవు ననుభయమును లేదు. కావున డాక్టరు కృష్ణస్వామిఅయ్యంగారి యొక్క యభిప్రాయము పాటింపదగనిది. పి రెట్లభిప్రాయపడినను, కృష్ణరాయలు సింహా చలమునుండి దండునడుపుకొనిపోయి కటకమును పరశురామప్రీతి గావించె నని నిశ్చయముగ జెప్ప వచ్చును. కృష్ణరాయల యాస్థానసంగీతవిద్వాంసుడు సింహాద్రికడ జయస్తంభమును నిలిపినపిమ్మట గృష్ణ రాయలు గజపతితో మరల యుద్ధముజేసి యతని నోడించి యతనిరాజ్యమును కుమార్తెకరముతో గూడ గ్రహించె నని చెప్పియున్నాడు. అతడు వర్ణించిన కళింగదండయాత్రక్రమమును దిలకింపుడు:

దుర్గం జిత్వాఽథ సోసా వుదయ గిరివరం
తత్ర రాహుత్తరాయం
బన్దీకృత్యాశు హృత్వా యుధినగరవరే
కొణ్డవీట్కొణ్డపల్లీ
జీవాగ్రాహం గృహీత్వా గజపతి తనయం
పొట్టనూర్పట్టణాగ్రే
విశ్వశ్లాఘ్యప్రతాపో బిరుదయుత జయ
స్తంభ ముచ్చైర్నిఖానీత్.
సోఽయం కృష్ణనరేశ్వరో గజపతిం
జిత్వా తదీయశ్రియా
సాకం తస్య సుతాముదూహ్య....."[13]

మటియు—రాయలు, పెద్దనగారు చెప్పినట్లు 'మాడెములు వ్రేల్చి యొడ్డాది మసియొనర్చి కటక మును గాల్చి'నదియు పొట్నూరు రవులుకొన్న పిమ్మటనే, మటియు పెద్దనగారు గజపతికి వ్రాసి యంపిన లేఖయందును రాయల కటకవిజయము వర్ణింపబడియున్నది.

" సంపెటనరపాలసార్వభౌముడు వచ్చి
సింహాద్రిజయశిల జేర్చునాడు
సెలగోలు సింహంబు చేరి ధిక్కృతిగంచు
తల్పుల గరుల డీకొల్పునాడు,
ఘనతరనిర్ఝరగండపెండెర మిచ్చి
కూతు రాయలకును గూర్చునాడు
ఒడ లెఱుంగవొ చచ్చితొ యుర్విలేవొ "[14]

ఇత్యాది—

కటకమువర్యంతము విజయనగరసైన్యములు దండయాత్ర జేసెనని ఈపద్యమువలన దెలియు చున్నది. కంచుతల్పుల కృష్ణరాయలు దన కరుల డీకొల్పినాడట. ఈకంచుతల్పు లెచటివో? గజపతి రాజధానియగు కటకముయొక్క కంచుతల్పులే కాని యన్యస్థలములవి కావు. ఈయూహ సరియైన దని యెంచుటకు శాసనాధారము కొంతకలదు. అనంతపురంజిల్లా హిందూపూరుతాలూకా చోళ సముద్రగ్రామమున క్రీ. శ. ౧౫౧౭ వ సంవత్సరము కడపట కృష్ణరాయల సేనాధిపతులలో నొక్కడగు

---

12. మను. ౧-౩౭

13. *Further Sources of Vijayanagara History. B. No.* 116-(*a*)

14. *Sources of Vijayanagara History p.* 154.

రాయసం కొండమరసయ్యగారు వ్రాయించిన శిలాశాసనమున దన యాధిక్యత నిట్లు చెప్పుకొని యున్నారు.

'స్వామికార్య్య హిమవంతం ఘనగిరిఉద యాద్రి ప్రముఖాది అనేక దుర్గప్రజా రక్షకం, సింహాద్రి శ్రీకూర్మ జయస్తంభకార్య్య నిర్వాహకం' [14a] ఇత్యాది. ఇందువలన కృష్ణరాయల దండయాత్ర సింహాద్రినిదాటి ప్రాచీన గంజాం మండలములోని శ్రీకూర్మముపర్యంతము సాగెనని నిశ్చయమగుచున్నది. మఱియు క్రీ. శ. ౧౫౧౭ వ సంవత్సరమున కృష్ణరాయల భృత్యులలో నొక్క డగు తిప్పరసయ్యకుమారుడగు లక్ష్మీకాంతరసు గుంటూరుమండలములోని కొమ్మూరుగ్రామమున వ్రాయించిన శాసనమువల్ల పై దండయాత్ర కటకముదాక నడచెనని రూఢియగుచున్నది.[15] ఇందు 'కటకముపర్యంతమును' కృష్ణరాయలు పొందిన విజయము లెన్నబడియున్నవి. కావున కృష్ణరాయల పూర్వదిగ్విజయము గజపతి రాజధాని యగు కటకమువఱకు సాగెనని మనము దృఢముగ జెప్పవచ్చును. అగునేని, యంతకు పూర్వము బేర్కొనిన, (౧) ఉదయగిరి (౨) కొండవీడు (౩) కొండపల్లి (౪) సింహాచలము మున్నగు నాలుగుఘట్టములకు (౫) కటక మను నైదవఘట్ట మును జేర్పవలసియున్నది.

కర్ణాటకులతోడి పూర్వవైరమునుస్మరించి మూడిండ్లసుల్తానుల సలహా ననుసరించి గజపతి తన గడిప్రదేశములను గాపాడుటకు వలసిన యేర్పా టుల గావించుటసహజమే. కాని రాయవాచకమున వర్ణింపబడిన రాయభారవృత్తాంతము వాస్తవమని నిరూపించుటకు దగిన సాధనాంతరము లెవ్వియు లేవు; అయినను ఇందు సంభవింపదగని విషయ మెద్దియు లేదు; కావున సాధనాంతరములవల్ల నిది యసత్యమని రుజువగునంతవఱకును నిదియు వాస్తవ మైన చరిత్రాంశమని మనము గ్రహింపవచ్చును.

అనుబంధము

శాసనములందు కొండపల్లిని సాధించిన పిమ్మట కృష్ణదేవరాయలు అనంతగిరి, ఉండ్రకొండ, ఉర్లకొండ, ఆరువపల్లి, జల్లిపల్లి, కందికొండ, కప్పలు వాయి, నల్లగొండ, కంభంమెట్టు, కనకగిరి, శంకర గిరి ఇవి మొదలైన తెలుంగాణ్యపు దుర్గముల నేక ఘాటిని కొన్నట్లు చెప్పియున్న ది. ఏకఘాటిప్రస్తా వము లేకపోయినను పైబేర్కొన్న తెలింగాణదుర్గ ములందు కొన్నింటిని రాయలు సాధించినట్లు సమ కాలికవాఙ్మయమువలన దెలియుచున్నది.

" వేలుపుగొండ యుద్ధ్వత్తిభంగము జేసె
జల్లిపల్లి సమగ్రశక్తి గూల్చె
గినుకమీఱ ననంతగిరి క్రిందుపడ జేసె
గంబంబుమెట్లు గ్రక్కనగదల్చె " [1]

అనిపారిజాతాపహరణమునందును, 'కనకగిరి స్ఫూర్తి గరచె'నని మనుచరిత్రయందును గలదు.[2] కాని రాయవాచకమునగాని కృష్ణరాయవిజయ మునగాని తెలింగాణఘాటిప్రస్తావములేదు. ఉదయ గిరి, కందుకూరు, కొండవీడు, కొండపల్లె, వినుకొండ, నాగార్జునకొండ మొదలైన దుర్గములను జయించిన తరువాత కృష్ణరాయలు అహమదానగరముపై నడచినట్లు రాయవాచకమునం దున్నది.[3] కృష్ణ రాయవిజయమునగూడ నిట్లే యుదయగిరి, కందు కూరు, కొండవీడు, కొండపల్లి, వినుకొండలను సాధిం చినపిమ్మట నహమదానగరముపై నెత్తిపోయినట్లు చెప్పియున్నది.[4] ఈ అహమదనగరం గజపతివారి రాజ్యములోనిది కాదు ఏలనగా, కృష్ణరాయ లా దుర్గమును జయించినపిమ్మట 'నందుండిగజపతిరాజ్యా నకు నడచి' నట్లు రాయవాచకమున వక్కాణింప బడియున్నది.[5] కృష్ణరాయవిజయమునందా దుర్గ సంరక్షకులగు 'పారశీకులనేకులు' గాందిశీకులైరని చెప్పియుండుటవలననది మూడిండ్ల తురకరాజులలో

---

14 *a. ARE* 87 *of* 1912, *SII. IX. Pt.* 2 *No.* 507.

15. *ARE.* 824 *of* 1922.

1. పారి. ౧.
2. మను ౧-౩౭.
3. రాయ. పుటలు ౯౧-౯౩.
4. కృ. రా. వి. ౩: ౫౩-౬౫
5. రాయ. పుట. ౯౩.

నొక్కరికిఁ జెందినదై యుండవలెనను నూహపొడము చున్నది. సకలభారతావనియందును సుప్రసిద్ధమైనది యహమదునగరునామపుర మొక్కటియే కలదు. ఇది నిజాంశాహివంశజులకు రాజధాని ; కాని కృష్ణదేవరాయలహమదునగరమునుసాధించెనని చెప్పుటకు సాధనాంతరము గానరాదు. కావున 'సోర్సస్ ఆఫ్ది విజయనగర హిస్టరీ' అనుగ్రంథమున దద్రచయిత కి. శే. శ్రీ ఆసూరి రంగస్వామిసరస్వతిగారు ఇది యహమదాబాదు-బీదరని సూచించిరి.[6] ఇది యంగీకార్యము గాదు. అహమదాబాదను మహమ్మదీయ నామము బీదరుకున్నను సర్వసామాన్యముగ నప్పటి మహమ్మదీయులందఱును వానిని బీదరనియే పేర్కొనువారు. రాయరాజ్యనివాసులు బెడదకోట యనెడివారు. మఱియు నహమదాబాదహమదు నగరము కాజాలదు. కావున శ్రీ రంగస్వామిసరస్వతి గారి స్థలనిర్దేశ్యము సరియైనది కాదు. రాయవాచక కృష్ణరాయవిజయములర్వాచీన గ్రంథము లగుట చేతను, కృష్ణరాయ లహమదునగరమును జయించె నని తెల్పు సాధనాంతరములు లేకపోవుటచేతను పైగ్రంథములందలి యహమదునగరవిజయకథనము విశ్వాసపాత్రము గాదని త్రోసిపుచ్చుట యుక్తమను తలంపు గలుగవచ్చును ; కాని యాముక్తమాల్యద యందు పంచమషష్ఠాశ్వాసాంత పద్యములను జూడగా పై జెప్పబడిన యహమదనగరపతనవృత్తాం మునందేదో కొంత సత్యమున్నట్లు తోచుచున్నది.

"ఇది యంధ్రోక్తి యథార్థనామ యవనా
సృక్పూర్ణకేంబావి వా
రిదపద్ధత్యవరోధివప్రవిలయ
శ్రేణీవిఘాతక్రియా
స్పదసేనాగ్రగకృష్ణరాయమహిభృ
త్సంజ్ఞాస్మదాముక్తమా
ల్యద నాశ్వాసము పంచమం బమరు హృ
ద్యంబైన పద్యంబులన్."[7]

"ఇది నైజామన యావనావనిధవా
హీనాభ్రచుంబిస్ఫుర
ద్విదితాఖిలమణిగృహాళిదళనో
ద్యోలోగ్రహస్తివ్రజో

ద్యదనీకాగ్రగకృష్ణరాయమహిభృ
త్సంజ్ఞాస్మదాముక్తమా
ల్యద నాశ్వాసవరేణ్య మాఱవది
హృద్యంబైన పద్యంబులన్."[8]

తాళపత్రప్రతులందును ముద్రితగ్రంథముల లోను 'ఇది నైరామనయావనావనిధవ' అనియే సర్వత్రకానవచ్చుచున్నది. నైరామనాఖ్యనగరము గాని యాపేరిటి సుల్తానుగాని యన్యత్ర యెచ్చటను బేర్కొనబడియుండలేదు. అట్టిపురము దక్కనులో గాని మఱి రాయల కందుబాటుగల దేశములందు గాని కానరాదు. కావున 'నైజామన' యని సవరించితిని. మఱియు నీ పద్యము ప్రాతప్రతులన్నిటి యందును గాన్పింపదు. శ్రీనివాసవ్యాఖ్యతోగూడిన ప్రతులయందే కానవచ్చుచున్నది. ఆముక్తమాల్యద యేడాశ్వాసముల గ్రంథమని పెక్కు ప్రాతప్రతుల యందు జెప్పియున్నది. ఈ పద్యమును ద్రోసివుచ్చిన ఆఱాశ్వాసాంతములే మిగులును ; యేడవ యాశ్వాస మున కాశ్వాసాంతపద్యముండదు. కావుననే శ్రీని వాసాదిప్రాచీన వ్యాఖ్యాతలును బ్ర. శ్రీకళాప్రపూర్ణ వేదము వేంకటరాయశాస్త్రిగారివంటి యాధునిక వ్యాఖ్యాతలును నీపద్యమును ద్రోసిపుచ్చక గ్రహించిరి. మఱియు నీయాశ్వాసాంత పద్యములు— ముఖ్యముగ నాలుగైదాఱేడాశ్వాసముల తుదనుండునవి—ముద్రితగ్రంథమందలి క్రమముచొప్పున కాక ప్రాతప్రతులందు తారుమారుగా గానవచ్చుచున్నవి. మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమునందలి ప్రాతప్రతులలో—

డి. నెం ౩౯౫—'ఇది సింహాచలదంభకేసరి... శ్వాసము సప్తమంబలరు' అనియున్నది. ఆఱేడాశ్వాసములు వేర్వేఱుగ విభజింపబడియుండలేదు.

---

6. *Sources of the Vijayanagara History p.* 114
7. ఆముక్త. ౫-౧౬౧.
8. ఆముక్త. ౬-౬౯.

డి. నెం. ౩౯౬	ఆ-వ	,,	''ఇది సింహాచల దంభకేసరి.'
	ఇ-వ	,,	''ఇదియంద్రోక్తి''
	ఈ-వ	,,	''ఇది యంద్రోక్తి''
డి. నెం. ౩౯౭	ఆ-వ	,,	''ఇది సింహాచల''
	ఇ-వ	,,	''ఇది యంద్రోక్తి''
	ఈ-వ	,,	''ఇదియంద్రోక్తి''
డి. నెం. ౩౯౮	ఆ-వ	,,	''ఇది సింహాచల''
	ఇ-వ	,,	''ఇది యంద్రోక్తి''
	ఈ-వ		గ్రంథమునష్ట మైనది.
డి. నెం. ౩౯౯	ఆ-వ	,,	''ఇది సింహాచల''
	ఇ-వ	,,	''ఇది యంద్రోక్తి''
	ఈ-వ	,,	''ఇది యంద్రోక్తి''
డి. నెం. ౪౦౧	ఉ-వ	,,	''ఇది సింహాచలదంభ కేసరి... నాశ్వాసము సప్తమంబలరు...''
డి. నెం. ౪౦౪	ఆ-వ	,,	''ఇది యంద్రోక్తి''
	ఇ-వ	,,	''ఇది నీలాచల''
డి. నెం. ౪౦౦	ఆ-వ	,,	''ఇది యంద్రోక్తి''
	ఇ-వ	,,	''ఇది నీలాచల''
డి. నెం. ౪౦౮	ఇ-వ	,,	''ఇది నీలాచల''
డి. నెం. ౪౦౧	ఉ-వ	,,	''ఇది సింహాచల''
	ఆ-వ	,,	''ఇది యంద్రోక్తి''
	ఇ-వ	,,	''ఇది నీలాచల''
డి. నెం. ౪౦౩	ఉ-వ	,,	''ఇది సింహాచల''
	ఆ-వ	,,	''ఇది యంద్రోక్తి''
	ఇ-వ	,,	''ఇది నైరామన''
	ఈ-వ	,,	''ఇది సింహాచల''
డి. నెం. ౪౧౪	ఉ-వ	,,	''ఇది సింహాచల''
	ఆ-వ	,,	''ఇది యంద్రోక్తి''
	ఇ-వ	,,	''ఇది సింహాచల''
డి. నెం. ౧౮౮౩	ఉ-వ	,,	''ఇది సింహాచల''
	ఆ-వ	,,	''ఇది యంద్రోక్తి''
	ఇ-వ	,,	''ఇది సింహాచల''

మచ్చునకు పైనుదాహరింపబడిన తాళపత్ర గ్రంథములును ప్రాతప్రతులును చాలును. ప్రాత ప్రతులు పెక్కింట 'ఇది సింహాచల' అను పద్యము చతురాశ్వాసాంతమునను, 'ఇది యంద్రోక్తి' పంచ మాశ్వాసముతుదను గానవచ్చుచుండుటచేత, నవి నిక్కముగ నాయాశ్వాసములకు సంబంధించినవిగనే యుండవచ్చును. ఇక మిగిలియుండు రెండాశ్వాస ముల విషయమై కొంత యభిప్రాయభేదముగలదు. వావిళ్ళవారు గ్రంథమాఱాశ్వాసముల దని నిశ్చ యించి యాఱేడాశ్వాసములను రెంటిని ఒక్కటిగ చేర్చి ముద్రించి 'ఇది నైరామన' యను పద్యము నాయాశ్వాసాంతముగ గ్రహించిరి. మఱియు జోగి జగన్నాథపండితుని వ్యాఖ్యతోగూడినప్రతులయందే కానవచ్చు 'ఇది నీలాచలనీలచేలక'యను నాశ్వా సాంతము ప్రక్షిప్తమని యనుబంధముగ ముద్రించిరి. కీ. శే. బ్రహ్మశ్రీ కళాప్రపూర్ణ వేదము వేంకట రాయశాస్త్రులవా రాముక్తమాల్యద యేడాశ్వా సముల గ్రంథమని నిశ్చయించి యాఱవ యాశ్వా సాంతముగ 'ఇది నైరామన' యను పద్యమును, ఏడవయాశ్వాసాంతముగ ఇది 'నీలాచలనీలచేల' యను పద్యమును ముద్రించిరి. 'ఆముక్తమాల్యద' యాఱాశ్వాసముల గ్రంథమైనను కావలయును; లేదా, పెక్కు తాళపత్రగ్రంథము లందున్నట్లేడా శ్వాసములగ్రంథమేనియు గావలయును. వావిళ్ళ వారివలె నాఱాశ్వాసములగ్రంథమని తలచినయెడ 'ఇది నైరామన' 'ఇది నీలాచల' యను నాశ్వా సాంతములంయం దొక్కదానిని విసర్జింప వలసి వచ్చును. రెంటియందేది సత్యమైనదో నిశ్చయిం చుట సులభముగాదు. ఏలన 'ఇది నైరామన'యను పద్యము శ్రీనివాసవ్యాఖ్యతో గూడిన ప్రతులయం దే కానవచ్చిన, 'ఇది నీలాచల' యనునది జోగి జగ న్నాథ పండితుని వ్యాఖ్యతోగూడిన ప్రతులలోనే గానవచ్చుచున్నది. కావున గ్రంథమేడాశ్వాసముల దని తాళపత్రగ్రంథములందు పెక్కింటియందుండు టచే బ్రహ్మశ్రీ కళాప్రపూర్ణ వేదము వేంకటరాయ శాస్త్రులగారి మార్గము నవలంబించుట యుక్తము.

పంచమాశ్వాసాంతపద్యమునందు బేర్కొన బడిన కెంబావి హైదరాబాదు సంస్థానమునకు జెందిన

గుల్బర్గజిల్లాలో గుల్బర్గకు నైరృతిమూలను ౬౦ మైళ్ల మీదనున్న గ్రామమని క్రీ. శే. శ్రీ కొమర్రాజు వేంకటలక్ష్మణరావుపంతులుగారు గుర్తించియున్నారు.9 కానియందు రాయలచే వధింపబడిన యవనులెవ్వరోవారు వివరించియుండలేదు. కృష్ణరాయలు పూర్వదిగ్విజయయాత్ర సేయుచుండగా క్రీ. శ. ౧౫౧౪సంవత్సరమున గుల్బర్గ యమీరు బరీదుయేలుబడిక్రింద నుండెననియు, దానిని ఇస్మాయీలాదిల్ ఖానుడు జయించి స్వాధీనపఱచుకొనగా బరీదందులకు గినిసి బుర్హాన్‌నిజామ్‌శాహ, కుల్లీకుతుబుశాహ, అల్లావుద్దీన్ ఇమాదుశాహ మున్నగువారి సహాయముతో గూడ విజాపురముపై నెత్తివచ్చెననియు, యుద్ధమున బరీదుమిత్రులతోగూడనోడిపాఱిపాయెననియు ఫెరిష్తా వ్రాయుచున్నాడు.10 కాని ఫెరిష్తావ్రాత విశ్వాసపాత్రముగాదు. ఏలన ఫెరిష్తా క్రీ. శ. ౧౫౧౪ వ సంవత్సరమున జరిగినట్లు చెప్పు చరిత్రాంశములన్నియు సమకాలిక పోర్చుగీసు గ్రంథకర్తలంతకు నాలుగేండ్లకు పూర్వము క్రీ. శ. ౧౫౧౦ వ సంవత్సరమున కృష్ణరాయల పట్టాభిషేకమైన వెంటనే సంభవించినట్లు వ్రాసియున్నారు.11 ఫెరిష్తావాక్యముల సత్యాసత్యము లెట్లున్నను కెంబావియప్పుడు బహమనీసామంతులయధికారముక్రింద నుండినది. కలుబరిగెకోట కప్పుడు విజాపురాధిపతియగు నేదులఖానునకును, బీదరు సర్వాధికారియగు బరీదునకును దఱచుగ యుద్ధములు జరుగుచుండినవి. బరీదునకు వ్యాపై యహమదనగరసుల్తానగు నిజామ్-ఉల్-ముల్కు నేదులఖానుతో యుద్ధము సల్పువాడు; కావున కృష్ణదేవరాయల కళింగ జైత్రయాత్ర యప్పుడు కెంబావి యెవ్వరి యేలుబడిక్రింద నుండెనో నిశ్చయించి చెప్పుటకు సాధ్యముకాదు. ఇక పష్టాశ్వాసాంతమున పేర్కొనబడిన 'నైజామన' యహమదనగరపాలకుడగు నిజామ్‌శాహు కావచ్చును కెంబావియుద్ధమునకును నైజామనయావనప్రభుని మణిగృహాళినిర్మ్మాలనమునకు నెద్దియేని సంబంధముండియుండును.

కృష్ణదేవరాయలు కెంబావిని యవనాస్మ కూర్ణను గావించి నైజామనయావనప్రభుని మణిగృహాళిని నిర్మ్మాలము గావించిన దెప్పుడు? ఈ ప్రశ్నకు సరియైన సమాధానము జెప్పుటకు దగిన సాధనసామగ్రి ఇంకను దొరకలేదు. అంతదనుక ఈవిషయమై నిశ్చయము తేలదు; కాని రాయవాచకము విశ్వాసపాత్రమగునేని యవి కృష్ణరాయల తెలింగాణధాటి యప్పుడు (క్రీ. శ. ౧౫౧౪-౧౫) జరిగియుండవలయును. అట్లుగాక ఆముక్తమాల్యదయాశ్వాసాంతపద్యక్రమము ననుసరించి—ముద్రితప్రతులలోని యాశ్వాసాంతపద్యక్రమము విశ్వాసపాత్రమగునేని—సింహాద్రివిజయస్తంభ స్థాపన యైనపిమ్మటను, కటకదహనమునకు పూర్వమునను నడచియుండవలయును. భావిపరిశోధనము వలన ఇందలి నిజానిజములు దేలవలసియున్నవి.

కళింగ జైత్రయాత్ర ౪

ఇంతవఱకు కృష్ణరాయల కళింగ జైత్రయాత్ర యేకథాటికాదనియు నందాఱుఘట్టములు గలవనియు నిర్ణయించితిని. ఇక నాయాఱుఘట్టములందును నడచినయుద్ధవిశేషములను వివరింపవలసియున్నది. ఉదయగిరి ముట్టడితో గళింగదండయాత్ర ప్రారంభమైనది. శకాబ్దము 1434 ప్రజోత్పత్తి పుష్యమాసమున రాయలు సైన్యముతో వచ్చి యుదయగిరికి ముట్టడివేసెను.1 రాయమాయెనని యతడచట నెలకొల్పిన జయశాసనముల వల్ల దెలియుచున్నది. (*N D I. III. U.* 40) ఉదయగిరి ముట్టడి యొకటిన్నరసంవత్సరము పర్యంతము సాగెనని న్యూనిజు చెప్పియున్నాడు. (*Forgotten Empire, p.*316) కావున పైజెప్పినట్లు శ. 1434 ప్రజోత్పత్తి పుష్యమందు ప్రారంభమాయెనని తెల్లమగుచున్నది.

9. లక్ష్మణరాయవ్యాసావళి. పుట. ౪౫.

10. *Briggs' Ferishta-III pp.* 45-7.

11. *JOR X pp.* 168-171.

1. శకాబ్దము 1436 మీద చెల్లు భావసంవత్సర జ్యేష్ఠ ఐ 2 నాడు ఉదయగిరి కృష్ణరాయలకు గైవసమాయెనని యతడచట నెలకొల్పిన జయశాసనముల వల్ల దెలియుచున్నది. (*N D I. III. U.* 40) ఉదయగిరి ముట్టడి యొకటిన్నరసంవత్సరము పర్యంతము సాగెనని న్యూనిజు చెప్పియున్నాడు. (*Forgotten Empire, p.*316) కావున పైజెప్పినట్లు శ. 1434 ప్రజోత్పత్తి పుష్యమందు ప్రారంభమాయెనని తెల్లమగుచున్నది.

వాచకమునందు కృష్ణరాయలు ఉదయగిరి దుర్గమునకువచ్చిన 'హుర్మత్తున దుర్గములపై లగ్గయెక్కగా దుర్గములోనివారు తమచేతనైనట్లు సమరంచేసి మంద్దుగుండ్లు శలపై నిర్వహించలేక కొలిచినారు' అని యున్నది. ఇది వాస్తవమును గప్పిపుచ్చెడి యతిశయోక్తి. ఈ ముట్టడి సుదీర్ఘ కాలము నడచినది. ఉదయగిరి తీరాంధ్రదేశ దుర్గములందు బలవత్తమమైనది.—దానిని సాధించుట సులభసాధ్యమైన కార్యముగాదు. దాని పరిసరములు పర్వతమయమగుటచేత దుర్గమమై శత్రుజన దుర్భేద్యముగ నుండెను. దానిని చొచ్చుట కొక్కటి దప్ప మార్గాంతరము లేదాయె. అదియు మిక్కిలి యిఱుకైనది. మనుష్యులు సైతము ఒకరి వెనుక నింకొకఱుగనె నడచి పోవలసియుండెను. ప్రకృతిచే నింత బలిష్ఠమైనందు వలన దానిని సంరక్షించుట కల్పసంఖ్యాకులు చాలియుండిరి. కొద్ది జనులు కొండలసందునను బండలవెనుకను దాగి యెంతటి ప్రబలశత్రువునైనను ధిక్కరించుటకు జక్కనియవకాశముండెను. వీరి నాకటిచే మాడ్చిన తప్ప కోటను వశపఱచుకొను పాయ మన్య మెద్దియులేదు.[2]

కృష్ణరాయ లసామాన్య ప్రజ్ఞాశాలియైన దళనాయకుడు. దళములను కూర్చుటయందు విప్పుటయందును యుద్ధరంగమున శత్రులపై బురి కొల్పుటయందుమాత్రమేకాదు అతని ప్రజ్ఞ వికసించినది. అసాధ్యమనుమాటను అతడెఱుగడు. ఎట్టి యాటంకమైనను సరే—మానుషము గాని యమానుషముగాని—అతనిమార్గమునుండి తొలగి పోవలసినదే. కావున దుర్గమమైనకోటను సుగమము సేయుటెట్లు? అని యతడు చింతించి చింతించి దాని పరిసరములనుండిన బండలను కొండలను పిండిగొట్టుటయొక్కటియే దుర్గమునుజయించుటకు సరియైన యుపాయమని నిశ్చయించెను. కాని యదిసులువైన కార్యముగాదు; రాయలా పనినెట్లు నిర్వహించెనో తెలుపుసాధనములులేవు. కాని దాని నెరవేర్చుటకు వలసిన మనుష్యబలగము కొంచెకొంచె మని యెంచుటకు వీలులేదు. ధనవ్యయమును తక్కువయైయుండదు. జనస్తోమమును ధనసంపత్తి గలిగియుండినను దానినికొనసాగించుటకు రాయలకు పదునెనిమిది మాసములు పట్టినవి. ఈకాల మంతయు కృష్ణరాయ లుదయగిరియందుస్థిరముగ నుండలేదు. రాజధానికి పోవుచు వచ్చుచునుండెను. పుణ్యక్షేత్రములకు యాత్రపోవు నెపమున రాజ్య మున జాలభాగములను ద్రొక్కిచూచుచుండెను. తుదకు ఉదయగిరి దుర్గమును సుగమము సేయు మార్గనిర్మాణము ముగిసెను. 'తన భటులు కోట బురుజుల సమీపించుటకొఱకు నచటిగండ శిలల ననేకములను జిదుగగొట్టి వాని మీదుగ పెక్కు మార్గముల నేర్పఱచెను. ఒకరి వెనుక నొక్కరుగ నడచిపోవలసియుండిన ఇఱుకుదారిని విశాలముజేసి వెడల్పైన బాటగమార్చెను. ఇట్టివానినే మఱి కొన్నింటిని గూడ నిర్మాణము గావించి కోట క్రిందికి బోవుటకు వసతిచేసికొనెను. ఇంతశ్రమ పడినను కోటస్వాధీనమగునట్లగపడలేదు. దుర్గాధిపతియు ప్రతాపరుద్ర గజపతి పినతండ్రియునగు తిరుమల కాంతరాయడు కోటను గడు జాగ్రత్తతో కాపాడుచుండెను.[3]

---

2. *Forgotten Empire*, *p.* 316.

3. ప్రతాపరుద్రగజపతి పినతండ్రి పేరు వాస్తవముగ తిరుమలకాంతరాయలని దృఢముగ జెప్పుటకు వీలులేదు. దీని విషయమైన సాక్ష్యము ఒక్కరీతిగ నుండలేదు. కొన్ని శాసనము లితని తిరుమలకాంత రాయలని పేర్కొనుచున్నను (*NDI. III. U.* 38, 40, *TTDI. III.* 77) మఱికొన్నిటియందు తిరుమలరాహుత్త లేక రౌతరాయలని యున్నది (*TTDI. III.* 76, 80, 81); ఒకానొక శాసనమున నితని నామధేయము (*U.* 37) తిరుమలరాఘవరాయలని యున్నది. ఇట్లు శాసనసాక్ష్యమే భిన్నమైయుండ వాఙ్మయము వీనికి విరుద్ధముగ నతని మఱియొకవిధముగ బేర్కొనుచున్నది. ఆముక్తమాల్యద ప్రథమాశ్వాసాంత పద్యమునందు 'ఇభరాడుదయోర్వీధర తత్పితృ వ్యకృత' అను వాక్యమునకు వ్యాఖ్యాతలు పరంపరగ 'ఇభరాట్=గజపతియైన ప్రతాపరుద్రునియొక్క, ఉదయ ఉర్వీధర=ఉదయగిరి దుర్గమందు, తత్=ఆ గజపతికి, పితృవ్య=పినతండ్రియైన ప్రహరేశ్వర పాత్రునిచేత' అని యర్థవివరణము వ్రాసియున్నారు. కాని ఇది తప్పు. ప్రహరేశ్వరపాత్రునికి ఉదయ

కృష్ణదేవరాయలి ట్లుదయగిరి దుర్గమును జయించుటకు భగీరథ ప్రయత్నము సేయుచుండ దానిజూచుచు ప్రతాపరుద్ర గజపతి మిన్నకుండ లేదు ; ఆత డొక గొప్పసైన్యమును వెంటబెట్టు కొని రాయలనోడించి ముట్టడిని లేవదోలుట కొఱకు తరలివచ్చెను. కాని రాయ లాతని నిజ సైన్యముతో నెదుర్కొని పరాభూతుని గావించెను. న్యూనిజీయంశమును ప్రస్తావించలేదు ; కాని యుదయగిరి తిరుమల శాసనములందు 'ప్రతాప రుద్ర గజపతిని కొండవీడుపర్యంతం విరుగబొడిచి' యని సంగ్రహముగ సూచించి యున్నది. ఇందు వల్ల కృష్ణదేవరాయ లుదయగిరిచెంత ప్రతాపరుద్ర గజపతిని పరాజితుని సేయుటయే కాక కొండవీడు పర్యంతమును నతని వెన్నంటి తఱుముకొని పోయె నని విదితమగుచున్నది.

గజపతి ప్రతాపరుద్రుని నిట్లోడించి తఱుమ గొట్టి కృష్ణదేవరాయలు వెనుదిరిగివచ్చి ఉదయగిరిని జేరి దుర్గము నెఱ్ఱిన స్వాధీనపఱచుకొనవలయునని పట్టుపట్టెను. మొట్టమొదట దుర్గమునకు వేణత (మేనత) వేయించెను.[4] వేణత యనగా కోటకు రాకపోకలను సంపూర్ణముగ నాపివేయుటకు చుట్టును పెట్టుగోడ. వేణత వేయించిన పిమ్మట బయటినుంచి కోటలోనికి పదార్థము లెవ్వియుబోక నిలిచిపోయినవి ; కాని కోటకావలిదండు ధైర్య సాహసములను జూపి మెండొడ్డి పెక్కుదినముల పర్యంతము బోరాడెను. ఈ యుద్ధము కృష్ణరాయ విజయమునందు వర్ణింపబడియున్నది.

"కోటలు దుర్గముల్ గొనుచు దోఃపటుబల
ధాటిచే మించు నార్వీటివారు
కంట కాహిత కంఠలుంఠనోద్ధత లీల
దంట లైతగు తొరగంటివారు

నిబ్బరంబుగ శత్రునికరంబు వణగించి
ధీరు లై మించు గొబ్బూరివారు
చాల దోర్బలలీల సమదారిసంఘంబు
దూలించి వెలయు నందేలవార

లాదిగా గల్గు రాజులు మేదురగతి
తుఱుదొరలును బోయలు దురుసుగాగ
బ్రతిదినంబును ఘోరమౌ రణమొనర్ప
నిలిచిపోరాడె గజపతి బలములపుడు."

"తీవిగ నొకువారును కడిందిరహిత
వెలుగోటివార లా
రావెలవారు గూడుకొని రాత్రిబగల్
చతురంగసేనతో

నేవగ జూచిన దెలియ నెంతయు
శక్యముగాని దుర్గమున
భూవరమౌళిగాంచి యొకపూటనె
దీసెద సంచుదగ్గుడై.

దిగ్గున లేచి సాహసము తేటపడన
మును మున్నుగాగదా
నగ్గలిక జెలంగు విధమంతయు
గన్గొని రోషచిత్తుడై

లగ్గలకెక్కి రందఱు బలంబు చలం
బలర రవంబులన
దిగ్గజముల్ వడంక బలుతెంపున
గుంపులు గూడియుద్ధతిన."[5]

ఈవిషయమునె తెల్పు ప్రాచీనగాథ యొకటి యాముక్తమాల్యద వ్యాఖ్యలం దుదాహరింపబడి యున్నది. 'కృష్ణదేవరాయల దిగ్విజయములలో ఉదయగిరి దుర్గమును ముట్టడించినప్పుడు అందు

గిరితో నెట్టి సంబంధ ముండినట్లును అగపడదు. ఇతడు కొండపల్లి దుర్గాధ్యక్షుడనియు నచట రాయల కతడు పట్టువడెనని యు నాముక్త మాల్యదృతీయాశ్వా సాంత మందలి 'ఇది పాత్రప్రహరేశ్వర' అను పద్యమువలన విదితమగుచున్నది. ఇతని సంపూర్ణనామ ధేయము ప్రహరరాజు శరశ్చంద్రపాత్రుడు. ఇతని బోడజన మహాపాత్ర బిజిలీఖానులతో గూడ రాయలు జీవగ్రాహముగ కొండపల్లెయందు బట్టుకొనినట్లు శాసనములు జెప్పుచున్నవి. (*TTDI. III.* 80) కావున లభ్యమైనసాక్ష్యము నాధారపఱచుకొని యుదయగిరియందు కృష్ణరాయల చేజిక్కిన ప్రతాపరుద్ర గజపతి పినతండ్రియొక్క వాస్తవ నామధేయ మిది యని నిశ్చయించి చెప్పుటకు వలనుపడదు.

4. *NDI. III U* 38, 40.

5. కృష్ణరాయ విజయము 3 : 58-60.

ప్రహరేశ్వర పాత్రుడనువాడు గజపతికి పినతండ్రి కాపుండి కడు సమర్థుడై ఎన్నాళ్ళకును దుర్గమును లోబడనీయక పోరాడుచుండెను. అంత నొకనాడు కృష్ణరాయడు 'ఈ దినము ప్రహరేశ్వరుని తల ద్రొక్కనిది స్నానముచేయనని ప్రతిజ్ఞచేసి స్వయముగా ముట్టడి నడపగా ప్రహరేశ్వరుడు భయపడి లోబడె'నట. ఈ యైతిహ్యమున ప్రహరేశ్వరుడనుట తప్పైనను తక్కినవిషయము సత్యదూరముగాదు. కృష్ణరాయల కంటిక్రింద పోరాడ దొడగిన రాయ రాణువ యసాధరణ పరాక్రమముజూపి నలుప్రక్కలను లగ్గలకెక్కెను. ఎంత సామర్థ్యము గలవాడైనను తిరుమలకాంతరాయడు ప్రబల శత్రుదళమును మార్కొనజాలక రాయలతో సంధినికోరెను; అతడు కోరినమేరకు సమాధానమున కొడంబడుటకు రాయలు సంకోచించెను. ఏలన యొక ధర్మసందేహ మాతని చిత్తమును కలతబెట్టినది. తిరుమలకాంత రాయని శిరము ద్రొక్కనిది ఆ దినము మజ్జనము సేయనని ప్రతినపట్టెను గదా; మఱి యతడు కోరినట్లు సంధినంగ్రహించిన ప్రతిజ్ఞాభంగమగును. శరణార్థియగు శత్రుని రక్షింపక నిరాకరించుట రాజధర్మముగాదు. ఏమిసేయుటకును దోచక సంకటపడుచుండ రాయలకు సర్వశిరఃప్రధాని యప్పాజి యొక యుపాయమును జెప్పి మనశ్శాంతిని గలిగించెను. తలపాగద్రొక్కిన తల ద్రొక్కినట్లే యగును; తిరుమలకాంతరాయడు దన యుష్ణీషమును రాయల పాదములకడనుంచుట కంగీకరించిన ప్రతిజ్ఞయు భంగము గాదు; శరణార్థులను సంరక్షించుటకును వలనుపడును. తిరుమలకాంతరాయలు రాయలు కోరినట్ల పాగ నతనిపాదములక్రింద వైచెను; రాయ లందులకు సంతసించి యతనిని చంపక విడిచిపెట్టెను. ఈ సంధి వృత్తాంతము జాలవఱకు పరంపరగ వచ్చు నైతిహ్యములనుండి సంగ్రహించినది. ఇది సత్యమని ఆముక్త ప్రథమాశ్వాసాంతపద్యము రుజువు సేయుచున్నది.

'ఇది కర్ణాట ధరాధృతిస్థిరభుజా హేవాక
లబ్ధేభరా
డుదయోర్వీధర తత్పితృవ్యకృత నవ్యోపాయ
నోష్ణీషర
త్నదృగంచత్పదకృష్ణరాయ వసుధాధ్యక్షోదితా
ముక్తమా
ల్యదనాశ్వాసము హృద్య పద్యముల నాద్యం బై
మహింబొల్పగున్.'

ఇట్లు ష్ణీషము నుపాయన మొసగిన తిరుమల కాంతరాయనికి గృష్ణరాయలు ప్రాణదానము జేసెనేగాని విడిచిపెట్టలేదు; బందీకృతుని గావించె నని పోర్చుగీసు రచనలును, సమకాలిక వాఙ్మయ మును, రాయల శాసనములును సాక్ష్యము బల్కు చున్నవి.[6] కోటను స్వాధీనపఱచుకొని దుర్గ సంరక్షణకు సాళువ కంపరాజును నియమించెను.[7] తరువాత సాళువ తిమ్మరుసయ్యను పిలువనంపి సాళువ నరసింగరాయల యాదేశమును దానెంత చక్కగ నిర్వహించినదియు వివరించి తండ్రియాజ్ఞ దృష్టికలుగలేదనియు, నురియూరాజ్యములోనికి నూఱు యోజనముల పర్యంతము గూచిచేసి పోవలయుననియు, నందుకు వలసిన సన్నాహాలు తయారుచేసి సైనికులకెల్ల జీతములు సంపూర్తిగా

---

6. '...*and in it he captured an aunt (some say an uncle) of the king of Oriya who was taken captive and carried off-with all courtesy that he could show her (him), having her (his) liberty; and he took her (him) along with hismself.*' —

— *Nuniz, Forgotten Empire, p.* 317.

'దుగ్ధాంబ్ధిత్వాఽథసోఽసావుదయగిరివరంతత్ర
రాహుత్తరాజం
బన్దిక్రుత్వా...'—సంగీతసూర్యోదయము.

Further Sources of Vijaynagara History. I. No. 16. (*a*)

'ఉదయగిరి దుర్గమును పుచ్చుకుని ప్రతాపరుద్ర గజపతివారి పిన్నతండ్రి తిరుమలకాంతరాయనిని పట్టుకొని...'*NDI. III. N* 40.

7. రాయవాచకమున 'కంపన్నను దుర్గమందు తాణ్యం వుంచి' అని యున్నది. మనుమంచి భట్ట కృత అశ్వలక్షణసార మను గ్రంథము సాళువయా భళరాజ భీమాంబికా పుత్రుడగు కంపరాజున కంకిత మియబడినది. ఈతడు కృష్ణరాయల సిద్ధకృపాణుడట (3 : 1). ఇతడే రాయవాచకము బేరొక్కను కంపన్న కావచ్చును.

NARLA MEMORIAL LIBRARY
V.R. NARLA
D.P.R.I.
Acc. No.

నిచ్చివేయవలసినదనియు నాజ్ఞాపించెను.[8] తిమ్మరుసయ్య రాయల యాజ్ఞానుసారము సేనలను ప్రయాణమునకు సంసిద్ధము సేయగడగెను. కృష్ణదేవరాయలంతట సైన్యముతో గదలిపోయి కొండవీటిని సాధింపుమని తిమ్మరుసునకాజ్ఞచేసి దేవేరులతోగూడ 'తిరిగి విజయనగరం రాజధానికి విచ్చేస్తున్ను తిరుమలమీందికి విచ్చేసి తిరువేంగళనాథుని దర్శించి తిరువేంగళనాథ దేవునికి కనకాభిషేకం చేసి'రి. మఱియు, 'తధాతిథి (శకవర్షంబులు 1436 మీదనడచే భావసంవత్సర ఆషాఢ శు. 15. గు) మన్వాది పుణ్యకాలమందు ధారాపూర్వకంగాను' 'పొత్తపినాంటి సీమలోని తాళపాకగ్రామం' 'సమర్పించి'రి. 'కృష్ణరాయల దేవులు చిన్నాదేవమ్మంగారు'ను, 'తిరుమల దేవమ్మంగారు'ను తిరువేంగళనాథదేవునికి కంఠమాలయు సరపదకమును సమర్పించిరి.[9] విజయము ప్రసాదించినందులకు ఇవి యిష్టదైవమగు శ్రీ వేంకటేశ్వరస్వామికి కృతజ్ఞతాపూర్వకముగ సమర్పణచేసిన కానుకలు గాబోలును. ఇట్లు భగవత్కైంకర్యమును ముగించుకొని రాయలు రాణివాసముతో గూడ విజయనగరమునకు దరలవలెను.

కొండవీడు :—రాయలయాజ్ఞ చొప్పున సాళువ తిమ్మరసదండనాథుని యాధిపత్యముక్రింద రాయరాణువ కొండవీడు దుర్గమువైపు కూచి చేసెను. ఆంధ్రదేశమునందు గజపతి సామ్రాజ్యములోని ముఖ్య ఆయపట్టు స్థానములలో నది యుదయగిరికి తుల్యమైనది. కొండవీటి దండపాటకు రాజధాని. చుట్టుపట్టులనుండు అద్దంకి యమ్మన బ్రోలు మొదలగు దండపాటల నేలు నధికారులు కొండవీడు దుర్గాధ్యక్షునికి లోబడియుండిరి. ఈ దండపాటలలో దుర్గము లనేకములుండినవి. దక్షిణదిశనుండి గజపతి సామ్రాజ్యముపై నెత్తివచ్చు శత్రు వీదుర్గముల నన్నిటిని మొట్టమొదట సాధించుట యత్యంతావశ్యకము. వానిని విడిచి పెట్టి కొండవీటి నొకవేళ జయింపగల్గినను అచ్చట నతనికి స్థిరముగ దన యధికారమును నెలకొల్పుటకు వీలుగాదు. ఈ మర్మమును జక్కగ గుర్తించినవా డగుటవలన తిమ్మరసయ్య వీని నన్నిటిని జయించి స్వాధీనపఱచుకొనిన పిదపగాని కొండవీటిజోలి యెత్తుకొనలేదు. ఇవి వరుసగ 'అద్దంకి,వినికొండ, బెల్లంకొండ, నాగార్జునికొండ, తంగేడు, కేతవరం మొదలయిన గిరిదుర్గ స్థల దుర్గములు.'[10] ఇవిగాక రాయవాచకమును కృష్ణరాయవిజయమును కందుకూరును గూడ జయించినట్లు తెల్పుచున్నవి.[11] ఇది సుసంగతమే. గజపతి సామ్రాజ్యమప్పుడు నెల్లూరుమండలములో ఆత్మకూరు పర్యంతము వ్యాపించియుండినది;[11a] కావున కందుకూరు గజపతి సామ్రాజ్యాంతర్గతమై యుండెననుటకు సంశయములేదు. అది క్రీ. శ. 1422 వఱకును రెడ్డిరాజ కుటుంబమునం దొక శాఖకు ముఖ్యస్థానమై యుండె. ఇప్పుడది యెట్టి స్థితియందున్నను క్రీ. శ. 16 వ శతాబ్ది పూర్వార్ధమున దాని ప్రాముఖ్యత నింకను గోల్పోలేదు; కావున రాయరాణువ ఉదయగిరినుండి బయలు వెడలిన పిమ్మట కందుకూరిని వశపఱచుకొనిరనుట విశ్వసింపదగిన విషయమే. పై పేర్కొనిన దుర్గములలో గజపతివారి పక్షమున నెవ్వరెచట కాపుండిరో వారెట్లు పోరాడిరో తెలియదు. కాని కృష్ణరాయలచే గొండవీడునందు వీరభద్రగజపతితో గూడ పట్టుబడిన పాత్రసామంతులై యుందురనుటకు గొంత యవకాశము గలదు. పట్టుపడిన పాత్ర సామంతుల సంఖ్యయేడు. కందుకూరితో గూడ రాయరాణువ జయించిన దుర్గముల సంఖ్యయు నేడే. మఱియు ఆముక్తమాల్యదయందు ఉత్కల క్షత్రియపాత్రు లెల్లను కొండవీటియం దుండినట్లు కృష్ణరాయలు వ్రాసియున్నాడు. న్యూనిజుకూడ

---

8. *Nuniz Forgotten Empire, p.* 317
9. *TTDI. III* 66, 67, 68, 70, 71, 72, 73, 74,75.
10. *TTDI. III.* 76.
11. రాయవాచకము, పుట. 91. 'కందూర్కి పోగా' 'కందూర'ను నది పొరబాటు. 'కందుకూర్కి' అని యుండవలయును. చూ. కృష్ణరాయ విజయము శి: 66 'అట కందుకూరు బిట్ట దిరెకాహళ శంఖ భేరీవిరావముల్ భోరుకలగ' అని.

11a. కాళహస్తి మొదలు జగన్నాథం పర్యంతం గజపతిసీమ రాయ. పుట 97.

గజపతి రాజ్యమందలి దొరలెల్ల నందెకూడి యుండిరని చెప్పియున్నాడు. మఱియు రాయ వాచకమున పై బేర్కొనిన దుర్గములందలి ప్రజలు తమ తమ దొరలున్న తావుకు అనగా కొండవీడు నకు పోయినట్లు చెప్పియున్నది.[11b] కావున రాయ లకు గొండవీటియందు పట్టువడిన ఏడ్గురు పాత్ర సామంతులును పై జెప్పిన దుర్గముల కధిపతులై యుందురని ఉహాకెడము గల్గుచున్నది. ఈ యూహ సరియైనదేని, రాయశాసనాదులందు పేర్కొనబడిన దుర్గములయొక్కయు పాత్రసామంతులయొక్క వరుసయు నొక్కటియ యగునేని కందుకూరికి కుమారహంవీరుని కొడుకు నరహరిదేవుడును అద్దంకికి రాచూరి మల్లూఖానుడును, వినికొండకు ఉద్దండఖానుడును, బెల్లంకొండకు జన్యాలకసువా పాత్రుడును, నాగార్జునుని కొండకు పూసపాటి రాచిరాజును, తంగేడుకు శ్రీనాథరాజు లక్ష్మీపతి రాజును, కేతవరమునకు పశ్చిమ బాలచంద్ర పాత్రుడును దుర్గాధిపతులై యుందురు. రాయ వాచకమున కొండవీటి దండయాత్ర కొంచెము విపులముగ వర్ణింపబడియున్నది. రాయసైన్యము 'కొండ్డవీటికి కదలిపోగా దుర్గములలో నున్న వూడెములవారు సముద్రంపొంగి వచ్చేరీతిని సేనా సముద్రం కదలివచ్చేది కని కాలిధూళిమిన్నుముట్టి సూర్యరశ్మిగప్పినగని స్థలములు విడిచి పొయ్యేవా రున్ను కాహళధ్వనివిని పాఱే వారున్ను యీరీతున కొండ్డవీడుసీమ కోటలు దుర్గాలలోనున్న వారలు సరాళభ్రష్టులై తమ తమ దొరలున్న తావుకు పోసాగిరి. బోయదొరలు పదునెనిమిది కప్పటాల వారున్ను మూడు లక్షలపాయ దళమున్ను కొండవీడు కొండపల్లె, బెల్లంకొండ్డ, వినికొండ్డ, నాగార్జునం కొండ్డ మొదలయిన దుర్గాలకు యేలు బడియైన శీమ లాద్యంత్తం నిపాతం శేస్తావున్నారు. గనక ఆయాశీమలోగల ప్రజలందర్ను సకలమును కొళ్లయిచ్చి మిక్కిలి అందుపడి అయిన దుర్గాలు చేరినారు.'[12]

ఇందువల్ల గృష్ణరాయల కొండవీడు దండ యాత్ర స్వభావము జక్కగ దెలియవచ్చుచున్నను యుద్ధాంశ మొక్కటియైనను విశదమగుటలేదు; కాని సర్వత్ర రాయలకు జయము చేకుఱెననియు, పై చెప్పిన దుర్గములందు రాయలు నిజదళములను కాపుంచి దుర్గ సంరక్షకులను నియమించెననియు నీ క్రిందివాక్యములు దెలుపుచున్నది.

'కందూర్కి పోగా డమామిధ్వని విన్న తుణాన్నె ఆ స్థలంవారు వెళ్ళిపోయిరి. గనక ఆ స్థలం తొక్కిచూచి అచ్చట తాణ్యంవుంచి 'యచటి నుండి వినికొండకై నడవంగా వారు యీ వార్తలు విని స్థలం నిర్వహింపనేర మనియెంచి మునకలుగా వెళ్ళిపోయిరి. అక్కడ భాస్కరయ్యను వుంచి బెల్లంకొండకై నడవగా వారు పిరంగినాదం విని బెల్లంకొండ్డవారు పారిపోయిరి. యిచ్చట వీర భద్రయ్యను తాణ్యముంచి నాగార్జునం కొండ్డకై నడవగా వారు నానా ప్రయత్నముల నాట మర్నాట పోరాడి చేతగాక తమనాటికి పోయిరి. గనక అయ్య లయ్యను వుంచి...'

ఇందు వివరింపబడిన యుద్ధ సమాచారము కడు సంగ్రహము. మఱియు సంపూర్ణముగాదు. అద్దంకి తంగేడు కేతవరములమాట బొత్తిగలేదు. కందుకూరు తాణ్యమున కధిపతి యెవ్వరో పేర్కొ నలేదు. కొండవీటి దండయాత్రకు సంబంధింపని కొండపల్లి దుర్గవిషయమిందు ప్రస్తావింపబడినది. ఈ యుద్ధచరిత్రను పరామర్శించునపుడు రాయ వాచకము కేవలము నిష్పక్షపాతముగ విరచితమైన చరిత్రగ్రంథము గాదని స్మరణయందుంచుకొనవలసి యున్నది. కృష్ణదేవరాయల యశస్సును ప్రకటిం చుటకై విరచింపబడినది; కాని న్యూనిజు మొదలగు విదేశచరిత్రకారులును, రాయలశాసన ములును నతని యాస్థానమందలి కవులును విద్వాం సులును నేకకంఠముగా రాయల విజయములనే వర్ణించియుండుటవల్లను గజపతులపక్షమును వివ రించు గ్రంథములుగాని శాసనములుగాని లేకపోవుట వల్లను, నీ దండయాత్ర యనంతరము కృష్ణానదికి దక్షిణమున గజపతుల యధికారము నామరూపముల లేక సమసిపోవుటవల్లను, వారిస్థానమున

11b. ఆముక్త 1 : 37, *cf* *Numiz, p.* 318.

12. రాయ. పుట 92.

కృష్ణరాయల యధికారము జెల్లుచుండినందువల్లను, రాయవాచకమునందలి యుద్ధవృత్తాంతము సత్య మైనదని నమ్మవలసియున్నది.

కృష్ణానదికి దక్షిణమందుండిన గజపతుల దుర్గ ములను వానికి జెల్లుచుండిన రాష్ట్రములను జయించి స్వాధీనపఱచుకొని చిట్టచివర తిమ్మరసయ్య కొండ వీడు దుర్గమును ముట్టడివేసెను. కొండవీడు బలిష్ఠ మైన గిరిదుర్గము; సులభముగ సాధ్యమగునది కాదు. దాని ప్రాముఖ్యమును గుర్తించి ప్రతాపరుద్ర గజపతి దాని సంరక్షణను మఱియెవ్వరికిని ఒప్పజెప్పక తన కుమారుడును రాజ్యమునకువారసుదారుడు నైన వీరభద్ర గజపతిని రాజప్రతినిధిగ నియమించి కొండ వీడు దుర్గాధిపత్యము నొసగి యచటి కంపెను.[12a] అదిమొదలు వీరభద్రుడు శక్తిసామర్థ్యములను జూపి యచటి రాజకార్యములను నిర్వహించుచువచ్చెను. కృష్ణరాయలు కళింగ దిగ్విజయయాత్రను ప్రారం భింపగనె ప్రతాపరుద్ర గజపతి దన రాజ్యములోని దక్షిణ దుర్గములను బలపఱచెను.[13] ఉదయగిరికడ తన యోటమియు, శత్రువు వెన్నంటి తఱుమ కొండవీటి పర్యంతము దన పలాయనమును, ఉదయ గిరి పతనమును తాను డీకొన్న శత్రువు సామా న్యుడుగాడని యతనికి దెల్లముచేసి యుండును; కావున నతడు కొండవీటిని సంరక్షించుటకు విశేష ప్రయత్నముల నొనర్చియుండును; కృష్ణకు దక్షిణ రాష్ట్రములను పాలించుచుండిన యుత్కలక్షత్రియ పాత్రులెల్లను కొండవీటియం దేకమైయుండిన దీ కార్యము కొఱకేమొ?[14]

కొండవీడు ముట్టడి రెండుమూడు నెలల పర్యంతము సాగినది. ముట్టడియందు నడచిన యుద్ధ వివరము స్పష్టముగ దెలియవచ్చుటలేదు; కాని రెండు మూడంశములు మాత్రము శాసనములందును వాఙ్మయమునందును సూచింపబడియున్నవి.[15] ముట్టడి కొంతకాలము నడిచినపిమ్మట కృష్ణరాయలు విజయనగరమునుండి మరలివచ్చి సైన్యమును గలసి కొనెను. కోటదుర్భేద్యమై లొంగునట్లు కాన రాలేదు; దాని పతనము వస్తుసామగ్రి యభావ మగుటచేత తప్పనిసరియైనది. కోటలో సేకరింపబడి యుండిన ఆహారపదార్థములు జనసమ్మర్ధ మధిక మగుటచేత సత్వరము ముగిసెను; అన్న కఱువు సంప్రాప్తమాయె. ఈ యంశము శాసనములందును

12a. కొండవీటి ముట్టడి యప్పటికి వీరభద్ర గజపతి కనీసము పదునెనిమిది యేండ్లు రాజ్యమొనరించి యుండెను. ఇతడిచ్చిన భూదానమును దెల్పునది ఇతని 21వ అంకశ్రీహి కుంభ శుక్ల 15 గు. నాడు వ్రాయించినది తామ్రశాసన మొకటికలదు. (*NDI. I. cp.*21) 28వ అంకము 18వ రాజ్యవర్షమునకు సరిపోవును. ఇదియతని కడపటి రాజ్యవర్షమని యెంచినచో, కృష్ణరాయలు కొండవీటిని జయించినది క్రీ.శ. 1514 సంవత్సరమునం దగుటచే, నతని ప్రభుత్వము (1514–18) = 1496 సంవత్సరమున అనగానతని తండ్రియగు ప్రతాపరుద్ర గజపతి రాజ్యాభిషిక్తుడైన సంవత్సరమునకు ప్రారంభమై యుండవలయును. మఱియు నితని బిరుదావళిని జూడ నితడు కేవలము రాజప్రతినిధి మాత్రుడాయను సంశయము కలుగుచున్నది. రాజ్యాధిపతియైన గజ పతివలె నితడును పరమభట్టారక పరమవైష్ణవ పరమ మాహేశ్వరుడే. 'నవకోటి కర్ణాట కలుబర్గేశ్వర మహారాయ' బిరుదము లితనికి గలవు. ఉపరి, 'ద్రావిడ మండలేశ్వరు'డనని చెప్పుకొని యున్నాడు—ఇందు 'పరభమట్టారక, నవకోటి కర్ణాట కలుబర్గేశ్వర' బిరు దులు ముఖ్యముగ గమనింపదగినవి—ఇవి కపిలేశ్వర, పురుషోత్తమ, ప్రతాపరుద్ర గజపతులకు మాత్రమే చెల్లుచుండెనని వారి శాసనములవల్ల దెలియుచున్నది. కపిలేశ్వరుని పక్షమున దక్షిణాంధ్రము నంతటిని పాలించుచుండిన అతని పుత్రుడగు నంబీరదేవునికి సైతమీ బిరుదులు లేవు. మఱియు సామంతరాజులవలె గాక రాజ్యాభిషిక్తుడైన గజపతివలె 'నిజరాజ్యాంక శ్రీహి'ని శాసనమున నమూదుచేసియున్నాడు. మఱియు నితని దానశాసనమందలి సంకేత సంతక మునకును ప్రతాపరుద్ర గజపతి తామ్రశాసనములు కొన్నిటియందు గానవచ్చు సంతకమునకును నించుక యేనియు భేదము గానరాదు.

13. రాయ. పుటలు 73–74.

14. ఆముక్త. 1 : 37.

15. *Forgotten Empire, pp.* 317-18. కృష్ణ రాయలు కొండవీటి కోటను ముట్టడించియుండగా గజపతి సైన్యముతో గూడ నతని దఱుముటకు వచ్చె ననియు నా విషయ మెఱుకపడినతోడనే కొంత సైన్యమును కోటచుట్టును గావుంచి, తక్కినదండుతో నాతని నెదుర్కొనుటకు నాలుగు 'లీగుల' దూరము

వాఙ్మయమందును సూచింపబడియున్నది.[16] ఇట్లు తుత్పిపాసలకోర్వలేక కోటకాపరులుమృతినందు చుండినను, దుర్గము లోబడు చిహ్నములు గానరాక పోగా గృష్ణరాయ లెట్లయినదాని శీఘ్రముసాధించు టకు నిశ్చయించి యున్నతమైన గోడల నెక్కి లోపల ప్రవేశించుటకొఱకు వానిచుట్టును నడచప్ప రములను బెట్టించెను. తరువాత రాయదళములు లగ్గలువట్టి కోటను ప్రవేశించెను. దుర్గాధ్యక్షుడైన వీరభద్రగజపతియు, కుమారహంవీరుని పుత్రుడు నరహరిదేవుడు, రాచూరి మల్లూఖానుడు, ఉద్దండ ఖానుడు, జన్యాల కసవాపాత్రుడు, పూసపాటి రాచిరాజు, శ్రీనాథరామరాజు లక్ష్మీపతిరాజు, పశ్చిమ బాలచంద్ర మహాపాత్రుడు మున్నగు నేడ్గురు పాత్రసామంతులను మన్నెవారును పట్టుపడిరి.

బోయి యచట నొక పెద్ద యుప్పునీటినదిని దాటి యతని నోడించి తఱుమగొట్టెనని న్యూనిజు ప్రాసి యున్నాడు. 'లీ' గనగా ' *varying measure of road - distance usually about three miles.* ' అని ఆక్సుఫర్డు డిక్షనరీ నిర్ణయము. నాలుగు లీగు లనగా పండ్రెండుమైళ్ళ దూరమగుచున్నది. కాని సూయెల్ గారన్నట్లు 'కొండవీటికి పండ్రెండుమైళ్ళ దూరమునగాని యా ప్రాంతమునగాని నట్టినది యెద్ది యునులేదు. 'ఉప్పునీళ్ళను' మాటను ఉప్పచప్పలకు మధ్యస్థమైన (*brackish*) నీరని యర్థము చేసికొనవల యును (*For. Emp. p.* 317. *n.* 4). కొండపల్లె దుర్గ విజయమును వర్ణించుచు, నచట రాజ్యములోని సామంతులెల్ల గూడియుండిరనియు, గోట రాయలకు హస్తగతమైనపుడు గజపతి కుమారుడును రాజ్యము లోని ముఖ్య దళనాయకు లేడ్గురును రాయలచే బట్టు వడిరనియు వారి నందఱ నతడు విజయనగరమునకు (బందులజేసి) బంపెనని యు న్యూనిజు ప్రాసి యున్నాడు. (*For. Emp. pp.* 318-19). ఉత్కల క్షత్రియ పాత్రులందఱును కూడియుండునది కొండవీటి యందని ఆముక్తమాల్యదయందు (1:37) చెప్పియు న్నది. రాయలశాసనములలోనతనికి గజపతి పుత్రుడును మఱియెడ్గురు సామంతపాత్రులును కొండవీటియందు పట్టువడిరని చెప్పియున్నది. మరియు పై జెప్పినట్లు కొండవీటికి నాలుగు లీగులదూరమున నది యెద్ది యును లేదుగాని కొండపల్లెకు దక్షిణమున పది పండ్రెండుమైళ్ళదూరమున కృష్ణానది ప్రవహించు చున్నది. ఈయంశములను జక్కగ విచారించి చూడగా న్యూనిజుచరిత్రయందు కొండవీడు కొండ పల్లెల ముట్టడివృత్తాంతము తారుమారుగ వర్ణించినట్లు తోచగలదు. కొండవీటియుద్ధాంశములు కొండపల్లె కును కొండపల్లియందు నడచిన విశేషములను కొండ వీటికిని అంటగట్టినాడున్యూనిజు. న్యూనిజుచరిత్ర కంటె వాఙ్మయశాసనాదులధిక విశ్వాసపాత్రములు కావున వానినే యనుసరించుచున్నాడను; కాని న్యూనిజుప్రాసిన విషయములను సంపూర్ణముగ త్యజిం పక వినియోగపరచుకొన్నాడను.

16. *El. VI. pp.* 128-9

సప్తాఙ్గోపేతశక్తి త్రితయ
చతురుపాయైక మన్త్రిశసాల్వే
తిమ్మాఖ్యే కొండవీట్యామ్ గజపతి
విహితాక్ష రాజహంసాక్ష గృహిత్వా
ధాత్రీమాటీక మానే పరనృపతి
ఖగాం తుత్పిపాసాతిఖిన్నాం
శాకాబ్ధాక్ష మార్గయన్తే గిరిపురజ
లధిఙ్ఞాసుగూఢాం ప్రలీనాం.

ఆముక్తమాల్యదయందును (1:37) ఈ విష యము గూఢముగ సూచింపబడినది.

చిత్రము కృష్ణరాయనృపశేఖర
నీదగుధాటి కోడి స
ర్వత్ర నిలింపకామినుల
వాడకుగాపులువోయిరుత్కల
క్షత్రియు పాత్రులెల్ల గనుగందుని
మేనుల దొంటి పెద్దలే
సూత్రముపన్ని నారొ బలసూదను
వీటికి గొండవీటికిన్.

ఈపద్యములోని 'కనుగందని మేనులు' వ్యాఖ్యా తలను ప్రిప్పటపెట్టినది. బుద్ధి చాతుర్యము కొలది యెవ్వరికి దోచినట్లువారు అర్థము వివరించిరి. ఉత్కల క్షత్రియపాత్రులు యుద్ధమున గానిపడి చావలేదు; ముట్టడియం దాహారపదార్థములు లభింపకపోవుటచేత ఆకటికిమాడి యసువులను విడిచిరి. కావున కనుగందని మేనులతో స్వర్గమున కతిథులైరి.

రాయలు వారికి అభయదానము జేసినను విడిచిపెట్ట లేదు.[17] వీరితోపాటు ప్రతాపరుద్రగజపతిరాణులలో నొక్కతె బంధీకృతురాలైనట్లు న్యూనిజు చెప్పు చున్నాడు.[18] పెద్దనయు 'మాద్యత్కళింగాంగనా బందీగ్రాహ' యను వాక్యమునందు ఈయంశమునే సూచించియున్నాడు.[19]

కొండవీడు స్వాధీనమైనది. సాళువ నరసింహ రాయల యాదేశము మూట రెండువంతులు నెఱ వేఱినది. ఇమ్మడి దేవరాయల కాలమునందువలె మరల విజయనగర సామ్రాజ్యపు టీశాన్యసరిహద్దులు కృష్ణయు సాగరమునైనవి. కృష్ణరాయలంతట తృప్తిపడి ఖడ్గము నొఱయందు సేర్పలేదు. గజపతి యుద్ధమునకోడి యతని పూర్వికులు విజయనగర చక్రవర్తుల కడనుండి నాచికొన్న రాజ్యమునంతటిని గోలుపోయెను; కాని యతని బలమింకను నిశ్శేషముగ సమసిపోలేదు. మరల నాతడు విజయనగర ప్రతాపరుద్ర గజపతి కుమారుని వీరభద్రగజపతిని బంధీకృతునిగావించిన సంగతి యనేకుల ప్రశంసకు పాత్రమైనది.

'ఇది భూమండన కొండవీడు
ధరణీభృద్దుర్గ పూర్వాద్రి భా
స్వది భేశాత్మజ వీరభద్రజన
జీవ గ్రాహరాహూయమాణ

అని యాముక్తమాల్యదయందు కృష్ణరాయలు,
'మునుకొని కొండవీటికడ

మూఢతరుద్రుడు కృష్ణ సందనున్
మనసిజుసిన్ జయించె, నది

మానుష మే సరసేంద్రు కృష్ణరా
యన్నృపతి కొండవీటి
కడసాహవభూమి ప్రతాపరుద్రనం
దనుడగు వీరభద్రు గరుచామతి
గాచె జగత్ప్రసిద్ధిగన్.'

అని పారిజాతాపహరణమున నంది తిమ్మన.
'...యుధినగరవరేకొండ వీటొక్కండపత్యా
జీవగ్రాహం గృహీత్వా గజపతితనయం...'

అని సంగీత సూర్యోదయమున బండారు లక్ష్మీనారాయణ. (*Further Sources.* 116-(*a*))

18. *Forgotten Empire p.* 318.

ముపై నెత్తి రావచ్చును; కావున బలము చక్కగ కూడించి యతడు నమ్ముడై సంధిని కోరువరకును యుద్ధము జరుపుటకు నిశ్చయించి సైనికులను ముందుకు నడువ నాజ్ఞయిచ్చెను. క్రొత్తగ గెల్చిన రాష్ట్రమును రాయసామ్రాజ్యమున గలుపుకొని, కొండవీటి రాజ్యమును నందలి దుర్గములను సర్వ శిరఃప్రధాని సాళువ తిమ్మరసయ్య పరాక్రమము వలన సాధింపబడినవగుటచేత నాతనికే కొండవీటి దుర్గాధిపత్యము నొసగెను. తిమ్మరసయ్య తాను దండుతోగూడ నడచి కళింగ జైత్రయాత్రను జయవంతముగ సంపూర్తి చేయవలసి యుండుటచేత నతడు తన యల్లుడగు నాదిండ్ల గోపమంత్రిని తనకు ప్రతినిధిగ నచట నిలిపి సైన్యముతోగూడ తరలెను.[20]

సైన్యమును దిమ్మరసయ్యతోగూడ తరల్చి కృష్ణరాయలు విజయనగరమునకు చిన్నాదేవి

19. మను. 3 : 142.

20. 'సాల్వతినియ (సాల్వతిమ్మయ) రాయలతో గూడ తాను ఉరియూదేశముగుండ పోవుట కొఱకు తన సైన్యమునుండి తన సోదరునొక్కని దళనాయకునిగ నియమించి యచట (కొండవీటియందు) నిలిపిపోయెను' అని న్యూనిజు వ్రాసియున్నాడు. (*Forgotten Empire, p.* 318) కాని ఇది పొరబాటు. మనకు దెలిసినంతమట్టుకు సాళువ తిమ్మయకు సాళువ గోవిందరాజొకడు దప్ప యన్య సోదరులు లేరు. సాళువ గోవిందరాజు రాయల కళింగ దండయాత్రలో బాల్గొనెనని యెంచుట కే యాధారమును లేదు. మఱియు క్రీ. శ. 1514 వ సంవత్సరమున కొండవీటిని సాధించినప్పటినుండి క్రీ. శ. 1525 వఱకును తిమ్మరసు పక్షమున నాదిండ్ల గోపయ దుర్గాధిపతియై యుండినట్లు శాసనములు దెల్పుచున్నవి. రామరాజు రంగప్పరాజ కృతమైన సాంబోపాఖ్యాన పీఠికయందు ఆరెవీటి పినకొండ రాజు 'కృష్ణరాయ రాజ్యలక్ష్మి నిరీక్ష పద్మాలంబగు కొండవీడఖీణ కాఱేయు, డని చెప్పియున్నది. (*Further Sources of Vijayanagar History Vol. II. No.* 122). రాయవాచకమున జెప్పినట్లు కృష్ణరాయలు కొండవీటియందు తాణ్యము ఉంచిన కొండయ్య ఇతడే కాదగును. కాని ఇతనికి దుర్గాధ్యక్షుడైన సాళువ తిమ్మరసయ్యతోడను, అతని ప్రతినిధియైన నాదిండ్ల గోపమంత్రితోడను గల సంబంధ మెట్టిదో తెలియదు.

తిరుమల దేవులతోగూడ బయలువెడలెను; కాని యతడు పుణ్యక్షేత్ర సందర్శనలాలసు డగుటచేత సూటిగరాజధాని మార్గమునబట్టక మొట్టమొదట కృష్ణాతీరమందలియమరావతికిబోయి దేవులతోగూడ నమరేశ్వరస్వామిని సేవించి తులాపురుషదానము జేసెను; తమ దేవుళ్లు చిన్నాజిదేవమ్మ తిరుమల దేవమ్మగారిచేతను మహాదానాలు సేయ నవధరించెను.[21] తరువాత శ్రీశైలమునకు విచ్చేసి మల్లికార్జునస్వామిని సేవించి తేరువీధి కిరుప్రక్కలను మంటపశ్రేణుల నిర్మించి, నిత్యనైవేద్య పూజాపురస్కారముల నడపుటకొఱకు కొన్ని గ్రామములను దేవాలయమునకు సమర్పించి, గుఱ్ఱములు యెద్దులు గాడిదలు మున్నగువానిపై గొనివచ్చు సామానులపై జెందవలసిన సుంకమును సర్వమాన్యము జేసెను.[22] రాజ్యకార్యములను విచారించుటకై 'తిరిగి విజయనగరానకు విచ్చేసి రత్నసింహాసనము నుండి సామ్రాజ్య' పాలనము సాగించుచు గొన్ని దినములు గడపెను. మరల కళింగదేశమునకు దిగ్విజయార్థము బయలువెడలి మొట్టమొదట ఇష్టదైవమగు శ్రీ వేంకటేశ్వరులను సేవింప శా. శ. 1437 యువ కార్తిక బ. 3 గురువారమునాడు తిరుపతికి విజయముజేసి 'తిరువేంగళనాథునికి నవరత్న ప్రభావళిం' మకరతోరణం ం' సమర్పించెను.[23] అచటినుండి బయలుదేరి యుత్తరముగ శేషాచలపర్వతమువెంబడి ప్రయాణముజేసి శా. శ. 1438 యువ పుష్య శు. 15. శుక్రవారమునా డహోబలముజేరి చెంచులక్ష్మీ సహితుడైన నారసింహుని సేవించి వజ్రపతకముతోటి రత్నహారమును రత్నకంకణములను చాంగలమఱ్ఱిసీమలోని మదూరుగ్రామమునుదానము జేసెను.[24]

కృష్ణదేవరాయ లిట్లు విజయనగరమునకు పోవునప్పుడును వచ్చునప్పుడును దారిపొడుగునను గల పుణ్యక్షేత్రములనుసేవించి సావధానముగ బెజవాడకు వచ్చిచేరెను; అంతకుముందె బెజవాడ రాయరాణువకు గైవసమైనట్లున్నది. బెజవాడ విజయప్రస్తావను శాసనములలో నెందును గానరాదు; కాని కృష్ణరాయల పూర్వదిగ్విజయమును వర్ణించుచు సమకాలికుడగు నఱ్ఱాలకవి యొక్కడు 'కూలెబెజవాడ' యని వచించియున్నాడు. కాని యప్పుడు గజపతిపక్షమున నా పట్టణము నెవ్వరు పాలించుచుండిరో యెట్లది రాయలకు హస్తగత మాయెనో తెలియదు; ఎట్లు స్వాధీనమైన నేమి? పేరువాతి కళింగయుద్ధ యాత్రయందు విజయనగర తనలకు జాల ననుకూలమైన పెంకియాయెను.

కొండపల్లె

ఇదియొక బలిష్ఠమైన గిరిదుర్గము. గజపతి సామ్రాజ్యములోని ముఖ్యమైన ఆయపట్టు స్థానములలో నిది యొక్కటి. తెలంగాణమునకు బోరుతలుపు; అది హస్తగతమైన తెలింగాణమును జయించుట బహు సులభము. ఈ విషయమును జక్కగ గుర్తించిన వాడగుటచేత ప్రతాపరుద్రగజపతి దాని సంరక్షణకు దగిన యేర్పాటులను గావించెను. ప్రహరేశ్వరపాత్రుడు మున్నగు పెక్కండ్రుత్కల క్షత్రియుల నచట గాపుంచెను. శత్రుజన భయంకరములైన మారణయంత్రముల నచట నెలకొల్పెను. దుర్గ్రహణమున నేర్పఱులైన రాయసేనాధిపతులు జంకుదురా? ఉదయాద్రి కొండవీడులకు మించినదా కొండపల్లె? ముట్టడి ప్రారంభమై కొంతకాలము నడచినది; కృష్ణరాయలే స్వయముగ ముట్టడి కార్యములను నిర్వహించుచుండెను. దాదాపు రెండునెలలు గడచినవి. అంతట ప్రతాపరుద్రగజపతి తన దుర్గములను రాజ్యమును సంరక్షించుటకొఱకు 1300 యేనుగులు 20000 గుఱ్ఱములు 500000 కాల్బలమునుగల ప్రచండసైన్యముతో గృష్ణరాయలను దఱుమగొట్టి ముట్టడిని లేపవలయునను నుద్దేశముతో వచ్చెను. అతడు తెలంగాణ ప్రాంతమునందెచ్చటనో కృష్ణను దాటివచ్చి నదీ దక్షిణతీరమున రాయలసైన్యమునకు బిఱుదున విడిసి, వెనుకటినుండి తాకుటకు ప్రయత్నము సేయదొడగెను. యుద్ధదృష్టిని చూచిన ప్రతాపరుద్రగజపతియొక్క యెత్తుగడ ప్రశంసనీయ

---

21. *ARE* 266 *of* 1897 (*El. VI pp.* 17-22)
22. *ARE*, 18 *of* 1915, *Part I Para* 16 .
23. *TTDI. III. No.* 76.
24. *ARE* 64 *of* 1915, *LR.* 15 *pp.* 341-33.

మైనదే. రాయ సైన్యమును వారి మూలపీఠస్థానము నుండి వేర్పఱచి వస్తుసామాగ్రిని వారికందనీయ కుండ ఇడుములుపాలుజేసి వెనుకనుండి తాను గవిసిన ముంగలనుండి కోటలోని ధాన్యము పైబడిన వారిని నాశముసేయుట సులభమని తలచెను; కాని కృష్ణరాయలయుద్ధ కౌశల్యము నతడు గణుతికి దేడాయె. ప్రతాపరుద్రుని ప్రయత్నములు రాయల కెఱుక పడగనె శత్రువును నదిని దాటిరానిచ్చుట క్షేమకరముగాదని యెంచి స్వయముగ తానే నది నుత్తరించి యచటనె మార్కొనుటమేలని యతడు నిశ్చయించెను. కావున కోటలోనివారిని వెలుపలికి పాఱిపోనీయక బలిష్ఠమైనదళమును కోటచుట్టును గాపుంచి, తక్కినదండును వెంటబెట్టుకొని నాలుగు లీగులదూరము కూచిచేసి, కృష్ణ యొడ్డునకువచ్చి చేరెను. నది కావలిగట్టున విడిసియుండిన ఒడ్డెదండును జూచి యచ్చటనె యాగి ప్రతాపరుద్రగజపతి కిట్లు సందేశమంపెను : 'మీరు నామీద యుద్ధకార్య మునడుప నిశ్చయించిన నేను నదీతీరమునుండి రెండు లీగులదూరము వెనుకకు జరిగిపోయెదను; మీరు నిరాటంకముగ నదిని దాటిరావచ్చును; మీరు దాటిన వెంటనె యుద్ధము సేయుదము.' ఈ సందేశ మునకు గజపతి ప్రత్యుత్తరమీయక యుద్ధప్రయత్న ములు సేయగడగెను. దానిని పొడగని కృష్ణరా యలు దనయావత్తు దళములతోడను ఏనుగుల తోడను నదిని దాట నారంభించెను. రాయలదండు నదిని దాటునపుడు శత్రువులతో సంఘర్షణగలిగి ఘోరపోరాటము నడచెను; ఇరుపక్షములను అనేకులు మడిసిరి. శత్రులను సరకుసేయక కృష్ణ రాయలు నది నుత్తరించి, యావలి గట్టుజేరి మహా పరాక్రమముతో గజపతిని పోరనిర్జించెను; గజపతి రాయల ప్రతాపమున కోర్వజాలక పలాయితు డాయెను; అతని గుఱ్ఱములును, ఏనుగులును రాయలకు హస్తగతమైనవి.[25] ప్రతాపరుద్రగజపతి నోడించి పాఱదోలి కృష్ణదేవరాయలు మరల కొండ పల్లెను జేరి తన శక్తిసామర్థ్యములను వినియోగ పఱచి కోటను స్వాధీనము జేసికొనెను. దుర్గాధ్య క్షుడైన ప్రహరేశ్వరపాత్రుడు (ప్రహరరాజు శర శ్చంద్రమహాపాత్రుడు) ను నతని సహాయులైన బోడజన మహాపాత్రుడును బిజిలిఖానుడును జీవ గ్రాహముగ పట్టుకొనబడిరి.[26]

తెలంగాణ దుర్గములు

కొండపల్లెను జయించినపిమ్మట కృష్ణరాయలు తెలంగాణముపై దండువెడలెను. తీరాంధ్ర దేశమువలె తెలంగాణమును గజపతుల యేలుబడి క్రిందనుండెను; క్రీ. శ. 1484 ప్రాంతమున పురుషోత్తమ గజపతి మహమ్మదీయులను బాఱద్రోలి కొండవీటి నాక్రమించినప్పుడు కొన్నిటిని సాధిం చెను; క్రీ. శ. 1500 వ సంవత్సరమున ప్రతాపరుద్ర గజపతి దక్షిణ దిగ్విజయమునకు బయలు వెడలినప్పుడు తెలంగాణమున జాలభాగమును జయించినట్లున్నది. ఈ విజయయాత్రయందు భోగి వంశజుడును మానభూపాలుని పుత్రుడునగు చిత్తాంబు లేక సిత్తాపభానుడను నతడు ప్రతాప రుద్రునికి సహాయపడినట్లు తోచుచున్నది. ఏలన నితడు క్రీ. శ. 1504 వ సంవత్సరమున వ్రాయించి యోరుగంటి కోటయందు నిల్పిన శిలాశాసనము నందు తాను మహమ్మదీయులను అనగా బహమనీ సుల్తానును జయించి యోరుగంటిని సాధించితినని చెప్పుకొనియున్నాడు.[27] ఇతని యధికారము క్రింద కంభమువెట్టు రాజాద్రి మున్నగు పెక్కు దుర్గము లుండెను; మఱియు గొండవీటిసీమకు జెల్లుచుండిన బెల్లంకొండ సైతము ఇతని పలుబడి క్రిందనుండెనని మహమ్మదీయ చరిత్రలవలన దెలియుచున్నది.[28] చిత్తాంబుభానుని కుటుంబమునొక్క పూర్వచరిత్ర తెలియదు. అతని పెద్దలు నామనిశానులు లేనివారు. స్వశక్తి సామర్థ్యములవల్లనే యాతడు ప్రఖ్యాతు డాయెను; కావున బహమనీ సుల్తానుల బలము నత

---

25. ఈ యుద్ధము కొండవీటికడ జరిగెనని న్యూనిజు వ్రాసియున్నాడు; కాని ఇది పొరపాట నియు వాస్తవముగ జరిగిన స్థలము కొండపల్లె పరి సరములందని ఇంతకుముందు సూచించియున్నాడను. (*See n.* 15) ఆ విషయము నిచట మరల జర్చింపవల సిన యవసరములేదు.

26. *TTDI. III.* 80.

27. *Memoirs of the Hyderabad Archaeological Department, No.* 9

28. *Briggs' Ferishta, III, p.* 360.

డన్యసహాయములేక ప్రతిఘటించి రాజాద్రి యోరుగల్లు మొదలగు దుర్గములను సాధింపజాలెననుట యంత విశ్వాసపాత్రముగ గనుపట్టదు. అతడు గజపతికి సామంతుడై యుండవచ్చును. కాదేని యతనిమైత్రిని సంపాదించి తన్మూలమున బహమనీ సుల్తానుల యధికారము దొలగద్రోసి యోరుగల్లు మున్నగు స్థలములను సంపాదించియుండును.

ఈ కారణమున కృష్ణరాయలు కొండపల్లెను సాధించిన వెనుక కళింగరాజ్యముమీద ముందు సాగిపోవక పశ్చిమముగ తెలింగాణ భూములవంక దన సైన్యములను ద్రిప్పెను. పార్శ్వమున నిన్ని ప్రబల దుర్గములు గజపతి యాధీనముననుండ, ముందుకు నడచుట క్షేమకరము గాదని యత డెంచెను. కృష్ణ రాయలు జయించిన తెలింగాణదుర్గము లతని శాస నములందును, సమకాలికాంధ్ర వాఙ్మయమునను బేర్కొనబడియున్నవి. 'అనంతగిరి, ఉండ్రగొండ, అరువఅల్లి, జల్లిపల్లి, కందికొండ, కప్పలువాయి, నల్లగొండ, కంభంమెట్టు, కనకగిరి, శంకరగిరి ఇవి మొదలైన తెలింగాణ్య దుర్గాలు ఏకధాటిని కైకొని' నట్లు శాసనములు దెల్పుచున్నవి.[29] ఇవిగాక 'దేవర కొండ యుద్వృత్తి భంగముజేసె'నని ముక్కు-తిమ్మ న్నగారు చెప్పుచున్నారు.[30] అనుమకొండ కైఫీయ తులో ఓరంగల్లు దుర్గమునుండి తురుష్కులను బాఱ దోలినట్లు చెప్పియున్నది.[31] ఇది సంశయాస్పదమే కాని యసంగతముకాదు. ఈ దుర్గము లన్నియు నిప్పటి హైదరాబాదు రాజ్యములోని మహబూబు నగరు నల్లగొండ వరంగల్లు జిల్లాలయందున్నవి. వీనిని పాలించుచుండిన శత్రులెవ్వరో యవి రాయల కెట్లు వశపడెనో తెలుపు నాధారము లెవ్వియులేవు; కాని కంభముమెట్టును ఓరుగల్లును సితాపుఖానుని రాజ్యమందలి ముఖ్యస్థానములు. మహమ్మదీయ చరిత్రకారులు చెప్పునట్లు బెల్లంకొండ దుర్గమును అతనిదె యగునేని అతనికి రాయలతోడ కొండవీటి దండయాత్రయందె ఘర్షణ కలిగియుండవలయును.

అతని యునికిపట్టైన కంభముమెట్టును రాయలు గొనవచ్చినప్పు డతడు రాయల నెదుర్కొని యుండు నని మనము దృఢముగ జెప్పవచ్చును; కాని యప్పటి శాసనములందుగాని వాఙ్మయమునగాని సితాప ఖానుడు రాయలను డీకొన్న ప్రస్తావము లేదు. రాయవాచకమునను కృష్ణరాయవిజయమునను చిత్తాపఖానుడు కొండభూమియందు కనుమలలో నెచ్చటనో సింహాచలమునకుబోవు మార్గమున విజయనగర సైన్యమున నడ్డగించి పరాభూతు డాయెనని చెప్పియున్నది.

"అందుండి గజపతి రాజ్యానకై నడవగా అప్పాజీ రాయలవారితో మూడుతెగల తురకల రాజ్యమంతా కపోలంచేసి వారి దుర్గాలున్ను స్థలా లున్ను కట్టుకొని అహమదా నగరం అమిద్యాలు విత్తించి గజపతివారి గిరి దుర్గం జలదుర్గం స్థల దుర్గం వనదుర్గం యివి అన్నియు ఆక్రమించినట్టా యను. ముందర కదలి పొయ్యేది కార్యంగాదు కనుమలు దాటిపోవలెను. కనుమలలోనున్న గజపతి తెగవారు సామగ్రి రానియ్యరు' అని మంత్రా లోచనగా విన్నపం శేషినంద్రులకు ఆ విశదం రాయలవారు చిత్తానపుంచ్చుక ముందర కదలిపోవల నని దృష్టిని యెదురులేదని యెంచ్చి అప్పాజీగారు విన్నపం శేషినంద్రులకు అవుముగాలు ఉత్తరవియ్యక కదలిపోగా,

గజపతివారి కనుమల నడమ పొయ్యేటప్పుడు చితాపుఖాను అనేవాడు అరవైవేల శింగ్గాణి రౌతుల తోడట్టు కనుమమార్గమునపొయ్యే రౌతు (రాయ ?) రాణువమీద చిత్తవానగురిశిన రీతి అమ్మల గురియించ్చగా అంమ్మలనుండి తప్పించ్చు కొనువారున్ను ఆ యంమ్మల యెదురై నిలిచిన వారున్ను ముంద్దువెనుక తెలియక నిలిచినవారున్ను ఆడాడ దిగ్భ్రమపడి వున్నవారున్ను యీ రీతిన వుండ్డగా చితాపుఖానునికి యెదురు లేదు గనుక జగడంశాయగా,

ఆ సమయాన కర్నాటకం కైజీతంరౌతులు చితాపుఖానునికి పెడతలపోట్లుగాయిరు పార్శ్వాల కనుమలపొడవున నెక్కి చితాపుఖానుని వెనక

---

29. *TTDI. III.* 80.
30. పా౪. 1 : 23.
31. *Further Sources II No.* 124.

దిక్కులకై వచ్చి శింగ్గాణులచేతనున్ను ఖడ్గములచేత నున్ను బరిజీలచేతనున్ను వేటారు తునకలుగా నరకగా చితాపుఖానుని తెగలకు కనుమలలో నిలువకూడక విరిగిపారగా వెంబ్బడించ్చి తరుముకబోయి వారిని దుర్గం చొరదోలి తిరుగా వచ్చిరి. గనక అప్పుడు చిత్తాపుఖానుని తెగలో యిరువైమూడువేల స్తోమమున్ను నాల్గువేలగుర్రములున్ను వఖతావున్నెమడిసి అటుతర్వాత సమదళం ఆద్యంతమున్ను ముంద్దర కదలిపోయిరి. గనుక ఆకనుమల్లోముపై వేల స్తోమాన్ని తాణ్యం వుంచ్చి అవతల గజపతి వారి సీమాద్యంత్తం నిపాతం చేసుకపోయిరి.''[32]

సింహాద్రి

ఇందువలన కృష్ణరాయలకు తెలుంగాణ్యము నుండి తీరదేశమునకు బోవుమార్గమందు చిత్తాపఖానునితో యుద్ధము సంఘటిల్లెనని తెలియుచున్నది. శత్రురాజ్యములోని కింకను చొచ్చుకొనిపోవలదనియు నది క్షేమకరము గాదనియు వారించు తిమ్మరుసుమంత్రిసలహా నంగీకరింపక ముందు సాగి నందుకు ప్రథమప్రతిఫలమిది; కాని సామాన్యదండనాయకులకది దుర్లంఘ్యమేకాని యసాధారణమేధాసంపదగల కృష్ణరాయల నది యాపజాలకపోయెను. చిత్తాపఖానుడు కనుమమార్గము నరికట్టిన రాయలు నిజసైనికులను కొండలెక్కించి యతని పుచ్ఛమునుండి మార్కొనజేసి మార్గమును నిర్బంధము గావించెను. ఈ కనుమమార్గమె గాబోలు నల్లసాని పెద్దనగారు పేర్కొన్న 'జమ్మిలోయ.' అగునేని, 'జమ్మిలోయబడి వేగిదహించె'నని పెద్దన గారు చెప్పియుండుటచేత నది తెలింగాణమునుండి పేంగిదేశమునకు ననగా కృష్ణాగోదావరుల మధ్య తీరదేశమునకు బోవుదారిలో నుండెనని యనుకొన వలసియున్నది. శాసనములందును, న్యూనిజు చరిత్ర యందును, మటికొన్ని సమకాలిక రచనలయందును, రాయవాచక కృష్ణరాయవిజయములందును తెలింగాణ దుర్గములను సాధించిన పిమ్మట కృష్ణరాయలు సూటిగ సింహాచలముపై నడచినట్లు చెప్పియున్నది; కాని కృష్ణరాయలు శకాబ్దము 1438 ధాతుచైత్ర బ. 12. వడ్డవారమునాడు సింహాచలమున నిల్పిన రెండు శిలాశాసనములందును 'ఉద్దగిరి కొండవీడు కొండపల్లి రాజమహేంద్రావరం మొదలైన దుర్గాలు సాధించి సింహాద్రికి విచ్చేసి' యని చెప్పియున్నది.[33] ఇందువలన కృష్ణరాయలు సింహాద్రికి విచ్చేయుటకుముందు రాజమహేంద్రవరమును జయించెనని తెల్లమగుచున్నది. రాజమహేంద్రవరము వేంగిదేశమునకు రాజధాని. కావున సింహాద్రికి విచ్చేయుటకుముందు కృష్ణరాయలు వేంగిదేశమును జయించుటయేకాక యాముక్తమాల్యద మనుచరిత్రల పీఠికయందు చెప్పినట్లు 'కోనబిట్టేర్చి కొట్టాన దగిలె'ను.

ఆవల పొట్నూరి సింహాద్రిని జేరెను. తరువాతి వృత్తాంతమును న్యూనిజిట్లు వివరించియున్నాడు: ప్రతాపరుద్రగజపతి నెదురుచూచుచు కృష్ణరాయలచట నాఱుమాసము లాగెను. 'నేను యుద్ధరంగమున తమరాకను నిరీక్షించుచున్నాడను' అని సందేశము పంపెను; కానియతడు రాడాయె. ఆ పట్టణమున రాయలు పెక్కు ధర్మకార్యముల నొనర్చెను; దేవాలయములకు దానము జేసెను; ఒక గొప్పదేవాలయమును నిర్మించి దానికధికమగు వరుంబడివచ్చు నేర్పాటులను గావించెను; దానిపై నీక్రింది యర్థముగల శాసనమును జెక్కించెను. 'ఒకవేళ నీ యక్షరములు మాసిపోయిన పిమ్మట ఒడ్డె రాజు విజయనగర భూపాలునితో సమరమునకు వచ్చునేమె. ఈ యక్కరముల నొడ్డెరాజు తుడిపించెనేని విజయనగర భూమీశ్వరుని గుఱ్ఱములకు లాడములుగొట్టు కమ్మరుల కతని భార్య యీబడును.'[34] ఈ జయస్తంభ స్థాపనను సమకాలికులనేకులు ప్రశంసించియున్నారు; కాని దీని మీది శాసన తాత్పర్యమును పెద్దనగారును కృష్ణరాయలును వేఱువిధముగ వక్కాణించి యున్నారు.[35]

---

32. రాయ 93–5, కృష్ణ. విజ 3 : 70–73.
33. *SII. VI Nos.* 694, *and* 696.
34. *Nuniz, Forgotten Empire, p.* 318.
35. *Further Sources II Nos.* 116. (*a*), (*e*), మను. 1 : 39; ఆముక్త 1 : 40.

'అభిరతి గృష్ణరాయ విజ
యాంకము లీవు లిఖించి తాళస
న్నిభముగ బొట్ట నూరికడ
నిల్పిన కంబము సింహభూధర

ప్రభుతిరునాళ్ల కుం డిగు సు
ప్రకరంబు కళింగమేదినీ
విభు నపకీర్తికజ్జలము
వేమఱు పెట్టి పఱించు నిచ్చలున్.'

ఇది న్యూనిజు చెప్పినదానికంటె గడు సభ్యముగ నున్నది. రాయ లచట నిర్మించిన దేవాలయమును దానితో గూడ నట డచట నిల్పిన జయస్తంభమును రూపు చెడిపోవుటచేత వాస్తవమైన శాసనార్థమేదియో నిశ్చయించుటకు వీలులేకున్నది.

కటకము

సింహాద్రియందు జయస్తంభమునునిల్పి కృష్ణరాయలు విజయనగరమునకు మరలిపోయెను; మార్గమున రాజమహేంద్రవరమునం దాగియతడును దేవేరులు చిన్నాదేవియు దిరుమలదేవియు మహాదానములను జేసిరి.[36] శా. శ. 1438 ధాతు ఆషాఢ బ. 15 అమావాస్య, కటకసంక్రాంతి పుణ్యకాలమున కృష్ణవేణీతీరమున కృష్ణరాయలు గజపతిమీద దండయాత్రచేసి జయస్తంభము నెత్తించి వచ్చునప్పుడు అతని దండనాయకులలో నొక్కడగు కుమార ధనుంజయుడొక యగ్రహారమును బ్రాహ్మణులకు దానము జేసెను.[37] కావున నప్పుడు కృష్ణరాయలు బెజవాడయందో తత్పరిసరములందో విడిసియుండెనని మనము నిశ్చయముగ జెప్పవచ్చును. ఆ సంవత్సరపు పుష్య శుద్ధ 10 శుక్రవారమునాడు విజయనగరమునుండి తిరుమలకు విచ్చేసియుండుటవలన ధాతు ఆషాడ బ. 15 అమావాస్యకును పుష్య శుద్ధ 10 కి మధ్య నొకనాడతడు విజయనగరమునకు జేరియుండును. మరల దాచాపు ఒక సంవత్సరకాలము దక్షిణరాజ్యములందు సంచరించుచుండినట్లున్నది. చిదంబర దేవస్థాన గోపురముపై జెక్కియుండు నొక శిలాశాసనమున నతడు సింహాద్రికడ జయస్తంభము నెత్తించి పొన్నంబలము (చిదంబరము)నకు వచ్చినట్లు చెప్పియున్నది.[38] కాని మరుసటియేడతడు మరల కళింగమునకు బయలు వెడలెను. అప్పుడు కృష్ణాతీరమున బెజవాడలో మల్లికార్జునస్వామిసన్నిధిని శా. శ. 1440 బహుధాన్య వైశాఖ శుద్ధ 15 చంద్రగ్రహణకాలమున కృష్ణరాయలు అల్లసాని పెద్దనగారికి కోకట గ్రామము నగ్రహారీకరించి దానము జేసెను.[39] కృష్ణరాయలు శా. శ. 1438 ధాతు వైశాఖము నుండి శా. శ. 1440 బహుధాన్య వైశాఖము వఱకును మధ్య దాచాపు రెండేండ్లకాలము సైన్యముతో గూడ నుండక సామ్రాజ్యమున సంచరించుచుండినను, కళింగమున యుద్ధమాగ లేదు. అతనిసేనాధిపతులీ మధ్యకాలమున గజపతి రాజ్యముపైని ఎడతెఱపిలేక దండయాత్ర సేయుచుండిరి. శా. శ. 1438 ధాతు ఫాల్గుణ బ. 5 బుధవారమునాటికే రాయరాణువ కటకమువఱకు కూచిచేసియుండెనని తిప్పరసయ్యకుమారుడు లక్ష్మీకాంతరసయ్య వ్రాయించిన కొమ్మూరుశాసనమువల్ల విదితమగుచున్నది.[40] ఈ ధాటియండే మనుచరిత్ర, ఆముక్తమాల్యద పీఠికలందు జెప్పినరీతిని, ఒడ్డాదిని మసియొనర్చి మాడెములు గాల్చినది.[41]: ఒడ్డాది ప్రస్తుత విశాఖపట్టణమునందలి వీరవల్లి, తాలూకాలో నున్నది. ఒడ్డాది మత్స్యవంశక్షత్రియులకు రాజధాని. కృష్ణరాయల దండయాత్ర యప్పుడచట నెవ్వరు రాజ్యముసేయుచుండిరో తెలియదు. 'రాయరావుతగండరాచయేనుగువచ్చి' జీరాడిన యారట్లకోటయు నీ ప్రాంతములోనిదే. మాడెములు బహువచనమునుండుట గమనింపదగినయంశము. వాని సంఖ్య యేడు. శ్రీనాథకవి వర్ణించిన సప్తమాడియములివియె గంజాముమండలమున తూర్పుకనుమల పొడువుననుగల పర్వతప్రదేశమున వెలసిన యేడు

---

36. *Nuniz, Forgotten Empire, p.* 319 *TTDI. III.* 80.

37. *EC. V. Hn* 13.

38. 378 *of* 1913 *ARE,* 1914 *Part II, Para* 30.

39. *LR.X. The Kaifiyat of Kokatam.*

40. 894 *of* 1922.

41. మను ౧ : ౩౯ ఆముక్త. ౧ : ౪౦.

చిన్న రాజ్యములకు పూర్వమీనామము చెల్లు చుండినది. కావున కృష్ణ రాయల సైన్యము గంజాము మండలమునెల్ల ద్రొక్కిచూచి గజపతి రాజ్యముయొక్క హృదయమును భేదించుకొని పోయినది. ఈ సందర్భమునసె రాయసముకొండ మరసయ్య శ్రీకూర్మమున జయస్తంభము నిల్పి నది.[42] కటకమును గాల్చినదికూడ నిప్పుడే కాబోలు.

కాని ఈ దండయాత్రతో కళింగయుద్ధము తుదముట్టలేదు; బహుధాన్య వైశాఖ శుద్ధ 15 చంద్రగ్రహణకాలమున గృష్ణరాయలు బెజవాడకు వచ్చెనని పైజెప్పియున్నదికదా. మటియు నాముక్తమాల్యదపీఠికయందు 'మున్నే గళింగ దేశవి జిగీషామనీషం దండెత్తిపోయి విజయవాటిం గొన్ని వాసరంబు లుండి శ్రీకాకుళనికేతనుండగు నాంధ్ర మథుమథను సేవింపబోయి హరివాసరోప వాసం బచ్చట గావింప నప్పుణ్యరాత్ర చతుర్థ యామంబున' యని యున్నది.[43] ఈ హరివాసరము శా. శ. 1440 బహుధాన్య ఫాల్గున శుద్ధ 11 శుక్రవారమని యచట కృష్ణరాయలు చెక్కించిన శిలాశాసనమువల్ల దెలియుచున్నది.[44] కావున అప్పటివఱకును (శా. శ. 1440 బహుధాన్య ఫాల్గుణశుద్ధ 11 వఱకు) కళింగయుద్ధము సమాప్తము గాలేదు. కృష్ణరాయ లింకను కళింగ దేశ విజిగీషామనీషం దండెత్తిపోవుచునే యుండెను. ఈ ఘాటియందు నడచిన యుద్ధ వృత్తాంత మెచ్చటను వర్ణింపబడియుండలేదు. బండారు లక్ష్మీనారాయణ మాత్రము సింహాద్రిని జయస్తంభ మును నిల్పినపిమ్మట.

సోఽయం కృష్ణ నృపేశ్వరో గజపతిం
జిత్వా తదీయశ్రియా
సాకం తస్య సుతా ముదూహ్య,'

అని చెప్పియున్నాడు; కాని ఆ యుద్ధము కొండ మరసు లక్ష్మీకాంతరుసులదాడికి జెల్లవచ్చును. రాయవాచకమున కృష్ణరాయల కడపటి దండ యాత్ర విపులముగ వర్ణింపబడియున్నది.

సింహాద్రినుండి ముప్పది యామడలదూరము కూచిచేసి పోయి కటకమునకు నాలుగు క్రోశము లలో వచ్చి పాళెముడిగెను.[45] గజపతి ప్రతాప రుద్రునికి తహతహ పుట్టినది. కటకమును విడిచి పోవుట కాతని కిష్టములేదు. ఎట్లయినను కృష్ణ రాయలను బాఱదోలి దానిని సంరక్షించుట యుక్తము. కావున తన రాజ్యమూలస్తంభ ప్రాయులైన షోడశ మహాపాత్రులను సముఖము నకు రప్పించి రాజధానిని శత్రుహస్తగతము గానీయక కాపాడవలసిన భారము వారిపైనున్న దని తెల్పి వారి సలహానడిగెను. అందుకు వారు కృష్ణరాయ 'లాయు' లనియు తాము 'స్థాయు' లనియు, 'నట్టిపట్ల యెదురు యెంచక లోతు యెరుగరు గనక లోజొచ్చివచ్చినారు. మంత్రా లోచన మీద వచ్చిన కార్యంగాదు, హామీకమీది కార్యం, గనక వారి కేమప్పు మన కార్యం జయమౌను'; 'మన శీమప్రజలకు వారలవీంగతోలి స్థలాలున్న నిలువవలెనన్న ఉత్సాహపుష్టిగనక ఇట్టి పట్ల మనం కనుపించుకొంట్టేను కర్ణాటకంవారు

---

42. *SII. IX, Part II.* 507.

43. ఆముక్త 1 : 11.

44. చూ. లక్షణరాయవ్యాసావళి పుటలు 33–34.

స్వస్తి శ్రీ విజయాభ్యుదయ శాలివాహన శక వర్షంబులు 1440 అగు నేటి శుద్ధ 11 శుక్రవారం శ్రీకాకుళపు తెలుగురాయలకు శ్రీ మన్మహారాజాధి రాజ పరమేశ్వర శ్రీ వీరప్రతాప శ్రీ కృష్ణదేవ మహా రాయలుంగారు దణ్ణం సమర్పించి యిచ్చిన ధర్మ శాసనం॥ స్వామికి కుంభ సంక్రమణ పుణ్యకాల మందు సందర్శించి...ఇత్యాది.

45. కటకము రాయవాచకమున బేర్కొన బడియుండలేదు; కాని 'పొట్లూరి సింహాద్రివద్ద శిబిరం దిగినారు. యిక్కడికి నాలుగుక్రోశముల మేర వచ్చి వున్నారు.' ఎక్కడికి? పట్టణసమీపానకు వచ్చినారు.' ఆ పట్టణంగజపతి రాజ్యములో మొదటిస్థళం' (పుట 97). 'అనింన్ని విచారించుకోక ముప్పైయామడ దూరం గజపతిసీమలో జొచ్చి మొదటిస్థలంవద్ద దిగి నందువల్ల వారికి ఆలోచనబుట్టి యింత్తకార్యాలకు తెగవేసినారు.' (పుటలు 101–102). సింహాద్రికి ముప్పదియామడలదూరమున నుండిన రాజ్యమున మొదటిస్థలమగు పట్టము కటకము గావలయునుగాని యన్యము గాజాలదు.

నిలువలేక తమశీమకు పొయ్యేమని బోదురు' అని వారు బదులుచెప్పిరి. ప్రతాపరుద్ర గజపతి సంతసించి వారికి 'వక్కలాకు లిప్పించి' మరుసటి యుదయమున విజయనగర స్కంధావారముపై బడుటకు నిశ్చయముజేసి వారిని వారివారి విడిదల కంపెను.

అప్పటికి సూర్యుడస్తంగతుడాయెను; కాని గజపతి యాస్థానమందుండిన కర్ణాటకంవారి స్థానాపతి కమలనాభయ్య పై విషయమునంతటిని 'సత్కృచ్ఛముగా కాకితము వ్రాయించి ముద్రబడి జేసి గోప్యముగా రాయలవారు అంతఃపురానవున్న ప్పటికిన్ని ఆయనచేతనే కాకితములు యిమ్మనిచెప్పి' అంపెను. ఆ కాకితము చదువగనె రాయలకు కళవళము గలిగినది. తాను 'యాయు' వే, 'స్థాయు' లతో పోరాట సుకరము గాదు. షోడశ మహాపాత్రులేకమై గజపతిసీమప్రజల కగ్నికి వాయువువలె దోడ్పడిన, దనజయమునూట నటుండనిచ్చి సైన్యముతో గూడ జేమముగ మరలిపోగల్గుటగూడ సంశయాస్పదమే. 'కార్యం బిసతప్పి' నని గుర్తెఱిగి 'తబ్బిబ్బాయను'. సైన్యము స్థితినారయుటకు కృష్ణరాయలు 'దీవిటి కొలువై విచ్చేసినట్టుగా నడిపించ్చి నగరశోధనగా పాళ్యాలు' చూచుచు వచ్చిరి. గజపతివారు మరుసటి ఉదయము నమ స్కంధావారముపై నెత్తిరాగలరను వార్త యెట్లో పొక్కినది. 'పాళ్యము లో ఆడాడ గలిబిలి' యాయెను. 'మూకలు గుమిగూడి గుసగుసలుగా మాట'లాడదొడగిరి; 'కొందరికి భయోత్పాతముగా తో'చినది. 'ఉదయమైతే గజపతివారి పాళ్యం మన పాళ్యంమీద పడుతావున్నారనిన్ని ఆరితే అయితే కర్ణాటకంవారి బలం నిలువదనిన్ని రాయల వారు అప్పాజీమాటలు వినక లోజొచ్చి వచ్చినందు వల్ల అపాయం వచ్చెననిన్ని యిందుకు యిప్పుడైనా అప్పాజి చెప్పినట్టువించే ఆయన అపాయానకుతగ్గ ఉపాయం చింత్తించ్చగలడనిన్ని అక్కడక్కడ పిన్నలు పెద్దలు రౌతులు రాణువవారు ఆ సకల మున్నుత్సాహమగ్నులై ఆడుకొనే మాటలున్ను వార్లు భీతిజెందినవార్లనుంన్ను చూచినవారై రాయలవారు అప్పాజి గుడారమునకు పోయినారు.' అదిరాత్రివేళ. రాయలదేవుడు ఒంటరిగ మంత్రి గుడారమునకు వచ్చుట అరుదు. ఆయన అట్లు వచ్చుటను జూచి ఆశ్చర్యపడినాడు అప్పాజి. తన యొద్ది వారలను వారివారి గుడారములకు అంపి రాయలవారిని విచ్చేసి కూర్చుండవలయునని మనవి చేసి అడిగెను, 'పిలువనంపిస్తే నేను వచ్చి విన్నపం శాయనా? ఏకదేశాన విచ్చేశేటంత్త కార్యం యేంద్ది?' అని. రాయలవారు 'ఏకదేశాన రాతగ్గ కార్యం గనక వస్తిమి' అని బదులుచెప్పి, కమల నాభయ్య పంపిన కాగితమును అప్పాజిచేతి కిచ్చెను. జాబును చదువుకొన్నాడు అప్పాజి. కొంతసేపు వితర్కించి దానమువలన శత్రువులలో భేదము పుట్టించి కార్యము సాధింపవచ్చును. రాయలదేవుడు యెంత ధనమునైనను వెచ్చపెట్టుటకు వెనుదీయక యనుజ్ఞయిచ్చిన కార్యము జయవంతమగునని విన్న వించెను. రాయలవారు 'యింతకు వచ్చిన వ్రయ ప్రయాసములకు నిలుచునా?' అని చెప్పి వలసినంత ధనమును వెచ్చపెట్ట సెలవిచ్చి తన గుడారమునకు వెడలిపోయెను.

అంతట తిమ్మరుసు మంత్రులను అవసరికులను వ్రాయసమువారిని పిల్పించి పదునార్గురు పాత్రుల కును పదునాఱుత్తరములు వారు కోరినంత ధనము నంపుచున్నామనియు, వారు చెప్పినట్లు గజపతిని రాయలకు బట్టి యీయ వలసినదని వ్రాసి యమూల్యమైన రత్నాభరణములు పదునాఱు పెట్టెలయందిడి వానిని నమ్మిన భటులచే పట్టణము లోనికంపెను. తరువాత విజయనగరస్కంధావార మున నుండిన గజపతివారి స్థానాపతి సుబుద్ధి తన ప్రభువును హెచ్చరించుచు, షోడశమహాపాత్రుల 'మాట మీద మీరు కార్యముఖానకు వస్తావున్నారు, కనక కర్నాటకం పాళ్యాననుండి మన పాళ్యానకు వచ్చే మార్గాన ఆప్తులయిన వార్ల నుంచి నియోగులున్ను పెట్టెలున్ను సముఖానకు తెప్పించుక జూడగా నిదర్శనమైతేను అందుకు తగిన ఆలోచనకనేదని వ్రాసి' అంపెను. ప్రతాపరుద్ర గజపతి తన స్థానాపతి వ్రాసిపంపిన కాకితము జూచుకొని యాతీరుననె మార్గమున కాపుంచి షోడశమహాపాత్రులకు తిమ్మర సంపిన నియోగు లను వారెత్తించుకొనిపోవుచుండిన పెట్టెలతో

గూడ పట్టుకొని పెట్టెలను దెరిపించి యందుండిన నగలను రాయలపేరట తిమ్మరసయ్యవారికి వ్రాసిన లేఖలను గాంచి వారు తనయెడ ద్రోహము దలపెట్టినారని యెంచి 'పదారు నియ్యోగుల నుంన్ను పట్టం విడిచి యేకదేశాన అవ్వలపీడతోలి గజపతివారు యేడెనిమిది ఆమడపొడవు ఉత్తరంగా పాఱిపోయిరి. మరుసటి ఉదయము షోడశ మహా పాత్రులు యుద్ధమునకు సంసిద్ధులై గజపతినగళ్ళకు వచ్చిరి. గజపతివారి పలాయనమును విని వారు తమ స్వస్థలములకు బోయి చేరిరి. ఈ వృత్తాంతము రాయలవారి కెఱుకపడగనె జయభేరి వేయించి కటకమును వ్రవేశించిరి.[46]

ఇది రాయవాచకమున వర్ణింపబడిన రాయల కటక దండయాత్ర వృత్తాంతముయొక్క సారాంశము. ఇందు అసంగత మేమియు లేదు. రాజపుత్రులతోగూడి తనపై తిరుగుబాటు గావించిన యక్కరు రాకుమారుని వారినుండి వేర్పఱచుటకు మొగలాయిచక్రవర్తి యౌరంగజీబు యిట్టి యుక్తినే అవలంబించినాడు; కాని రాయవాచక వృత్తాంతమును రుజువు సేయగల యన్యసాక్ష్య మెద్దియు గానరాదు; కావున దాని నుపయోగించుకొనునప్పు డీ యంశ మును స్మరణయందుంచుకొనుట మేలు. రాయ వాచకమందు కృష్ణరాయలు పైజెప్పినట్లు కటక మును వ్రవేశించినపిమ్మట వ్రతాపరుద్రగజపతి యతనితో సంధి గావించుకొని తన కూతు నతని కిచ్చి యుద్వాహము గావించెనని చెప్పియున్నను పోర్చుగీసు చరిత్రకారుడగు న్యూని జీ విషయము నింకొకవిధముగ వివరించియున్నాడు.

కృష్ణరాయలు సింహాద్రినుండి విజయనగర మునకు విచ్చేసిన తరువాత 'మొదటిదుర్గమున దనచే బట్టువడి (గజపతి) రాజకుమారుని[47] తన సముఖమునకు రప్పించి, యతడు లగువుగల పోటరి యనియు, గత్తికటారుల సామున గడు నేర్పరి యనియు, జనశ్రుతిచే దెలియవచ్చుచున్నందున నతని ఖడ్గ విద్యానైపుణ్యమునుజూడ వేడుకపడు చుంటిననియు' జెప్పెను. 'పలినవారు నన్ను రప్పించితిరి. కావున నాశక్త్యానుసారము (నా నేర్పును) జూపెదను' అని యా యువకుడు బదులు చెప్పెను. మరుసటిదినము రాగనే రాయలు అతనిని మరల పిలిపించి, యప్పుడు ఖడ్గవిద్యా విశారదు డని పేరందిన తన యనుచరులలో నొక్కనితో గూడ పోట్లాడమని కోరెను. తన యంతస్తుకు దగిన ట్లొక రాజకుమారునితో గాక యొక యధమపురుషుని దనతో పోట్లాడ నియోగించి నందులకు గినిసి, 'దైవనిరోధము, రాజపుట్టువుగాని వాని స్పృశించి నా చేతులను మలినపఱచుకొన జాలను' అని రాయలతో నాక్రోశించి చెప్పి యాత్మహత్య గావించుకొనెను. తన కుమారు డెట్లు మృతినందినదియు దెలియగనె యతని తండ్రి సాళ్వతినియ (సాళువ తిమ్మయ)కు—కుమారుడు గతించిపోయెగనుక—యేమి వ్రత్యామ్నాయము గొని రాయల చెఱయందుండు తన రాణివాసమును బంధవిముక్తను గావింతురో తెలుపవలయునని లేఖ వ్రాసెను. అందుకతడు రాయల కతని (గజపతి యొక్క) కుమార్తెనిచ్చి వివాహము సేయుట కేర్పాటుగావించిన యెడల రాయ లతని రాణిని చెఱనుండి వదలిపెట్టుటయే గాక యతని రాజ్య మును సైతము ఆతనికే ఇచ్చివేయగల'డని బదులు వ్రాసెను. అతడు (గజపతి) ఈ సలహా నంగీకరించి తన కుమార్తె వివాహవిషయమును సంప్రతించుటకు రాయభారులను విజయనగరమున కంపెను. కృష్ణ రాయలు సంతృప్తి నందెను. ఈవిషయమై యతని అభిప్రాయము దెలియగనె ఉరియ నరపాలుడు తన

---

46. రాయ. 95–109.

47. ఇందు 'మొదటి దుర్గమున' అను మాట వ్రమాదజనితము. న్యూనిజు చరిత్రవ్రకారము వ్రతాపరుద్ర గజపతి పుత్రుని కృష్ణరాయలు చెఱగొన్నది కొండపల్లె దుర్గమునందు. అతని లెక్కననుసరించి యది మూడవదుర్గమగునుగాని మొదటిది కాజాలదు. రాయలు సాధించిన మొదటిదుర్గము ఉదయగిరి. అచట బందీగావింపబడినది గజపతి 'ఆంటో లేక ఆన్‌కులో' (పినతల్లిగాని మేనత్తగాని లేక పినతండ్రి గాని మేనమామగాని) కృష్ణరాయల శాసనములును అప్పటి యాంధ్రవాఙ్మయమును వ్రతాపరుద్ర గజపతి కుమారుడు రాయలచే బట్టువడినది కొండవీటి దుర్గ మందని తెల్పుచున్నవి.

పుత్రిక నతనికడకంపెను. ఆమెరాకతో వారిరువురికి (గజపతికిని రాయలకును) సఖ్యము గుదిరినది. కృష్ణ రాయలు నది (కృష్ణ) కవ్వలివైపు రాష్ట్రము నాతని కిచ్చివేసి యీవలివైపు భూములను దానుంచు కొనెను.[48]

న్యూనిజుగాథ యథార్థమైనదని పయసు సాదృశ్యమువలన రుజువగుచున్నది. కృష్ణరాయలు తఱుచుగ నురియాదేశపు రాజుతో గయ్యము సేయు చుండెననియు, నతని రాజ్యమును జొచ్చి పెక్కు పట్టణములను నాశమొనర్చి సాధించి యతని భటుల నసేకులను వారణములను నిర్జించెననియు, నతని పుత్రుని చెఱవట్టి చిరకాలము విజయనగర మున కారాగారమందుంచగా నత డచటనె మృతి నందెననియు, నతనితో సంధిచేసికొని దేశమున శాంతిని నెలకొల్పుటకొఱకు ఉరియారాజు తన భగినీమార్తె నొక్కతె నతని కిచ్చెననియు నాత డామెను విజయనగరమున బెండ్లాడి తన ధర్మపత్నిగ గైకొని యున్నాడనియు పయసు వ్రాసియున్నాడు.[49]

కృష్ణరాయలచే బట్టువడిన యురియరాజ కుమారుడు వీరభద్ర గజపతియని యింతకుముందే చెప్పియున్నాడను. ఇతని మరణమునుగూర్చి న్యూనిజు ప్రభృతులగు సమకాలిక పోర్చుగీసు చరిత్రరచయితలు వచించుగాథ విశ్వాసపాత్రము గాదని యాధునిక పరిశోధకులు గొందఱు నిరసించు చున్నారు. వారి యభిప్రాయమునకు గారణము లేకపోలేదు. విజయనగర చక్రవర్తి యేలుబడి క్రింద నుండిన రాష్ట్రమున వీరభద్రగజపతి శాసనములు మూడు గలవు. వీని మూలమున నతడు కృష్ణరాయలపక్షమున గొన్ని సీమలను బరిపాలించుచున్నట్లు తెలియవచ్చుచున్నది; ఇట్లు తనక్రింద మాండలీకుని గావించి గౌరవించిన కృష్ణ రాయలు వీరభద్రగజపతి నవమానపఱచి యతని యాత్మహత్య కెంతమాత్రమును గారణభూతుడు గాజాలడని వీరి వాదమందలి సారాంశము.[50]

చక్కగ విచారించి చూచిన వీరి యూహాపణ సదాధారమైనదికాదు. వీరభద్ర గజపతిశాసనము లన్నియు శా. శ. 1437 యువసంవత్సర కార్తిక మాస శుక్లపక్షమున వ్రాయించినవి. ఒకటి ద్వాదసి నాడును తక్కినవి రెండును పౌర్ణమాస్యనాడును జెక్కించినవి.[51] అప్పుడు వీరభద్రగజపతి కృష్ణ రాయలక్రింద మాండలీకుడై సీమల నేలుచుండినది వాస్తవమే; కాని న్యూనిజు జెప్పునది యవ్వలి చరిత్ర—శా.శ. 1438 ధాతు చైత్ర బ. 12 నాడు రాయలు సింహాద్రియందుండెను[52] శా.శ. 1438 ధాతు ఆషాఢ బ. 15 నాడు తిరిగివచ్చుచు బెజవాడలో మకాముజేసెను.[53] అచటినుండి బయలుదేరి విజయనగరమునకు వచ్చి శా. శ. 1438 ధాతు పుష్యశుద్ధ 10 నాడు తిరుమలకు విచ్చే సెను.[54] కావున శా. శ. 1438 ధాతు ఆషాఢ బ. 15 కును పుష్యశుద్ధ 10 కిని నడుమ నేదో యొకదినమున నతడు విజయనగరమును జేరి యుండవలయును. న్యూనిజుచెప్పు వృత్తాంత మనంతర మెప్పుడో జరిగియుండవలయును. కాబట్టి శా. శ. 1438 యువ సంవత్సర కార్తిక మాస శుక్లపక్షమున వ్రాయించి నిల్పిన వీరభద్ర గజపతిశాసనములు న్యూనిజు గాథయందలి నిజా నిజములను నిశ్చయించుటకు ఆధారము గాజాలవు.

మఱియు వీరభద్రగజపతిని బుద్ధిపూర్వకముగ కృష్ణరాయ లవమానపఱచెనని తలంచ నావశ్యము లేదు. ఖడ్గవిద్యానైపుణ్యము ప్రదర్శనమునందే దృష్టియుంచి యేకాంగిపోరు మర్యాదలను మనసు నకు దెచ్చుకొనక విస్మరించి వీరభద్రునికి పుట్టుక యందు గాకున్నను విద్యావిశారదతయందు సరి యుద్ధియైన శూరునితో బోర గోరియుండవచ్చును. శూర మర్యాదలను జక్కగ నెఱిగిన వీరభద్రుడు కావలెనని దన్నవమానపఱచుటకొఱకు గృష్ణ

---

48. *Nuniz, Forgotten Empire, pp.* 319-320.
49. *Paes : Forgotten Empire p.* 247.
50. *ASIR.* 1908-19, *P.* 178, *The Yet remembered Ruler of a Long Forgotten Empire, p.* 11.
51. *EC. XI. Dg.* 107, *XII Pg.* 62 *ARE* 744 *of* 1917.
52. *SII. VI.* 694 *and* 696.
53. *EC. V. Hn.* 13.
54. *TTDI III.* 80.

రాయలు ఒక యధమ పురుషునితో బోర నాజ్ఞా పించెనని యెంచి యా యవమానమున కోర్వ జాలక ఆత్మహత్య గావించుకొని యుండవచ్చును. ఇందలి నిజానిజము లెట్లున్నను వీరభద్రగజపతి యంతటితో పొడగానరాకపోయెను. శాసనములం దెచ్చటను నతనిజాడ గా న రా దు. త ం డ్రి కి వారసుడైనను, రాయలతో సంధిగావించుకొన్న పిమ్మట గజపతి రాజ్యపాలన కార్యముల కన్యులు దఖలైరి; శా. శ. 1447 ప్రాంతమున గజపతి రాజ్యముపై నెత్తివచ్చిన సుల్తాన్ కుల్లీ కుతుబు శాహును బ్రతిఘటించినవాడు ప్రతాపరుద్రుని పుత్రుడు రామచంద్రగజపతిగాని వీరభద్రుడు గాడు. ప్రతాపరుద్రుని యనంతరము గజపతి పట్టమున కభిషిక్తుడైన వా డతని కుమారులలో మఱియొకడగు కులుఅదేవుడుగాని వీరభద్రుడు గాడు. కావున న్యూనిజు పయసులు వ్రాసినట్లు వీరభద్రగజపతి శా. శ. 1439 ఈశ్వర సంవత్సర ప్రాంతమున విజయనగరమున మృతినం దెనని యెంచుట యుక్తము.

కృష్ణరాయల రెండవ కటకదండయాత్రతో గళింగయుద్ధము సమాప్తమైనది. రాయవాచకమున జెప్పినరీతిని సర్వస్వమును గోలుపోయి శరణాగతుడైన నేమి న్యూనిజు వక్కాణించినట్లు పుత్ర మరణమువలన జడిసి భార్యయొక్క క్షేమము నపేక్షించిననేమి ఎట్లైననేమి గజపతి సంధిని కోరెను. అతడు రెండు షరత్తుల కొడబడిన రాయలు సమాధానపడుట కొప్పుకొనెను. గజపతి తన కూతును రాయల కిచ్చి వివాహము సేయ వలయును. మఱియు గృష్ణానదికి దక్షిణమున పూర్వము విజయనగర రాయలకడనుండి గజపతులు జయించి కైకొన్న రాష్ట్రమునంతటిని మరల నిచ్చి వేయవలసినది. ఇందులకు ప్రతాపరుద్రగజపతి సమ్మతించినయెడల కృష్ణ కుత్తరమున కృష్ణ రాయలు జయించిన యావద్రాష్ట్రము నతనికి మరల నిచ్చివేయుట కొప్పుకొనెను. ప్రతాపరుద్ర గజపతి యా షరతుల నంగీకరించెను. అంతట సంధి కుదిరినది. ఇరుపక్షములవారును సమాధానపడిరి. ఇందుకు దా ర్కా ణ ము గ గృష్ణదేవరాయలు శా. శ. 1441 ప్రమాది సంవత్సర శ్రావణశుద్ధ 13 సోమవారమునాడు 'విజయనగరం సింహాసనా రూఢుడై సింహాద్రినాథునికి తమ పేరింటిభోగము నడచేఅందుకు ప్రతాపరుద్ర గజపతిమహారాయల చాతను పుచ్చుకొన్న గ్రామాలు కళింగదండపాట లోని గ్రామాలు' రెంటిని దానముజేసెను.[55]

గజపతియోటమికి గారణములు

ఈ యుద్ధమున బ్రతిరణక్షేత్రమునను, బ్రతి ముట్టడియందును, గజపతియు నతని బలములును బరాజయమునందుటకు గా ర ణ మె ది యో విచారింతము. సుప్రసిద్ధపరిశోధకులైన రఖల్ దాస బెనర్జీ గారా సమయమున నొరిస్సా సత్వము ఋణించుటకును, ప్రతాపరుద్ర గజపతి మరణానంతర మిరువ దెనిమిదేండ్లకు దాని స్వతంత్ర వినాశమునకు మూలకారణము శ్రీకృష్ణచైతన్యులని చెప్పి యున్నాడు. ప్రతాపరుద్రగజపతియు నాతని యధికారవర్గమున బెక్కండ్రును చైతన్యుని శిష్యులు మతదృష్టిని జూచిన చైతన్యు లుపదే శించిన భక్తిమార్గము మహనీయమైనదే; కాని దాని నవలంబించుటవలన నొరిస్సా సామ్రాజ్యము పాడగుటయేగాక రాజకీయముగ దాని ప్రతిష్ఠ యంతయు రూపుమాసిపోయినది. సర్వసమత్వమును బ్రేమను ఉపదేశించుమతము మనుజులహృదయ ములందు కైతవాదర్శములను నమ్మకములను నుప్ప తిలజేసి సంఘబంధములను నిర్మూలము గావించును; వా స్తవముగ సర్వవిషయములందును సమానులగు మనుష్యులిరువురెందును గానరారు; రాజ్యతంత్రము సర్వత్ర బలముమీదనే యాధారపడియున్నది. చైతన్యమతము నవలంబించుటవలన ప్రతాప రుద్రుడును నతని యధికారవర్గమునం దనేకులు యుద్ధమునందభిరుచిని గోల్పోయిరి. ఇదియే ఒరిస్సా వినాశమునకు గారణభూతమైనది.[56]

ఇది యపోహము. ప్రతాపరుద్రగజపతియు నతని యధికారు లొక కొందఱును వైష్ణవ మతమును స్వీకరించినది వా స్తవమే. చైతన్యస్వామి

---

55. 599. *VI.* 695.

56. *Indian Antiquary*, 1929 (*April*) *p.* 67.

సర్వసమత్వమును ప్రేమను ఉపదేశించుటయు నిజమే. అందువలన ప్రతాపరుద్రగజపతి యుద్ధాభిరతికి పీడికోలిచ్చెననుట కల్ల. అతడుత్తమ క్షత్రియ ధర్మము నొకప్పుడును త్యజించలేదు. కళింగయుద్ధము శా. శ. 1434 ప్రజోత్పత్తి సంవత్సరమునుండి శా. శ. 1441 ప్రమాదివఱకును దాదాపు యేడేండ్లకాలము నడచినది. ఈ యేడేండ్లును ప్రతాపరుద్రుడు కృష్ణరాయలతో నెడతెగక పోరాడెను. సమయము వచ్చినప్పుడు శత్రుని మార్కొనుటకు జంకి వెనుదీయలేదు. యావచ్ఛక్తిని వినియోగించి తుదవఱకును పోరాడక విడిచిన దుర్గము లేదు. అతని కుటుంబమున పిరికికండ లేదు; అతని పినతండ్రి తిరుమల రాహుత్తరాయడును, కుమారుడు వీరభద్రుడును శూరాగ్రేసరులు; అధికారులలో గసవాపాత్రుడు, ప్రహరేశ్వరపాత్రుడు, చిత్తాపఖానుడు మున్నగువారు పేరెక్కిన యోధులు. కావున వైష్ణవమతావలంబనముచేగాని మఱియే కారణముచే గాని ప్రతాపరుద్రుడును నతని సేనాధిపతులును యుద్ధమునందు విరక్తులని యెంచుట కవకాశము లేదు ప్రతాపరుద్రుని పరాజయమునకు నిజమైన కారణ మతని ప్రతిపక్షియొక్క యద్వితీయ సమర నిర్వహణశక్తియే. కృష్ణరాయలు సామాన్య సేనాధిపతిగాడు. అతనికి సరియుద్ధియని పేర్కొన దగిన దండనాయకు డెవ్వడును భరతఖండమునందప్పుడు గానరాడు. కృష్ణరాయల నెదుర్కొని యోడినవాడు గజపతి యొక్కడేకాదు. ఏదులఖానులిద్దఱును, బరీదుకుతపనమల్కులును అతని కత్తిపోటు రుచిజూచి పాఱినవారే; వారు శౌర్యహీనులగుటవలనగాదు, అతడసాధారణ ప్రజ్ఞావంతుడగు సేనానాయకుడగుటవలన. ఈయంశమును దృష్టియందుంచుకొనినగాని ప్రతాపరుద్ర గజపతి యోటమికి వాస్తవమైన కారణమును గ్రహింప జాలము.

కళింగయుద్ధ ఫలితార్థము

కళింగయుద్ధమువల్ల కృష్ణరాయల కీర్తి భారతావనియంతటను బర్వినది; అతని శౌర్య ప్రతాపములు ప్రకటితమైనవి; అతడసాధారణ ప్రతిభాసంపన్నుడైన దండనాయకాగ్రేసరుడని తెల్లమైనది. రాయరాణువ ప్రతిష్ఠ యతిశయించినది. లుప్తమైన రాయసామ్రాజ్యభాగములు మరల స్వాధీనపడినవి. ఇవి తాత్కాలికఫలములు. దీర్ఘదృష్టి దిలకించిన గళింగయుద్ధము దక్షిణభారత భూమికి అనర్థకరమని చెప్పవలసి యున్నది. చిరకాలమునుండియు దక్షిణహిందూదేశమును యవనాక్రాంతము గానీయక హిందూస్వాతంత్ర్య ధర్మముల సంరక్షించుచుండిన హిందూసామ్రాజ్యములలో నొక్కటియగు గజపతి సామ్రాజ్యపతనమునకీ యుద్ధము మూలకారణమాయెను. విజయనగర చక్రవర్తులును గజపతులును సుహృద్భావముతో నేకీభవించి పూనుకొనియుండిన మహమ్మదీయుల యధికారమును సమూలముగ బెకలించి యుండవచ్చును. వారి పరస్పర వైషమ్యము మహమ్మదీయులకు లాభకారియైనది. మొదట బహమనీ సుల్తానులును వారి యనంతరము గోలకొండ కుతుబుశాహులును తీరాంధ్రమున ప్రవేశించుటకీ వైరము జాల యనుకూలపడెను. ప్రకృతము గజపతికి సంధిషరతుల ప్రకారము కృష్ణకవ్వలి భూముల నన్నిటిని కృష్ణరాయ లిచ్చివేసినను నది యిడియబడిన యింటిదానమువలె ప్రతిగృహీత కుపభోగ్యము గాదాయె. ఈ యుద్ధానంతరము ప్రతాపరుద్ర గజపతి తన స్థితిగతుల నిట్లు చెప్పుకొని యున్నాడు.

'నష్టంకులం భిన్నతటాక కూపాన్
విభ్రష్టరాజ్యం శరణాగతంచ' అని.

కావున సంధిమూలమున లభ్యమైన రాజ్యమును సంరక్షించుకొనుటకు గజపతికి తగిన బలము లేదు; బలమును గూర్చుటకు ధనములేదు; దీర్ఘయుద్ధముచే నవసిన ప్రజలను, పాడువడి బీడువడిన దేశమును పోషించి సంరక్షించు శక్తి యతనికి లేదాయె. ఈ కష్టములను గడకొత్తి రాజ్యమును బునరుద్ధరింప జాలు నాథుడును గానరాడాయె. కావున ప్రతాపరుద్ర గజపతిరాజ్య కాలమునకే గోలకొండ కుతుబుశాహు తెలింగాణ

దుర్గములను శ్రమ లేక సాధింపగల్గెను; అతని మరణానంతర మచిరకాలమునసె పుత్రుడు మల్కిభరాము గజపతి రాజ్యమును గూలద్రోసి తీరాంధ్రకళింగప్రాంతములను స్వాధీన పఱచుకొనగల్గెను; కావున కృష్ణరాయల కళింగ జైత్రయాత్ర గజపతిసామ్రాజ్యనిర్మూలనకును దేశ పారతంత్ర్యమునకును హేతుభూతమాయెనని చెప్ప వలసియున్నది.

౭. కాటూరు—కుతపనమలక

గజపతితో సంధిగావించుకొనిన పిమ్మట తత్పూర్వ మేబదియేండ్లనుండియు గప్పమీయక తిరుగ బడియుండిన కాటూరు ప్రభువుమీద రాయలు దండెత్తిచనెనని న్యూనిజు చెప్పుచున్నాడు. ఈ కాటూరురాజ్య మెచ్చటనుండెనో నిశ్చయించి చెప్పుటకు దగిన సాధనములు లేవు; విజయనగర చరిత్రకారు లీ యంశమునుగూర్చి భిన్నాభిప్రాయ ములను వెలిబుచ్చియున్నారు; కాని న్యూనిజ్ సందర్భమున జెప్పియుండు నంశములన్నిటిని దృష్టియం దుంచుకొని నిష్పక్షపాతబుద్ధితో బరిశీలించి చూచితి మేని యది దక్షిణదేశమున తామ్రపర్ణీ ముఖద్వార ప్రాంతమున నుండెనని తోచకపోదు.[1]

ఈ దండయాత్రయందు నడచిన యుద్ధప్రకారము మనకు జక్కగ దెలియదు. ముఖ్యాంశము నొక్కదానిని మాత్రము న్యూనిజు వేరొక్క నియున్నాడు. కృష్ణరాయలు కాటూరు ప్రభువుపై నెత్తిపోయి యతడు నివసించుచుండిన ముఖ్య పట్టణమును ముట్టడింప దలపెట్టెను; కాని యాపట్టణము నావరించి ప్రవహించుచుండిన నదియొక్కటి వెల్లువ నీటిచే నుప్పొంగి దరులు దాకి ప్రవహించుచుండుట వలన దాని ముట్టడివేయుటకు సాధ్యపడదాయె; కృష్ణరాయ లంతట నా యుద్యమమును మానుకొనలేదు. నదియొక్క ప్రధానశాఖనుండి పెక్కు కాలువల ద్రవ్వించి వానిమూలమున ప్రవాహ జలము సన్యమార్గములద్రిప్పి వెల్లువను శోషిలజేసి కోటనుముట్టడించి స్వాధీనపఱచుకొనెను. అందు విస్తారమైన ధనమును హస్త్యశ్వాదివాహన చయమును లభించినవి. కాటూరు ప్రభువు బందీకృతుడై విజయనగరమునకు గొంపోబడెను. అతని రాష్ట్రము రాయసామ్రాజ్యమున గలసిపోయినది.

కాటూరు వృత్తాంతము న్యూనిజు చరిత్ర యందు దప్ప మఱియెందును గానరాదు. సమకాలిక ప్రబంధములుగాని యన్యరచనలుగాని ఈ దండయాత్రను బేర్కొనవు. రాయవాచక కృష్ణ రాయ విజయాదియర్వాచీన గ్రంథములందు సైతము దీని ప్రస్తావము గానరాదు. కాటూరుప్రభువు కృష్ణ రాయలకు మాఱొడ్డిన క్షుద్రశత్రువులందొక్క డనియు, దత్కారణమున భారతీయగ్రంథకర్తలతని మీది దండయాత్రను గృష్ణరాయల సుప్రసిద్ధ విజయములలో జేర్చిలెక్కపెట్టక వదలిపెట్టియుందు రనియు మనమూహింపవలసియున్నది.

కుత్బుశాహుతో యుద్ధము

ఇతడు గోల్కొండ కుత్బుశాహీ రాజ్యస్థాపకుడగు సుల్తాన్‌కుల్లీ కుత్బుశాహు. ఇతనిని సమకాలికాంధ్రులు కుతుపనమలక యని పిలిచెడివారు. జన్మముచే నితడు తురుష్కుడు. ఇమ్మడి ముహమ్మదుశాహు కడపటిదినములలో దక్కనుకువచ్చి సుల్తాను అంగరక్షక బలమును ప్రవేశించెను. ఇతడు మొదట బహమనీసుల్తానుయొక్క వేటకుక్కలను గాపాడు చేర్వగాడుగ నియమింపబడినట్లు రాయవాచకము నందు కలదు.[2] ఇది యెంతసత్యమో తెలియదు. ఇతడునెఱజోదు; నేర్పరియైన దళవాయి; సుల్తాన్ ఇమ్మడిమహ్మూదుశాహు రాజ్యప్రారంభదశయందు తెలంగాణమునకు పాలకుడాయెను. సుల్తాను దౌర్బల్యమును సందర్భపఱచుకొని, తక్కిన బహమనీ సామంతు లందరివలెను, స్వతంత్రుడాయెను. కృష్ణ రాయలు సింహాసనమునధిష్ఠించిన క్రొత్తలో నితడు దనపేర నాణెములను ముద్రించుకొని ఖుద్బానుజది

---

1. చూ: అనుబంధము, 'కాటూరు'.

2. రాయవాచకము ఆం. సా. పరి, పత్రిక, సం. 3. పుట 61.

వించుకొని నిజస్వాతంత్ర్యమును ప్రకటించుకొనెను. ఇతడు ఆసవోతు, ఇతని రాజ్యకాంక్షకు మేరలేదు; తెలుగుభూమి కంతటికిని తానె యొడయుడను గావలయునని ఇతని కోరిక. కావున, గజపతుల తోడను విజయనగర రాయలతోడను పోరితని కనివార్యమాయెను.

కృష్ణరాయల ప్రథమ తురుష్కయుద్ధమునకు కుల్లి కుత్బుశాహతని కత్తిపోటు రుచిజూచియుండెను. రాయలు సింహాసనము నెక్కియు నెక్కక ముందె జిహాదును ప్రకటించి విజయనగర సామ్రాజ్యముపై నెత్తివచ్చిన బహ్మనీసుల్తాను రెండవ మహమ్మదుశాహునకు దోడునడచి కృష్ణాతటమున ఘోరసంగ్రామమున నిర్జితులై పాఱిపోయిన ముగ్గురు దునేదారులలో కుత్బుశా హొక్కడు. ఈ పరాజయ మతని హృదయమునకు శల్యప్రాయమై రాయలతో పదింబదిగ బోరాడ బురికొల్పినది. ప్రతి సంవత్సరమును అతడు విజయనగర సామ్రాజ్యముపై దండయాత్ర వెడలువాడట! క్రీ. శ. 17 వ శతాబ్ద ప్రారంభదశయందు విరచితమైన 'తారీఖ్-ఇ-ముహమ్మదు కుల్లి కుత్బుశాహీ' యను గోల్కొండ సుల్తానుల చరిత్రయందు సుల్తాన్ కుల్లికుత్బుశాహుకు కృష్ణరాయలతో నైన యుద్ధములు కొన్ని విపులముగ వర్ణింపబడియున్నవి. ఈ చరిత్రప్రకారము ఆయుద్ధమంతయు రెండురాజ్యముల గడిప్రదేశములందుండిన గిరిదుర్గము లైదింటి చుట్టు నడచినవి. దేవరకొండ ముట్టడితో యుద్ధము ప్రారంభమైనది; కుల్లికుత్బుశాహు తన సైన్యముల నంపి కోటను ముట్టడించి స్వాధీనపఱచుకొనుటయే కాక యచ్చట హిందూదేవాలయములను కట్టడములను నిడియగొట్టించి వాని స్థానమున మసీదులను గట్టించెను. ఈ వార్త విన్నంతటనె కృష్ణరాయలొక గొప్ప సైన్యముతోగూడ కుత్బుశాహీ రాజ్యముపై నెత్తివచ్చి గడిప్రదేశమున జాలభాగము ద్రొక్కిచూచి పాడుగావించెను; సుల్తాన్ కుల్లి యంతట నొక చిన్నసైన్యముతో నతని దఱుముటకు వచ్చెను. ఉభయసైన్యములును పానుగల్లు దుర్గము కడ దారసిల్లినవి; యుద్ధమున కృష్ణరాయ లోడి పాఱిపోయెను; తరువాత కొంతకాలము ముట్టడి నడచిన పిమ్మట రాయల బంధువైన దుర్గాధ్యక్షుడు పానగల్లు కోటను సుల్తాన్ కుల్లివశము గావించి ధాన్యముతో గూడ నచటు వాసిపోయెను; అచటి నుండి కుల్లికుత్బుశాహు ఆ దుర్గమునకును గోయిల్ కొండకును మధ్యనుండు గన్పురమును ముట్టడించెను. రెండు నెలల పర్యంతము ముమ్మరముగ ముట్టడి సాగినది. దుర్గపాలకులు మొండిధైర్యముతో దుర్గ సంరక్షణకార్యమును నిర్వహించినను తుదకు కోటను శత్రువులపాలు గావించి బయలువెడలవలసినవారైరి. గన్పురము స్వాధీనమైనపిమ్మట కుల్లి కుత్బుశాహు కోవెలకొండ (కొయ్యలకొండ) ను ముట్టడించెను; కొన్నినాళ్ళైన పిమ్మట తురకలు కోటగోడలలో గండ్లు పొడిచి లోపల ప్రవేశింప ప్రయత్నించిరి; అటుపిమ్మట శత్రులనిల్వరించుటకు సాధ్యము గాకపోయినందువల్ల దుర్గసంరక్షకులు కోటను శత్రువులకు నైవసము జేయవలసి వచ్చెను.

కోవిలకొండను సాధించిన తరువాత కొన్ని యేండ్లు గడచినవి. కుల్లికుత్బుశాహు ప్రతాపరుద్ర గజపతి నోడించి కృష్ణాగోదావరుల మధ్యనుండు తీరాంధ్రభూమిని స్వాధీనముజేసికొనెను. సుల్తాన్ కుల్లి యుద్ధప్రయత్నములు పూర్తిజేసికొని కొండ వీటికివచ్చి యాదుర్గమును ముట్టడించెను; కాని యది నిరభ్యంతరముగసాగలేదు. బెల్లంకొండ వినుకొండ దుర్గములందు కాపుండిన రాయరాణువ పలుమారు రాత్రులందు ముట్టడికారులపైబడి వారి కపార నష్టము గలిగించెను; కావున కుల్లి కుత్బుశాహు కొంత దండుతో దన కుమారుని హైదరుఖానుని కొండవీటి చుట్టును గాపుంచి స్వయముగ బెల్లంకొండపై నడచి యా దుర్గమును ముట్టడించెను. అచ్చటి రాయశాణ్యము నిర్వక్ర పరాక్రమముతో బోరినను కోటను తుదకు కుత్బుశాహున కొప్పజెప్పవలసినవారైరి. ఇంతలోపలనె కొండవీటిని ముట్టడించుచుండిన కుత్బుశాహీ దండు హైదరుఖానుని యాధిపత్యము నంగీకరింపక తిరుగుబాటుచేసెను; వెంటనె కుల్లికుత్బుశాహు కొండవీటికి బోవలసివచ్చెను; బెల్లంకొండ మహమ్మదీయులకు వశమైనదని తెలియవచ్చినంతటనె, కృష్ణరాయలొక గొప్పసైన్యమును, కొండవీటి రాజ్యమునుండి తురకలను బాఱదోలి వారాక్రమించుకొన్న దుర్గ

ములను రాష్ట్రము మరల స్వాధీనము జేసికొనుట కొఅకంపెను; కాని యా సైన్యమును బెల్లంకొండ జేరగనే వారి రాక నెఱింగి కుల్లీకుత్బుశాహు కొండవీటినుండి వేగిరమె తిరిగివచ్చి యాకస్మికముగ పైబడి యుద్ధమున వారి నోడించి పాఱిదోలెను; పిమ్మట నతడు కొండవీటికి మరలివచ్చి యా కోటను గూడ సాధించెను. కొండవీడు శత్రువశమాయెనని విన్నంతనె, కృష్ణరాయలు దన యల్లుడును సేనాధిపతియునైన శివరాయల యాధిపత్యము క్రింద నొక లక్షదళము నా దుర్గమును మరల జయించి వశపఱచుకొనుటకొఅకంపెను. రాయసైన్యము వచ్చుటనుగని కుల్లీకుత్బుశాహు కొండవీటిని విసర్జించి కొండపల్లివైపు తరలిపోయెను. హిందువులు వెన్నంటి తఱుముచు బోయిరి. వారు సమీపించు నందాక ఊరకయుండి కుత్బుశాహు దటాలున వారిపై నురికి పంచ బంగాళము గావించెను. ఇట్లు నిర్జితులైన హిందువులు వెనుదిరిగి కొండవీటికి బోయి యా దుర్గమున జొరబడి ద్వారములను మూసికొనిరి. కుల్లీకుత్బుశాహు వారిని వెంబడించి వచ్చి కొండవీటిని మరల ముట్టడించెను. కుత్బుశాహుదాటి కాగజాలక హిందువులు, సంవత్సరమునకు మూడు లక్షల హొన్నులను గప్పముగట్ట నొప్పుకొని, యతని కరిగాపులైరి.[3]

తారీఖ్-ఇ-ముహమ్మదు కుల్లీకుత్బుశాహీ యందు వర్ణింపబడిన యుద్ధవృత్తాంతము సంగ్రహముగ నిది. యుద్ధవృత్తాంతము నింత విపులముగ విరచించిన చరిత్రకారుడు యది యెప్పుడు జరిగెనో తెల్పియుండిన విషయ గ్రహణమునకు జాలగ ననుకూలపడి యుండెడిది. అట్లాతడు తెల్పియుండక పోవుటచే నీ యుద్ధచరిత్రము దురవగాహమై తప్పు తలంపులకు దానకమైయున్నది. కొందఱు సుప్రసిద్ధ పరిశోధకులీ మహమ్మదీయ చరిత్రగంథమున వివరించియుండు యుద్ధవృత్తాంతమంతయు గల్పనాకథయని ద్రోసిపుచ్చియున్నారు.[4] కావున మొట్ట మొదట నీ యుద్ధకాలమును నిర్ణయించుట కర్తవ్యము. కుల్లీకుత్బుశాహు యొక్క దేవరకొండ ముట్టడితోగదా ఈ యుద్ధము ప్రారంభమైనది. మొదట నీ దుర్గము గజపతులకు జెల్లుచుండినది. క్రీ. శ. 1460 వ సంవత్సరమున కపిలేశ్వర గజపతి యాజ్ఞ చొప్పున నతని పుత్రు డంబీరదేవుడు దేవరకొండ వెలమలకు దోడు చనినప్పటినుండి క్రీ. శ. 1515 సంవత్సరమున గృష్ణరాయలు గజపతి సామ్రాజ్యముపై దండెత్తిపోవుచు దేవరకొండతో గూడ తెలింగాణ దుర్గముల నన్నిటిని సాధించువఱకును నది గజపతుల యాధీనమందే యుండినది; కావున కుత్బుశాహు దాని ముట్టడించినది క్రీ. శ. 1515 నకు దరువాతనై యుండవలయును. తరువాత పానుగల్లు గన్నవర కోవెలకొండదుర్గము లన్నియు నొక దాని వెనుక నొకటిగ గుత్బుశాహుచే నైదాఱు నెలల కాలమున జయింపబడినట్లు చెప్పియుండుటచే నవి కుత్బుశాహునకు క్రీ. శ. 1516 వ సంవత్సరమునకు దరువాతోనెప్పుడో వశమైనట్లు మనము నిశ్చయింపవచ్చును. కీర్తిశేషులైన శ్రీ కొమఱ్ఱాజు వెంకటలక్ష్మణరావు పంతులుగారు అద్దంకి గంగాధర కృత తపతీసంవరణ పీఠికలోని కుల్లీకుత్బుశాహు ప్రశంసాత్మకములైన—

"పడమట సవాయి బసవనిగా జేసి
యచట గొయ్యలకొండ యావరించె
దమది(రి)మి(మ)ల్లాఖాను దక్షిణంబున గొట్టి
హరియించె పానుగల్లాదిగిరుల."

అను సీసపద్య చరణముల నాధారపఱచుకొని 'ఈదమదిమిల్లాఖాను డెవ్వడో తెలియదు. కాని యతడు తురుష్కుడనుటకు సందేహములేదు. అదిల్‌షాహ యొక్క సేనానియైయుండనోపు. కావున గుతుబ్‌షాహ పానగల్లును రాయలయొద్దినుండి తీసికొనియెనన్న 'వార్తకల్ల' యని వ్రాసినారు.[5] కుత్బుశాహు దమదిమిల్లాఖానుని దటిమిపానుగల్లాదిదుర్గములను గొనియెనని గంగాధరకవియన్నంతమాత్రమున, గృష్ణరాయల నాత డోడించి యా దుర్గము స్వాధీనపఱచుకొనెనని తారీఖ్-ఇ-ముహమ్మదు కుల్లీకుత్బుశాహీయందు చెప్పబడిన వృత్తాంతమును,

---

3. *Briggs, Ferishta* III *pp.* 355-57, 365-67.

4. కె. వి. లక్ష్మణరావుగారు—మహమ్మదీయ మహాయుగము, పుటలు 368–69.

5. డిటో.

'కల్ల'యని త్రోసిపుచ్చవలసిన యావశ్యకతలేదు. ఏలన, రెండును సత్యమే కావచ్చును. పానుగల్లు మొదలగు దుర్గములను కుల్లీకుత్బుశాహొకసారి కృష్ణరాయలను జయించియు మఱియొకసారి దమదిమిల్లాఖానుని బాఱదోలియును స్వాధీనము జేసికొనియుండవచ్చును.[6]

ఇకకొండవీటి యుద్ధవిషయమును విచారింతము. తారీఖ్-ఇ-ముహమ్మదు కుల్లీకుత్బుశాహి లోజెప్పినట్లు సుల్తాన్‌కుల్లి కొండవీటిపై నెత్తివచ్చినది వాస్తవమని పరిశోధకు లొప్పుకొనుచున్నను, అందు వక్కాణించినట్లు విజయుడుగాక రాయలచే పరాభూతుడై పాఱిపోయెనని నిశ్చయించియున్నారు. వీరు తమ యభిప్రాయము సత్యమైనదని నిరూపించుటకు న్యూనిజుమున్నగు సమకాలిక రచయితల వ్రాతల నుదాహరింతురు; కాని న్యూనిజు సాక్ష్యము నాధారపఱచుకొని తారీఖ్-ఇ-ముహమ్మదు కుల్లీకుత్బుశాహీయందలి యుద్ధవృత్తాంతము సత్యాత్మకముగాదని వాదించుట తగవుగాదు. ఏలనగా, న్యూనిజు, పేర్కొను దండయాత్ర తారీఖ్-ఇ-ముహమ్మదు కుల్లీకుత్బుశాహియందు వర్ణింపబడిన దండయాత్ర కంటె భిన్నమైనది. న్యూనిజు చెప్పు దండయాత్ర, క్రీ. శ. 1519 సంవత్సరము ననో యంతకు కొంచెము ముందో జరిగినది. కృష్ణరాయలు కళింగవిజయము సంపూర్ణమైనపిమ్మట విజయనగరమునకువచ్చి తిమ్మరసయ్యను అతనికి నాయంకరమున కిచ్చియుండిన కొండవీటికి ప్రయాణము జేసియుండెను. అత డచటికి బోయి చేరకముందే కుత్బుశాహు దళవాయి, మదార్ మలుకయను మహమ్మదీయుడు అఱువదివేలసైన్యముతో నతని నెదిరించెను. రెండులకులపోజును వెంటబెట్టుకొని పోవుచుండిన తిమ్మరసు వానిని సులభముగ

---

6. జరిగినవాసవముగూడ నింతియయని తోచుచున్నది. ఇందు పేర్కొనబడిన దుర్గములన్నియు నిప్పటి హైదరాబాదు రాజ్యమునందలి మహబూబ్‌నగరమండలము నందున్నవి. దేవరకొండ నల్లగొండ జిల్లాసరిహద్దునను పానుగలు గన్పర కోవిలకొండలు మహబూబ్‌బునగర పశ్చిమప్రాంతమునం దొండొంటికి చేరువయందున్నవి. క్రీ. శ. 16 వ శతాబ్దప్రారంభమున విజయనగర విజాపుర గోలొకొండరాజ్యముల పొలిమేరలును ఇచ్చటనె సంధించుచుండినవి. ఈప్రదేశమప్పుడు ముయ్యేలగుట్ట; కావున పై బేర్కొనిన దుర్గములన్నియు దఱచుగ జేతులుమారుచుండుటయందు వింతయేమియు లేదు. కోవెలకుంట వీనియందు ప్రధానదుర్గము; దాని చరిత్రననుసరించియె తక్కినవాని కథయు నడచెను. 16 వ శతాబ్దప్రారంభముననది విజాపురరాజ్యస్థాపకుడగు యూసఫ్ ఆదిల్‌ఖానుని యధీనమందుండెను. క్రీ. శ. 1511 వ సంవత్సరమున కృష్ణరాయలీతని వధించి కోవెలకొండను దత్సమీపదుర్గములను రాష్ట్రములను వశపఱచుకొనెను. క్రీ. శ. 1534 వ సంవత్సరమున కోవెలకొండ కుల్లీకుత్బుశాహునకు జెల్లుచుండినది. విజాపుర ప్రభువగు ఇస్మాయిల్ ఆదిల్ శాహీదుర్గమును గైకొనుటకు వచ్చి ముట్టడివేసి యచటనె కోటను సాధింపకముందె వ్యాధిగ్రస్తుడై మృతినందెను.(*Briggs Ferishta III p.* 71) కావున కుత్బుశాహుసవాయిని బసవనిగావించె కోవెలకొండ నావరించినదియు దమదమిల్లాఖానుని గొట్టి పానుగలు మొదలగు దుర్గములను హరించినదియు దత్పూర్వముజరిగియుండవలెను. ఎప్పుడోనిశ్చయించి చెప్పుటకు దగిన సాక్ష్యములేదు; కాని యది 1530-34 ల మధ్య జరిగియుండవచ్చును. ఏలనగా క్రీ. శ. 1529-30 సంవత్సరమున బీదరు ప్రభువైన బరీదునకును ఆదిల్ శాహునకును యుద్ధము సంఘటిలెను. ఆదిల్‌శాహుకు బీరారు పాలకుడైన ఇమాదు శాహును, బరీదునకు కుత్బుశాహును తోడువచ్చిరి; కాని బరీదుపక్షమునకు ఓటమిగల్గెను. ఆదిల్‌శాహు బీదరును స్వాధీనముజేసికొనెను. ఈ సందర్భమున ఆదిల్‌శాహు కోవెలకొండ గన్పర పానుగలు దుర్గములను స్వాధీనపఱచుకొనియుండవచ్చును; ఏలనగా నతని పుత్రుడగు మల్లూఖానుడీ యుద్ధమున దండ్రికి బాసటయై నిలిచి శత్రులతో బోట్లాడెను. (*Ibid p.* 64). ఇతడు గంగాధరకవి బేర్కొన్న దమది లేక దమరి మల్లూఖానుడు. దమది లేక దమరియనునవి రెండును అపపాఠములు. 'తఱిమి' మల్లూఖాను అని యుండవలెను. తరువాత కుత్బుశాహీయుల నోడించి యీ దుర్గముల నన్నిటిని కైవసముజేసికొని యుండవలయును. కావున నీదుర్గములను కుత్బుశాహు కృష్ణరాయల నోడించి కైకొన్నది, క్రీ. శ. 1516 నందగుటవలన గంగాధరకవి వాక్యముల నాధారపఱచుకొని తారీఖ్ - ఇ - ముహమ్మదుకుల్లీ కుత్బుశాహీ సాక్ష్యమును నిరసించి త్రోసిపుచ్చుట సమంజసముగాదు.

నోడించి భార్యాపుత్రులతోగూడ చెఱబట్టి విజయ నగరమున కంపెను. వారందఱు సచట చెఱసాల యందు మృతులైరి.[7]

తారీఖ్-ఇ-ముహమ్మదు కుల్లీకుత్బుశాహీ యందు వర్ణింపబడిన దండయాత్ర క్రీ. శ. 1526 న తరువాత నడచెను. ఏలన నతడు గజపతిని జయించి కృష్ణాగోదావరుల నడిమి తీ రాంధ్ర దేశమును జయించి స్వాధీనము జేసికొనిన పిమ్మట కొండవీటిని ముట్టడించినట్లు చెప్పియున్నది. కుల్లీకుత్బుశాహు విజయముల కప్పుడు కొండవీటిరాజ్యమున రేగిన యల్లరియే ముఖ్యకారణము. క్రీ. శ. 1515 మొదలు కొండవీడురాజ్యము కృష్ణరాయల సర్వశిరఃప్రధాని యైన తిమ్మరసయ్యకు జెల్లుచుండెను ; అతని పతు మునం దతని యల్లుడైన నాదెండ్ల గోపమంత్రి యా రాష్ట్రముయొక్క పాలనకార్యమును గొండవీటి నుండి జరుపుచువచ్చెను. ఆ సంవత్సరమున కృష్ణ రాయలు దన కుమారుడైన తిరుమలదేవ మహా రాయలను నాఱేండ్ల బాలుని తిమ్మరసయ్య కుమా రుడగు తిమ్మదండనాయకుడు విషప్రయోగముచే జంపినాడని విశ్వసించి తిమ్మరసయ్యను నతని పుత్రు లను సోదరులను బందిచేసి చెఱబెట్టించెను ; కాని తిమ్మదండనాయకుడు చెఱనుండి తప్పించుకొని సాం ద్రారణ్యమునకు బారిపోయి బందిపోటు దొంగలకును దారి దోపిడిగాండ్రకును ఇరవైన యొక దుర్గమును బోయిచేరెను. ఆ దుర్గాధ్యక్షుడతనికి బంధువగుట చేత నతని జేరదీసి యతనికి వలసినట్లెల్ల సాయ మొనర్చెను. ఆ దుర్గమును ప్రధాన స్థానముగ జేసి కొని కృష్ణరాయలతో యుద్ధము సేయగడగెను ; రాయ లాతని యల్లరి నణచివేయుట కయ్యపర సయ్య నాయకత్వముక్రింద నొక గొప్పసైన్యము నంపవలసివచ్చెను. అయ్యపరసు తిమ్మదండనాయకు నికి మనికిపట్టైన దుర్గమును జుట్టుముట్టి సాధించి యతనిబట్టి విజయనగరమునకు గొంపోయి రాయల ముందుంచెను. కోపోద్రిక్తుడై రాయలాతని సోద రుని, తండ్రియైన తిమ్మరుసును జెఱసాలనుండిరప్పించి కన్నులు బొడిపించి మరల కారాగారమున బంధిం చెను. తిమ్మదండనాయకుడు చెఱసాలయందె మృతి నందెను.[8]

తిమ్మదండనాయకుని తిరుగుబాటువలన కొండవీటి రాజ్యమున శాంతి చెడి సంక్షోభము గలిగి నది. తిమ్మదండనాయకుడు పాటిపోయిన సాంద్రా రణ్య పర్వతప్రదేశము శ్రీశైలభూమి. అతని కాశ్రయమొసగిన చుట్టమతని బావ నాదెండ్ల గోప మంత్రి. తిమ్మదండనాయకుని తిరుగుబాటునకును కుల్లీకుత్బుశాహు కొండవీటిదండయాత్రకును పర స్పర సంబంధ మెద్దియేనియు గలదో తెలియదు. కాని యించుమించుగనవి యేకకాలమునసె సంభ వించినవి. అన్యోన్యసంబంధ ముండినను లేకపోయి నను తిమ్మదండనాయకుని యల్లరిమూలమున గలిగిన సంక్షోభము కుత్బుశాహు దండయాత్రకు జాలగ ననుకూలించెననుటకు సంశయములేదు.

తారీఖ్-ఇ-ముహమ్మదు కుల్లీకుత్బుశాహీలో జెప్పినట్లు ఈ దండయాత్రయందు జయము కుల్లీ కుత్బుశాహుకు జేకూరెననుట సంశయాస్పదమైన విషయము. హిందువు లోడి దుర్గము సంరక్షించు కొననేరక కప్పము కట్టెదమని యొడబడినంత మాత్రమున కుల్లీకుత్బు కొండవీటిని హిందువులకే విడిచిపెట్టి పోయెనన్నది నమ్మదగిన సంగతికాదు. ఇది సుల్తాన్ కుల్లీపద్ధతికి వ్యతిరేకమైనది. అతనికి గలి గిన యపజయమును గప్పిపెట్టుటకు తారీఖ్-ఇ-ముహమ్మదు కుల్లీకుత్బుశాహీ రచయిత యవలం బించిన కుయుక్తి ఇదియని తోచుచున్నది. ఈ తలంపు కళాపూర్ణోదయ పీఠికయందలి,

"వదలక యుత్కలేంద్రుని సవాయి
బరీదు నడంచు దుర్జయుం
గుదుపనమల్క దల్లడిల గొట్టె
మహాద్భుత సంగరంబులో
నెదిరిచి కొండవీటికడ నెవ్వరు
సాటి విచిత్ర శౌర్య సం
పదపస నారసింహ విభుపట్టికి నార
నృపాల మౌళికిన్."

---

7. *Nuniz. See. Forgotten Empire p.* 322.
8. *Ibid pp* 360-61.

అను పద్యమువలన దృఢమగుచున్నది. ఇందు వలన కుతపనమల్కను నందెలనారపరాజు కొండ పిటి దగ్గర యుద్ధమునం దోడించినట్లు తెలియవచ్చు చున్నది. ఈ నందెలనారపరాజు ఆరెవీటి బుక్క రాజునకు ముమ్మనుమడు ; మజీయొక ముమ్మనుమ డైన అళియరామరాజు కృష్ణదేవరాయల యల్లుడు; ఇతనినే తారీఖ్-ఇ-ముహమ్మదు కుల్లీకుత్బుశాహీ రచయిత శివరాయలని పేర్కొ ని యున్నాడు. ఇతని యాధిపత్యము క్రిందనే కృష్ణరాయ లొక ప్రచండసైన్యమును కుల్లీకుత్బుశాహను కొండవీటి నుండి తటిమివేయమని పంచియుండెను. కావున లక్ష్మణరావుగారు వచించినట్లు 'కొండవీటికడ నోడి పోయినది కుత్బుషాహయేగాని హిందువులుగా'రని స్పష్టముగ జెప్పవచ్చును.

కృష్ణరాయలకు గుతుపనమల్కతో జరిగిన యుద్ధములలోనాద్యమున జయము గుతుపనమల్కకే గలిగెను ; కళింగ దిగ్విజయమున నిమగ్నుడైయున్న తరి యాదిల్‌శాహు కుత్బుశాహు లిర్వురును గలిసియో ప్రత్యేకముగనో విజయనగర సామ్రాజ్య గడిదుర్గములను గొన్నింటినాక్రమించిరి. కృష్ణరాయ లవ్వల ఆదిల్‌శాహు నోడించి రాయచూరు ముద్గలు దుర్గముల మరల స్వాధీనపఱచుకొన్నను కుత్బుశాహా క్రమించిన కోవిల కొండగన్పురపానుగలు దేవర కొండ దుర్గములు నాల్గును అతని యధీనమునకె నిలిచిపోయినవి ; కొండవీటి రాజ్యమున తిమ్మదండ నాయకుని హావళి మూలమున సుల్తాన్ కుత్బుశాహు నకు మొదట జయము చేకూరినను చివరకు నిర్జితుడై నిజరాజ్యమును బోయిచేరెను.

అనుబంధము

కాటూరు

కళింగ విజయానంతరము కృష్ణదేవరాయలు కాటూరు రాజ్యముపై దండు వెడలెనని న్యూనిజు బ్రాసియున్నాడు. కాటూరు దండయాత్ర ప్రశంస మఱియెచ్చటను గానరాదు ; కావున దీని చరిత్రను గనుగొనుటకు న్యూనిజు గ్రంథమునకంటె సాధనాంత రములేదు. ఆతడు వివరించిన కాటూరు వృత్తాంత మిది :—

"కృష్ణరాయలు ఒరియారాజుతో సంధి కొడ బడి యతని పుత్రికను పెండ్లియాడి యతని రాణివా సము చెఱవదల్చి (కృష్ణా) నది కవ్వలి రాష్ట్రముతో గూడ నతనికి మరల నొసగిన పిమ్మట గొప్పసైన్య మును సమకూర్చి కాటూరుపై దండువెడల సంసిద్ధు డాయెను. కాటూరనునది—ఏబదిపండ్లనుండి (రాయల యధికారము నంగీకరింపక) తిరుగుబాటు చేసియుండిన యొక ప్రభువు యేలుబడిక్రిందనుండిన యొక రాజ్యము. చోళమండల తీరమందున్నది. (కృష్ణరాయలు) దానిమీదదండువెడలి తత్ప్రభువు వసించుచుండిన ముఖ్యపట్టణములయం దొకదానిని ముట్టడించెను. దాని పేరు...[1] అది జలపరివృతము.

కృష్ణరాయలీ పట్టణమును ముట్టడివేయగడగి నపుడు వానకాలమగుటచే దానిచుట్టును నావరించి యుండిన నది వెల్లువచే నుప్పొంగి జలభరితమై ప్రవ హించుచుండెను. తత్కారణమున ఆతనివలన నాపట్ట ణమున కెట్టిముప్పును గలుగదాయెను. ఆలస్యమును సహింపక కృష్ణరాయలు తన యుద్యమమును కొన సాగనీయక యడ్డపడుచుండిన యానది ముఖ్యశాఖను దాటి దాని (యా పట్టణమును) దాకుటకు వీలు కలుగునట్లు దానినుండి పెక్కుకాలువలను ద్రవ్యదన పరివారమున కాజ్ఞాపించెను. (అతనికడ) జనస్తోమ మధికముగనుండుటచే నా కార్యమచిరకాలమునకె ముగిసెను. క్రొత్తకాలువ లన్నియు ద్రవ్వియైన పిమ్మట నదీప్రవాహమును వానివైపు త్రిప్పించెను. నదిలోని నీరంతయు నల్పకాలమునకె కాలువల మూలమున బాఱిపోవుటచే నది యడుగంటి లోతు లేక వట్టిపోయినది. అంతట నా పట్టణప్రాకారమును డాయుటకు వలనుబడెను. ఏబదిపాయలగుండ వేఱు మార్గముల నదీజలమంతయు బాఱిపోయినది.

పట్టణములో గాపుండిన లక్షకాల్బలమును మూడువేల గుఱ్ఱపురౌతులును ధైర్యసాహసముల బ్రకటించుచు హోరాహోరిగ బోరిరి ; కాని వారి

---

1. న్యూనిజు గ్రంథములో ఆ పట్టణము పేరుం డవలసిన తావు శూన్యముగ వదలివేబడి యున్నది.

పరాక్రమము వానికెక్కక వమ్మయిపోయినది; వారు కృష్ణరాయలను పట్టణమును జొరనీయక యడ్డపెట్టజాలరైరి. ఒక కొన్ని నాళ్లు పోరాటజరిగిన వెనుక, రాయలాపట్టణమును బ్రవేశించి యందుండినవారినందరిని సంహరించెను. అందు విస్తారము ధనముండినది. భూషణములును బహు సంఖ్యాకాశ్వ చయమును మదహస్తివర్గముగాక యొక కోటి యఱువదిలక్షల బంగారు పర్దావు లతనికి హస్తగత మాయెను. ఆ రాష్ట్రము గైవసమైనపిమ్మట కృష్ణ రాయలు దన నాయకులలో నెవ్వరెవ్వరి కెంత మాత్ర మీదగునో యంతమాత్రము బంచియిచ్చెను. ఆ పట్టణమున నివసించుచు నా రాజ్యము నేలు చుండిన ప్రభువును బంధీకృతుని గావించి విజయ నగరమునకు గొనివచ్చెను. అతడచట రాయల చెఱయందు మృతుడాయెను."[2]

న్యూనిజు చెప్పిన కాటూరు వృత్తాంతమున సందేహాస్పదములైన యంశములు కొన్ని కలవు. కాటూ రెచ్చటిదో రాయలకోపమునకు గుఱియైన తద్రాజ్యాధిపతి యెవ్వడో తెలియరాదు. ఈ యంశ ములను స్పష్టముగ దెలియజేయగల సాక్ష్యము న్యూనిజు చరిత్రయందుగాని యన్యత్ర మఱియెందు గాని లభ్యపడదు. కావున నీ దండయాత్ర చరిత్రను వివరింపబూనిన యాధునిక పరిశోధక పండితులు ఒకఱు చెప్పినట్లు మరియొకరు చెప్పక తలకొకదారి ద్రొక్కియభిప్రాయభేదమును వెలిపుచ్చియున్నారు. గజపతుల రాజధానియగు కటకమే కాటూరన్నారు హొసకోట కృష్ణశాస్త్రిగారు.[3] సాధు సుబ్రహ్మణ్య శాస్త్రిగారు 'తథాస్తు' అని కృష్ణశాస్త్రిగారి యభి ప్రాయమును శిరసావహించినారు.[4] వీరి యభిప్రా యము సరికాదని నిరసించి కాటూరనగా కాడవ రాజ్యమనియు నదియే యుమ్మత్తూరనియును, న్యూనిజు భ్రమజెంది కృష్ణరాయల యుమ్మత్తూరు కళింగదండయాత్రల కాలక్రమమును దారుమారు చేసినాడనియు వాదించినారు డాక్టరు యస్. కృష్ణ స్వామి అయ్యంగారు.[5] తొలుత రాయవేలూరే కాటూరని యూహచేసిన సూయలుఱి తరువాత కృష్ణస్వామి అయ్యంగారి యభిప్రాయము నంగీక రించినారు.[7] ఇది సమంజసము కాదని త్రోసిపుచ్చి ఆచార్య కె. ఎ. నీలకంఠశాస్త్రిగారును డాక్టరు టి. వి. మహాలింగముగారును, కాటూరనునది చెంగ ల్పట్టుజిల్లా పొన్నేరితాలూకాలోని తూర్పుసముద్ర తీరమున నుండు కాటూరను కుగ్రామమే యని నిర్ధారించినారు.[8]

ఈ యభిప్రాయము లెంతవఱకంగీ కార్యములో విచారించుట యుక్తము—కాని మున్ముందు న్యూనిజు కాటూరు వృత్తాంతమున దత్ప్రదేశ నిర్దేశమునకు సాధకములగు నంశములను వివరించుట మిక్కిలియు నావశ్యకము.

1. కాటూరనునది యొక రాజ్యముపేరు; అది చోళమండలతీరమున నుండెను.

2. కృష్ణరాయలా రాజ్యములో నొకముఖ్య పట్టణమును నదిచే పరివృతమైనదానినిముట్టడించెను.

3. ఆ రాజ్యమును బాలించుచుండిన రాజు కృష్ణరాయల దండయాత్రకు పూర్వ మేబదిసంవత్స రములనుండియు దిరుగుబాటుచేసియుండెను. ఈ మూడంశములును ఏ ప్రదేశమున కనువర్తించునో యా ప్రదేశమున కాటూరు రాజ్యముండెననుట సమంజసము; ఇందే యంశమునకు విరోధించినను అట్టిచోట కాటూరు రాజ్యముండెనని తలంచుట యుక్తముగాదు.

ఇక కాటూరురాజ్య మెచట నుండెనో కను గొందము. కటక మే కాటూరగునా? తూర్పుసముద్ర తీరము నంతటిని పాశ్చాత్యులు చోళమండలతీరమని చెప్పువారు. కటకము తూర్పు సముద్రదేశమునందు న్నది. అంతమాత్రమున నదియె కాటూరనుటతగదు. ఏలన కృష్ణరాయల కాటూరు దండయాత్రకుపూర్వ

---

2. *Nuniz. See the Forgotten Empire, pp* 320-22.
3. *ASIAR.* 1908-9 *p.* 180.
4. *TDER. pp* 181-2.
5. *The vet-remembered Ruler & pp* 9-11.
6. *Forgotten Empire, p.* 321, *n.* 1.
7. *Historical Inscriptions. li.* 228.
8. *Ep. Ind.*

మేబది సంవత్సరముల (క్రీ. శ. 1519-20—50 = 1469-70) నుండి తత్పాలకుడు తిరుగుబాటుచేసి యుండెనని న్యూనిజు చెప్పుచున్నాడు. తిరుగుబాటు నకు పూర్వ మతడు రాయసామంత మండలాధిపతి యని తెల్లమగుచున్నది. అగునేని యతనిరాష్ట్రము విజయనగర సామ్రాజ్యాంతర్గమై యుండవలెను. విజయనగర రాయల యధికారము కృష్ణరాయల కళింగ దిగ్విజయమునకు పూర్వమెన్నడును సింహాచలమున కవ్వలిదేశముపై సాగియుండలేదు. మఱియు గటకము గజపతుల రాజధాని. అచట మొదట పూర్వ గాంగ వంశజులును నటువెనుకు సూర్యవంశజులునగు గజపతులు రాజ్యమొనర్చిరి. వీరెన్నడును విజయనగర చక్రవర్తుల కరిగాపులై యుండిరనుటకు లేశమాత్రమైన నాధారము లేదు; కావున కటకమే కాటూరను సిద్ధాంత మంగీకరింప దగినది కాదు.

ఉమ్మత్తూరు కాటూరా? ఇది కృష్ణరాయల కాలమునగాని యంతకు ముందుగాని కాడవుల యధికారముక్రింద నుండెనా? కృష్ణరాయలోడించి బంధీకృతుని గావించి విజయనగరమునకు గొని పోయిన కాటూరు ప్రభువు కాడవ వంశజుడా? అను ప్రశ్నలకు సమాధానము చెప్పవలసియున్నది. క్రీ. శ. 1323 వ సంవత్సరమున మహమ్మదీయులు ద్రావిడదేశమును జయించిన తరువాత కాడవ వంశజు లడపొడ గానరాకపోయిరి. విజయనగర యుగశాసనములలో గాని మఱియన్యచరిత్రాధారములందుగాని కాడవుల ప్రస్తావ మెందును గానరాదు. కాడవులనగా పల్లవులు. క్రీ. శ. 10 వ శతాబ్దారంభమువఱకును పల్లవుల యధికారము పశ్చిమాంధ్ర దక్షిణకర్ణాటక భూములపై సాగినది. తరువాత వీరి యధికారము క్షీణించి వారి రాష్ట్రము చోళసామ్రాజ్యమున గలసిపోయినది. క్రీ. శ. 13 వ శతాబ్దమధ్యమున కొప్పెరుంజింగడను కాడవప్రభువు ప్రసిద్ధికెక్కి తొండమండలమున జాలభాగమునేలెను. అతని యధికారమెన్నడును ఉమ్మత్తూరుపై సాగలేదు. మఱియు విజయనగరరాయలకాలమునందు ఉమ్మత్తూరునేలిన రాజవంశము కేవలము కర్ణాటకవంశము; మఱియు, వాము పాశ్చాత్యగాంగరాజుల యొక్కయు హొయసలుల యొక్కయు సంతతివారమని వారు చెప్పుకొనిరి. కాడవులకును వారికిని సంబంధమున్నట్లగపడదు. ఇంతకంటెబ్రబలమైన యాక్షేపణ యొకటికలదు. కాటూరుప్రభువు ముఖ్యపట్టణమువలె గృష్ణరాయలచే సాధింపబడిన యుమ్మత్తూరులోని శివనసముద్రముభయ కావేరి మధ్యస్థమైనను, నది మైసూరు పీఠభూమిపై నున్నది కాని చోళమండల తీరదేశమున లేదు. ఈ రెండు కారణములవల్లను కాటూరనునది కాడవ రాజ్యమనియు దాని కుమ్మత్తూరు రాజధాని యనియు దలంచుటకు వీలులేదు.

ఇక న్యూనిజువచించిన కాటూరు పొన్నేరి తాలూకాలోని ఆ వేరిటి గ్రామమా? ఇది పైనుడివినట్లు చోళమండల తీరదేశమునందున్నది. మఱియు దత్పరిసరముల నొక యేఱు ప్రవహించుచున్నది. కాని యా ప్రాంతము నేలుచుండిన ప్రభువు కృష్ణరాయల దండయాత్రకును వేబది సంవత్సరముల నుండి తిరుగుబాటుచేసియుండెననుట విశ్వసింపదగనిది. ఏలన నీ ప్రాంతభూమియంతయు క్రీ. శ. 1491 పర్యంతము సాళువనరసింగరాయల యేలుబడిక్రిందనుండినది. తరువాత ఇమ్మడి నరసింహదమ్మరాయల కాలమున రాజ్యసంరక్షకుడైన నరసానాయకుడుదయగిరికడ గజపతి నోడించి సముద్రతీరమునకై సైన్యమును నడిపించుకొనిపోయి ద్రావిడదేశమును బ్రవేశించి యచటినుండి దక్షిణ దిగ్విజయయాత్ర సాగించినట్లు వరదాంబికాపరిణయమునందు చెప్పియున్నది.[9] తుండీరమండలమునుబ్రవేశించుటకు ముందుగాని తరువాతగాని సముద్రతీరదేశమున నతడెవ్వరితోడను యుద్ధముజేసినట్లు చెప్పియుండలేదు. ఈ దండయాత్ర క్రీ. శ. 1496 వ సంవత్సరమున నడచెను. నరసానాయకు డీ సందర్భమున రామేశ్వర పర్యంతము రాజ్యము సల్పుచుండిన దాక్షిణాత్యభూపాలురనెల్ల జయించెను.[10] వీరనరసింహరాయల కాలమునగాని కృష్ణరాయల రాజ్యారంభకాలమునగాని పొన్నేరి ప్రాంతభూమిని

9. *Sources of Vijayanagara History. pp.* 172-3
10. *Further sources I. pp* 168. *f*

రాయల కనతుడైయుండిన మాండలికు డొక్క డేలుచుండినట్లూహించుటకు దగిన సాక్ష్యములేదు. కావున పొన్నేరి ప్రాంతమున చోళమండల తీర ప్రదేశమున నదీతటమున కాటూరను పేరుగల గ్రామమొకటి యున్నను నదియే న్యూనిజు వర్ణించిన కాటూరని తలచుట పొరబాటు.

మఱి యీ కాటూ రెచ్చట నున్నదనుట విచారణీయాంశము. కాటూ రనునది కాయత్తారు కావచ్చును. ఇది మధురకు దక్షిణదిగ్భాగమున తిరునేల్వేలి ప్రాంతభూముల నేలుచుండిన పాండ్యవంశజులలో నొకశాఖవారికి రాజధానియై యుండెను. అప్పటి పోర్చుగీసు ప్రయాణీకులును గ్రంథకర్తలును దీనిని బేర్కొనియున్నారు. 'ఆ తీరదేశమునకు రాజధానియైన తూత్తుకుడి ప్రభువును 'కయిత్రో రాజని' పిలుతురు. అతడు 'శూరుడు', అని పెద్దోడి బస్తో యను నతడు చెప్పియున్నాడు.[11] సింహళవిజయ చరిత్రను రచించిన కైరాసుపాదిరి కూడ 'కేత్రో నేలు చిన్నరాజు'ను పేర్కొనియున్నాడు. ఇట్లు పోర్చుగీసు రచయితలచే కెయత్రో యని పేర్కొన బడినది కాయత్తారు పాండ్యరాజ్యము. న్యూనిజు కాటూరునుగూర్చి చెప్పిన ముఖ్యాంశములు గాయత్తారునకు సరిపోవుచున్నవి. కావున కృష్ణరాయలు క్రీ. శ. 1519–20 వ సంవత్సరమున జయించిన కాటూరి కాయత్తారు రాజ్యము గావచ్చును; ఇట్లని దృఢముగ జెప్పుటకు వలనుపడదు; ఈ యంశమును రుజువు సేయగల సాక్ష్యమింకను లభ్యపడలేదు.

ఆ. కెంబావి–అహమదునగరము

(క్రీ. శ. ౧౫౧౬–౧౭)

ఇస్మాయీలు ఆదిలుఖానునికి ప్రాపై యతని పేర రాజకార్యములను నడపుచు కమాలుఖానుడు విజాపుర రాజ్యభార ధురంధరుడై యున్నప్పుడు, క్రీ. శ. ౧౫౧౭-వ సంవత్సరమున, కృష్ణరాయలు రాయచూరు దుర్గమును స్వాధీనపఱచుకొనెనని పూర్వప్రకరణమున దెల్పియున్నది. ఈ దుర్గమిట్లు రాయలకు హస్తగతమగుటయు దన్మూలమున కృష్ణా తుంగభద్రల నడీమియంతర్వేది తనచేతినుండి దుసికిలిపోవుటయు నాదిల్ఖానునికి హృదయశల్యములై యతని బాధింపఁగడగినవి. కావున నతడాదుర్గమును దత్సంబంధిరాష్ట్రమును నెట్లయిన మరల స్వాధీనపఱచుకొన నిశ్చయించి, కమాలుఖానునిపారుపత్యమును దొలగద్రోసి స్వయముగ రాజ్యమును బరిపాలింపగడగిన పిమ్మట దండయాత్ర వెడలి రాయచూరునుసాధించినట్లున్నది. కాని ఇస్మాయీలు ఆదిల్ఖాను ఇట్లు దండయాత్ర వెడలెననిగాని రాయచూరుదుర్గమును మరల గైవసము గావించుకొనెననిగాని తెల్పెడి ఆధార మెద్దియులేదు. ఇది వ్యక్తచరిత్రాంశములందు నిగూఢమైయున్నవిషయము. క్రీ. శ. ౧౫౧౭ లో కృష్ణరాయ లీదుర్గమును జయించి కైవసము గావించుకొనెగదా; 1520 నందు ఆదిలుఖానుపై నతడు దాడి వెట్టినప్పు డది యతని యాధీనమందుండినది.[1] ఇందువలన క్రీ. శ. ౧౫౧౭, ౧౫౨౦ ల

---

11. *Queyros, The Conquest Ceylon, p.* 394. *n.* 1.

1. ఫెరిష్తాచరిత్రయందు (*Briggs' Ferishta III, PP*48 *f*) రాయచూరుదుర్గము హిజిరీ ౯౨౩ అనగా క్రీ. శ. ౧౫౧౬-౨౦ వఱకును రాయలస్వాధీనమందెయుండెననియు, నప్పు డిస్మాయీ లాదిలుఖాను దానిని వశపఱచుకొనుటకుదండెత్తిరాగా రాయలాతని నోడించి తఱుమగొట్టెనని యు జెప్పియున్నది. కాని ఇది వాస్తవము గాదు. ఏలనగా, సమకాలికుడును ప్రాయశః ప్రత్యక్షద్రష్టయు నగు న్యూనిజు రాయల దండయాత్రసమయమునందు రాయచూరు ఆదిలుఖానుని యధీనమున నుండెనని వ్రాసియున్నాడు. (*Nuniz, F. E. PP.* 334 *f*). ఫెరిష్తా యర్వాచీనుడు; అతని వ్రాతకంటె సమకాలికుడును రాయలవెంట దండయాత్రను జూచుటకు బోయియుండిన న్యూనిజువాక్యములు విశ్వాసపాత్రములు గదా. కావున, నూయలు మున్నగు నాధునిక విజయనగర చరిత్రకారుల మార్గమునను సరించి న్యూనిజు వివరించిన వృత్తాంతమే సత్యాత్మకమైన దని విశ్వసించుచున్నాను.

మధ్య నెప్పుడో యొకప్పుడు ఇస్మాయీలు ఆదిలు ఖానుఁడు రాయ సామ్రాజ్యముపై దండెత్తివచ్చి రాయచూరుదుర్గమును మరల జయించి స్వాధీనము జేసికొనెనని మన మూహించవచ్చును. ఈ మధ్య కాలమున గృష్ణరాయలు కళింగకాటూరు విజయ యాత్రలయందు నిమగ్నుఁడై యుండెను; అది యాదిలుఖానుని కడక నెఱవేర్చుకొనుట కనుకూల మైన సమయమే. రాయరాణువ యంతయు గళింగాది యుద్ధయాత్రలయందు పనివడియుండుట వలన, గడిదుర్గములను సంరక్షించుటకు దగిన బలములం దధివసితములై యున్నను, ప్రబలుఁడగు శత్రువెత్తివచ్చిన నతని మార్కొని పాఱదోల జాలిన దళము లందుబడి దూరమున లేవు. ఈ సంగ తిని గుర్తించి యాదిలుఖాను రాయసామ్రాజ్య ముపై నెత్తివచ్చి రాయచూరు మున్నగు నంతర్వేది దుర్గములను వశపఱచుకొని యుండవచ్చును.

ఆత డెత్తివచ్చిన సమయ మిదియని నిర్ధారించి చెప్పుటకు వలను పడదు; కాని ఊహించుటకు గొంత యవకాశము గలదు. ఆముక్తమాల్యదయాశ్వాసాంతములలో మొదటి నాల్గింటియందును ఉదయగిరి కొండవీడు కొండపల్లి సింహాచల విజయములను దరువాతి రెంటియందును కెంబావి నైజామన 'యావనావనిధవు' లపైని విజయములును కడపటిదానియందు కటకవిజయ మును వరుసగ బేర్కొనబడియున్నవి. దీనినిబట్టి చూడఁగా గృష్ణరాయలు క్రీ. శ. ౧౫౧౬-౧౭ వ సంవత్సరమున సింహాచలమున విజయస్తంభమును నిల్పినపిమ్మటను గటకదహనమునకు బూర్వమును మహమ్మదీయులతో గెంబావికడను నైజామన యావనావని ధవుని మణిగృహాళిచెంతను యుద్ధము జేసినట్లు తెలియుచున్నది. ఆశ్వాసాంతోక్త విజయము లవి చేకూడిన కాలక్రమమునను సరించి పేర్కొనబడియుండిన, కెంబావి యవనులతోడను నైజామనయావ నావనిధవునితోడను గృష్ణరాయలు యుద్ధము జేసినది క్రీ. శ. ౧౫౧౬ నకు దరువాతను ౧౫౧౭ ముందునై యుండవలయును; అనగా నీయుద్ధములు రెండును ౧౫౧౬-వ సంవత్సరమున జరిగెనని స్థూలముగ జెప్పవచ్చును.

ఈ సందర్భమున రాయలు మహమ్మదీయులతోజేసిన యుద్ధము రాయవాచకమునందును బ్రస్తాపింపఁబడియున్నది. కాని యందు కెంబావి మాట లేదు; నైజామనయావనావనిధవుని రాజధానియగు నహమదునగరమును రాయలు నాశనము గావించినట్లు వచించియున్నది; మఱియు నది క్రీ. శ. ౧౫౧౪-వ సంవత్సరమున నాగార్జున కొండను సాధించిన పిమ్మటను ౧౫౧౬-౧౭ న పొట్నూరు సింహాచలముకడ జయస్తంభమును ప్రతిష్ఠించుటకు ముందును నడచినట్లు చెప్పి యున్నది. కృష్ణరాయ విజయమునందుగూడ అహమదునగరమున రాయలు దురకలను జయించి నట్లు కలదు. యుద్ధకాలనిర్ణయవిషయమై పై గ్రంథముల సాక్ష్యమించుక భిన్నముగ గన్పడు చున్నను, కళింగత్రైత్రయాత్రమధ్య రాయలొక పర్యాయము మహమ్మదీయులపై జయవంతముగ దాడినడచెనని యవియేకగ్రీవముగ బల్కుచున్నవి.

ఇట్లు రాయలచేబరాజితులైన తురకలెవ్వరో కనుగొందము. ఈ యుద్ధమునుండి మరలివచ్చిన పిమ్మట గజపతి రాజ్యముపై మరల గూచిసేయ నుంకించుచున్న రాయలనువారించు తిమ్మరసయ్య వాక్యములవలన వా రెవ్వరైనదియు దెలియ వచ్చుచున్నది.

'అప్పాజీ రాయలవారితో నూడు తెగల తురకలరాజ్యమంత్తా కంపోలంశేశి(=కంపింపజేసి!) వారి దుర్గాలున్ను స్థలాలున్ను కట్టుకొని అహముదానగరం ఆమిద్యాలు విత్తించి గజపతి వారి గిరిదుర్గం స్థలదుర్గం యివి అన్నియు ఆక్రమించినట్టాయను. ముందర కదలిపొయ్యేది కార్యంకాదు.'[2]

ఇంతకంటె స్పష్టతరముగ కృష్ణరాయ విజయమునందు,[3]—

---

2. రాయవాచకము (కాకినాడ, 1933) పుటలు 93–94.

3. కృష్ణరా. విజ. 3 : 66

'ఇతరులు శక్తులే తలప నేదుల
శాహు నిజాము శాహులన్
గుతపనమల్క నున్ గెలిచి
గొబ్బున సర్వగిరీంద్ర దుర్గముల్
జతురత గైకొనన్ ధర
నసాధ్యను నీకిక గల్గదైన నం
చిత యశ యొక్క విన్నపము
జేసెద వేదురఁ జిత్తగింపుమా,'

ఇందువలన కృష్ణరాయలు కేంబావి యహమదునగరములకడ నోడించిన తురకలు ఆదిలుఖాన నిజాముల్ముల్క్ కుత్బుల్ ముల్క్ లను, విజాపురాహమదనగర గోల్కొండనేలు ప్రభువులని తెలియవచ్చుచున్నది.

ఇక రాయలు కళింగజైత్రయాత్రను నడుమ నాపి పై బేరొక్కన్న తురకరాజులపై నేల యెత్తిపోయెనో కనుగొనవలసి యున్నది. విచారించఁగా దీనికి ముఖ్యకారణము రాయ సామ్రాజ్యముపై దురకరాజులందఱు నేకముగనో, ప్రత్యేక ప్రత్యేకముగనో నడపిన దండయాత్రలని తోచుచున్నది. క్రీ. శ. ౧౫౧౬ ప్రాంతమున కుల్లికుత్బుల్ ముల్క్ విజయనగర గడి ప్రదేశ మందలి దేవరకొండ పానుగలు గన్నుర కోవిల కొండలను నాలుగు దుర్గములను రాయల సైన్యముల నోడించి కైకొన్నట్లు ఇంతకుముందరి ప్రకరణమున విదితము సేయబడి యున్నది. ఇస్మాయీ లాదిల్ఖాను రాయచూరునుగూడ అప్పుడె స్వాధీనపఱచుకొని యుండవలయునని ముందె యూహించితిమి. అహమదునగర నిజాముల్ ముల్క్ వీరికి దోడునడచి యుండవల యును. ఇట్టి సంఘటన నూతనమైనది కాదు. తత్పూర్వము పలుమార్లు నడచినదే. ఈ మూడిండ్లు తురకరాజులును రెండు ఉద్దేశములతో నీ యుద్ధ కార్యమును దలపెట్టినట్లున్నది. గజపతికి దోడ్పడ వలయునను ఇచ్ఛయొకటి: గజపతివారికిని తురక రాజులకును రాజకీయమైన మైత్రి గలదు. ఇప్పటివలె నప్పుడును రాజు లొండొరుల సంస్థానములలో దమ ప్రతినిధులను నిలుపువారు; ఈ ప్రతినిధులు తాత్కాలికముగ నేదైన యొక కార్యార్థము వచ్చి పోవు రాయబారులును దూతలును గారు. స్థిరముగ నొకరాజుపఱుమున మరియొకరాజు నాస్థానమున నుండు నియోగులు. అప్పటి రాజకీయ పరిభాషయందు వీరికి స్థానాపతులని పేరు. ఈ స్థానాపతు లిప్పటి రాయబారులవలె నన్యరాజ్యములందు దమ రాజ్యమునకు సంబంధించిన యావద్విషయములను జేడ్పడనీయక జూచుటయె కాక అన్యరాజ్యముల మర్మములను గనుగొనుట కొఱకు నిరంతరము మాఱువేసముల సంచరించు చుండు వేగరులకు బ్రాపైయుండిరి. తఱుచుగ పెక్కురాజ్యముల స్థానాపతులు సమావేశమై తమ రాజ్యముల కన్నిటికిని సామాన్యములయిన రాజ కీయసమస్యలను జర్చించి వానిని దీర్మానముసేయు మార్గముల నన్వేషించువారు. కృష్ణదేవరాయలు మహమ్మదీయరాజ్యములపై దండు వెడలబోవు చున్నాడనువార్త ప్రచుర మయినంతటనె ఇట్టి స్థానపతుల సమావేశ మొక్కటి విజాపురమున గూడెను.

'దాదిమహలు ముందుగా ముందర దివాణంలో ముందర ఆయావజీర్లు దొండోపండితులు మొదలయినవారు నియోగులువారివద్ద కుతపనమల్క వారి ఫేజీబులు ముకుందపండితులు మొదలయినవారు కూర్చుండి ఆలోచనచేసినది:— కర్నాటకం సింహాసనానకు నడవంగా కృష్ణరాయల వారిని అధిష్ఠాన కర్తలను జేసిన దారభ్యం తురకల మీద కార్యం శాయ ఆలోచనజేశి అందుకై యత్నములు శేస్తావున్నారు. అన్ని వివరాలకు విజయనగరమునుండి కాకితములు వ్రాశివచ్చెను. ...మంత్రాలోచనగా వార్తలాడినవి: కర్నాటకం వారు సరదు బలమించివస్తే గజపతివారికిన్ని మనకున్ను మున్నెరికం గాకుండగా వుండును. ఆరీతు గాకుండ అందునకైన యత్నంగని సరుదు దుర్గాలను రస్తుసామగ్రిలు వేయించి బలవంతంగా యేనుగలు గుఱ్ఱాలు కాల్బలములు వుంచవలెను. అని ఆలోచనజేసినవారై యేదుల శాహువారితోను...నిజాంశాహువారున్ను కుతుపనమలకవారున్ను విజయనగరానినుండి కాకితములు వ్రాశి

వచ్చినది విని ఆలోచనపరులై యిక్కడికి కాకి తములు అంప్పి తమ తమ సరుదు స్థలములు పదిలపరచుకొని యాది హెచ్చరికలతో నున్నారు...

'గజపతివారు.....పరస్థలపు నియోగులతో నున్ను సంభాషణ శేయిగా నిజాంశాహువారి నీలాద్రిపంత్తులువారుంన్ను యెదుల శాహువారున్ను నిజాంశాహున్ను, కుతపనమలకవారున్ను సరుదులు స్థోమ శుద్ధిగా యోచనశాయగాపనిలేదు. అందుకు మించిన కార్యాలఇతే అహుముదు నగరపర్యంత్తం వత్తురు—అని ఘనంగా వ్రాశిఅంప్పినారు.'[4]

రాయవాచకమునందు పై వివరింపబడిన స్థానాపతుల వృత్తాంతము విశ్వాసపాత్రమేని—కాదనుటకు కారణము కానరాదు—దక్కను మహమ్మదీయ ప్రభువులకును గజపతి వారికిని రాజకీయములందు మైత్రి కలదనియు, నుత్తరమున అహుపురము (ఆగ్రా) వారితోను దక్షిణమున కర్నాటకంవారితోను యుద్ధము పొసగినప్పుడు వారంద రేకీభవించి శత్రువును దార్కొనువారనియు దెల్లమగుచున్నది. క్రీ. శ. ౧౫౦౯-౧౦ యందు కృష్ణరాయలు మహమ్మదీయ రాజ్యములపై దండు వెడలబోవుచున్నా డను వదంతి పుట్టినప్పటి నుండియు నతని వారంద రేకమై ప్రతిఘటించుటకు ఒండొరులతో సంప్రతింపులు సాగించుచు, బూర్వ మర్యాదప్రకారము గజపతిని గూడ తమ కొత్తాసిగనుండుమనియు దమతో నేకీభవించుట మేలనియు నతనికి దెలియబరచిరి. గజపతులకును గర్ణాటక చక్రవర్తులకును శత్రుత్వము తరతరములుగ బెరిగివచ్చుచుండెను; కర్ణాటక చక్రవర్తులతో యుద్ధము సంభవించినపుడు దురకల సహాయమును బొందుట కపిలేశ్వరుని కాలము నుండియు నాచరణయందుండిన పాతమర్యాదయె కాని క్రొత్తది కాదు. కావున గజపతి ప్రతాపరుద్రుడు కృష్ణరాయల ప్రతిఘటించుటకొఱకు దక్కను మహమ్మదీయ ప్రభువులతో నేకీభవించెనని నిస్సంశయముగ నంగీకరింపవచ్చును.

ఇట్లు మున్నెఱుకగలిగి కర్ణాటకులను గడిదాటి రానీయక వెనుకకు ద్రోయుటకొఱకు మహమ్మదీయప్రభువులును గజపతివారును జేసిన ప్రయత్నములన్నియు కృష్ణరాయల రణకౌశల్యమువలన వితథములైపోయెను. ప్రారంభమునందె మహమ్మదీయుల కళని సంకాశమైన దెబ్బ తగిలెను. క్రీ. శ. ౧౫౧౦-౧౭ ప్రాంతమున కృష్ణరాయలు కృష్ణాతీరమున మూడిండ్ల తురకరాజుల దళములను విఱుగబొడిచి చెల్లాచెదరు గావించుటయే కాక కృష్ణకుదక్షిణమందుండిన వారిదుర్గములను రాష్ట్రమును నాక్రమించుకొనెను. తరువాత గజపతి సామ్రాజ్యముపై నెత్తిపోయి కొండవీడు కొండపల్లి మున్నగు తీరాంధ్ర సుప్రసిద్ధ దుర్గములను తత్సంబంధిరాష్ట్రములను జయించి స్వాధీనము జేసికొని తెలింగాణము ప్రవేశించి యచటి కోటలను సీమలను ఆక్రమించి, కళింగ మధ్యమందలి సింహాచలముచెంతకు బోయి విడిసెను. అప్పాజీ తిమ్మరసయ్యవలె దక్కను మహమ్మదీయ ప్రభువులును కృష్ణరాయలు గజపతిరాజ్యములోనికి చాలదూరము జొచ్చుకొని పోయెనని తలచిరి. రాయరాణువధాటి కాగజాలక పాఱుగజపతికి దోడ్పడుటకు అదియె యదననియెంచిరి. అప్పుడు తాము విజయనగరసామ్రాజ్యముపై నెత్తిపోయి తాకిన దమదండయాత్ర నడ్డగించుటకొఱకు కృష్ణరాయలు కళింగమున యుద్ధము సల్పుచుండిన సైన్యమునంతటిని గాకపోయినను జాలభాగమును మరల్చుకొని రావలసివచ్చునని యు నందు

4. రాయవాచకం (కాకినాడ. 1933) ; పుటలు 46, 47, 49, 73.

మూలమున గజపతిమీది రాయసైన్యముల యొత్తిడి తగ్గిపోవుననియు దలచి ఫౌజుల ముస్తీదు చేసికొని బయలువెడలిరి. కేవలము గజపతికి సాయముసేయు నపేక్ష యొక్కటియె వారి నీ దండయాత్రకు దురికొల్పలేదు. ౧౫౧౧-౧౭ వ సంవత్సరమున రాయలచే దమకుగల్గిన పరాభవము నకు ప్రతీకారముసేయు దలంపును నప్పు డతడు దమచేతినుండి నాచికొన్న దుర్గములను రాష్ట్రమును మరల సంపాదింపవలయునను గోరికయు వారిని ద్వరపెట్టెను.

ఈ దండయాత్ర నెదుర్కొనుటకె కృష్ణ రాయలు కళింగ జైత్రయాత్రను మధ్యయం దాపి దక్కను తురకరాజులపై నడచినది. ఈ యుద్ధమున నడచిన ముఖ్యాంశములను రెంటినిమాత్రము రాయలు బేర్కొనియున్నాడు. (1) కెంబావి కయ్యము:— కెంబావి ప్రాచీన బహమనీ రాజధానియగు గుల్బర్గకు నైరృతి దిగ్భాగమున నేబదిమైళ్ళదూరమునను, ఆదిలుశాహుల రాజధాని యగు విజాపురమునకు దూర్పున గొంచె మించుగ నంతియదూరమున నున్న గ్రామము. బీదరు అహమదానగరరాజ్యముల సరిహద్దులు సమీపమం దె యుండినవి. ఇచట నొక బలిష్ఠమైనకోట యుండెను. అది యప్పు డెవ్వరి యేలుబడిక్రింద నుండెనో చెప్పుటకు వీలులేదు. మహమ్మదీయ రాజ్యములోని కంతదూరము గృష్ణరాయలు చొచ్చుకొనిపోవుటను జూడ తత్పూర్వము మహమ్మదీయ ప్రభువులనోడించి వారిని వెన్నం టి తఱుముచుబోయినట్లున్నది. ఆముక్తమాల్యదలోని వర్ణననుబట్టి చూడగా గెంబావియుద్ధము భయంకరమై యవనజనమారణ కారణమైనట్లు తోచెడిని. (2) నైజామనయావనా వనిధవుని మణిప్రాసాద నిర్మూలనము:—రాయ వాచకమునందును గృష్ణరాయ విజయమునను రాయలు అహమదునగరముపై నడచి యచట తురకల నోడించి యాపట్టణమును నేలమట్టము గావించినట్లు చెప్పియున్నది. రాయవాచకమున జరిగిన యుద్ధాంశములు వర్ణనాడంబరము లేక సంగ్రహముగ నిట్లు వివరింపఁబడినవి:—

'అహము దానగరమునకు నడవగా కొనమూకలవారు వెళిపాళ్యాలు చొరబడి చెరజొరాపట్టి చాలా కంపోలంశేయంగా కోటలోని గుర్రాలు వారు వెళ్ళివచ్చి యెదుట నిలిచి జగడ మియ్యంగా మూడుంనుక్కాలు ఘడియలలోగా రెండువేలుంన్నెనమంన్నారు గుర్రాలను అన్నియు రౌతులున్ను చావకట్టుగా మృతిబొందిరి గనక యీ సమాచారం కోటలోవున్న మొదటి దొరలఇనవారు విని ఇఖను మనం కోటలో నిలిచి వున్నట్టఇతే చేపట్టుగా పట్టుకబోదురు. అందునుంచి చాలా అవమర్యాద అని యెంచి యేమిబోయినా బోని అని కోటనువిడిచి పారిపోఇరి. గనక రాయల వారు ఆకోట యిడియగొట్టించి ఆపట్టం యెంత మేరో అంతమేరానున్ను వెలిపాళ్యాలుంన్ను దుంన్నించి ఆమిడాలు జిల్లేళ్ళు విత్తించె'ను.[5] కుమారధూర్జటి పై యంశములనే ప్రబంధ ఫక్కిని ఇట్లు వర్ణించినాడు:—

'దర్పంబున నముదానగరంబుపయి గరంబు దురంబు నేయందలంచి యప్పురంబు నలుదెసలం జుట్టు ముట్టినంబెట్టదరియు బెదరియుఁ జెదరియుఁ దజ్జానపదవర్గంబు పలుదెసలం బాఱి మీఱి న రాగంబున నచ్చటి యవనబలంబు లెసంగచలంబునన్ గోటవెడలివడిం దలపడినం బోరు ఘోరంబై కౌరవ పాండవ రణంబునుంబోలి గాంగేయ కుంభజాత దుశ్శాసన వీరలక్ష్మణ కర్ణ శల్య హరణ కారణంబై...మెఱయు నయ్యుద్ధవిడికి నోహాటించి చలించి పలాయమానులగు పారసీకుల ననేకుల గాందిశీకులని యెంచి బ్రదుకుదురుగాక యని యుపేక్షించి తదీయస్థలంబున జయధ్వజంబెత్తించి' అని.[6]

పైనుదాహరించిన రెండు వర్ణనల యందును గొంతభేద మగపడుచున్నది. రాయ వాచకమునందు గృష్ణరాయ లహమదునగరపుగోట నిడియగొట్టించెనని యున్నది. కృష్ణరాయ విజయమునం దాప్రస్తావము గానరాదు. కుమార

---

5. రాయవాచకం (కాకినాడ. 1933 పుట 93.)

6. కృష్ణరా విజ 3:65.

ధూర్జటి యీయంశము నెందుకు పేర్కొనలేదో కాని కోటను ఇడియగొట్టినదిమాత్రము వాస్తవము. కృష్ణ రాయల సాహ్యమే రాయవాచకవర్ణన యథార్థమని రుజువు సేయుచున్నది. ఆముక్త మాల్యదషష్ఠాశ్వాసాంతమున,

'ఇది నైజామన లూవనావనిధ
వాహీనాభ్రచుంబి స్ఫుర
ద్విదితాభీలమణిగృహాళిదళనో
ద్వేలోగ్రహస్తి వ్రజో
ద్యదనీకాగ్రగ కృష్ణరాయ,'

అని చెప్పుకొనియున్నాడు. ఈ మణిగృహాళి యహమదనగరపు గోటలో నుండినవి. వీని పరిసరముల యందే యహమదునగరము నిర్మింపఁబడెను. ఈ మందిర పట్టణ నిర్మాణములనుగూర్చి ఫెరిష్తా యిట్లు వ్రాసియున్నాఁడు. బహమనీసుల్తాను సైన్య ముతో నహమదు నిజాముల్ ముల్కుకు జరిగిన యుద్ధమునందు నిజాముల్ ముల్కునకు జయము గలిగెను. ఈ రణక్షేత్రమున క్రీ. శ. ౧౪౯౦ సంవున అహమదు నిజాముల్ ముల్కొక చక్కని ప్రాసాద మును నిర్మించి దానిచుట్టును కనులపండువు సేయు నుపవనమును వేయుటచే నా విజయమున కుపవన విజయమని పేరు వచ్చినది; అతని తరువాతివా రాతోటను మరింత మనోజ్ఞము గావించిరి. మఱియు దానిచుట్టును కోట కొత్తళము లెత్తించి దానికి నిజాము ఉపవనమని నామకరణము గావించిరి. ౧౪౯౪ సంవున దనరాజ్యమున కొక రాజధానిని నిర్మింప నిశ్చయించుకొనెను. ఈ యుద్దేశముతో నతఁడు నిజాము ఉపవన పరిసరముల సేనానదీతట మునను నహమదునగరమను నూతన పట్టణమునకు బునాది వేసెను. తరువాత క్రీ. శ. ౧౫౦౦ ప్రాంత మున దౌలతాబాదు ముట్టడినుండి మరలివచ్చినవెంట నిజాము ఉపవనము చుట్టు కోటనుగట్టి యందెట్టి ఖాతితో నొక మందిరమును గట్టించెను.'[7] ఈ నిజాము ఉపవనములోని ప్రాసాదములె కృష్ణరాయ లియడియగొట్టిన గృహాళి. అవి యహమదునగరపు గోటలోనివగుటచే గోట నిడియగొట్టక వానినిడియ గొట్టుట సాధ్యమైన కార్యము గాదు; కావున రాయవాచకమున జెప్పినట్లు కృష్ణ రాయ లహమదు నగరపు గోట నిడియగొట్టుట నిక్కువము. కాని యీ విజయముమూలమున గృష్ణరాయలు విశేషము లాభమును బొందినట్లగపడదు. రాయ వాచకమున మూడు తెగల తురకలరాజ్యమంత్తా కంపోలంజేసి వారి దుర్గములను స్థలములను గట్టుకొన్నట్లు వ్రాసియున్నది. తురకల రాజ్యము లను గంపోలము జేసినమాట వాస్తవమే; కాని యీ యుద్ధానంతరము దురకల రాజ్యమందలి దుర్గములును స్థలములును వారి యధీనమందే యుండుటచే గృష్ణరాయలు వానిని గట్టుకొనె ననుట యతిశయోక్తి. ఇంతియకాదు రాయచూరు మున్నగు నంతర్వేదిదుర్గము లింకను ఆదిలుఖానుని యాధీనమునందే యుండినవి. కోవెలకొండ మున్నగునవి కుత్బుల్ ముల్కు క్రిందనె యుండినవి. తురకలను పరాభూతులను గావించియు గృష్ణ రాయ లీ దుర్గగ్రహణమున కేల పూనుకొనలేదు? అనుప్రశ్న యొకటి సమాధానమును గోరుచున్నది. ఏల పూనుకొనలేదో కను గొనుటకు దగిన సాధనములు లేవు, కాని యూహసేయవచ్చును.

రామాయణములో బిడుకలవేట్లాట యన్నట్లు కళింగ జైత్రయాత్రమధ్యమం దావిర్భవించిన దీ కెంబావి యహమదునగరముల యుద్ధ ప్రసక్తి. తత్కారణమున నడచుచుండిన కళింగ దండయాత్రనాపి మహమ్మదీయ ప్రభువులతో గృష్ణ రాయలు గయ్యమునకు రావలసి వచ్చెను. వారిని పరిభవించి తఱుమగొట్టినపిమ్మట వా రాక్రమించు కొనియుండిన దుర్గములను గైకొనుట వ్యవధి లేకపోవుటచే వానిని దరువాత జయించవచ్చునని తలఁచి కలింగమునకు మరలిపోయియుండును. బహిరంగస్థలయుద్ధముకంటె గోటల ముట్టడించి సాధించుటకు దీర్ఘకాలము పట్టును. రాయలు మహమ్మదీయు లాక్రమించుకొనియుండిన గడికోటలను సాధించుటకు గడగిన, గజపతిపైని దండయాత్రను దదేకనిష్ఠతో సాగించుటకు వీలుండదు. అవకాశముగలిగిన నతఁడు రెక్కొని క్రొత్తగ దళములను గూర్చుకొని ప్రబలుడై

7. *Briggs' Ferishta III pp.* 197, 200-01, 204.

తారొక్కనవచ్చును. కావున గజపతి కట్టియవకాశము నీయక సతని సంపూర్ణముగ నోడించి సంధికొడ బఱచి యావల మహమ్మదీయుల పని బట్టింప వచ్చునని నిశ్చయించి సింహాద్రికి దరలిపోయి యుండును.

౯

రాయచూరు

(క్రీ. శ. 1520)

కళింగ దండయాత్ర జయవంతముగ ముగిసినది : కూతునిచ్చి రాయల కుద్వాహమొనర్చి గజపతి రాయలతో సంధిజేసికొనెను ; అనతుఁడై యుండిన కాటూరు ప్రభువు నిహతుఁడాయెను ; అతని ధనసంచయము రాయభండారమును జేరెను ; రాష్ట్రము రాయ సామ్రాజ్యమున గలసి పోయెను. ఇక తురక లాక్రమించుకొని యుండిన దుర్గములను జయించి. కైకొనుటకు ప్రయత్న పడవలసియుండెను. అందు ముఖ్యమైనది కృష్ణా తుంగభద్రల యంతర్వేదియందలి రాయచూరు. మొట్టమొదట నాదుర్గమును సాధించి యంతర్వేది నంతటిని తన యధికారము క్రిందికిదెచ్చుకొని దక్కిన చిల్లరకోటల నటుపిమ్మట సులభముగ స్వాధీనపఱచుకొనవచ్చు నని నిశ్చయించి యా కార్యమును నెఱవేర్చుటకు దగిన ప్రయత్నములు సేయగడగెను.

రాయచూరు దండయాత్ర ప్రకటన సందర్భము న్యూనిజొక కథను చెప్పుచున్నాడు :—

సయ్యదు మర్కరు కథ : ఒకనాడు కృష్ణ దేవరాయలు సాళువతిమ్మయతో సాళువ నరసింగ రాయల మరణపత్రమందలి యాదేశముచొప్పున నందు భేరొక్కనియుండిన దుర్గములలో నొక్కటి యైన రాయచూరును ఆదిలుఖానుని జయించి స్వాధీనము జేసికొనుటకు నిశ్చయించితిననియు, సంతకు ముందు నలువదేండ్లనుండియు నాటివఱకును వర్ధిల్లుచు వచ్చిన దమ రెండురాజ్యములయొక్క మైత్రి భంగపఱచుటకు వెరవెఱుగక నున్నాడ ననియు జెప్పెను. అందుకు సాళువ తిమ్మయ ఇట్లు జవాబుచెప్పెను. రెండురాజ్యములకును మైత్రి కొన్ని నిబంధనల ననుసరించి నడువవలసి యున్నది :— ఇరుపక్షములవారియం దెవ్వరి రాజ్యమునుండియేనియు జమీందారులు, ఋణ గ్రస్తులు, ద్రోహి దళపతులు మున్నగువారు పాఱి పోయి రెండవవారి యండ జేరిన, నటివారిని దమకు బట్టియీవలయునని మొదటివారు కోరిన యెడల రెండవవారు వారి నప్పగింపవలయును. ఏలినవారిక్రింది భూస్వాములును, అప్పుపడి ధనము నీయవలసిన ఋణగ్రస్తు లనేకులు ఆదిలుఖానుని రాజ్యమున డాగియున్నారు. కావున ఆ నెపము వెంట దండు వెడలవచ్చునని యత డుపాయము జెప్పెను ; కాని ఇతరమంత్రు లందు కొప్పుకొన లేదు.

కృష్ణరాయల కొలువున సయ్యదుమర్క రను మహమ్మదీయు డొక డుండెను. వానిచే నలువదివేల పద్దావుల పైకమిచ్చి గుఱ్ఱములను గొనుటకు గోవాపట్టణమున కంపియుండెను ; గోవాకు రెండు లీగుల దూరమున పొండాయను స్థలము గలదు. అది మహమ్మదీయుల కునికిపట్టు. మర్క రాస్థలమును జేరి యచటినుండి యాదిలు ఖానుని రాజ్యములోని కాధనమునంతటిని వెంటగొనిపరారి చిత్తగించెను. పొండాయందాత డుండగ నాదిలుఖా నాతనిపేర నొక యుత్తరము ప్రాసిపంపెననియు, దత్కారణమున నాత డాది లుఖానుని రాజ్యమునకు బాఱిపోయెననియు గొందఱు చెప్పుదురు. సయ్యదుమర్కరు పలాయనము రాయల కెఱుకపడినంతటనె, యతడు పెక్కు సంవత్సరములుగ రెండురాజ్యములకును వర్ధిల్లుచున్న మైత్రి యాద్రోహి కారణముగ విఘాతము సేయుట యుక్తముగాదనియు, వానిని బట్టి తనకడ కంపవలసినదనియు గోరుచు నొక కమ్మ నాదిలుఖానునిపేర ప్రాయించి పంపెను. ఆ కమ్మ యందగనె యాదిల్ఖానుఁడు ఖాజీలను మంత్రులను రప్పించి వారి కాలేఖార్థము జదివి వినిపించి వారిని సలహా యడిగెను. మర్కరు సయ్యదు, అనగా ముహమ్మదుప్రవక్తవంశ సంజనితుడగుటచేతను, ముల్లాశాస్త్రవిశారదుడు

నగుటచేతను నాతని రాయలకుబట్టి యీరాదనిరి. అంతట నాదిల్ఖా నొకయుక్తి నవలంబించెను; మర్కరుకు దాబులను రేవుపట్టణమును జూగీరొసగి యతనినచటి కంపి, యతడు దన యాస్థానమున లేడనియు, నతనిసంగతి తనకేమియుఁ దెలియదనియు బదులు వ్రాసియంపెను. దాబులు నుండి యీ సయ్యదెచ్చటికో పాఱిపోయెను.

ఈ విషయ మెఱుకపడగనె రాయలు దక్షణమె దాబులుపై దండువెడలిపోయి సూడు దీర్చుకొన నిశ్చయించెను. మంత్రు లల్పధనము కొఱకు సయ్యదుపై యుద్ధమునకు వెడలుట పాటి గాదని వారించిరి. కాని రాయల దృఢసంకల్పమును గుర్తెఱిగి, 'దేవా! దాబులుమార్గమున బోవలదు; ఇప్పు డాదిలుఖానుని యధీనమున నుండు రాయచూరుపై దండువెట్టుఁడు; అది పూర్వము మన రాజ్యమునకు జెల్లుచుండిన'దని విన్నవించిరి. మంచిదని వారి సలహా నంగీకరించి, సయ్యదు మర్కరు వృత్తాంతమును దెల్పుచు మ్రొదమల్కా, దెమెల్లెనో, దెస్తూర్, విరిదో అనువార లకు ఉత్తరములు వ్రాయించెను.[8]

క్రీ. శ. ౧౫౫౦ ప్రాంతమున దా ఏపీయా యను చరిత్ర గ్రంథమున ప్రథమదశకమును బ్రకటించిన బ్యారాసు ఈకథను గించి ద్వ్యర్థాన్వయముతో నిట్లు చెప్పుచున్నాడు :—

'ఆదిలుఖానుని తంత్రము చేసి బోను కెక్కింప వచ్చునని యెఱిగి కృష్ణరాయలు పెక్కేండ్లుగ దన కొలువునందుండిన సయ్యదు మెర్కరను మహమ్మదీయుని బిల్పించి, నలువదివేల పర్దావుల నెత్తికొని గోవాకుబోయి యచట పారశీక దేశమునుండివచ్చు గుఱ్ఱములను గొనుమని యాజ్ఞాపించెను. మన కప్తానునకు గూడ నాయర్థమును సాధించు నుద్దేశముతో, నాయంశమెల్లరకు దెలిసియుండుట మేలని యెంచి జాబులను వ్రాసెను. సయ్యదు మర్కరు తనవశమున నున్న ధనముమీది వ్యామోహముచేతనో, యాదిల్ఖా నంపిన యుత్తరమునకులోగియో, గోవాకు మూడులీగుల దూరమునందుండు పోండ యను కాణాదరియకు వచ్చి చేరినపిమ్మట ఆదిలుఖానుని రాజ్యమునకు బాఱిపోయెను. అతడు తన చెంతకురాగానే యాదిల్ఖాను, అతడు ప్రవక్తముహమ్మదుయొక్క మహోన్నత కుటుంబమునకు జెందినవాడగుటచే నతనికి దావులు కాణాదారి యను జాగీరుగ నొసగి యచటి కంపెను..., కాని తరువాత కొన్ని దినములలోనే యత డచట గానరాక మాయమై పోయెను. అతనిచెంత నున్న నలువదివేల పర్దావులను హరించినపిమ్మట ఆదిల్ఖా నాతని జంపించెనని చెప్పుదురు.[9]

ఇట్లు కృష్ణరాయలకు సమకాలికులును నించుక తరువాతివారునైన పోర్చుగీసు చరిత్ర కారులును జెప్పు సయ్యదు మర్కరుకథయందు సత్య ముండకపోదు; కాని వారి యాదార్థమును సంశయగ్రస్తముసేయు నట్టియంశములు వారి కథయందు లేకపోలేదు. ఇందు ముఖ్యమైనది విద్యానగర విజాపురరాజ్యముల మైత్రి. క్రీ. శ. ౧౫౭౦-వ సం॥న కృష్ణరాయలు రాయచూరుపై దండు వెడలుటకు పూర్వము నలువది సంవత్సరము లనగా ౧౪౮౦ నుండియు పై రాజ్యముల రెంటిమధ్య మైత్రి వర్ధిల్లుచుండినట్లు న్యూనిజు చెప్పియున్నాడు. ఇది యబద్ధమని నోరువిచ్చి చెప్పనవసరము లేదు. విజాపురరాజ్యము స్థాపింపబడినది క్రీ. శ. ౧౪౮౯ వ సం॥ నందని మహమ్మదీయ చరిత్రలవల్ల దెలియు చున్నది. అదిమొదలు రాయచూరు యుద్ధపర్యం తము గడచినయేండ్లు ముప్పదియొక్కటి. ఈ ముప్పదియొక యేండ్ల కాలములోపల విద్యానగర విజాపురములకు పెక్కుమార్లు యుద్ధము నడచినట్లు మహమ్మదీయ చరిత్రలవల్లను, హిందూ వాఙ్మయమువల్లను, విజయనగర చక్రవర్తుల శాసనములవల్లను దెలియవచ్చుచున్నది. కావున ఈపట్టున న్యూనిజుమాట సత్యాత్మకము గాదని వేఱుగ జెప్పవలయునా? దీనివలెనే మర్కరు కథయు నసత్యమైయుండరాదాయను సంశయము గలుగవచ్చును. వీటిరెంటికిని గల తారతమ్యమును గ్రహించితిమేని యట్టి యనుమానమున కవకాశ

8. *Nuniz F.E. pp.* 323-25
9. *Ibid, p.* 325, *W.* 2.

ముండదు. విద్యానగర విజాపురముల మైత్రి న్యూనిజన్యుల నుండి కర్ణాకర్ణిగ విన్న గత చరి త్రాంశము. సయ్యదు మర్కరుకథ ప్రాయశః అతడు విజయనగరమునకో, గోవాయందో, లేక తత్సమీపస్థమగు మఱియొక తావునకో నివసించు చుండినప్పుడు జరిగినది. ప్రత్యక్షముగ కంటితో జూచినది కాకపోయినను నట్లు చూచినవారివల్ల నెఱిగినది, స్వానుభవముక్రిందికి వచ్చును; కావున నది యసత్యమని యనుకొనుట కవకాశము లేదు.

ఇక కృష్ణరాయలు సయ్యదు మర్కరు వృత్తాంతమును దెలియజేయుచు లేఖలు వ్రాసినవా రెవ్వరో, వారి కట్లు ఏల వ్రాయవలసివచ్చెనో విచారించవలసి యున్నది. వీరిలో 'మాద్రెమలుకో' యను దానియందలి 'మాద్రె' యను పేరు 'ఇమా' దనియు నతడు బీరారు సుల్తాననియు, 'విరిదో' బీదరు సుల్తానగు బరీదనియు, దెమెల్లినో దెస్తూరుల యానవాలు చక్కగ దెలియరాదనియు నొకవేళ నది 'జెమెల్లుకో' యనగా నిజాముల్ ముల్క్ ను దానికి వ్రాయసకాని పొరపాటు కావచ్చుననియు, దెస్తూరనునది న్యూనిజు గ్రంథమున మటికొన్ని యెడల దెసూయా, లేక దెస్కారను దాని

---

10. *F. E. p.* 325, *N.* 3

11. 'జెమెల్లుకో' యనునది నిజాముల్ ముల్క్ కాభా సరూపమని యా మాటలకు గల పోలిక యే విదితము సేయుచున్నది. ఇంతేకాక జెమెల్లుకో సోదరి నాదిలుఖానుడు పెండ్లాడినట్లు న్యూనిజు వక్కాణించి యున్నాడు. (*F. E. p.* 326); దీనిని రుజువుసేయు సాక్ష్యము లభ్యపడలేదు; కాని ఫెరిష్తా గ్రంథమునందు క్రీ. శ. 1508 మొదలు 1553 వఱకు రాజ్యముచేసిన మొదటి బుర్హాన్ నిజాం షాహు ఇస్మాయీలు ఆదిల్ ఖానుని తోబుట్టువగు మరియం బేగము నుద్వాహము జేసికొన్నట్లు వ్రాసియున్నాడు. మఱియు నీ వివాహము జరిగినది క్రీ. శ. 1524 వ సంవత్సరమునననియు దెల్పియున్నాడు. (*Briggs-Ferishta III pp* 51-2) దక్కను మహమ్మదీయ ప్రభువుల కుటుంబములలో గుండమార్పు పెండ్లిండ్లు పెక్కు జరిగినట్లు చరిత్రగ్రంథములవల్ల దెలియ వచ్చుచున్నది. కావున న్యూనిజు చెప్పినట్లు ఆదిల్షా నుండు జెమెల్లుకొ (నిజాముల్ ముల్క్)ని తోబుట్టువును బెండ్లియాడి యుండిననుండవచ్చును.

కృష్ణరాయలు నది గోలొ్కండసుల్తానగు కుల్లీకుతుబ్షాయనియు సూయెలుగారు వ్రాసి యున్నారు.[10] కాని సూయెలుగారి వ్యక్తినిర్ణయ మును పూర్తిగ నంగీకరించుటకు వీలుగాదు. 'మాద్రె' యను నామమును ఇమాదుతో సరిపెట్టుటకంటె 'మదార్' యొక్క యాభాస రూపమని యూహించుట యుక్తమని తోచుచున్నది. 'మాద్రెమలుకో,' మదారుల్ ముల్క్ కావచ్చును. అట్లయిన నతని గుర్తించుటకు దగు సాధనము లింకను లభ్యపడలేదు. 'విరిదో' బీదరు సుల్తానగు బరీదనుటకు సంశయములేదు. 'దెమెల్లినో' సూయె లూహించునట్లు జెమెల్లుకో కావచ్చును. అగునేని యతడహమదునగర ప్రభువని నిజాముల్ ముల్కనుట సరియే.[11] దెసూరు కుతుబ్ల్ ముల్కని సూయెలు చేసిన వ్యక్తినిర్ణయము సరియైనది కాదు. ఇది దస్తూరి మమాలిక్, దస్తూర్ దీనా రనువారిలో నొక్కరిపేరై యుండవలయును. వీరిరువురికి పితా పుత్రబాంధవ్యము గలదు. ఇరువురును కృష్ణ రాయలకాలమున గుల్బర్గ నేలిరి. ఈ మహమ్మదీయ ప్రభువులందఱును బహమనీ సంస్థానము నాక్ర యించియుండిన సామంతులు. క్రీ. శ. 1347 మొదలు 1424 వఱకును బహమనీరాజ్యమును బాలించిన రెండవ మహమ్మదుషాహు కేవలము సత్వహీనుఁడగుటచే సామంతులపై దన యధికార మును జెల్లించుకొనజాలకపోయెను. కావున వారు తా మేలుచుండిన సీమలయందు స్వతంత్రులుగ వర్తిలుటయెకాక, చుట్టుప్రక్కలనున్న తోడి సామంతులను గొట్టి వారి సీమలను జయించి నూతన రాజ్య నిర్మాణమునకు గడగిరి. తత్కారణమున వారికి పరస్పరము వైరము గలిగి యుద్ధము సామాన్యమాయెను. వీరికి సయ్యదుమర్కరు కథను దెల్పుచు కృష్ణరాయ ఔత్తరము లేల వ్రాయించె ననునది ప్రస్తుతము విచారణీయాంశము. న్యూనిజీ విషయమును జక్కగ వివరించి యున్నాడు :— 'కృష్ణరాయలు మంచి నయశాలి. వారికి లేఖలంపినది వారిని దనకు సుముఖులను జేసికొనుటకొఱకే. వారి దళముల సహాయ మాతని కావశ్యము గాకపోయినను, సౌహార్ద మభిలషింపవలసియుండెను. వారంద ఱాదిల్షా

నునితో నేకమైన రాయలాతని నారీతి జయించి యుండజాలడు. ఆదిల్షానుఁడు దమకంటె బలాధికు డగుటచే నతనియెడ వారు ద్వేషము వహించిరి. తురకలలో విశ్వాస మల్పము; కుక్కలవలె నొకరిపై నొకరుబడి పెఱుకులాడుదురు; ఒండొరుల నాశమును జూడ నపేక్షింతురు.[12] కృష్ణరాయలు దలచినట్లు పై బేర్కొనిన తురకదొర లెవ్వరును ఆదిలుఖానునకు దోడ్పడ రైరి. కాని నిజాముల్ ముల్కుమాత్ర మాతఁడు నిజసోదరీ భర్త యగుటచే గొంత దండింపక తప్పినదికాదు.[13]

దళనాయకులు, దళసంఖ్య :—రాయల వెంట రాయచూరుపై నడచిన ముఖ్యదళనాయకుల నామములను, వారినాయకత్వముక్రింద నుండిన గజతురగ పదాతిసంఖ్యను న్యూనిజు వివరించి యున్నాడు :—

(1) కామానాయకుఁడు. ఇతఁడు రాయల కొలువునందుండిన మహమ్మదీయ సైనికుల కధిపతి. విలుకాండ్రేమి, ఖేటకధారులేమి, గడలవారేమి, తుపాకిబంట్లేమి—ముప్పదివేల కాల్బలమును, వేయి గుఱ్ఱములును, నాఱుగజములును, నతని యాధిపత్యముక్రింద నడచినవి. (2) త్రియంబక రావు, ముప్పదివేలు కాల్బలము, రెండువేల గుఱ్ఱములు, ఇరువది యేనుగలతోడను; (3) తిమ్మప్పనాయకుఁడు, అఱువదివేల కాల్బలము, మూడువేల గుఱ్ఱములు ముప్పదియేనుగలతోడను; (4) ఆదెప్పనాయకుఁడు లక్షకాల్బలము, ఐదువేల గుఱ్ఱములు, యేబదియేనుగులతోడను; (5) కొండ మరసు లక్ష యిరువదివేల కాల్బలము, ఆఱువేల గుఱ్ఱములు, అఱువది యేనుగులతోడను; (6) కొంతమర ఎనుబదివేలకాల్బలము, రెండువేల యేనూఱు గుఱ్ఱములు, నలువదియేనుగులతోడను; (7) విజయనగరపాలకుడగు సాళువగోవిందరాజును అతనిదళవాయియు ముప్పది[14] వేల కాల్బలము వేయిగుఱ్ఱములు బది యేను గుల తోడను; (8) రాయల యనుగు కొజ్జాలు ముప్పురు నలువది వేల కాల్బలము వేయిగుఱ్ఱములు పదునైదేనుగుల తోడను; (9) రాయల యడపము[15] పదునైదువేల కాల్బలము, రెండువందల గుఱ్ఱములతోడను;[16] (10) కొమారవీరయ యెనిమిదివేల కాల్బలము, నాలుగువందల గుఱ్ఱములు, నిరువది యేనుగుల తోడను, యుద్ధమునకు నడచిరి. (11) బంకాపురాధిపతిదళములును బహుసంఖ్యాకులైన దొమరు పుర ప్రజలును మఱియొకమార్గమున బోయిరి.[17] వీరుగాక మఱికొంద ఱీయుద్ధమున బాల్గొనినవారు శాసనములందు బేర్కొనబడి యున్నారు.

---

12. *F. E. p.* 326.

13. *Nuniz, F. E. p.* 326

14. న్యూని జీతని పేరును ఒగెంద్రహో. (*Ogemdraho*) అని వ్రాసియున్నాడు; కాని పయసు ఇతనిపేరు గందరాజోయనియు నితడు సాళువ తిమ్మయ సోదరుడనియు జెప్పియున్నాడు (*F. E. p.* 284). సాళువ తిమ్మయ సోదరుని సరియైన నామధేయము సాళువ గోవిందరాజని శాసనములవల్ల దెలియుచున్నది.

15. న్యూని జితని పేరు చెప్పలేదు. సూయెలిట్లు వ్రాసియున్నాడు. 'రాయరాజ్యము విచ్ఛిన్నమైన పిదప, మధురయందు స్వతంత్రులై పాలించిన యచటి మహా సామంత ప్రభువులు రాయల యడపము వాని వంశజులని బ్రాడాసు చెప్పియున్నాడు.' (*F. E. p.* 227, *N.* 3). ఇందువలన మధురనాయకుల పూర్వికుడే ఇచట పేర్కొనబడిన యడపమని సూయె లభిప్రాయపడినట్లున్నది. అడపము డెబ్బదిరెండు నియోగములలో నొక్కటి. ఈ పదమునం దేకకాలమున నెక్కండ్రు నియుక్తులై యుండవచ్చును. మఱియు బ్రాడాసే రాయలకడ మధురనాయక రాజుల మూలపురుషు డడపగాడై యుండెనో చెప్పలేదు. మధురనాయకరాజ వంశస్థాపకుండైన విశ్వనాథ నాయకుండు కృష్ణ రాయల కడపటిరాజ్యవర్షములందు బళ్లారి మండలములోని పాలకల్లు గ్రామము నమరముగ ననుభవించుచుండెను. ఇతడు అడపముచినానాగినాయని కొడుకు (*Further Sources I. p.* 175). ఇందు వల్ల చినానాగినాయడు కృష్ణరాయల యడపగాండ్రలలో నొక్కడని నిశ్చయమగుచున్నను, నతడె న్యూని జిట బేర్కొన్న యడపగాడని చెప్పుటకు వీలులేదు.

16. ఇతని కేనుగులు లేవు.

17. *Nuniz F. E. pp* 326-27.

మాధవవర్మ వంశజుడు కంఠమరాజు సింగరాజొక్కడు.[18] ఆపత్సహాయాభిధానుడు చోళమండల బ్రాహ్మణుడు మజీయొక్కడు.[19] దీనివల్ల రాయలదళనాయకులును సామంతులు మాత్రమెకాక సామ్రాజ్యమునందు పేరెన్నిక కెక్కిన యోధులనేకు లీదండయాత్రయందు పాల్గొనినట్లున్నది. మజీయు పోర్చుగీసులు పెక్కం డ్రుభయపార్శ్వములవారికిని తోడ్పడిరి. వీరియందు క్రిస్తోవాన్ డిఫిగైరెడో యను నశ్వ వ్యాపారి ప్రముఖుడు. ఇతనిక్రింద తుపాకులవా రిరువదిమంది రాయలతోగూడ దండయాత్రకు నడచిరి. ఫిగైరిడో రాయచూరు దుర్గమును సాధించునప్పుడు రాయల కమూల్యమైన సేవ యొనర్చెను. ఇట్లు రాయచూరుపై నడచిన రాయ సైన్యమునందు యేడులక్షల ముప్పదివేల పదాతు లును, ముప్పదిరెండువేల యాఱువందల గుఱ్ఱములును, నైదువందలయేబదియొక్కగజములు నుండెనని న్యూనిజు లెక్కనుబట్టి తేలుచున్నది. దండయాత్ర నడచునప్పుడు వలసిన వస్తుసామగ్రు లను నితరపదార్థములను సరఫరా సేయు వర్తకులును, సేవజేయు రజక క్షురకాది పరిచారకులును, విలాసినీబృందమును లెక్కకు మిక్కుటమై యుండెనట. ఇట్టి ప్రచండసైన్యముతో గూచిచేసిపోయి కృష్ణరాయలు రాయచూరు దుర్గముచుట్టును ముట్టడి దిగెను.

౯. రాయచూరు ముట్టడి

కృష్ణదేవరాయలు ముట్టడి వేసినప్పుడు రాయచూరు దుర్గ మేస్థితియందుండెనో న్యూనిజు వివరించియున్నాడు. గార నుపయోగింపక గండశిలలతో గట్టబడిన ప్రాకారములవరుసలు మూఁడు పట్టణము చుట్టు నావరించుకొనియుండినవి. ప్రాకారపుగోడల యంతర్భాగము మట్టితో గట్టనసేయబడి యుండినది.[1] వీనిలోపల మిక్కిలి యున్నతస్థానమున గోపురమువంటిది పొడవైన బలిష్ఠదుర్గము గలదు; దుర్గముచెంత సంవత్సరముపొడుగునను ఋష్కించని ప్రహద మొక్కటి యున్నది. అంతటి యున్నతప్రదేశమున నెన్నడును దఱుగని జలసమృద్ధి గలదగుటచే నది దివ్యతీర్థమని యెన్నబడుచున్నది; ఇదిగాక నచట చెఱువులు, బావులు మున్నగు జలాధారము లనేకములు కలవు; కావున అచటివారికి నీటికఱవువలన శత్రువులచేఁజిక్కుదుమను భయము లేదు. మజీయు నచటనాహారపదార్థముల కేమియు కొదవలేదు. ఐదేండ్లకు వలయు వస్తుసామగ్రియందు సమకూర్పబడి యుండినది. కోట కాపుదల యేర్పాటులయం దలసపా కెందును గానరాదు. ఎనిమిదివేల కాల్వురును, నన్నూఱు గుఱ్ఱములును, నిరువదేనుగులును, గొప్పబండలను విసరి యపారనష్టము గల్గింపజాలిన దంచనములు ముప్పదియు నందుండెను. మజీయు గోటగోడలపై బురుజులనేకము-లొండొంటికి మాట వినవచ్చునంతటి సమీపమున-లుండినవి. వాని మధ్యస్థలములందు ఫిరంగులు పెద్ద-వియే రెండువందలట, చిన్నవానిగూర్చి వేఱుగచెప్ప నేల? —బారులు తీర్చి యుండినవి. ఆపురజనులు రాయరాణువరాక తెలియవచ్చినంతటనె, యాదిలు

---

18. *S. I. I. IV.* 789.

19. *ARE.* 47 *of* 1906. తిరుక్కడవూరు అమృతఘటేశ్వరాలయమును ఆపత్సహాయుఁడను బ్రాహ్మణుడు కృష్ణరాయల కాలమున విజైయ (వృష) సంవత్సరమున ననగా శకాబ్దము 1444 (క్రీ. శ. 1521–22) న బాగుచేయించెను. అతడు ఇరాచూచ్చరు. 'విజైయా నగరములకడ నిజపరాక్రమ ప్రదర్శనమువలన గృష్ణరాయలను మెప్పించితి నని చెప్పుకొనియున్నాడు.'

1. ప్రాచీన దుర్గ సాలనిర్మాణపద్ధతి ఇది: పెద్ద గండశిలల యుపరితలములను మలిచి రెండు వరుసల గోడల నొండొంటికి మధ్య గొన్ని యడుగుల యెడము విడిచి కట్టి యా రెండుగోడలనడుమ నుండు స్థలమును గోడలపై మట్టము వఱకును మట్టిపోసి నింపి గట్టించెడి వారు. అప్పుడు రెండువరుసలగోడ లేకమై ఘనమైన కోటగోడ యొక్కటి పర్వడును. ఇట్టి కోటగోడ వరుసలు మూడొకదానిలోపల నొక్కటి రాయచూరు నావరించి యుండెనని న్యూనిజు చెప్పుచున్నాడు.

ఖానుఁడు గొంత సిబ్బందితో నంపిన దళవాయి నొక్కని బ్రవేశింపనిచ్చి, గచ్చుతోడను జూలతోడను వాకిళ్ళకన్నింటికిని అడ్డగోడలను గట్టి మూసివేసిరి. యుద్ధము జూలవఱకును కోటకు పూర్వదిశయందె నడచెను; ఉత్తర దక్షిణదిక్కులందు కోటయున్నత మైన గండశిలలపై నిర్మితమైయుండుటవలన, నా ప్రక్కలం దది బహుబలిష్ఠమై దుస్సాధ్యమై యుండెను. పట్టణముచుట్టును రాయరాణువ ముట్టడిదిగినను రాయలవారి శిబిరము కోటకు దూరుననె యుండెను. తత్కారణమున యుద్ధ కార్యమచ్చటనె ముమ్మరముగ నడచినది.

గొబ్బూరు యుద్ధము

యవనక్ష్మాపం సపాదంతతః
గొబ్బూరు స్థలవాసినం
సరభసం జిత్వాను విద్రావ్యతం
హస్తాశ్వాఽసతదీయదుర్గమతులం
రాచూరు మాదత్తవాఁ.

అని కృష్ణరాయల గొబ్బూరు రాయచూరు విజయములను బండారు లక్ష్మీనారాయణ వర్ణించి నాడు. కాని న్యూనిజు పై యుద్ధములను కన్నుల ముందు పొడకట్టునట్లుగ విపులముగ వివరించియు న్నాడు. కృష్ణరాయ లెత్తివచ్చి రాయచూరుదుర్గ మును ముట్టడించియున్నాడను వర్తమానము దెలి యవచ్చినంతటనె, ఇస్మాయీలు ఆదిల్‌ఖానుఁడు సైన్యమును ప్రోగుచేసికొనివచ్చి కృష్ణానదీయుత్తర తటమున విడిసెను; తనరాక వినఁగనె కృష్ణరాయలు దండునంతటిని గదల్చుకొని తడవుసేయక దన్ను మార్కొనవచ్చుననియు, నట్లు వచ్చినయెడల నాతని నోడించుటకు దానుపాశెముడిగియున్నచోఁబెయన్న స్థలములకంటె ననుకూలతరమైనదనియు నెంచెను. ఫలననగా, నది నుత్తరించి యవ్వలిదరి నేరుటకు దగినరేవు తన శిబిరముకడనెయున్నది; దానికంటె భిన్నమైనది యా ప్రాంతమున మఱియొకటి నెచ్చ టను లేనికారణమున, నా రేవును జక్కఁగ గాపు చేసియుండిన నదినిదాటి వచ్చుటకు యెవ్వరికి శక్యముగాదు; ఇఁక నానల్లమూక యేడనదిదాటు చేడయని తలపోసెను. కాని అతఁడనుకొనినట్లు కృష్ణరాయలుతారసిల్లలేదు; మఱియు దనస్కంధా వారమునందు నిశ్చలుఁడై యతని మార్కొననెట్టి ప్రయత్నమును జేయక మిన్నకుండెను; వేగరులను బిలిచి శత్రువునడవడికను నెత్తుగడలను నతని దళ సంచరణను జక్కఁగ బరిశీలించి తన కనుఱణమును నెఱుకచేయవలయునని యాజ్ఞాపించి యంపెను.

ఇస్మాయీలు ఆదిలుఖాను కనుమానము గల్గి నది. తా ననుకొనినట్లు కృష్ణరాయలు దన్ను మార్కొన రాకుండుటకు గారణమేమి? మర్మ మెద్దియో నిగూఢమై యుండవలయును; దానిని గనిపెట్టి తగినశాస్తి సేయుట యుక్తమనియెంచి హితులను దండనాయకులను బిల్పించి సభగూర్చి వారిని సలహా యడిగెను. వారియం దొక్కొక్క రును గృష్ణరాయల నిరాగమనమునకు గారణము నొక్కొక్కవిధమున నూహించుటచే, వారి యభి ప్రాయములు భిన్నములైయుండెను. అంకుశఖాను ప్రభృతులు కొందఱు, కృష్ణరాయ లాదిల్ఖానుని సరకుగొనక నిజబలాధిక్యమును నతనియెడ దన నిర్లక్ష్యభావమును వెల్లడిసేయుటకొఱ కచలుడై, స్కంధావారమందె సుస్థిరుఁడైయున్నాడనియును, దాము నదిని దాటినంతటనె వచ్చి తమపై బడు ననియు జెప్పిరి. మఱికొంద ఱది సరికాదనిరి. పూర్వము మహమ్మదీయులచే హిందువులకు గల్గిన పరాజయములను స్మరించిభీతిచేతస్కుడై గృష్ణరాయ లున్నాడనియు, దాము జంకక ముందునకు నడచినదిని దాటుట మంచిదనియు, నాదిల్ఖానుఁడు సత్వహీనత జూపుట యుక్తముగాదనియు, నతఁడపుడున్నచోట నెంతకాల మాగియుండిన నతనికి కీడును శత్రువుకు మేలునునంతగ హెచ్చుచుండుననియు, దమకు హిం దువులంతటి గొప్పసేన లేకపోయినను బూర్వవిజయ ములవలన గలిగిన ప్రతిష్ఠయె తమ కిప్పట్టునను జయము చేకూర్చుననియు విన్నవించిరి.

అందుమీదట నాదిల్ఖానుఁడు తన సైన్యము లకు గణుతి పెట్టించెను. విలుకాండ్రుగాని బందూ కులవారుగాని ఖేటకధరులుగాని గడలవారుగాని మొత్తము కాల్బల మొకలక్ష యిరువదివేలును, పదునెనిమిదివేల గుఱ్ఱపు రౌతులును, నూటయేబది యేనుగులును సైన్యమందున్నట్లు తేలినది; దీనికి

దోడు ప్రబలమైన ఫిరంగుల బారాతని కడనుండెను. తత్సహాయమున శత్రువును సులభముగ సాధింప వచ్చునని నిశ్చయించి సేనల కేఱుదాటుట కనుజ్ఞ యొసఁగెను.

శత్రువు నేఱుదాటనీయకమార్గము నరికట్ట వలయునను నుద్దేశము కృష్ణరాయలకులేదు; కావున ఆదిల్ఖాను నిర్బాధముగ గృష్ణనుదాటి రాయచూరు కించుక వాయవ్యమున బదునెనిమిదిమైళ్ళ దూర మున నుండు గొబ్బూరుగ్రామముకడ విడిసెను[1]. అచటినుండి రాయచూరు ముందుండు కృష్ణరాయల స్కంధావారముపై దళములనంపినతనకపజయము, గలుగదనియు నా దుర్గము దనచేతినుండి జాఱిపో దనియు నతఁడు తలంచెను. మొట్టమొదట తనశిబిర మును సురక్షితము జేసికొనుట మేలనియెంచి దాని చుట్టును కందకము ద్రవ్వించి కరగోడ నెత్తించి ఫిరంగులనన్నిటిని ముంగలిభాగమున బారుదీర్పించి, దళములను దత్తదభ్రస్థానముల నెలకొల్పి, శత్రువు పైకొనినపుడు కార్యము నడపవలసిన తెఱగును బోధించెను. మఱియు గృష్ణరాయ లొకవేళ తన యావత్ సైన్యముతో గదలివచ్చి యొక్క హుర్మ్తున దన శిబిరముపై బడవచ్చునని యెంచి యట్టి సందర్భమున శత్రుసంహారమునకు దగిన యేర్పాటులను గావించెను; శత్రువులపై బేల్చుటకు ఫిరంగులను బాణసంచును సిద్ధము జేసియుంచెను. సాహసముజూపి హిందువుల దండు పైకొన్నప్పుడు, దనయోధులు వారిని గసిమసగుట తప్పదనియు, నంతవఱకు వేచియుండి యప్పుడు ఫిరంగుల నన్నిటి నొక్కుమ్మడి పేల్చిన వారిని రూపుమాపవచ్చున నియు దీర్మానించుకొనెను.

కాని గృష్ణరాయలు యుద్ధమునకు ఆదిల్ఖాను తలచినవిధమున దారసిల్లలేదు. అతఁడసామాన్య ప్రతిభ గల దళనాయకుఁడు; తురకలతో బోరాట ములం దారితేరిన యోధుఁడు; యుద్ధకార్యము లందు చక్కని యనుభవముగలవాఁడు; ప్రణిధిబలము గల ప్రభువు. ఆదిల్ఖానుని యేర్పాటులన్నియు వేగ రుల మూలమున నతనికి దెలిసియుండిన నుండ వచ్చును. ఎట్లయిన నేమి? అతఁడదిల్ఖాను డూహిం చినట్లు కాక వేఱువిధమున వ్యూహమును రచించి కయ్యము సేయ బయలువెడలెను.

కృష్ణరాయలు దన సైన్యమునంతటినియేడు వాహినులుగ విభజించి, యందు రెంటిని యెలుగోలు బలముగ నేర్పాటుజేసి, వాని యాధిపత్యమును దనకు పిల్లనిచ్చిన మామయు, శ్రీరంగపట్టణరాజ్య పాలకుఁడును సైనకుమారవీరయకిచ్చి, సైన్యముతో గదలిపోయిన యాదిల్ఖాను స్కంధావారమున కొక పరుగుదూరమున విడిసియుండు నట్లాజ్ఞాపించెను. తరువాత కృష్ణరాయలు దక్కిన యైదువాహినులు వెంటరానతని పిరుదఁగూచిచేసి పోయెను. అరుణో దయసమయమున నాయుధములను ధరించి యుద్ధము నకు సంసిద్ధముగ నుండవలసినదని, సైనికుల కందరి కాజ్ఞఁ చేసెను. వెంటనె కోల్తలు సేయవలయునని రాయల యుద్దేశమైనను శుక్రవారమగుటవలన నాదినము కయ్యమారంభించిన మేలొడగూడదని యాంతరంగికులు విన్నవించుటచేత వారి వేడికో లంగీకరించి యుద్ధోద్యోగమును నాడుమానుకొనెను. ఉభయసైన్యములొండొంటికి గడు సమీపమందు విడిసియుండుటవలన ఇరువాగులందును సైనికులెల్ల నాపగలును రాత్రియంతయు నాయుధముల నూడ్వక జాగరూకతతో గాఁచియుండిరి.

శనివారమునాడు ఉషఃకాలమున గృష్ణ రాయల విడిదియందు రణభేరిపటహాది వాద్యములు సెలగినవి; సైనికుల కలకలము ప్రబలినది; ఆయా రవమునకు దాళక మిన్నువిఱిగి నెత్తిపై బడునట్లు తోచినది; వీనికిదోడు హయహేషలును గజఘీంకార ములును దిక్కుల బిక్కటిల్లినవి. ఆ మహోత్సంకులా రావమును వర్ణించుట కలవిగాదు. విన్నవారికే కాదు, తత్కర్తలకు సయితమది యెంతటి భయో త్పాదకముగనుండెనో యథాతథముగ జెప్పినను నమ్మ్మటకు సాధ్యమనిపించదు. శత్రులును వీరికి తీసిపోలేదు; భూనభోంతరాళములునిండినయా పెను ఘోషయం దెవ్వరికిని వారి నోటినుండి వెలువడు మాటలుసయితము వినరావాయెను; సంజ్ఞలమూల మునదప్ప నొండొరులతో మాటలాడు మార్గము వేఱెద్దియు గానరాదాయెను.

---

1. *Further Sources. I.* 116 (*a*).

రణరంగమున కందఱునుబోయి చేరునప్పటి కుదయమై జాము ప్రొద్దెక్కినది. అప్పుడు కృష్ణ రాయలు దన యెలగోలు బలము రెండువాహిను లను శత్రువులపై గవిసి వారియం దొక్కనిసైన జీవముతో నుండనీయక సంహరించవలసినదని యాజ్ఞాపించెను. రాయల యుత్తరువుప్రకారము



కుమార వీరయ ఫౌజులతో శత్రుసైన్యముపై నుఱికి తఱిమి నుఱుమాడుచు ముందునకు సాగి, వారి స్కంధావారము చుట్టునుండు కందకపు కర గోడపై కెక్కెను. అప్పుడు తెలియవచ్చినది ఆది ల్లానునకు గృష్ణరాయలు దాననుకొనినట్లు గాక వేఱు రణవిధానము నవలబించినాడని; కావున నతడు తన మొదటియేర్పాటులను త్యజించి, రాయల సైన్యములపై దనభటు లుఱికి యుద్ధము సేయుతరి మీద ప్రయోగింప నుద్యమించి యుండిన ఫిరంగు లను, దన స్కంధావారమును జొచ్చుట కుంకించు చున్న ఎలగోలుఫౌజులపై ద్రిప్పి కాల్పించెను: పిడుగుల వర్షమువలె నా ఫిరంగుల యగాదు రాయల యెలగోలు మూకను నిర్మూలముసేయ గడగినది; పెక్కేనుగులును గుఱ్ఱములును రణ క్షేత్రమున బడెను; పదాతివర్గము బహుళముగ

కృష్ణరాయలు పాఱివచ్చుచున్న తన సైని కులను గనిక్రోధదందహ్యమానచిత్తుడై 'స్వామి ద్రోహులార! ఏలపఱతెంచెదరు? పఱతెంచి వచ్చిన చోట లేదా మృత్యువు? పుట్టినవారు గిట్టక తప్పదు. అపకీర్తిపాలై పేరుప్రఖ్యాతులను దగుల బెట్టి మను అధమజీవనముకంటె వీరోచితమైనరణ శయ్యయే మేలుగాదో? మీకు బాసటయై నిలువ జాలిన యోధులెవ్వరును లేరా?' యని యుద్ధో పించెను. రాయలవారి నోటినుండి యామాటలు వెలువడెనో లేదో, తక్షణమే దొరలును దళనాయ కులును శూరులును పెక్కండ్రాతనిచుట్టునుమూగి 'మహాప్రభో! మా యొడలు యేలినవారివి? పని గొనుడు, అని విన్నపము జేసిరి. రాయలవారు మరల నిట్లు పల్కిరి: 'లోకములోని భూపాలుర కెల్ల నధికుడగు మేటిని జంపితినని యాదిలానుడు

రజ్జులాడు కాల మాసన్నమైననగుగాక ! అతని పరాభూతుని గావించితినని ప్రేలుట కెన్నడును అవసరము గలుగబోదు. అని తన ప్రేలినుండి ముద్దుటుంగరమును దీసి యొక యూడిగీని చేతికిచ్చి తనకు వీర స్వర్గప్రాప్తి కలిగిన చానిని రాణివాసములకు జూపవలయుననియు, నంతట వారు కులాచారము ప్రకారము సహగమన కార్యము నడుపుదురనియు నానతిచ్చి, గుఱ్ఱము నెక్కి, శత్రువుల నెదుర్కొన జాలక పఱతెంచివచ్చు వారియం దొక్కనినైన విడువక దయాదాక్షిణ్యములను మఱచి సంహరింప వలసినదని యుత్తరవిచ్చి, తక్కిన యైదువాహినులు వెంటరా రణభూమికి దరలెను. పలాయితులైవచ్చు చుండినవారు తమవారిచే దను కెట్టి మర్యాద జరుగునో గ్రహించి వెనుదిరిగి దుస్సహ పరాక్రమముతో శత్రువులను మార్కొని చించి చెండాడ గడగిరి. వారి ప్రతాపమునకోర్చి యభిముఖుడై నిల్చి యుద్ధము సేయగల తురక యొక్కడేనియుం గానరాడాయె. ఏలనఁగా దురకలు జయము తమకే కూడెనని యెంచి యుద్ధక్రమము ననుసరింపక వారులువీడి యెవ్వరి కనుకూలపడినట్లు వారు శత్రుల దఱుముకొని వచ్చుచుండిరి. హఠాత్తుగ హిందువు లెదురుతిరిగి వ్యూహక్రమమునను సరించి పోటుచూపగా వారియెదుట నిలిచి సరిపోరుటకు తురకలకు శక్తిలేకపోయెను. ఇందుమూలమున మహమ్మదీయ సైన్యము కలగుండువడినది. వారి ఫౌజసంఖ్యాకముగ మడిసినది. మిక్కిలి శ్రమపడి బల పఱచిన నిజస్కంధావారమును సయితము సంరక్షించుకొనవలయునను బుద్ధికూడ వారికి పుట్టదాయెను.

ఈ సందర్భమున సలాబఖ్తానుని వృత్తాంతము జెప్పక తప్పదు. ఇతఁడు ఇస్మాయీలు ఆదిల్ ఖానుని యొక్క సర్వసేనాధిపతి; విజాపురసుల్తాను కొలువు నందుండిన పోర్చుగీసుభటులలో నైదువందలమంది నేర్చి తనకంగరక్షకుల జేసికొనియుండెను. గొబ్బారు రణక్షేత్రమున దురక సైన్య మోడి బీభత్సమగుటను గని మరల దాని నేకముఖమునకు దెచ్చి శత్రులపైఁ గవియింపదలపెట్టెను; కాని యతనికడక నిష్ఫలమాయెను. మహమ్మదీయ సైనికుల కెవ్వరికిని నిజప్రాణ సంరక్షణ యొక్కటి తప్ప యన్యచింతలేకపోవుటచే నాతనిమాటల నెవ్వరును చెవిబెట్టరైరి. శత్రువులచే బట్టువడుట కంటె మరణమే మేలనియెంచి తన పోర్చుగీసంగ రక్షకబలముతోగూడ రాయరాణువపైబడి, తన్ను దన యంగరక్షకులను శత్రులు జిరకాలము స్మరించి భయముజెందున ట్లద్భుతఘణితి వీరవిహారము సల్పెను. అతని పరాక్రమమున కోర్వజాలక యాతని నెదుర్కొన సయిత మెల్లవారును వెఱచి దారి విడిచిరి. మొగ్గరము జీల్చుకొని లోఁ బ్రవేశించి రాయల యంగరక్షక బల సమీపమునకు బోయి చేరెను; అతఁడెక్కిపోవుచున్న గుఱ్ఱము విగత ప్రాణమై నేలకూల నతఁడు పాదచారియాయెను; శత్రువులచే బడనీయక యతని సంరక్షించుటకొఱ కతని పోర్చుగీసుభటులు రాయరాణువను పాయవడ నఱుకుచుబోయి యాతని వేఱొకగుఱ్ఱముపై నెక్కించిరి. వారు పోయినమార్గమును గ్రమ్మికొనగూడ నెవ్వరికిని ధైర్యము చాలదాయె. సలాబఖ్తాను డంతట గొఱ్ఱెలమందఁ బొచ్చిన తోడేలువలె మఱల విజృంభించెను; కాని యెంతకాలమట్లు పోరగలడు? శత్రు సమూహాంతుడై, కాయమెల్ల గాయమయమై గాసిలియుండ నిలుపోప నెట్లు సాధ్యమగును ? తుదకు సలాబఖ్తానుఁడు వాహనముతో కూడ కుప్పఁగూలెను. అతని మఱల సంరక్షించుటకు పోర్చుగీసులు ప్రయత్నము జేసిరి ; కాని యొక్కడైన నతనిచెంత జేరజాలక నఱుకుఁడువడి నిశ్శేషముగ నందఱు సమసిపోయిరి. ఈతగాత్తుఁడై సలాబఖ్తానుఁడు శత్రులచేఁ బట్టువడెను.

సలాబఖ్తానుఁ డొక్కఁడు దక్క శత్రుసంరంభమును నిల్వరించుటకు దొడరిన సర్దారు వేఱొకఁడాదిల్ఖానుని సైన్యమున లేడు. తక్కిన దొరలును శూఁకలును ప్రాణభీతిచే యథాయథలై పాఱజొచ్చిరి ; కృష్ణాప్రవంతి యందుఱికి యవ్వలిదరి నెట్లయిన జేర సమకట్టిరి; కాని వారిని వెన్నంటి తఱుముచు వచ్చిన రాయదళము వారిని బోనీక పొదుపుకొని చంపగడగెను. అందు ముఖ్యముగ నేను గులు నదిలోనికి దిగి నీట నీదుచుండిన వారిని తొండములఁ గబళించి తునిమి తూఁటూడ దొడగి

నవి. చౌడోలు లందుండు యోధులు నిజహేతి ప్రహారములచే ననేకులఁ దుదముట్టింపుచుండిరి. కృష్ణరాయలప్పుడు నదియొడ్డు జేరి తేఱిచూచెను; దృశ్యము మహాఘోరమై కన్పట్టినది. ఎటుచూచినను మృత్యువుతాండవమాడుచుండెను;స్కంధావారము నుండి బిడలతోఁ బరారియగుచుండిన యువతీజన మొకప్రక్కను, నదీ ప్రవాహ మగాధ మగుటచే దప్పించుకొని పోఁజాలక వాహములే శరణ్యము లుగ దేలియాడు నాశ్విక సందోహ మొక ప్రక్కను, గజౌఘక్క గమకించి పట్టుదప్పి రాహుత్తులతో గూడ బిళ్లపాటుగ నీటగూలి మడియు గుఱ్ఱము లొక ప్రక్కను, శ్రమపడి పైకెగబ్రాకి తలచూపిన శత్రుల నచటనె రూపుమాపు రాయ సైనికులును, నీట నుండు వారిని గీటడగించు గజఘటలును నెల్లయెడల బొడకట్టెను. ఈ దృశ్యమును గాంచినంతటనె రాయలవారి హృదయమున జాలిపుట్టినది. 'నిరప రాధులగు వీరెట్లు వధార్హులగుదురు? వీరి తప్పేమి?' యని చింతించి ధర్మదారబట్టుట కాజ్ఞాపించెను; ధర్మదార బట్టినంతటనె దళనాయకులెల్ల యుద్ధ కర్మను చాలించి దళములను మరల్చిరి.

ఈ మహాసంగ్రామమునందు ఇస్మాయీలు ఆదిల్ఖానుఁ డేమిచేసెనో విచారింతము. ఆతఁడు యుద్ధభూమిని ప్రవేశించనేలేదని చెప్పుచున్నాఁడు న్యూనిజు. యుద్ధసమయమున నతడుఁ తరువాత అసాద్ఖానుడనుబిరుదువహించిన—సుఫోలారిజ్ చే సంరక్షితుఁడై యుండెను. ఈ సుఫోలారిజ్ కుట్ర సేయుటయందు సాటిలేని ప్రజ్ఞావంతుడు; తన్నును దన పరివారమును ఆదిల్ఖానుఁడు దన కంగరఱకులుగ నియమించునట్లు పన్నుగడ పన్నెను. యుద్ధమునందు ఆదిల్ఖానుని ఫౌజు సంపూర్ణ పరాజయమును బొంది విఱిగిపాఱుతెంచు విధముగనుఁగొనియతఁడు, 'మహా ప్రభో! అవధారు! తమకు జీవముపై నాశయుండిన నావెంట విజయము సేయుఁడు' అని యాదిల్ఖానునితో విన్నపము జేసెను. అంతట నాదిల్ఖానుఁడేనుగునెక్కి శిబిరమును నందలి సర్వమును వ్యజించి, సుఫోలారిజ్ సలహాప్రకారము నదిని దాటక దాని దక్షిణ తటమందుండు కొండలవరుసనుజుట్టి నిజ రాజ్యమునకుబోయి చేరెను.

కృష్ణరాయలు యవన స్కంధావారమును బ్రవేశించి యాదిల్ఖానుని శిబిరమందు విశ్రమించెను.[1] దండనాయకుల రాయలవారట్లు విశ్రమించుట సరి యని తోచలేదు. కావున, వారు 'పలినవారిట విశ్రమించుట యుక్తముగాదు; శత్రుశేష ముంచరాదు. దేవరవారు స్వయముగ శత్రుసంహారకార్యమునకు బూనుకొనవలసిన యావశ్యకతలేదు. ఆజ్ఞయైన మేమా కార్యము నస్తమయమునకు ముందె ముగించి రాగల'మని విన్నవించిరి. రాయల వారందుకు సమ్మతింపడాయె. 'నిరపరాధు లనేకులు సమసిరి; ఆదిల్ఖానుఁడు నాయెడ చేసిన తప్పునకు దగిన శాస్తి యైనది. మఱియు, మన పింగల రాయచూరు మన కింకను స్వాధీనము కాలేదు; కావున కూచిజేసి ముందుకు నడచుటకు పూర్వము దానిని సాధించుట యవసర' మని చెప్పి యాదిల్ఖానుని స్కంధావార మున నుండు చూఱనంతటిని బరిశీలించుట కాజ్ఞ యొసఁగెను. మృతినొందినవారిలో నాదిల్ఖాను సంస్థానపు మొదటి వరుస దొరలు పెక్కండ్రుండిరి; యేవురు మహాదండనాయకులు జీవగ్రాహముగ బట్టువడిరి. పై బేర్కొనిన సలాబత్ఖానుడు వారి యందు ప్రముఖుఁడు; నాలుగువేలు పురుమంజి గుఱ్ఱములును, నూఱు మదహస్తులును, నన్నూఱు గొప్ప ఫిరంగులును, పెక్కు చిన్న ఫిరంగులును, తొమ్మిదివందల ఫిరంగిబండ్లును, బహువిధముల గుడారములును హస్తగతము లాయెను; ఇవిగాక

---

1. కృష్ణానదిని దాటి కృష్ణరాయ లాదిల్ఖానుని పాళెమును బ్రవేశించెనని నూనియెలు వ్రాసినాడు. *'The Raya then crossed the river and seized the Shah's camp.'* (*Forgotten Empire. p.* 139.) ఇదిప్రమాద జనితము. న్యూనిజు చరిత్రయందు దీని కాధార మేమియులేదు. ఆదిల్ఖానుడు కృష్ణ కవ్వలి యొడ్డున తొలుదొల్త పాళెముడిగినది వాస్తవమే; కాని దాని వ్యజించి కృష్ణను దాటివచ్చి గొబ్బూరు కడ శిబిరము లెత్తించి వానిచుట్టును కందకమును గరగోడను నిర్మించుకొని యుండెను. ఈ శిబిరముకడనె యుద్ధ కార్యమంతయు నడచినది. కావున కృష్ణరాయ లాదిల్ఖానుని శిబిరమునకు బోవుటకు గృష్ణను దాట వలసిన యావశ్యకతలేదు.

యసంఖ్యాత భారవాహోశ్వవృషభాది జంతువర్గ మును, పరిచార పరిచారికాసమూహమును పట్టు వడెను. రాయలవారి యాజ్ఞచే స్త్రీ లనేకులు బంధ విముక్తలై తమ నెలవులకుబోయి చేరిరి. రణస్థలి బడిన స్వపక్షమువారు పదునాఱువేల కధిక సంఖ్య గల యోధుల కెల్ల దహనాది క్రియలు ముగయు వఱకును నచ్చటనెయుండి, వారికి బుణ్యలోకా వాప్తికొఱకు దాన ధర్మముల గావించి, యటు పిమ్మట రాయచూరికి మరలిపోయి యథాపూర్వము ముట్టడివేసెను.[1]

ఇది న్యూనిజు చేసిన గొబ్బూరు యుద్ధవర్ణన క్రమము.

ఫెరిష్తా ఈ యుద్ధము నింకొకతీరున వర్ణించి యున్నాడు. హిజిరీ ౯౩౭ (క్రీ. శ. ౧౫౩౯)వ సం॥న ఇస్మాయీలు ఆదిల్ శాహు విజయనగర రాయలకడనుండి ముద్గలు రాయచూరు దుర్గము లను మరల స్వాధీనపఱచుకొన నెంచి దండయాత్ర సన్నాహముల గావించెను. ఆ సడి నెఱిగి యతడు ప్రచండసైన్యముతో వచ్చి కృష్ణానదీతీరమున విడిసెను; సామంతు లనేకు లచటికివచ్చి యతని గూడిరి; అందువలన నతని క్రిందనే బదివేల గుఱ్ఱములును గొప్ప కాల్బలమును యుద్ధమునకు సిద్ధముగ నుండెను. మఱియు నతడు కృష్ణానదిని దాటు రేవుల నన్నిటిని స్వాధీనపఱచుకొని వాని గాపుదల సేయుటకు బలిష్ఠమగు దళముల నియ మించెను. ఆదిల్ శాహు అంతట దన యుద్యమ మును విరమించుకొనిన భాగుగ నుండెడిది; కాని యప్పటికె వెలి గుడారములను వేయించి యుండుట వలన వెనుదీయుట నిజప్రతిష్ఠకు భంగకరమని యెంచి యేడువేల గరీబు గుఱ్ఱపుదళముతో బయలు దేరిపోయి హిందువుల పాళెమున కెదుట కృష్ణ యవ్వలిగట్టున డేరా లెత్తించి నదిని దాటుటకు దోనెలను జేసి ముగియువఱకు నచట వేచియుండెను. పాళెముడిగిన తరువాత నొకరోజున ఆదిల్ శాహు శిబిరమున విశ్రమించియుండగా దెఱకు వెలుపల నతని సహచరులలో నొక్కడు,

'సంతసపు మధువుతో నింపు బంగరుగిన్నె
మధు పిపాసితుఁ డుర్విమంట గలయకమున్నె'

యను గీతమును పాడుటను వినెను. అతని కంతటమధు పిపాస హెచ్చుగా ననుగులను బిలువ నంపి వారితో గూడ భోగాస్తరణముపై నాసీనుఁడై మధుపానుచు నాటపాటలయందు నిమగ్నుఁడై యుండెను. ఈ మధుపానక్రీడ మితి మీఱగా నాదిల్ శాహునకు గైపెక్కి యప్పుడే నదిని దాటిపోయి శత్రుసైన్యముపై బడవలయు ననుయిచ్ఛ ప్రబలెను. తఱుణమె దళనాయకులను బిలువనంపి దోనెలను తయ్యారుసేయుట కంతటి యాలస్యమేల కల్గెనో విచారించెను. నూఱుదోనె లప్పటికి సిద్ధమాయెననియు, దక్కినవి కొద్ది రోజులలోనే తయ్యారుకాగలవనియు వారు జవాబు చెప్పిరి. హాలాపానమదోద్రిక్తుఁడై యాదిల్ శాహు వెంటనె నది నుత్తరించుటకు నిశ్చయించి, తన యుద్దేశము నెవ్వరికిం జెప్పక యేనుఁగునెక్కి శత్రుస్థితిని పరికించుటకొఱకు బోవునట్లు బయలు వెడలెను; ఉన్నట్లుండి సిద్ధమైయుండు పడవలు పట్టు నందఱు సైనికులు పడవలపై దాటవలసిన దనియు, దక్కినవారు నేనుగులనెక్కి రావలయు ననియు ఆజ్ఞాపించెను; తొందరపడి సాహసముజేసిన కార్యము చెడునని దళనాయకులు విన్నవించిరి; కాని యాదిల్ శాహు మారువల్కక తన యేనుగును నదిలోనికి దోలెను; చేయునది లేక దళములతో గూడ దళపతులు రెండువందల యేబది యేనుగులపై దాటి యవ్వలి యొడ్డును జేరిరి. అదృష్టవశమున పడవలన్నియు రెండు పర్యాయములు సైనికుల నెక్కించుకొని దాటించువఱకును హిందువులు వారిని దారసిల్ల లేదు. కాని వారి సేన యత్యంతము బలిష్ఠమైనది; సుల్తానునకు జయము చేకుఱునను నాశకుగూడ నవకాశములేదు. అతని రెండువేల భటులును వారు ముప్పదివేలతో ఢీకొనిరి. మహమ్మదీయ వీరు లేక చిత్తముచే నుద్బోధితు లైనట్లు అత్యంతాటోపముతో వారి పైబడి, విజయనగర సర్వసేనాధిపతి సంగతరాయలు మున్నగు సహస్రాధిక సంఖ్యాతులను రూపుమాపిరి; కాని ఫిరంగులు తుపాకులు బాణసంచు మున్నగు

1. *Forgotten Empire. pp.* 334-343.

నాగ్నేయాయుధ ప్రయోగమువలన మహమ్మదీయ బలమునం దర్ధభాగమును విద్వేషులు హతము గావించిరి. హతశేషులు ప్రదుకు జీవుఁడా యని నదీప్రవాహమున నుఱికి తప్పించుకొనజూచిరి. సుల్తానుతో గూడనదేయంబారిలో గూర్చుని యుండిన తర్సూన్ బహదూరును ఇబ్రహీమ్ బేగును ఏనుగును నది కడ్డముగ దోలాడి యవ్వలి గట్టువైపు పఱచిరి; ఆ యేనుగయు మఱి యేడును దప్ప తక్కిన వన్నియు ప్రవాహవేగమునకు నిలుపోవక నీటబడి నశించినవి. వేగిరపాటునకు సుల్తానుకు దగిన శిక్షయాయెను; పరాజయమువలన దన కాపాదించిన యపయశమును బోగొట్టుకొను నంతవఱకును మరల మద్యసేవ జేయనని యత డొట్టువెట్టుకొనెను; ఆ యవమానము బాపుకొని తనకీర్తిని నిష్కళంకము జేసికొనుట కతఁడు యావచ్ఛక్తిని వినియోగింప గడగెను.

ఈ యుద్ధరంగమున మీర్జా జిహాంగీరు నిహతుఁడైన కారణమున, ఆదిల్ ఖానుకు కలిగిన పరాజయమునకు ప్రతిహతముగ సేయదగిన కార్య మెద్దియో తెలుపవలయునని యసాద్ఖాను నడిగెను. తమకు గలిగిన నష్టమపారమనియు సైన్య ముత్సాహరహితమై యున్నదనియు, దత్కారణ మున విజాపురమున కప్పుడు మరలిపోవుటయె యుక్తమనియు నతఁడు విన్నవించెను. ఆతని సలహా సనుంజసమని యంగీకరించి సుల్తాను కృష్ణాతటము నుండి తరలిపోయెను.[1]

న్యూనిజు ఫెరిష్తాల వృత్తాంతములు రెండును నొక్క యుద్ధముయొక్క వర్ణనలే. కాని వాని నొండొంటితో బోల్చిచూడగా ముఖ్యాంశ ములు మూటియందు తప్ప వాని కైకాత్మ్యము గానరాదు; ఈ ముఖ్యాంశములు మూడును ఇవి: (1) ఆదిల్ ఖాను విజయనగర రాయలతో యుద్ధము సల్పుటకొఱకు సైన్యముతో గూడ కృష్ణానదిని దాటివచ్చెను (2) అతడు యుద్ధమునందు పరాజితుడై కృష్ణను మరలదాటి తన దేశమునకు బాఱిపోయెను; అట్లు వెనుదిరిగి పోవునపు డతని సైనికు లనేకులు కృష్ణా ప్రవాహమున బడి మునిగి చచ్చిరి. మఱియు (3) యుద్ధానంతరము సుల్తాను అసాదుఖానుని సలహాప్రకారము ప్రవర్తించెనని ఇరు వురును వ్రాసియున్నారు. కావున వారు వర్ణించిన యుద్ధమొక్కటియే యని మనము తీర్మానింప వచ్చును. ఈ మూడంశములు విడిచిన తక్కిన యుద్ధవృత్తాంతము నంతటిని న్యూనిజు ఫెరిష్తాలు చెఱియొక విధమున వర్ణించియున్నారు.

యుద్ధము జరిగినది క్రీ. శ. ౧౫౭౨ మేనెలలో నమావాశ్య శనివారమునాడని న్యూనిజు వక్కాణించినాడు;[2] హిజిరీ ౯౭౨ (డిసెంబరు ౧౨ క్రీ. శ. ౧౫౬౦ మొదలు డిసెంబరు ౧. క్రీ. శ. ౧౫౬౧ వఱకు) అని ఫెరిష్తా చరిత్రయందున్నది.[3] పిరిద్దఱును జెప్పిన కాలము తప్పనియు, న్యూనిజు ప్రమాదవశమున '౧౫౬౧'కి బదులు '౧౫౭౨' అని వ్రాసెననియు, ఫెరిష్తా పొరపాటున నొకయేడధిక ముగ వేసెననియు, వాస్తవముగ యుద్ధము జరిగినది క్రీ. శ. ౧౫౬౦ మే నెల ౧౯ వ తేది యమావాస్య శనివారమునాడని సూయలు నిర్ణయించి యున్నాడు.[4] సూయలుచేసిన కాలనిర్ణయమే సరియైనదని రుజువుసేయగల శాసన సాక్ష్యము కొంతకలదు. మాధవవర్మ వంశజుఁడు క్రీ. శ. 1522 వ సంవత్సరముననో యించుక తరువాతనో బెజవాడ కనక దుర్గాలయమున వ్రాయించిన శాసనములో 'అధి వృషవర్ష మధిశ్రావణ మధి రాచూరు జగదేక నాథస్య వరాలయేన సహ వాటికా' యని యున్నది.[5] ఇందువలన పై సింగరాజు వృషవర్ష శ్రావణమాసము సందనఁగా క్రీ. శ. ౧౫౬౧ జూలై మాసమున రాయచూరు నందు రంగనాథస్వామికి దేవాలయమును గట్టించి దాని కొక వాటికను దానము చేసినట్లు తెల్లమగు చున్నది. తత్పూర్వమే రాయచూరు కృష్ణరాయలకు గైవసముగాకయుండిన, నతని సామంతులయం దొక్కని కప్పు డచట దేవాలయమును నిర్మించుటకు

---

1. *Briggs Ferishta, III pp.* 48-51.
2. *Nuniz, Forgotten Empire, pp.* 326, 337.
3. *Briggs Ferishta, III. p.* 48.
4. *Forgotten Empire, pp.* 140-147.
5. *SII. IV.* 789. *ll.* 110-13.

సాధ్యమైయుండదు. వృషసంవత్సరమునం డాపత్స హాయుఁడు వ్రాయించిన శాసనమునగూడ రాయ చూరు విజయము దత్పూర్వమే చేకుఱినట్లు తెలియ వచ్చుచున్నది.[6] కావున న్యూనిజు ఫెరిష్తా లిద్దరును చెప్పిన యుద్ధకాలములు విశ్వాసపాత్రములు గావని దృఢమగుచున్నది.

కృష్ణరాయల దండయాత్ర కాలమునందు రాయచూ రాదిల్ ఖానుని స్వాధీనమున నుండె ననియు దానికి గృష్ణరాయలు ముట్టడివేసిజయించి కైవసము జేసికొనెననియు న్యూనిజు చరిత్రవలన దెలియుచున్నది. దీనికి విరుద్ధముగ ఫెరిష్తా యప్పుడు రాయచూ రెముద్గలు దుర్గములు రెండును నప్పుడు రాయలకు జెల్లుచుండెననియు, వాని జయించి స్వాధీనము జేసికొనవలయునని యాదిల్ ఖాను దండెత్తిరాగా రాయ లాతని గృష్ణ యొడ్డున యుద్ధమున నోడించి తఱుమగొట్టెననియు ఫెరిష్తా పల్కుచున్నాడు. వీరియం దెవ్వరు చెప్పునది సత్యమో కనుగొనవలసియున్నది.

క్రీ. శ. ౧౫౧౭ లో విజయనగరరాయలు ఆదిల్ఖానుని జయించి రాయచూరును స్వాధీనపఱచు కొనెనని ఫెరిష్తా చెప్పియున్నాడు. సమకాలికుఁడును కృష్ణదేవరాయల రాయచూరుదండయాత్రయందు రాయల శిబిరమున వసింపుచు యుద్ధమును ప్రత్యక్షముగ జూచిన న్యూనిజు అప్పుడు రాయచూరు ఆదిల్ఖానునికి జెల్లుచుండెననియు నాతని నోడించి యా దుర్గమును గృష్ణరాయలు సాధించెననియు జెప్పియుండుటచేత క్రీ. శ. ౧౫౧౭-౧౫౨౦ ల మధ్య ప్రాయశః ౧౫౧౮-౧౯ ప్రాంతమున నాదిల్ఖానుఁడు కృష్ణరాయల కడనుండి రాయచూరును మరల స్వాధీనపఱచుకొని యుండునని పూర్వప్రకరణమునం దొకచోట నూహ చేసియున్నాఁడను. ఈ యూహ తప్పుకాదని శాసనసాక్ష్యమువలన నిశ్చయమగుచున్నది. సఫ-ఇ-షుహూరు ౯౧౬ (= హిజిరి ౯౨౧ = క్రీ. శ. ౧౫౧౫-౧౬) సం॥న వ్రాయించినవి ఇస్మాయీలు ఆదిల్ఖానునివి రెండు అరబీ శాసనములు హైదరాబాదు మ్యూసియములో నున్నవి. ఇవి మొదట రాయచూరుదుర్గము నందుండినవి; హైదరాబాదు మ్యూసియమును నిర్మించినపుడు గులాం యాజ్దానీగారు వాని నచ్చటికి దెప్పించి భద్రపఱచిరి. బహమనీ సుల్తాను మహమ్మదు షాహ కుమారుఁడు మహమూదు షాహ రాజ్యము సేయుచుండగా, ఖాన్-అల్-అక్రమ్ మజ్లిస్-అర్-రఫీ ఆదిల్ ఖాన్ అల్-ఘూజీ కుమారుడు ఆదిల్ ఖానుఁడు ముఖ్య ప్రధానిగనుండ, షేఖ్ బుర్హానద్దీన్-అల్-కిర్మాని పుత్రుఁడు మల్లిక్-అల్-ముఖల్ షేఖ్ నిజాముద్దీన్ అహమదు రాయచూరుదుర్గమును పాలించుచుండ, హుసేన్ ఇబ్రాహమ్ షుస్త్రీ తనయుఁడు అల్-అమీర్ రమజాను నతఁడు మసీదును కట్టించి నట్లొక దానియందును, నా సంవత్సరముననె పై బేర్కొనిన బహమనీ సుల్తాను ముహమ్మదు షాహ కుమారుఁడు మహమూదు షాహయు, ఆదిల్ ఖానుని కుమారుఁడు ఆదిల్ ఖానును, మల్లిక్-అల్-ముకల్లమ్ నిజాముద్దీన్ అహమద్-అల్-కిర్మానియును మీది శాసనమున జెప్పినరీతిని అధికారము నిర్వహించుచుండ నున్నతమగు బుర్జ్-అల్-ఫతహ (అనగా విజయబురుజు) కట్టబడెనని మఱియొక దానియందును వ్రాసియున్నది.[7] ఈ రెండు శాసనములును క్రీ. శ. ౧౫౧౬-౧౬ వ సంవత్సరమున రాయచూరుదుర్గము ఇస్మాయీలు ఆదిల్ఖానుని యేలుబడిక్రింద నుండెననియు నిజాముద్దీన్ అహమద్-అల్-కిర్మాని యతని పక్షమున దుర్గాధ్యక్షుఁడై యుండెననియు దెల్లము సేయుచున్నవి. మసీదును, విజయనామాంకితమగు బురుజును ఏకకాలమున నిర్మించుటను జూడ రాయచూరు నా సంవత్సరమందె యాదిల్ఖానుఁడు సాధించి యుండునని తోఁచుచున్నది. కావున కృష్ణరాయల దండయాత్రకాలమున రాయచూరు రాయల యధీనమున నుండెనని ఫెరిష్తా చెప్పునది యబద్ధమనియు, న్యూనిజు వచించి నట్లది యాదిల్ఖానుని వశముననె యుండెననుట వాస్తవమనియు దేలుచున్నది.

ఇక్లే యుభయపక్ష బలముల సంఖ్యను గూర్చియు న్యూనిజు ఫెరిష్తాల వృత్తాంతములందు

6. *ARE.* 47 *of* 1906.

7. *Khwaja Muhammad Ahmad. Inscriptions of Raichur in the Hyderabad Museum, pp* 14-16.

భేదము గానవచ్చుచున్నది. న్యూనిజు లెక్క ప్రకారము రాయలు ఏడులక్షల ముప్పదివేల పదాతులును, ముప్పది రెండువేల యాఱువందల గుఱ్ఱములును, నైదువందల యేబది గజములును గల మహా సైన్యముతో రాయచూరును సాధించుటకు బయలు దేరినట్లు తెలియుచున్నది. ఇదంతయు గాకపోయిన జాలభాగమేనియు గొబ్బూరు యుద్ధమున బాల్గొని యుండు ననుటకు సందియములేదు. ఈ మహా సైన్యమునెదుర్కొనుట కాదిల్ఖానుఁడు లక్షయిరువది వేల పదాతులును, పదునెనిమిదివేల గుఱ్ఱములను, నూటయేబది యేనుగులును, రెండువందలకుమించిన ఫిరంగులను వెంటగొని యుద్ధరంగమునకు వచ్చెను. ఫెరిష్తా లెక్కప్రకారము రాయల సైన్యమునం దేబదివేల గుఱ్ఱములును, విస్తారమైన కాల్బలమును, ఫిరంగి తుపాకి బాణసంచు మొదలగు నాగ్నేయా యుధములును నుండినవి; ఈ సైన్యము నెదుర్కొనుట కాదిల్ఖాను యేడువేల గరీబు గుఱ్ఱముతో గదలివచ్చెను; కాని రెండువేలతోడనె కృష్ణానదిని దాటి రాయరాణువతో డీకొనెను.

వీరిరువురిలో నెవ్వరి లెక్క సరియైనదో నిర్ధారించి చెప్పుటకు వలనుపడదు. కాని రాయ రాణువసంఖ్యాబలము రాయవాచకమందు వివరింప బడియున్నది. రాయరాణువయందు కైజీతంవా రనియు నమరనాయక బలమనియు రెండు వగల దళము లుండెను: కైజీతపు ఫౌజులో లక్ష కాల్బ లమును పండ్రెండువేల గుఱ్ఱమును, నైదువందల యేనుగులు నుండినవి; అమరనాయక బలమునందు రెండులక్షల పదాతులును, నిరువదినాల్గువేల గుఱ్ఱ ములును, పండ్రెండువందల యేనుగులును నుండినవి. కైజీత దళముగాని యమరనాయక దళముగాని మొత్తముమీద రాయరాణువయందు మూడులక్షల కాల్బలమును, ముప్పది యాఱువేల గుఱ్ఱములును, వేయియేడునూఱు లేనుగులును నుండెను. ఇది నగరిలెక్క. దీనితో బోల్చిచూచిన న్యూనిజు లెక్క యందు నాలుగులక్షల కాల్బల మధికముగను, పదు నొకండువందల యేబదియేనుగులును, బదునాల్గు వందల గుఱ్ఱములును దక్కువగనున్నవి. వాస్తవ సంఖ్యను నిర్ణయించుటకు వీలులేకున్నను రాయలు రాయచూరు దండయాత్రకు కొన్ని లక్షల సైన్య ముతో బయలువెడలెనని యనుకొనవచ్చును.

ఆదిల్ఖాను బలము ఫెరిష్తా చెప్పునంతటి స్వల్ప మైనదికాదు. ఏబదివేల గుఱ్ఱమును విస్తారమైన కాల్బలమునుగొని రాయలు యుద్ధమునకు బయలు వెడలి వచ్చినాడని వినియు నాదిల్ఖాను యేడు వేలతో నాతని నెదుర్కొనవచ్చినాడనియు, నందు చాలభాగమును గృష్ణకవ్వలి యొడ్డుననె నిల్పి రెండువేలతో నదినిదాటి యుద్ధమునకు గడగె ననియు జెప్పు ఫెరిష్తా వాక్యములు నమ్మదగినవి కావు. ఈ రెండువేలును యుద్ధమునను కృష్ణాప్రవా హమునను సంపూర్ణముగ సమసిపోయెనని యొప్పు కొనినను, మిగిలిన యైదువేలును యుద్ధమున బాల్గొనక, వచ్చినవారు వచ్చినట్లు చెక్కు చెమర్చక యుండిరికదా. ఇంతబలము యుద్ధమునకు సిద్ధమై యుండ నసాదుఖానుఁడు దమకు గలిగిన నష్ట మపారమైనదనియు, దత్కారణమున సైనికు లుత్సాహరహితులై యుండిరనియు నప్పటికి వెను దిరిగి విజాపురమునకు బోవుటయె శ్రేయస్కర మనియు, నహమదునగరపాలకుఁడైన బూర్హాను నిజాముశాహుతో సఖ్యము గావించుకొని యవ్వల రాయలపై గసితీర్చుకొనవచ్చుననియు జెప్పుట వింత. ఆతని సలహా చక్కనిదని యంగీకరించి యాదిల్ఖాను నిజరాజధానికి దిరిగిపోవుట యంత కంటె వింత.

చక్కఁగ విచారించి చూడఁగ న్యూనిజు ఫెరిష్తాలకు గల భేదములకు ముఖ్యకారణములు రెండు గానవచ్చుచున్నవి. న్యూనిజు కృష్ణరాయల కాలమున వచ్చుచు బోవుచుండిన సమకాల రచ యిత; రాయచూరు దండయాత్రయందు రాయల శిబిరముననుండి యుద్ధకార్యమును గన్నులార జూచిన ప్రత్యక్షద్రష్ట. ఫెరిష్తాతరువాత ఎనుబది తొంబదియేండ్లు గడచినవెనుక విజాపురమునందు చరిత్ర రచన గావించిన యర్వాచీనుఁడు. ఫెరిష్తాకు విజయనగర చరిత్ర తెలియదు; తెలిసికొనవలయు ననియతఁడు ప్రయత్నము సల్పినట్లగపడదు; కావున నతఁడు బహమనీసుల్తానుల చరిత్రయు వారి యధి కారమునకు వారసులైన దక్కను పంచసాదు

కాశ్రయమొసగిన యాదిల్ శాహు పూర్వికుల కీర్తి ప్రతాపములు నిష్కళంకమైనవని నిరూపింపవలయు ననినాతనికడక. కావున మహమ్మదీయులకును నందు ముఖ్యముగ నాదిల్ శాహు రాజులకును దుర్యశమును దెచ్చు చరిత్రాంశములను సాధ్యమై నంతవఱకును సంపూర్ణముగ గప్పి పుచ్చుటయో, విధిలేక చెప్పవలసివచ్చినప్పుడు మసిబూసి మారేడు కాయ యనిపించుటయో యతనికి గర్తవ్య మాయెను. ఈ కారణములచేనతడెన్నియో యబద్ధ ములను గల్పించెను. రాయలచే సంపూర్ణ పరాజయ మునుబొంది రాయచూరువంటి ప్రధానదుర్గమును గోల్పోవుట ఇస్మాయీ లాదిల్ఖానుని యశక్తతను వెల్లడిపఱచుననియెంచి కల్పనాకథను గల్పించెను. రాయచూరు రాయల యాధీనమందె యుండె ననియు దానిని జయించుటకొఱకు ఇస్మాయీ లాదిల్ శాహు దండయాత్ర సన్నాహముల జేయు చుండగా నా సంగతి దెలిసి రాయలు ప్రచండ సైన్యముతో దానిని సంరక్షించుటకు వచ్చెననియు ప్రారంభించినాడు; తన కాతనినెదుర్కొనబలము చాలదని యెఱిగియు వెలిగుడారము వేసినపిమ్మట వెనుదీయుట పరువునకు లోటని యల్పబలముతోడనె యాదిల్ శాహు యుద్ధమునకు బయలుదేరెనని రచింపబూనిన కథకు పీఠిక ప్రాసినాడు; మధుపాన గోష్ఠిని సృజించినాడు; ఆదిల్ శాహు వెంటనున్న యల్పబలమును అల్పతరముగ జేసినాఁడు. ఏల ననఁగా నాదిల్ఖానుఁడు పరువుమీఁద దృష్టినిల్పి శత్రుబలమును సరకుసేయక తొందరపడి యల్ప సైన్యముతో యుద్ధమునకు వెడలి మధుపానమత్తుడై యొడలెఱుగక కూడవచ్చిన చిన్నదండునకుగూడ సంపూర్ణముగ నదినిచాటుట కవకాశమీయక శత్రు వునుదాకుటవలన నోడిపోయెనేకాని లేనియెడల నతడు పరాజయమును బొందియుండడని బోధిం చుటకొఱకింత కల్పన గానలసి వచ్చినది. గావున ఫెరిష్తా వృత్తాంతము విశ్వాసపాత్రము గాదు. యుద్ధమును కన్నులారగాంచి వర్ణించిన న్యూనిజు కథ సత్యాత్మకమైనదగుటచే ఫెరిష్తాప్రాతకంటె సర్వోత్కృష్టమైనది. ఈ యంశమును స్మరణయం దుంచుకొని చరిత్రకారులు పరిశోధనసేయుట యుక్తము.

శాహుల వృత్తాంతమును వివరించునపుడు విజయ నగరవిషయములను బ్రస్తాపింపవలసి వచ్చినప్పుడు కుంతీ పుత్రో వినాయకః యను న్యాయమునను సరించి తన ప్రతిభకొలది గాఢలనేకములను గల్పించి నాఁడు.[1]

విజయనగర చరిత్రాధ్యాపకుల కిదియం తయు నాకాశపురాణమని వివరించి చెప్పవలసిన యావశ్యకత లేదు.

అజ్ఞానముతోపాటు జాతిమతాభిమానము లతని దప్పనడారుల కీడ్చినవి. మహమ్మదీయుల పరువు ప్రతిష్ఠలను గాపాడవలయుననియు, దన

---

1. ఒక యుదాహరణముజాలును అతని యజ్ఞానమును గల్పనాసైపుణ్యమును వెల్లడిసేయు టకు. క్రీ.శ. ౧౫-వ శతాబ్దోత్తరార్ధమున శివరాయలను నతడు విజయనగరమును పాలించుచుండెను; అంతకు పూర్వ మతని పెద్దలచట నేడువందల సంవత్సరముల నుండియు రాజ్యము సేయుచుండిరి. అతని కిద్దఱు పుత్రులుండిరి; అందు పెద్దవాఁడు తండ్రివెనుక సింహా సనము నధిష్ఠించెను; కాని యతని మంత్రియగు తిమ్మ రాజు విషప్రయోగముచే జంపి — మఱియొక చోట నతఁడు యుద్ధమున గాయపడి చచ్చెనని చెప్పి నాడు — అతనితమ్మునిదనచేతి జంత్రపు బొమ్మవలె నాడించుచు, గొంతకాలమైన పిమ్మట సింహాసనము నాక్రమించుకొనెను. మఱియొకచోట కథను ఇంకొక విధముగ మార్చినాఁడు. శివరాయల మరణాంతర మర్భకుఁడైన యతని పెద్దకుమారుడు సింహాసనము నెక్కెను; కాని యల్పకాలమునన యాతఁడును మర ణించెను; అతనితరువాత నతని తమ్ముడు రాజ్యాధిపత్య మునువహించెను; అతఁడును మృతినందెను. తరువాత రాజ్యమునకు వారసైన మూడుమాసముల పసిపాపను సింహాసనము నెక్కించి ముఖ్యమంత్రి తిమ్మరా జాతనిపేర రాజ్యముసేయ గడగెను. ఆ బాలుడు స్వయముగ రాజకార్యములు నిర్వహించుటకు దగిన యీడురాగనే తిమ్మరా జతనికి విషముపెట్టి చంపి, యాతని వంశమునకు జెందిన మఱియొక పసికూనను గద్దెపై గూర్చుండబెట్టెను. ఇట్లు నలువదియేండ్లధి కారమును జెల్లించి క్రీ. శ. ౧౫౭౦ ప్రాంతమున నతఁడు కాలగతినందెను. తిమ్మరాజు కుమారుఁడు రామరాజు. ఇతఁడు శివరాయల కుమార్తెను బెండ్లి చేసికొనెను. తండ్రి యనంతర మతడు రాయలకును రాజ్యమునకు సంరక్షకుఁడై ప్రజాపాలనము సేయ గడగెను. *Briggs Ferishta III pp.* 10-13, 80-81.

౧౦. రాయచూరు పతనము

గొబ్బూరు రణరంగమునుండి మరలి రాయచూరు దుర్గపు ముట్టడిని కొనసాగించి దాని గైవసము గావించుకొనునుద్దేశముతో గృష్ణరాయలా దుర్గము వైపు కూచిచేసిపోయెను. మార్గమధ్యమున క్రిస్తవన్ డిఫిగ్రెడో యను పోర్చుగీసు గుజ్జరు వర్తకుఁడు ఇరువదిమంది తుపాకిబంట్లతోకూడ విజయనగరమునుండివచ్చి రాయలను గలసికొనెను. ఇతఁడు వాగ్మి; శూరుఁడు. గుణగ్రహణపారీణుఁడగు రాయల కాతనియెడ నాదరాభిమానములు గల్గినవి; కావున నాదిల్షానుని స్కంధావారమున జూఱగొని తెచ్చిన గుడారములయం దొకదాని నిజ శిబిరముచెంత నెలకొల్పి యందాతనికి విడిది యేర్పాటు చేయవలసినదని యాజ్ఞాపించెను. రాయచూరుజేరగనే, తొల్లి గొబ్బూరుయుద్ధమునకు వెడలుటకు ముందు విడిసియుండిన శిబిరమునకె కుదురుకొనెను. సామంత దండనాయకాది సమస్త పరిచారమును వారి వారి నిర్ణీతస్థానముల నెలకొనిరి.

రాయలశిబిర మొక మహాపట్టణమువంటిది. కృష్ణరాయలవారి గుడారము రాజధానియందలి రాజనగరిని బోలి విరాజిల్లుచుండెను; సంరక్షణార్థ మొక కంపకోటచేనది పరివృతమైయుండినది. రాక పోకలకొక్కటే ద్వారము. ఈ యావరణములోపల గృష్ణరాయలును యతని కూడిగము సేయు పరిచారకులుమాత్రము నివసించువారు; రాయల వారిని జలకమాడించు బ్రాహ్మణుఁడొక్కడు; రాయ లెల్లప్పుడును వెంట గొనిపోవు దేవతార్చన సామగ్రియంతయు నితని యధీనమునకె యుండెడిది. ఇతఁడుగాక యడపము, కతి, గిండి, కాళాంజి మున్నగు రాజచిహ్నములను ధరించెడి యూడిగములవారును; రాయలసముఖమున నెల్లప్పుడును గాచియుండెడి యన్నగళును నివసించువారు. కంప కోటచుట్టును అంగరక్షకుల బలగము నిర్ణీతస్థానములందు గాపుండెను; వీరితోగూడ నగరి యుద్యోగస్తులును విడిసియుండిరి. వారి పురోభాగమున దళనాయకులెల్లను ఎవ్వరెవ్వరి కేర్పఱచియుండిన పాళెములందు వారుడిగిరి. వీరందఱికి వెలుపట రాత్రియంతయు దుర్గపు ముట్టడిని కొనసాగించి దాని గైవసము గావించుకొనుద్దేశముతో గృష్ణరాయలా దుర్గము వేగులవారి నెలపీడు; రాత్రియంతయు స్కంధావారమునందెల్లయెడల గస్తుతిరిగి ప్రతి పటుల వేగరులు గానవచ్చిన పట్టి బంధించుట వారి కర్తవ్యము. వారి కవ్వలి ప్రక్క దండు చాకళ్ళ పాళెము; ఇది వారుద్యోగముసేయుటకు వలసిన జలసమృద్ధిగల తావునకె ఏర్పఱుచబడియుండెను.

స్కంధావారమునం దెల్లయెడలను పురములందువలె వీధులు చక్కఁగ దీర్చియుండినవి. ఒక్కొక్క దళనాయకునిపాళెమందును అంగడివీధి యొక్కటికలదు. గొఱ్ఱె, మేక, పంది, కుందేలు మున్నగు సకలవిధ జంతు మాంసములును, కోడి, కౌజు మున్నగు పటులపొలయును యథేష్టముగ లభించెడివి. ఇవిగాక యాహారమున కుపయుక్తములగు బియ్యము, జొన్న, రాగి మున్నగు సకల ధాన్యములను అన్యాహారపదార్థములను విక్రయించు బాజారులును గలవు. మఱియు, నానావిధ వస్త్రములను సకలవిధ భోగ ద్రవ్యములను విక్రయించు నంగడివీధియొక్కటి గలదు. ఇందు దొరకనివస్తువులేదు. పలువగల కర్మకారుల వీధులు గలవు. ఇందు స్వర్ణమయభూషణాదులును, వజ్ర వైడూర్య పద్మరాగ మౌక్తికాది నవరత్నములును లభించును. ఇవికాక పచ్చిక, గడ్డి మున్నగునవి వెల్లికొల్లలు. ముప్పదిరెండువేల నాలుగువందల గుజ్జములకును, నైదునూఱుల యేబదియొక్క యేనుగులకును, లెక్కకుమిక్కుటమైన ఖరాశ్వతర వృషభాది భారవాహ జంతువర్గమునకు వలసిన యాహారపదార్థము లెటనుండి వచ్చుచుండెనో చెప్పుటకు సాధ్యముగాదు.

సైన్యమంతయు యథాపూర్వము స్కంధావారమున గుదురుకొనినపిమ్మట ముట్టడి మరల ప్రారంభమాయెను. న్యూనిజు ముట్టడి నడచిన విధము నిట్లు వర్ణించియున్నాడు: 'ఒకనాడు క్రిస్తవన్ డిఫిగ్రెడో తనకు పట్టణములోనికిబోయి చూడవలయునని కోరెక్కలిగెనని రాయలతో విన్నవించెను; కాని యందువలన నతనికాపద వాటిలుననిశంకించి, కృష్ణరాయలు పలదని

నివారించిరి. అందుమీదట యుద్ధకర్మయే పోర్చు గీసుల వృత్తియనియు, దన్నా పట్టణమును బ్రవేశించి తురకలతెరగు నారయనిచ్చుటయు యేలినవారు తనకు బ్రసాదించు ఘనసత్కార మనియు మనవి జేసెను. అంతట రాయలవా రాతని కనుజ్ఞనొసగి యతనికి దోడు కొంత పరివారము నంపెను.

క్రిస్తవ డి ఫిగెరెడో తాటితాటి కోట గోడల చెంత ద్రవ్వియుండుగాడిని సమీపించెను. తురకలు గడు నిర్భయముగ కోటగోడలపై దిరు గాడుటను గాంచి, తనతోగూడ దోడ్కొని వచ్చి యుండిన తుపాకిబంట్లను వారిపై దుపాకులను బేల్వనాజ్ఞాపించి, పెక్కండ్రను హతము గావించెను ; తత్పూర్వము దురకలు తుపాకి మొదలగు నాగ్నేయాయుధముల ప్రయోగమువలన జచ్చి యెఱుగరు గావున జాగరూకులై యుండక విచ్చల విడిగ దిరుగుటవలన నసువుల గోల్పోయిరి; తత్కా రణమున కోటగోడల సంరక్షించుటకు నిలువజాలక హతశేషులుపాటిపోయిరి;అంతటరాయదళమునిర్బా ధికముగ కోటగోడలను జేరవలనగుటను గుర్తించి సమీపించి, వాని నిడియగొట్టుట కారంభించెను ; దళమచటి కన్నియెడల నుండియు మూగుటవలన రాయస్కంధావారమున గొప్ప సంభ్రమము గల్గి నది. క్రిస్తవ డి ఫిగెరెడో నిజభటులతోగూడ దుర్గమును జొచ్చెనను వార్తను గొందఱు రాయల వారి కెఱుకపఱచిరి.

కోటవెలుపల నేమి నడచుచుండెనో, పోర్చు గీసుల కెట్లు రాయరాణువయందు ప్రవేశము గల్గెనో కోటలోనివారికి తెలియదు; కాని గొబ్బారు యుద్ధసమయమున వారు వచ్చి రాయరాణువను గూడిన సంగతి స్మరణకు రాగనే తమకిక చేటు మూడినదని నిశ్చయించిరి. ఏలన నంతదనుక వారు బండలను పై రువ్వియు, బాణబందుకాద్యాయుధ ముల బ్రయోగించియు ముట్టడికారులను కోట గోడల చెంగటికి జేరనీక తఱుమగొట్టుచువచ్చిరి. పోర్చుగీసుల యాగమనముతో ముట్టడి పరిస్థితులు మారినవి. క్రిస్తవ డి ఫిగెరెడో తనభటులను బురికొల్పి కోటగోడలపై బొడచూపినవారినెల్ల బరిమార్పగడగుటవలన, బయలుమెఱసి వారి కెవ్వ ఱును బోటు చూపఱాలక పోయిరి. ఇక పోర్చు గీసుల నండ జేసికొని కోటగోడలను ధ్వంసము సేయ రాయదళముల కవకాశము గల్గెను. సంరక్షార్థమై కోటగోడలపై మోర్జాచేయబడి యుండిన ఫిరంగు లున్నతస్థానములందు నెలకొల్పబడి యుండుటవలన వానియగాదులచేత క్రిందగోడల చెంతనుండు శత్రుల కెట్టి యపాయము గల్గుటకును వలనుపడ దాయె. కోటగోడల యంతర్భాగమునందు మట్టి నింపి గట్టన జేసియుండుటచే వానియందు గండ్లు పొడచుట కష్టకార్యము గాదు. మఱియు గండ్లను గాపాడదగిన ఆగ్నేయాయుధము లభావమగుట వలనవానిగుండ శత్రులపురమును జొరనీక యడ్డ పెట్టుటకు సాధ్యపడకపోయెను.

క్రిస్తవఱ డి ఫిగెరెడో సంగతిని యుద్ధము నకు నడచుటకు రాయ దండనాథు లుత్సుకులైరి; వారిని తృప్తి పెట్టుటకై ముఖ్యులను కొందఱి నత డొక్కొకనాడు వెంటబెట్టుకొని యుద్ధమునకు బోవువాడు. ఒకనాడతడు తన బందూకు భటు లను మూడుపాయలుగ విభజించి కోటగోడపై గానవచ్చిన తురకలనెల్ల గాల్పించి చంప నారం భించెను; తత్కారణమున కోటలోని వారెవ్వరును బయట దలచూప వెరచిరి. అంతట బైమూడు పాయలందలి రాయల సైనికులు పార, గడ్డపార మున్నగునుపకరణములనుధరించి,గోడలనిడియగొట్ట మొదలిడిరి; తక్కిన సైనికులుగూడ నెవ్వరి కను కూలపడినట్లు వారు కవియవలసినదని యతడు వార్త యంపెను; తత్కారణమువలన దుర్గసంరక్ష కులు వెలుపలిప్రాకారమును గాపాడ శక్యము గాకపోవుటచే దానిని త్యజింప మొదలిడిరి; స్త్రీలు దమ బిడ్డలతోగూడ లోపలి కోటలోనికిబోయి డాగిరి. పురజనుల యలజడినిగాంచి దుర్గాధ్యక్షుడు ధైర్యము చెప్పి వారిని మరల్ప బ్రయత్నము సేయుటయేకాక, కొందఱిని వెంటనిడుకొని ఫిరం గులు రాయదళమునకు బాసటయైనిల్చి యుద్ధము సేయుచుండు స్థలమునకుబోయి, వారెచటినుండి నిజపక్షమువారిని బోరికొనుచున్నారో స్వయముగ బరిశీలించి చూడనెంచి కోటగోడపైకెక్కెను;

త్రుపాకి గుండొకటి యళనివలె వచ్చి నెన్నుదుట దాకుటచే విగతప్రాణుఁడై యతఁడు నేలగూలెను; అతని మరణము రాయచూరు ప్రజలను శోక సముద్రమున ముంచినది. వారియాలగోడు బాల గోడు రాయస్కంధావారమునకు వినవచ్చినది; కోటగోడను సంరక్షించుట కొక్కడైన నిలువక దురదృష్టకులు బాటిపోయిరి. రాయ సైనికులు వాని నెట్లు ధ్వంసము జేసినను నడ్డపడువారు గానరారైరి. కాని వారు కోటను జొరలేదు; కోటలోనివారేమి సేయుదురో చూతమని నాటికి యుద్ధము జాలించి వెనుదిరిగి విడిదలకేగిరి.

మరుసటి యుదయమున గోటనుండి తెల్ల జండాలతో గొందఱు సంధికి వచ్చుచున్నారని కృష్ణరాయలకు దెలియవచ్చినది. రాయలంతట సాళువ తిమ్మయనువారికెదురేగి సముఖమునకు తోడ్కొని రా నాజ్ఞాపించెను. సాళువ తిమ్మయను జూడగనే రాయలవారు తమ్మాదరించునను నాశ వారి హృదయసీమల నంకురించినది. ఈ యాశ వ్యర్థమైపోలేదు. రాయలవారి సముఖమునకువచ్చి శోకావేశపరవశులై యాతని పాదములకడ బ్రెళ్లగనే వారి కాత డభయ మిచ్చెను. 'లెండు, భయమువలదు; మీ యాస్తిపాస్తులను ప్రాణము లను సంరక్షించెదము; పట్టణమునకు మరలిపొండు; రేపు పురప్రవేశము గావింతుము,' అని వారి నూర డించి యంపి, దళనాయకులలో నొక్కని బట్టణ మును స్వాధీనపఱచుకొనవలయునని యాజ్ఞాపించి యటుపిమ్మట నిజ శిబిరమునకు జనెను. తరువాత దినమంతయు విజయోత్సవ కార్యములందు గడచెను.

మరునాడు ప్రభాతమున కాలకృత్యములు దీరినపిమ్మట కృష్ణదేవరాయలు పట్టణమును ప్రవే శించెను; మొదట దారి దీయుచు నంగరక్షకబలము గదలినది; వారివెనుక కృష్ణరాయలు సామంత సైన్యాధిపతులతో గూడ నశ్వారూఢుఁడై చనెను. రాయలవారి రాకను నిరీక్షించుచు బురజనులు వీధులందు బారులుదీరి నిలచియుండిరి; వారిని దిలకించుచు ముందుకుసాగి కృష్ణరాయలు లోపలి కోటసమీపమును జేరి పౌర ప్రముఖులను బిలువ నంపి, 'మీ సర్వస్వమును మీకే విడిచితిమి; మీ యిష్టానుసారము వర్తించుచు దానిని వినియోగించుకొనవచ్చును; ఇచ్చట నిలువనిచ్చ గలవారెప్పటివలె నిచటనే యుండవచ్చును; అట్లు గాక మఱియెచటికేనియు బోదలఁచువారు తమ సర్వమునుగొని వెంటనె వెడలిపోవచ్చును' అని యానతిచ్చెను. రాయలింతటి చల్లచూపు జూపి నందుకు వారెల్లరు భగవంతునికి దమ కృతజ్ఞతా సూచకముగ వందనములను సమర్పించిరి.

కృష్ణరాయ లిట్లు పురప్రముఖుల కభయ ప్రదానము జేయుచుండు సమయమునసె పురజనులు కొందఱచటికివచ్చి రాయలవారి సేన పట్టణమును జూఱగొనుచున్నదని మొఱపెట్టిరి. కొల్లను వెంటనే నిలుపవలసినదని రాయ లాజ్ఞాపించెను. ఎవ్వరి యొద్ద కొనిన చూఱద్రవ్యమును వారికి మరల నిప్పించెను; ఆస్తిపాస్తు లెటుపోయిననేమి ప్రాణము దక్కిన చాలునని పాటిపోయినవారి సర్వస్వమును కొల్లపోయినది. వీరి విషయముగూడ తరువాత రాయలవారికి దెలియరాగా జూఱ కారులను బిలువనంపి కఠినముగ శిక్షించెను. కృష్ణ రాయ లిట్లాదరించుచుండినను పౌరు లనేకులచట నుండనొల్లక అన్యప్రదేశములకు లేచిపోయిరి. దారి బత్తెములేక పోజాలనివారికి రాయభండారమునుండి వలసిన ద్రవ్య మిప్పించి పంపెను. కోట కైవస మైనపిమ్మట రాయలు కొంతకాలము రాయచూరు నందుండవలసి వచ్చెను. విధ్వస్తమైన కోటగోడలను బాగుచేసి వాని సంరక్షణార్థమువలసిన బలములను కూడ్యముంచెను; రాష్ట్ర పరిపాలనకు దగిన యేర్పాటులనొనర్చి యవ్వల విజయనగరమునకు దరలిపోయెను[1].

న్యూనిజు వర్ణించిన రాయచూరుపతనకథను బట్టిచూడగా ప్రిసవన్ డిఫిగైరెడో యొక్కడే కృష్ణరాయలవిజయమునకు కారణభూతుఁడైనట్లు తోఁచగలదు; కాని యది సత్యము గాదు. పోర్చు గీసుల యవక్రపరాక్రమమును ప్రకటించుట కొఱకు వారికి లేనిపోని ప్రాధాన్యతను గల్గించు

1. *Nuniz, Forgotten Empire pp.* 343-49.

కట్లు న్యూనిజు ప్రాసెనని తోచుచున్నది. ఇది కేవల మూహామాత్రమైన యభిప్రాయముగాదు. క్రిస్తవ డిఫిగెరెడో ప్రథమదివసయుద్ధమును వర్ణించుసందర్భమున దురక లంతకు పూర్వము తుపాకి మొదలగు నాగ్నేయాయుధ ప్రయోగము వలన జచ్చియెఱుగరు; కావున రాయచూరుకోట గోడలపై నిర్భయముగ దిరుగాడుచుండిరనియు క్రిస్తవ దన తుపాకిబంట్లచే గోడలపై బొడ చూపిన వారినెల్ల గాల్పించి చంపుటచే వా రటు పిమ్మట దల చూపుటకు వెఱచిరనియు దత్కారణ మున రాయల సైనికులకు కోటగోడలనుదాకి ధ్వంసము సేయుటకు సాధ్యపడెననియు న్యూనిజు వక్కాణించియున్నాడు. ఇది సత్యమని నమ్ముటకు వీలులేదు. బుక్కరాయల కాలమునుండియు విజయనగర సైన్యమునందు ఫిరంగి తుపాకి మున్నగు నాగ్నేయ సాధనములు వాడుకయం దుండెనని మహమ్మదీయ చరిత్రలవలన దెలియ వచ్చుచున్నది.[2] మఱియు రాయచూరుపై నడచిన కృష్ణరాయల సైన్యములో రాయల యంగరక్ష బలమున కధిపతియైన కామానాయకుని యాధి పత్యముక్రింద ముప్పదివేల కాల్బల ముండెననియు వారిలో విలుకాండ్రు, ఖేటకధరులు, తుపాకిబంట్లు, గడలవారును గలరని న్యూనిజే చెప్పియున్నాడు.[3] న్యూనిజునకు సమకాలికుఁడును నతనివలెనె కృష్ణ రాయలకాలమున విజయనగరమునకు వచ్చి యప్పటి విజయనగర సైన్యస్థితిని పరికించిన వాడును నగు పయసు, విజయదశమినాడు రాజ ధానియందు గూడిన రాయదళములలో బందుకులు బండ్లవరుసలు మున్నగు నాగ్నేయాయుధ ధారులను బేర్కొని యున్నాడు.[4] రాయచూరు ముట్టడికి నడచిన తుపాకిబంట్లు దుర్గసంరక్షకులపై దమ యాయుధముల బేల్వకపోయిరని యెంచుట సమంజసము గాదు; కావున కోటగోడలపై దుర్గ సంరక్షకులు నిర్భయముగ నడయాడుటయు, క్రిస్తవ డిఫిగెరెడో బంట్లు యగ్న్యాయుధ ప్రయోగములకు జడిసి గోడలపై దలచూప వెఱచి డాగిరనుటయు విశ్వాసపాత్రములు గావు. క్రిస్తవ బంట్లు విజయనగరబందుకుధరులకంటె నెక్కుడు కౌశల్యముతో దమ యాయుధముల ప్రయోగించి యుండవచ్చును. తన్మూలముననె కృష్ణరాయలు రాయచూరును సాధింపగల్గెననుట యతిశయోక్తి.

సంధి రాయభారములు

ఆదిల్‌ఖానుపై గృష్ణరాయలు పొందిన విజయములవలన నప్పటి భారతీయ మహమ్మదీయ ప్రపంచమున గలవరము పుట్టినది. బహమనీ రాజ్యము నధఃకరించి పైకి వచ్చిన తురకసంస్థా నాధిపతుల హృదయములందు ముదమును భీతియు బెనగొనెను. తమయందరి యందును బలవత్తముఁడును, దత్కారణమున దమ స్వాతంత్ర్యమునకు వేరువిత్తునగు నాదిల్ఖానునకు గల్గిన ఘనపరాభవ మువలన వారిహృదయముల సంతోషమంకురించి నది. కాని యట్లు ఆదిల్ఖానుని పరిభవించినవాడు హిందూ రాయసురత్రాణుడైన కారణమున నాదిల్ఖానున కాతనిచే జరిగిన మర్యాదయే తమకును గలుగవచ్చుననుభయముకూడ జనించినది:—కావున నిజాముల్ ముల్క్, మదార్ మల్లిక్, దస్తూర్ దీనారు, బరీదు మున్నగు బహమనీసామంతులు దమతమ రాయబారుల మూలమున రాయలపేర లేఖల నంపిరి. రాయచూరునకువచ్చి చేరినంతటనె యంతటి ప్రబలదుర్గము రాయలకు గైవసమగుట యవనదూతల కచ్చెరువు గల్గించినది; రాయల యసంఖ్యాతబలమును పరాక్రమాతిశయమును గాంచినంతనె వారి విస్మయ ముత్కటమైనది. రాయలవారిని దర్శనముజేసికొని తమ ధణీలంపిన యుత్తరములను సమర్పించిరి. వెంటనె వాని నాతఁడు జదువుకొనెను. అందలి వృత్తాంత మిట్లుం డెను:—రాయలవా రప్పటివఱ కాదిల్ఖానుపై బొందిన విజయములతో దృప్తినందుట మేలు; అటుమీదట నింకను యుద్ధము సేయుట యుక్తము గాదు. మనసు పెద్దజేసి యాదిల్ఖాను నోడించికొనిన సర్వమును నాతనికి మరల నిచ్చివేయుట సరి; అట్లొనర్చిన దా మెల్లవేళల నాతనియాజ్ఞలనౌదల దాల్చియుందుమనియు నట్లు సేయుట కీయకొనని పక్షమున దామెల్ల రేకమై యాదిల్ఖానుగూడి రాయలవారితో యుద్ధమొనర్చినయతడు నష్టమందిన

2. *Briggs, Ferishta II p.* 312.
3. *Nuniz, Forgotten Empire, p.* 326.
4. *Ibid. p.* 277.

వానినెల్ల నతనికి మరల దీసి యీ వలసివచ్చు ననియు దెల్లము జేసిరి. కృష్ణరాయలు వారంపిన యుత్తరములను జదువుకొని వారందఱకు నొక్క జాబుమూలమున నిట్లు జవాబు వ్రాయించెను. 'నిజామనములుక, మదారుములుక దస్తూరు బరీదు మున్నగు మాననీయదక్కను ప్రభువులారా, మీరంపిన యుత్తరముల దిలకించితిమి. మీరంపిన సందేశమునకు మిక్కిలియు గృతజ్ఞుఁడను. ఆదిల్ఖా నునియెడ మేము నడపిన కార్యక్రమమును, నాచి కొనిన వస్త్వాదికమును, అతని ప్రవర్తనకు దగినట్లె యున్నవి; వానిని మరల నాతనికిచ్చివేయుట సమంజసముగ గన్పట్టదు; అట్లిచ్చివేయు నుద్దేశమును మాకు లేదు. మీరు చెప్పినట్లు చేయనిపక్షమున నతనితో గలసి మాపై నెత్తివత్తు మంటిరికదా. అయ్యలారా! మీరంతటి శ్రమ పడవలసిన యవసరము లేదే. మీరు స్థయిర్యముతో మీ రాష్ట్రిము లందు నిలచి యుండనోవుదురేని, మేమే మిమ్ము వెదకుకొని రానున్నారము. ఇదియే మేము మీకంపు ప్రత్యుత్తరము.' ఈ కమ్మకాగితమును రాయబారులకిచ్చి వారి నుచితరీతిని సత్కరించి పంచెను.[5]

దక్కను మహమ్మదీయ ప్రభువులు కృష్ణరాయల సముఖమునకు రాయబారులను తమంతట తామె పంపిరో లేక యాదిల్ఖానుని ప్రేరణపై నంపిరో తెలియదు; కాని యా రాయబారము నిష్ఫలమై పోయిన పిమ్మట విజాపురమునుండి దూత యొకడు విజయనగరమునకువచ్చి కృష్ణరాయల దర్శనముజేసికొని యిట్లు విన్నవించెను. 'దేవా! నన్నాదిల్ఖానుఁడు తమ కడ కంపినాడు. తనకు న్యాయము గల్గింపుడని నా ముఖాంతరముగ మిమ్మిట్లు ప్రార్థించుచున్నాడు. ఇట్లు విన్నపము సేయవలసినదని నన్నాజ్ఞాపించినాడు. పుడమిలోని రాజులలోనెల్ల బలాధికులును న్యాయమూర్తులును సత్యపరాయణులునునగు దమయెడ తనకు సోహార్దము గలదనియు; దాము నిష్కారణముగ జిర కాలమునుండియు మీపూర్వులు బెక్కండ్రుపాడి తప్పక నాయెడ నెఱపుచువచ్చిన మైత్రికిని, యుభయ రాజ్యములమధ్య జెల్లుచుండిన శాంతికిని భంగముగావించితిరనియు; దామేల నిజరాజ్యమును వగలి తనపై నెత్తివచ్చినదియు దన కెఱుకపడ లేదనియు; నట్లుశంకలేకున్నతరి, తాము వచ్చి రాయచూరు దుర్గమును ముట్టడించి తత్పరిసర ప్రాంతదేశమును కొల్లగొట్టి నాశనమొనర్చితిరన్న వార్తను విని నిజరాష్ట్రమును గాపాడుకొనుట కొఱకు దా రావలసి వచ్చెననియు; నట్లు వచ్చిన పిమ్మట దన యాశ్రితులనెల్ల యుద్ధమున వధించి స్కంధావారమును జూఱగొని నందులకు దామె ప్రత్యుపసాతులనియు; దనకు గలిగిన నష్టమునకు బరిహారముగ దనస్కంధావారమును జూఱపట్టి కైకొన్న యాగ్నేయాయుధ సముదాయమును గుడారులను హస్త్యశ్వాదిసమస్తమును రాయచూరు దుర్గముతోగూడ మరల నిచ్చివేయవలసినదనియు; కోరినట్లు తన యాస్తి పాస్తులను వస్తువాహనాది సమస్త పదార్థముల నిచ్చివేసిన నిరంతరము సఖ్యము పాటింతుననియు; లేనిచో తమ దృష్టి యందు తమ చర్యయెంత న్యాయముగ గన్పట్టినను నది యక్రమముగాక తప్పదనియ విన్నవించెను. అంతట నానాటి సంధి సంప్రతింపు ముగిసినది. పట్టు దుస్తులు మున్నగు నుడుగరలచే రాయబారిని సత్కరించి యతని రాయబారమునకు ప్రత్యుత్తరము మరుదినము జెప్పెదనని యతని విడిది కనిచి కృష్ణరాయలు సభ చాలించెను.

మరుసటిదిన ముదయమున గృష్ణరాయలా రాయబారిని సముఖమునకు రప్పించి, 'యాదిల్ఖానుఁడుమాకు పాదాక్రాంతుడైనచో[5a] నాతఁడు

---

5. *Numiz, Forgotten Empire. pp* 348-49.

5 *a.* '*Provided Ydallacao* (*Adilkhan*) *would come and kiss his foot*' అని న్యూనిజు. దీనికి సూయలు విపరీతార్థ మూహించి కృష్ణరాయలు గర్వోన్మత్తుడై యట్లుకోరెననియు దత్కారణమున మహమ్మదీయులెల్ల తుదకేకమై రఱసితంగడి యుద్ధమున విజయనగర సైన్యమునోడించి యా పట్టణమును ధ్వంసము గావించిరనియువ్రాసియున్నాడు. '*Kiss his foot*' అను మాటలు 'పాబూస్' అను పార్సీమాటలకు భాషాంతరీకరణము. ఈ మాటలకు 'పాదము ముద్దిడుకొను' అని యథాతథమగు నర్థమైననునభ్రమతజూపుట యనునర్థము రూఢియై వాడుకలోనికి వచ్చెను.

కోరినమేర కాతనియొద్ద కైకొన్న సమస్తమును మరల నాతని కిచ్చివేయుదుననియును, సలాబత్కా నునిగూడ బంధవిముక్తుని గావించి విడిచెద'మనియు దెలియపఱచెను. ఆ దూత యంతట దన విడిదికి బోయి తన యజమానుని కావృత్తాంతమును వ్రాసి యంపెను; ఉత్తరమందగనె ఆదిళ్ఖానుఁడు దానికి ప్రత్యుత్తరము వ్రాసి యంపెను; దానిగైకొని రాయబారి మరల కృష్ణరాయలను దర్శించి, 'రాయలవారు కోరిన ప్రకారము వారికి తాను పాదాక్రాంతుఁడగుట తన యజమానున కెట్టి యాపేపములేదనియు ప్రత్యుతముగ విజయనగరమునకు వచ్చుటకు అతఁడు జంకుచున్నాడనియు విన్నవించెను. కృష్ణరాయ లంతట దాముభయరాజ్యముల సరిహద్దునకు విచ్చేయుదుమనియు నచటి కాదిలుఖాను నిర్భయముగవచ్చి దమకు పాదాక్రాంతుఁడు గావచ్చుననియు నానతిచ్చిరి. రాయబారి యందుల కంగీకరించి విజాపురమునకు బయలు వెడలిపోయెను.

కృష్ణరాయల విజాపురయాత్ర

ఆదిళ్ఖానునిచే ప్రమొక్కగొనుటద్వేషముతో గృష్ణరాయలు విజయనగరమునుండి బయలువెడలి విజాపుర గడిసీమ సమీపమునందుండు ముదుగలు దుర్గమునకు బోయి యతని యాగమనమును నిరీక్షించుచు గొంతకాల మచట విడిసి యుండెను. ఎన్నిదినము లెదురుచూచినను అతడు రాడాయెను; అతనిచే ప్రమొక్కగొనవలయునను కుతూహలముత్కటముకాగా గృష్ణరాయ లచటినుండి బయలువెడలి దక్కను రాజ్యమును ప్రవేశించెను. రాయల సముఖమునకు వచ్చుట కాదిళ్ఖానునకు ధైర్యము చాలక పోయెను; 'ఇదె మారాజు వచ్చుచున్నా'డని యతని యనుచరులు బల్కుచు వచ్చినను నతని యడపొడగాన రాదాయె. తుదకు కృష్ణరాయలు విజాపురము జేరి యాదిళ్ఖానుడు వచ్చునందాక నచటనె విడిసి యుండ నిశ్చయించెను. ఆదిళ్ఖాను డవుడుగూడ మోము చూపలేదు. ఆతని ప్రవర్తనవలన రాయల కాతనిపై గోపము గల్గినది. తన్నవమానపఱచుట కొఱకై యాతఁడు ప్రమొక్కిడుదునని రప్పించి పొడచూపకపోయెనని యెంచి యతఁడు దర్శనము సేయవచ్చిన పట్టి బంధించవలయునని నిశ్చయించెను; కాని కృష్ణరాయలకు తా ననుకొనినంత కాలము విజాపురమున నుండుటకు వీలుగాక పోయినది. అది సర్వసంపదల కాకరమైన పట్టణమె! కాని నీటివసతి తక్కువ; పైరుపంటలేకాక పానీయ జలమునకుకూడ జనులు కేవలము వర్షపాతముపై నాధారపడవలసి యుండెను. జనుల యుపయోగార్థము వర్షజలము రెండు పెద్ద చెఱువులందు సేకరింపబడి యుండెను; కృష్ణరాయలను దమ పట్టణముననుండనీయక వెడలనంపు నుద్దేశముతో దురకలా చెఱువుకట్టలను నఱకి నీటిని వెలుపలికి బాఱించి వేసిరి. జలాభావము వలన నచట నునికి యసాధ్యమాయెను; జలాభావమునకు దోడు వంట చెఱకునకు కఱవు వచ్చినది. దూరమునుండి వచ్చు కట్టెలమోపు లాగినవి. రాయల సైనికులు వెక్కుకట్టడముల నిడియగొట్టి యందలి కలపను వంట చెఱకున కుపయోగింపవలసి వచ్చెను. ఇందు మూలమున విజాపురమున జాలభాగము పాడై పోయినది. పట్టణ వినాశ వార్త దెలియవచ్చి నంతటనె యాదిళ్ఖానుఁడు, సందేశహరునిమూలమున 'మా దండ నాయకుల గృహములను నిర్మూలము గావించితిరె, వాని యపరాధమేమని రాయల నడుగ నంపెను. రాయలందులకు 'నిర్మూలము గావించినది మేము కాదు; మా జనులను నివారింప వీలుగాక పోయిన'దని ప్రత్యుత్తరమంపెను. తరువాత కృష్ణరాయలు దండును మరల్చుకొని ముదుగల్లునకుబోయి చేరినపిమ్మట నాదిళ్ఖానుఁడు నిజరాజధానికి మరలి వచ్చెను.

అసద్ఖానుని రాయబారము

ధ్వంసమును సేయబడిన రాజధానిని జూడఁగనె యాదిళ్ఖానుని చిత్తమున వ్యథ కలిగినది. ఆ ధ్వంసమున కంతటికిని మూలకారణము దానేయని యతడు చింతించెను. తన రాయబారి కరారుచేసి వచ్చినట్లు తాను కృష్ణ రాయలను భేటీచేసికొని యుండిన, నట్టి ముప్పు వాటిల్లియుండదని తోఁచినది. ఇకమీద నట్టి యవాంతరమును రానీక తొలఁగద్రోయుటకును, దన రాజ్య పురోవృద్ధికిని

కృష్ణరాయలతోడ సఖ్యపడు టావశ్యకమను బుద్ధి పుట్టినది. వెంటనె హితులనెల్లగూర్చి తన మనో భావమును వారి కెఱుకపఱచి సలహా చెప్పుఁడని యడిగెను. హితులలోనెల్ల ప్రధానుఁడసద్ధానుఁడు; గొబ్బూరు రణక్షేత్రమునుండి యాదిల్ఖానుని పలాయనమునకు పురికొల్పి తొలఁగఁదోలుకొని పోయిన వాడితఁడే తన్ను విజయనగరమునకు రాయబార మంపినచో దన యజమానుని చిత్తమునకు వచ్చిన తెరగున సర్వవిషయములను జక్కఁబెట్టుకొని వచ్చెదనని యతఁడు మనవిచేసెను. ఆదిల్ఖానుఁ డాతని మాటల నాలకించి యానందించి రాయ బారము నడుపుటకు అతని విజయనగరమున కంపెను.

అసద్ధానుఁడు సామాన్యుడుకాడు; గడుసు దనమునందారి తేరినవాడు; కపటి, వంచనయందు పంచకములకు జదువు నేర్పజాలిన మేధావి. అతఁడు విజయనగరమునకు పోగోరినది స్వామి కార్యనిర్వ హణార్థము గాదు; స్వకార్యమును సాధించుట కొఱకే. విజయనగరమున చెఱసాలయందు బందీ కృతుడై యుండిన సలాబత్ఖానుఁడతనికి ప్రతిపక్షి; అసద్ధానుని స్వభావము నతడు చక్కగ నెఱుగును. గొబ్బూరు రణమునం దసద్ధానుడుచూపిన పంద తనమును, నాదిల్ఖానునికి దురాలోచన జెప్పి భయముకొల్పి యతని దోడ్కొని రణరంగమునుండి పలాయనము సేయుటయు, దత్కారణమున విజా పుర సైన్యములు నిర్మూలమగుటయు నతనికి దెలియపచ్చెను. బంధనముబాసి మరల విజాపురము జేరినంతటనె యసద్ధానుని దుష్ప్రవర్తనకు దగినరీతిని శాస్తిచేయించెదనని సలాబత్ఖానుఁడు తనుజూడ వచ్చు మిత్రులతో జెప్పువాడు; ఆ మాటలు కర్ణాకర్ణిగ నసద్ధానుని చెవిసోకెను. కావున నస ద్ధానుఁడు సలాబత్ఖానుని ప్రత్యాగమనము దనకు శ్రేయస్కరము గాదని గ్రహించి రానున్న యాప దను దొలగఁబెట్టుకొనుట కుపాయము చింతించి విజయనగరమునకు బయనమాయెను.

విజయనగరమును జేరినపిమ్మట నసద్ధానుఁడు కృష్ణరాయలను సందర్శించి సంధి సంప్రతింపుల కారంభించెను. అతఁడు వాగ్మియు నతి చతురుడు నగుటచే రాయలనుసులువుగ సుప్రసన్నుని గావించు కొనెను. పూర్వ రాయబారమును, నందుమూల మున నాదిల్ఖానునివలన దనకైన యవమానమును కృష్ణరాయలు స్మరణకు దేగా, నది దన యజ మానుఁడు బుద్ధిపూర్వకముగ జేసిన యపరాధము గాదనియు సలాబత్ఖానుడు పుత్తెంచిన దుర్మంత్ర మునకులోనై యట్లొనర్చెననియు, రాయల కాదిల్ఖానుతో సంధి కుదురకపోవుటకు సలాబత్ఖానుడే ముఖ్యకారణమనియు మనవి చేసెను. కృష్ణరాయ లకు సలాబత్ఖానుపై గోపము పెల్లుకొనెను. అస ద్ధానుని కపటమును గుర్తింపజాలక, ముందు వెనుక లాలోచింపక చెఱయందుండు సలాబత్ఖానుని వధింప నతఁడాజ్ఞాపించెను. అసద్ధానుని కుతంత్రమువలన శూరోత్తముడగు సలాబత్ఖాను డిట్లు దుర్మరణము నందెను.

అసద్ధానుని కిక విజయనగరమునందు పని లేదు; వచ్చిన కార్యము ఇష్టానుసారముగ నెఱ వేరినది. అట్లుపైనిలచుట శ్రేయము గాదు; అతని కుట్ర యేనిమిషమునందైన వెల్లడి కాపచ్చును; వెల్లడియైన ప్రాణోపద్రవముగల్గుట నిశ్చయము. ఆలస్యము సేయక యెంత శీఘ్రముగ విజయనగ రమునుండి వెడలిపోయిన నంత మేలగును. కావున నసద్ధాను రాయలవారి దర్శనము జేసికొని, సత్వ రముగ దానేగి యాదిల్ఖానుని కృష్ణాతీరమునకు దోడ్కొనివచ్చి భేటీ చేయింతుననియు, దనకు స్వదేశమునకుబో ననుజ్ఞ నీయవలసిన దనియు వేడు కొనెను; కృష్ణరాయ లీయకొనడాయె. ఇంకను వివరింపవలసిన విషయము లనేకములు గలవనియు వేగిరపాటు వలదనియు వారించెను. భయభ్రాంత చేతస్కుఁడగు నసద్ధానుఁ డొకరాత్రి యెవ్వరికిని దెలియనీయక విజయనగరమునుండి పరారియై విజా పురమునకుబోయి, యాదిల్ఖానునితో, 'రాయలు సలాబత్ఖానుని జంపెను; నన్నుగూడ జంప నుద్యు క్తుఁడుకాగా దప్పించుకొని తమ సముఖమునకు వచ్చితిని. అతని నమ్మరాదు; ఎంతటివాడైనను నల్లమనుష్యుడే కదా' యని పల్క యట నిలువక తన నెలవైన బెల్గామునకుబోయి దానిని బలపఱచు కొనెను; తరువాత నాదిల్ఖానుఁడు దన సముఖము

డిన దక్కను సామంత ప్రభువులెల్ల నతని యాజ్ఞా బద్ధులై నడచుకొన సంసిద్ధులైరి. కృష్ణరాయల భయమువలన నాదిల్ఖానుఁడు సయిత మాతని నమ్ముఁడాయెను. ఇట్లు జ్యేష్ఠుని దక్కను రాజ పీఠమందు స్థాపించి యతని తమ్ముల నిరువురను కృష్ణరాయలు తనతోగూడ విజయనగరమునకు గొంపోయి రాజపుత్రుల యంతస్తులకు దగినమర్యా దల గావించి దినవెచ్చమునకై సాలు కేబదివేల బంగారు పర్దావుల వేతనము నేర్పాటుచేసెను.[6]

ఇంతవఱకు న్యూనిజుచే వర్ణింపబడిన రాయ చూరు ముట్టడి చరిత్రను, నటుపై నడచిన విజా పుర విజయనగర పరస్పర సంబంధ వృత్తాంతమును సంగ్రహముగ వివరించితిని. మొత్తముమీద నిది యంతయు విశ్వాసపాత్రమేయైనను సత్యదూర మైన విషయమిందు లేకపోలేదు. రెండు రాజ్య ముల మధ్య చిరకాలమునుండియు శాంతి యవిచ్ఛి న్నముగ వఱలుచుండెననియు కృష్ణరాయల రాయచూరు దండయాత్ర మూలమున నది భగ్న మాయెననియు నాదిల్ఖానుని రాయబారి రాయల సముఖమున మొరపెట్టినట్లు న్యూనిజు వ్రాసి యున్నాడు. ఇది యసంభవము. విజయనగర రాయలకును దక్కను మహమ్మదీయ ప్రభువులకును నిరంతర వైరమేకాని సఖ్య మెన్నడును లేదని మహమ్మదీయ చరిత్రలు ఘోషించుచున్నవి. ఇది సత్యమని హిందూ శాసనములును వాఙ్మయమును నిరూపించుచున్నవి. రాయచూరుముట్టడికి ముందు కృష్ణరాయలే రెండు పర్యాయములు మహమ్మ దీయులతో బోరాడెను; వీర నరసింహరాయలొక మారును, నరసానాయకుడు రెండు మూఁడుసారు లును యుద్ధము సల్పియుండిరి. కావున చిరకాలము నుండియు నిరెండు రాజ్యముల మధ్య శాంతి యవిచ్ఛిన్నముగ వఱలుచుండెననుట కల్ల. వాస్తవ మిట్లుండగా నాదిల్ఖానుని రాయబారి కృష్ణరాయ లతో చిరకాలమునుండియు నుభయ రాజ్యముల మధ్య శాంతి వర్ధిలుచుండెనని మొరపెట్టు టెట్లు? దాని నాలకించియు గృష్ణరాయలు మిన్నక యా యసత్యము నంగీకరించు టెట్లు? మరియు గృష్ణ రాయల సముఖమున నాదిల్ఖాను డంపిన రాయబా

కలుబరిగె దండయాత్ర

అసద్ఖానుడు దన్ను వీడ్కొనక పాఱిపోయి నను, నతఁడు చెప్పిన ట్లాదిల్ఖానుఁడుగాని యతని తల్లిగాని తనభేటికి కృష్ణాతటమునకు వచ్చెదరని యెంచి కృష్ణరాయలు సరిహద్దు ప్రాంతమునకు బోయెను; కాని యాదిల్ఖానుడుగాని యతని తల్లి గాని పొడచూపరైరి. అప్పు డాసద్ఖానుని కృత్రిమ మును గృష్ణరాయలు గ్రహించి క్రోధపరవశుఁడై కలుబరిగ మీదికి దండయాత్రజేసి యాదుర్గమును మఱి కొన్నింటిని నేలమట్టమునకు చదును గావించెను; అటనుండి యుత్తర భూములపై దండు పెట్టవలయునని యుద్యుక్తుడాయెను; కాని మంత్రులది సుకరముగాదని వారించిరి. 'ఉత్తర దేశ ముపై దండు వెడలిన మిత్రులని మనమిప్పుడు పరిగణించు నచటి తురక లాదిల్ఖానుని దేశమువలెనే వారి దేశమునగూడ నాక్రమింతుమని జడిసి యాత నితో గలసి మనపై యుద్ధము సేయవచ్చును. అట్లు వారంద ఱేకమైనను జంకున కవకాశము లేదనుకొనుడు. జలాభావముచే దండు సేయుట సుల భము కాదు.' అని విన్నవించిరి. వారు చెప్పిన సలహా సమంజసమైనదని కృష్ణరాయ లొప్పుకొని యా యుద్యమమును మానుకొనెను.

కలుబరిగె దుర్గమునందు దక్కను సుల్తాను పుత్రులు ముగ్గురు కృష్ణరాయలచే జిక్కిరి. తన సోదరి భర్తయగు సుల్తాను భోగకాంత పుత్రుని రాజ్యాధిపతిని సేయనెంచి యాదిల్ఖానుఁడు పై ముగ్గురు పుత్రులను వారి తండ్రి మరణానంతరము పట్టి బందీకృతులగావించియుండెను. కృష్ణరాయలు వారిని విడుదలచేసి వారియందు జ్యేష్ఠుని తండ్రి పదమున ప్రతిష్ఠితుని జేసెను. స్వతంత్రులై యుం

6. *Nuniz, Forgotten Empire, pp.* 349-58.

రముల ప్రస్తావము న్యూనిజు గ్రంథమందుతప్ప మఱి యెందును గానరాదు; కావున వాని వాస్తవికతను పరిశీలించి కనుగొనుటకు సాధ్యముగాదు; కాని కలుబరిగె దండయాత్రను గూర్చి న్యూనిజు వ్రాసిన ప్రత్యక్షరమును సత్యమైనదే. బండారు లక్ష్మీనారాయణ తన సంగీత సూర్యోదయ పీఠిక యం దీదండయాత్ర నిట్లు వర్ణించియున్నాఁడు.

'కృష్ణా ముత్తీర్యసోఽయం
యవనజనపదం వహ్నిసాత్కృత్యసర్వం
పీరోజాబాద్ హసన్ బాదురు
నగర సమాఖ్యాని దుర్గాణిజిత్వా

భంక్త్వోచ్చైఃపారశీకం
కలుబరిగపురీం ద్రాక్పాదాద్యమానాన్
క్రాన్త్వా వ్యాకృష్టవాన్ దోర్బల
ఘనమహిమాత్రీన్ సురత్రాణపుత్రాన్.'7

ఇందువలన కృష్ణదేవరాయలు కృష్ణానదిని దాటి యవనజనపదమునంతటిని దహనము గావించెనియు, పీరోజాబాదు, హసన్‌బాదు, సగరు మొదలగు దుర్గము జయించెనెనియు, దరువాత సపాదు ఆదిల్ఖానునిచే సంరక్షితమైన కలుబరిగను దాకియందు సుల్తాను పుత్రులను మువ్వురఁ బట్టుకొనెనని యు దెలియవచ్చుచున్నది. లక్ష్మీనారాయణ పేర్కొనిన దుర్గములలో హసన్‌బా దెచట నుండెనో తెలియదు. తక్కినవన్నియు నిప్పటి హైదరాబాదు రాజ్యమునందలి గుల్బర్గ జిల్లాలో నున్నవి. ఇందు మొదట పేర్కొనదగినది సగరు. దీనినిప్పుడు సాగరందురు. ఇది కృష్ణానది కుత్తరమున షోరాపూర్ షాపూరుల మధ్యనున్నది. ఫీరోజాబాదు షోరాపూరునుండి గుల్బర్గకుపోవు బాటమీద రెండు పట్టణములకును గొంచె మించుమించు మధ్యభాగమున నున్నది. కలుబరిగయె ఇప్పటి గుల్బర్గ. హైదరాబాదు రాజ్యము పశ్చిమమునందుండు నా పేరిటి జిల్లాకు ముఖ్యపట్టణము. హసన్‌బాదుకూడ నా ప్రాంతమునందే యుండవలయును.

ఆముక్తమాల్యద పీఠికయందుగూడ కలుబరిగ సగరపుర విజయములు వర్ణింపఁబడియున్నవి.

'సనకాది దివిజమస్కరి ఫాలగోపి
చంద్రన పుండ్రవల్లి కల్నాకినాకి

సెలసి హోహోహూహువుల దండియలతంత్రి
ద్రైవ్య సింగిణులుగాఁ దివిచి తివిచి

సప్తర్షి కృతవియ్యర వాలు కాలింగ
సమితిముచ్చెల కాళ్ఁజమరి చమరి

రంభా ప్రధానాప్సరః పృథూరోజ కుం
భంబు లెచ్చటఁగన్నఁబట్టిపట్టి

తిరుగు హరిపురి సురతరు సురలమరగి
బహుళహళి హళిభృత కలుబరగి నగర

సగర పురవర పరిభృఢజవనయవన
పృతన భవదసి ననిఁదెగి కృష్ణరాయ.'8

ఇందు సగరపుర కలుబరిగ విజయములు మాత్రము పేర్కొనబడి యుండుటచేత నా స్థలములందు దక్కినచోట్లకంటె యుద్ధము ఘోరతరముగ జరిగెనని మన మూహింపవచ్చును. కృష్ణరాయలు జలహళ్ళి దేవదుర్గముల సమీపమున కృష్ణానదిని దాటి విజాపుర రాజ్యమును ప్రవేశించియుండవలయును. ఆ ప్రాంతములందు ప్రబలమైన దుర్గము సగరు. తోఘ్లూకులకాలమున నది ఢిల్లీ సామ్రాజ్యమునకు దక్షిణ ద్వారమై యుండెను. బహమనీ సుల్తానుల పాలనయందా ప్రాంతమున ప్రధానగడి దుర్గమై బహమనీ విజయనగర సంగ్రామములందు ముఖ్యరంగముగ వాసికెక్కినది. కావున కృష్ణరాయలు విజాపురముపై దాడిసేయ నారంభము జేసి మొట్టమొదట దానిని గైవసము గావించుకొనెను. తరువాత నా చుట్టుపట్టు సీమలను పరశురామ ప్రీతిసేయుచు నుత్తరాభిముఖుఁడై చని ఫీరోజాబాదస్ బాదులను సాధించెను. తరువాత బహుమనీరాజుల ప్రాచీన రాజధానియైన కలుబరిగపైనడచి యాదిల్ఖానునితో ఘోరయుద్ధ మొనర్చి స్వాధీనము జేసికొనెను.

---

7. *Further Sources of Vijayanagara History Vol. II.* 116 (*a*)

8. ఆముక్త. ౧: ౪౧.

కృష్ణదేవరాయలు - చరమదశ

కలుబరిగమీది దాడి కృష్ణరాయల దండయాత్రలలో గడపటిది. తరువాత నతఁడు శత్రురాజు లెవ్వరి తోడను యుద్ధము జేసినట్లగపడదు. కాని సామ్రాజ్యములో నల్లరులు రేగుటవలన శాంతిచెడి కొంత సంక్షోభము గలిగెను. ఈ యల్లరులకు గారణమును న్యూనిజిట్లు వివరించి యున్నాడు :—అప్పటికి రాయలకు వయసు మీఱినది; వార్ధక్యమునం దతఁడు విశ్రాంతి నందగోరెను; మఱియు నతని కాఱేండ్ల ప్రాయముగల పుత్రుఁడొకడుండెను; తన మరణానంతర మాబాలునికి సామ్రాజ్యాధిపత్య మబ్బక పోవచ్చునని శంకించి, తాను సజీవుఁడై యుండగనే యతని సామ్రాజ్యపదమున స్థిరపఱచుట యుక్తమని తలచెను; కావున కృష్ణరాయలు రాజరికమును విడుకొని కుమారునికి రాజ్యాధిపత్య మొసగి తాను ప్రధానియై సాళువ తిమ్మయను దనకు సహాయుని జేసికొనెను; రాజ్యాభిషేకోత్సవము లెనిమిదినెలల పర్యంతము సాగినవి. ఇంతలో నా యువకుఁడు జాడ్యగ్రస్తుఁడై కాలగతినందెను. పిమ్మట నా బాలునికి సాళువ తిమ్మయ కుమారుడగు తిమ్మదండనాయకుఁడు విషప్రయోగము జేసినాడని తెలియవచ్చెను. కృష్ణరాయ లంత క్రోధపరవశుఁడై యది సత్యమని తలచి సాళువ తిమ్మయను నతని తమ్ముడగు గోవిందరాజును వారి బంధువులగు దండనాయకుల బెక్కండ్రను సముఖమునకు బిలిపించి నిందించి చెఱసాలలో బంధించెను. వారినిట్లు చెఱఁబెట్టినపిమ్మట కొండమరసు కుమారుడగు నయ్యపరసును ప్రధాని పదమున నియమించెను. కృష్ణరాయల తండ్రి యాజ్ఞానుసారము నరసింగరాయలను వెనుగొండ దుర్గమున హత్యచేసి చంపినవాడీ కొండమరసే. 8-*a*

మూడేండ్ల కాలము తిమ్మరసు కుటుంబము కారాగారమున నవయుచుండెను ; అప్పుడు తిమ్మరసు పుత్రుడు తిమ్మదండనాయకుఁడు తప్పించుకొని పాటిపోయి దొంగలకును దారిదోపిడికాండ్రకును డెంకియైన పర్వతమును జేరెను. అచటనుండి తన బంధువగు నొక దండనాయకుని సాయము పొంది రాయలపై గత్తికట్టి భీకరముగ యుద్ధము సేయఁగడఁగెను. కావున కృష్ణరాయ లతనిబట్టి తెచ్చుటకుగొప్పసైన్యముతోగూడ దన ప్రధానియగు నయ్యపరసునునియోగించెను. అయ్యపరసుతిమ్మదండనాయకునికి నెలవైన పర్వతమును జుట్టుముట్టి యతనిబట్టి బంధించి రాయల సముఖమునకు దెచ్చెను. అంతట రాయలాతని తండ్రి పినతండ్రులతో గూడ వధ్యస్థానమున కంపి బ్రాహ్మణు లగుటచే వధింపక కండ్లను బొడిపించి మరల చెఱసాలయందు వైవ నాజ్ఞాపించెను. తిమ్మదండ నాయకుఁడు చెఱసాలయందే మృతి నందెను. అతని తండ్రియగు సాళువ తిమ్మయయు సోదరుఁడగు గుండరాజును చెఱయందే సవయుచుండిరి.[9]

న్యూనిజు చెప్పుకథ సత్యాత్మకమగునాయని మనవారనేకులు సంశయపడుచున్నారు. ఈ సంశయమున కాధారము కృష్ణరాయలపై మనకుగల యభిమానము. అతఁడు మన కాదర్శప్రాయుఁడైన చక్రవర్తి; నిష్కళంక చరిత్రుఁడని మన భావము; కావున కంటిని రెప్పవలె గాపాడిన తిమ్మరసును, నప్పాజియని తండ్రినిబోలి గౌరవించిన తిమ్మరసును, మహనీయుఁడైన కృష్ణరాయలు కఠినచిత్తుఁడై కండ్లూడ బీకించునా? యని పరితాపమంది న్యూనిజు కథ సత్యము గాకపోవచ్చునని యూహడిల్లుచున్నారు. కావున నీ కథయొక్క వాస్తవికత నిచట బరిశీలించుట యుక్తము. ఈ సందర్భమున మనము నిర్ణయింపవలసిన విషయము లివి.

1. కృష్ణరాయల కొక పుత్రుఁడుండెనా?

2. ఉండిన నతని కాఱేండ్ల ప్రాయమున రాయలు రాజ్యాభిషేక మొనర్చెనా?

3. అట్లు రాజ్యాభిషిక్తుఁడైన యువకుఁ డెనిమిదినెలల కాలము రాజ్యముజేసి కాలగతి నందెనా?

4. తిమ్మరసు కుమారుఁడు తిమ్మదండనాయకుఁ డతనికి విషముబెట్టి చంపెనా?

8-*a* ఇది పొరపాటు. కృష్ణరాయల యన్న యని యుండవలయును.

9. *Nuniz, Forgotten Empire pp* 359-61.

5. కృష్ణరాయలు తిమ్మరుసును సోదర పుత్రులతో గూడ కారాగార బద్ధులను గావించి యనంతరము కండ్లు పొడిపించెనా?

ఇందు మొదటి ప్రశ్నకు సమాధానము గృష్ణరాయల కొకపుత్రుఁ డుండెననియే చెప్ప వలయును. ఇచట నీ క్రింది శాసనములను స్మరించుట మంచిది.

శా. శ. ౧౪౩౯ ఈశ్వర మార్గశిర బ. ౩ (డిసెంబరు. ౧. ౧౫౧౭) నాడు చోళసముద్రమందు చౌడేశ్వరీ యాలయమున రాయసంకొండమరసయ్య కృష్ణరాయలకు సంతానాభివృద్ధియగుగాక యని దాన శాసనము వ్రాయించియున్నాడు.[10] ఇందువలన నప్పటికి కృష్ణరాయలకు సంతానము గలుగలేదని తెల్లమగుచున్నది. అతని దేవేరులయం దెవ్వరేని చూలాలై యుండిన నుండవచ్చును. విజయనగరమున కుంభారకుంభెయందు శా. శ. ౧౪౩౯ బహుధాన్యకార్తిక శు (బ?) ౧౫ (౩౦ అక్టోబరు. ౧౫౧౭) నాడు కృష్ణరాయల పట్టపు మహాదేవి తిరుమల దేవమ్మ తిరుమల దేవ మహారాయలకు బుణ్యముగా భూదానము జేసెను[11] శరువాత శాసనమునందితిరుమలదేవ మహారాయలు కృష్ణరాయల పుత్రుఁడని తెల్లము సేయబడియున్నది.[12] కావున కృష్ణదేవరాయలకు పట్టమహిషి తిరుమల దేవియందు శ. ౧౪౩౯ సరియైన క్రీ. శ. ౧౫౧౭ వ సం॥ న తిరుమల దేవ మహారాయలను పుత్రుఁ డొకడు గలిగెనని నిశ్చయింపవచ్చును

రెండవ ప్రశ్నకు సమాధానము న్యూనిజు వచించినట్లు కృష్ణరాయలు దన పుత్రునకు దన జీవితకాలమందే రాజ్యాధిపత్య మొసగెనని చెప్ప పలసియున్నది. శా. శ. ౧౪౪౬ తారణ వర్షమున మహా రాజాధిరాజ వీరప్రతాప తిరుమలయ్య దేవ మహారాయలు విజయనగర సామ్రాజ్యమును పాలించుచుండెనని యాంధ్ర కర్ణాటద్రావిడదేశములందు గానవచ్చు శాసనములందు జెప్పియున్నది.[13] మద్రాసు శాసన శాఖవారు ౧౯౨౩వ సం॥ నివేదికయందు కృష్ణరాయలు తిరుమల దేవరాయలను యౌవరాజ్యమున కభిషిక్తుని జేసెనని వ్రాసియున్నారు. శాసనములందీ వ్రాత కేమియు నాధారము గానరాదు.[14] శాసన సాక్ష్యమునుబట్టిచూడ నతఁడు మూర్ధాభిషిక్తుఁడైన చక్రవర్తియనియే తోచుచున్నది. ఇక మూడవ ప్రశ్నకు సమాధాన మేమొకనుగొందము. తిరుమల దేవ మహారాయలు శా. శ. ౧౪౪౦ వ సం॥ న జననమందెనని పై జెప్పియున్నదికదా. అతని శాసనములన్నియు శా. శ. ౧౪౪౬ వ సంవత్సరము నందే కానవచ్చుచుండుటచేత నతని ప్రభుత్వ మా పర్షమునందె ప్రారంభమయి తుదముట్టెనని తేలుచున్నది. మఱియునవి యా సంవత్సర వైశాఖము నుండి మార్గశిర మాసమువఱకును, తుల మొదలు ధనస్సువఱకును గానవచ్చుచుండుటచే తిరుమలదేవ మహారాయలు రాజ్యాభిషేక కాలమున నాపేండ్ల బాలుఁడనియు నతని ప్రభుత్వ మెనిమిది మాసముల కంటె నధికముగ సాగలేదనియు విదితమగుచున్నది.

తక్కిన రెండు ప్రశ్నలకును దృప్తికరమైన సమాధానము చెప్పుట సులభమైన పనికాదు. తిమ్మరసునకు దిమ్మదండ నాయకుఁడను పుత్రుఁడుండెనని నిశ్చయించి చెప్పుటకు దగిన శాసనాధారము లేదు. కాని, శా. శ. ౧౪౪౬ తారణ మార్గశిర శు ౭ శని వారమునాటి యొక కన్నడశాసనమున. మహా రాజాధిరాజ పరమేశ్వర వీరప్రతాప శ్రీ తిరుమలై య దేవ మహారాయల యాధిపత్యముక్రింద సాళువ తిమ్మణ దండనాయకుఁడు బెంగుళూరు జిల్లా మాగడి ప్రాంతమును బాలించుచుండెనని చెప్పియున్నది.[15] ఇతఁ డొకవేళ సాళువ తిమ్మరసయ్య పుత్రుఁడై యుండిన నుండవచ్చును. తిమ్మయ దండనాయకుఁడు తిరుమలైయదేవ మహా

---

10. *S. I. I. IX. ii No.* 507.
11. *Ibid* 510.
12. *EC. IX. Ma*, 82, 116 *of* 191, 1398 *of* 1896.
13. *EC. IV. HS.* 58, 181 *of* 1913, 139 *of* 1896, 115, 116, 117 *of* 1918, 91 *of* 1912, *EC. IX. Ma* 82.
14. *ARE.* 1223 *Part II p.* 79.
15. *Ee. IX. Ma.* 82.

రాయలకు విషముబెట్టి చంపెనని కాని తత్కారణమున గృష్ణరాయలు తిమ్మరుసును సోదరపుత్ర బంధుసమేతముగ కారాగార బద్ధునిజేసి యనంతరము తిమ్మదండ నాయకు చెఱనుండి తప్పించుకొనిపోయి యల్లరి రేపిన నేరమునకు వారెల్లరకు గండ్లూడ బీకించెనని కాని నిరూపింపదగిన యూథారము లెవ్వియు గానరావు. కాని శా. శ. ౧౪౪౬ తారణ తరువాత సాళువ తిమ్మరసయ్య ప్రస్తావము శాసనములం దెచ్చటను గన్పట్టదు. ఇతని పఱుమున కొండవీటి సామ్రాజ్యమును పాలించుచుండిన యితని యల్లుడగు నాదిండ్ల గోపమంత్రి. శా. శ. ౧౪౪౭ ఫాల్గుణ శుక్ల ౧౫ నాడు కొండవీటిలో పరివార పట్టాభిరామ విగ్రహమును ప్రతిష్ఠించెను.[16] ఇదియె గోపమంత్రి కడపటి శాసనము. మఱియు సాళువ తిమ్మరసు శాసనములు స్వభానుసర్వధారి సంవత్సరముల మధ్య కానరావు. కావున సాళువ తిమ్మరసు మంత్రి యధికారము శా. శ. ౧౪౪౭ నకు సరియైన క్రీ. శ. ౧౫౨౫-౬ తో ముగిసెనని నిశ్చయింపవచ్చును. తరువాత నీ ప్రాంతమును కొండమరసు కుమారుఁడయ్యపరసు పాలించినట్లు శాసనసాక్ష్యము గలదు. న్యూనిజు కథ కిది యనుకూలముగనే యున్నది.[17]

తిమ్మదండనాయకుని యాచూకి శాసనములందు గానరాదు; ఇక నతని నాయకత్వము క్రింద రేగిన యల్లరి ప్రస్తావము లేకపోవుట వింతకాదుగదా. కాని కృష్ణరాయల యంత్యదినములలో గొండవీటి రాజ్యమున గొంత సంక్షోభము గలిగెను. క్రీ. శ. ౧౫౨౭ వ సంవత్సరమున తంగెడ దుర్గము శత్రులెవ్వరో ముట్టడించిరి. వారితో బోట్లాడి కోటను సంరక్షించినందులకా చుట్టుపట్టు నలువది నాలుగు గ్రామములవారిద్దరు శూరులకు గొంత భూమి నిచ్చినట్లు దుర్గద్వార మందలి శాసనము దెల్పుచున్నది.[18] గుంటూరు జిల్లా చాగల్లునందలి మఱియొక శాసనమున క్రీ.శ.౧౫౨౭వసంవత్సరముజూన్ మాసమునచెన్నమనాయనింగార్లు కండలకుంటకుత్తరమున నుండు చెఱువుక్రిందిభూమిలో మూడుపాళ్ళు బ్రాహ్మణులకును దక్కిన రెండుపాళ్ళును దేశసంరక్షకులకును బంచిపెట్టెను.[19] ఇందువలన కొండవీటి రాజ్యమున క్రీ. శ. ౧౫౨౭-౨౮ లో శత్రుల యుపద్రవము వలన శాంతి చెడినట్లు తెలియుచున్నది. ఈ యశాంతికి కారణమేమో నిశ్చయించి చెప్పుటకు వీలులేదు. న్యూనిజు చరిత్ర ప్రకారము విజయనగరమునుండి తిమ్మదండ నాయకుఁడు తప్పించుకొని దుర్గాధిపత్య మొనర్చుచుండెను.(401 *of* 1926); మఱియు శా. శ. ౧౪౫౧ విరోధి శ్రావణ బహుళ కృష్ణాష్టమి నాడు వేమరసు కుమారుడైన రాయసం అయ్యపరసు భారద్వాజగోత్రాశ్వలాయన సూత్రబుక్కాఖాధ్యాపకుడైన రాయసం తిమ్మరసయ్యగారి యాజ్ఞచే కొండవీటి రాజ్యములోని యద్దంకి సీమకు జెందిన పోలవరం గ్రామమును వెంకటాద్రి నాథునికి దానముజేసెను. (*NDI.I. Darsi* 53) ఇందు పేర్కొనబడిన రాయసం తిమ్మరసు కొండమరసయ్యపరసు కుమారుఁడు. క్రీ.శ. ౧౫౨౯ వ సం॥ నతడు కొండవీటికి దుర్గాధిపతియైయుండెనని తెల్లమగుచున్నది. పై నుదాహరింపబడిన శాసనములవలన రాయసంఅయ్యపరసయ్యయు నాతని పుత్రుడు తిమ్మరసయ్యయు న్యూనిజు చెప్పినట్లే కృష్ణరాయల చరమదశయందు కొండవీడు ఉదయగిరి పెనుగొండ దుర్గములను బాలించుచుండిరని తెలియవచ్చుచున్నది.

---

16. కొండవీటి సామ్రాజ్యము, పుట ౯౩.

17. ఒకచోట న్యూనిజు సాళువ తిమ్మయను కారాగారమున బంధించిన పిదప కృష్ణరాయ లతఁడు పాలించుచుండిన రాష్ట్రము కంతటికిని కొండమరసు కుమారుఁడైన అయ్యపరసు నధికారిని గావించెనని వ్రాసియున్నాడు. *Nuniz, Forgotten Empire, p.* 360 మఱియొక తావునం దయ్యపరసు కుమారుడు తిమ్మప్ప యుదయగిరి, కొండవీడు, పెనుగొండ, కొదగరలు (?) సిద్ధవటము మున్నగుపట్టణముల బాలించుచుండెననియు, నతని పాలన క్రిందిదేశము గజపతి రాజ్యమును బంగాళాతమును దాకుచుండెననియు దెల్పియున్నాడు. *Ibid. pp.* 385-6. రాయసం కొండమరసు క్రీ. శ. ౧౫౨౫ నవంబరు ౭వ తేదికి ముందు పుణ్యలోక ప్రాప్తినందెను. అతని పుత్రుడగు నయ్యపరసు పెనుగొండ రాజ్యములోని కుందుర్పి రాజ్యము నేలుచుండెను. (97 *of* 1913). క్రీ.శ. ౧౫౨౭వ సంవత్సరమునం దయ్యపరసుదయగిరిదుర్గాధిపతియైయుండెను.(*NDIII.kr*77); క్రీ. శ. ౧౫౨౯, ఏప్రిలు ౨౩ వ తేదివఱ కచటనే

18. 374 *of* 1926.

19. 388 *of* 1915.

కొనిపోయి పర్వతభూమియందు నెలకొన్న సమయ మిదియె. మఱియు నిదే సమయమున తారీఖ్-ఇ-ముహమ్మద్ కుల్లీ కుతుబ్ షాహీ యను మహమ్మదీయ చరిత్రయందు గోలొ్కండ కుతుబ్‌షాహీ వంశస్థాపకుఁడైన సుల్తాన్ కుల్లీ కుత్బుశాహు కొండపీడు బెలంకొండ మొదలగు దుర్గములను ముట్టడినేసినట్లును కృష్ణరాయలు దనయల్లుఁడైన శివరాయల యాధిపత్యము క్రింద నొక లక్ష సైన్యము నంపినట్లును, దురకలతో సరి పోరజాలక హిందువు లరిగాపులై సాలుకు మూడులక్షల హొన్నులిచ్చి సంధిజేసికొనినట్లును జెప్పి యున్నది.[20] తారీఖ్-ఇ-ముహమ్మదు కుల్లీ కుత్బుశాహీలో జెప్పినదంతయు వాస్తవమని యంగీకరించుటకు కొండవీటిరాజ్యమున గానవచ్చు నప్పటి శాసనముల బరిశీలించిచూడఁగా గుత్బుశాహీ సుల్తాను గాని మఱి యే మహమ్మదీయ ప్రభువు గాని ఈ ప్రాంతముల నేలినట్లగపడుటలేదు. మఱియు గృష్ణరాయలకు. శివరాయలను నల్లఁడుండెననుట నమ్మదగినది కాదు. మన కెఱుక పడినంతవఱకును కృష్ణరాయల కల్లుండ్రిద్దఱుండిరి. అళియ రామరాజొక్కఁడు; మట్ల వరదరాజు మఱి యొక్కఁడు.[21] అళియ రామరాజు తమ్ముడఁగు తిరుమలరాజుకూడ కృష్ణరాయల యల్లుఁడని వాఙ్మయమున నొక యైతిహ్యము గలదు; కాని యది విశ్వాసపాత్రము గాదు; కృష్ణరాయలకు శివరాయలను నల్లుడుండెనని దుఱువు సేయగల సాధనములులేవు. కాని యచ్యుతరాయలు దన ప్రథమరాజ్య వర్షమున దురకల నోడించెనని శాసనాదులలో జెప్పియున్నది. మఱియు నచ్యుతరాయల మన్నెసామంతులలో నొక్కఁడైన గని తిమ్మానాయడు, 'గడిదాటి రాకుండ వడిదాకి మలక కాల్బలము నేల కాల్బలము జేసె' నని వెలుగోటి వారి వంశావళియందు కలదు. కావున గృష్ణరాయల కడపటి రాజ్యవర్షము లలో గోలొ్కండప్రభువు సుల్తాన్ కుల్లీకుత్బుశాహు కొండపీటిపై దండెత్తివచ్చెననుట కల్లకాదు. కాని శాసనములందు ప్రస్తావవశమున బేరొ్కనిన శత్రువుల హావళికిని సుల్తాన్ కుల్లీ కుత్బుశాహు దండయాత్రకును దిమ్మదండనాయకుని యల్లరితో నెట్టి సంబంధముండెనో చెప్పుటకు వీలుకాదు. ఇట్లు న్యూనిజు వర్ణించిన యంశముల నెల్లను శాసనాద్యన్యసాధనముల మూలమున నిరూపించు టకు వీలుగాకపోయినను నతఁడు చెప్పు వృత్తాం తము మొత్తముమీద సత్యాత్మకమనియె యెన్న దగి యున్నది.

రాజ్యాధిపత్య నిర్ణయము

కుమారుడు తిరునులయ్య దేవ మహారాయలు కాలగతి నందిన పిమ్మట కృష్ణరాయలకు దనయనం తరము రాజ్యాధిపత్యము వహింప నర్హుడెవ్వఁడో నిర్ణయింపవలసిన యావశ్యకత గల్గెను. సామ్రాజ్యమునకు వారసులుగ బరిగణింప దగిన వారిలో నలువురు ముఖ్యులుండిరి. మొదటివాడు కృష్ణరాయల పుత్రుఁడు. ఇతఁడు పదునెనిమిది మాసముల సిసుగు. రెండవవాఁడు గృష్ణరాయల యన్న వీరనరసింహరాయల కుమారుఁడు. ఇతఁడు సామ్రాజ్యాధిపత్యము వహింపదగిన వయసుగల వాఁడే. కృష్ణరాయల యంత్యకాలమునందాత డిరువదెనిమిదేండ్ల ప్రాయముగలవాడై యుండవల యును. మూఁడవవాఁడు కృష్ణరాయల కనిష్ఠ ద్వైమాతురుఁడగు నచ్యుతరాయలు. వై బేరొ్కనిన వారిలో ద్వితీయ తృతీయు లిర్వురును కృష్ణరాయల పట్టాభిషేక కాలమునుండియు జంద్రగిరి దుర్గ కారాగారమున బంధితులై యుండిరి. నాల్గవ వాడచ్యుతరాయలయన్న శ్రీరంగరాయల కుమారుఁడగు [illegible] యల్లుఁడైన యళియ రామరాజునుగూడ నిచట బేరొ్కనుట యుక్తము. రామరాజు తిమ్మభూపాలుని పుత్రుఁడు బుక్కరాజు ముమ్మనుమడు; రామరాజు మనుమఁడు; శ్రీరంగ రాజు పుత్రుఁడు. మేట్ల మొదలి నీతఁడు

---

20. *Briggs Ferishta III. pp* 365-68.

21. రామాభ్యుదయము. 1 : 55, కకుస్థ విజయము. 1 : 40.

NARLA MEMORIAL LIBRARY D.P.R.I. Acc. No.

గోలొ్కండ సుల్తాన్ కుల్లీకుత్బుశాహ కొలువునం దుండెను; క్రీ. శ. ౧౫౧౫ ప్రాంతమున సుల్తాన్ కుల్లీ విజయనగర సామ్రాజ్యముపై నెత్తివచ్చి గడిసీమలఁ గొన్నిటిని జయించి స్వాధీనము జేసికొని యా సీమలపై ప్రభుత్వమునకు మహమ్మదీయులను నియమించుట యుక్తముగాదని దలఁచి రామరాజు నచట నెలకొల్పెను. తరువాత నా ప్రాంతముపై నాదిళ్ఖాను నెత్తివచ్చెను; అతని ధాటి కోర్వజాలక రామరాజు గోలొ్కండకు బాఱిరాగా సుల్తాన్ కుల్లీ యతని పందతనమున కది నిదర్శనమని తలచి నిజరాజ్యమునుండి వెడలిపోవ నాజ్ఞాపించెను. అంతట నతఁడు విజయనగరమున కేగుదెంచెను. కృష్ణరాయలతని శక్తిసామర్థ్యములను గ్రహించి గౌరవించి కూతురు తిరుమలాంబనిచ్చి యుద్వాహ మొనర్చెను.[22] రామరాజునకు విజయనగర సామ్రాజ్యముపై నెట్టి వారసత్వపు హక్కును లేదు. కాని యతని యధికార కాంక్ష మేఱలేనిది. కృష్ణరాయల జీవితకాలమునందే యతఁడు మామ గారికి సామ్రాజ్యపరిపాలనయందు చేదోడు వాదోడై యుండెనని కొన్ని యర్వాచీన పోర్చు గీసు చరిత్ర గ్రంథములందు కలదు; కాని యది సత్యమని నిరూపింపగల సాక్ష్యము విశ్వాసపాత్ర మెద్దియు గానరాదు. రామరాజు కృష్ణరాయల యనంతర మతని పుత్రునిపేర ప్రజాపాలనము సేయదలపెట్టి సామ్రాజ్య మల్లకల్లోలము గావించెను. అతనిదృష్టి యప్పటికే సింహాసన ముపై బారియుండునటకు సంశయములేదు.

వీరందఱి గుణగణములును శక్తిసామర్థ్య ములను కృష్ణరాయ లెఱుగనివికావు. దీర్ఘము వితర్కించి వితర్కించి వీరందఱిలోను దన యనంతరము సింహాసనము నధిష్ఠింపదగిన వాడచ్యుతరాయలే యని నిశ్చయించుకొనెను. ఇట్లు నిశ్చయించినది కృష్ణరాయలు జాడ్యగ్రస్తుఁడై ప్రాణముపై నాసవిడిచి మృత్యువు నెదురు చూచుచున్న సమయమందని న్యూనిజు వచించి యున్నాఁడు. ఇది సరికాదు. మరణకాలమునకు రెండుమూడేండ్లకు ముందే రాజ్య వారసత్వనిర్ణ యము జరిగియుండవలయును.[23] ఇట్లు నిశ్చయించు కొనిన పిమ్మట నచ్యుతరాయల బంధనము నాపి యతఁడె తన యనంతరము వజ్రసింహాసనాధిపతి యని ప్రకటించెను.

తన నియామకము సర్వసమ్మతము గాదని కృష్ణరాయలు శంకించెను. కావున నది నిర్విఘ్న ముగ నెఱవేరుటకు గొన్ని యేర్పాటులను గావించెను. సాళువతిమ్మయ కుటుంబమునెడ మరల సుప్రసన్నుఁడై చెఱను విడిపించి మరల దన కొలువు నందు బునఃప్రతిష్ఠించెను. సర్వధారి సంవత్సరమున మైసూరు మండలములోని మరదీపురమున మహా ప్రధాన సాళువగోవిందరాజ వొడయలుగారు వ్రాయించిన శిలాశాసన మిందుకు తార్కాణ.[24] అచ్యుత దేవరాయల కనుకూలుఁడైన సాళువ నరసింగరాయ దండనాయకుని ముఖ్యమంత్రిని జేసికొనెను. ఇతఁడు ప్రబలుఁడు; ప్రతిపక్షులను సింహాసనము నాక్రమించుకొననీయక చంద్రగిరి నుండి యచ్యుతరాయలు వచ్చునందాక సంరక్షించి నాత డితడే.[25]

---

22. *Briggs Ferishta III. pp* 380-81.

23. ఈ క్రింది శాసనము లీ సందర్భమున బరిశీలింపదగినవి:—ఇం దచ్యుతరాయలు రాజ్యము సేయు చుండినట్లున్నది:

(1) *NDI. Nl.* 34.*a.* శా.శ. ౧౪౪౮ పార్థివ ఫాల్గుణ శు. ౧౫ బుధవారము.

(2) *Ec. X. Sd.* 15 శా.శ. ౧౪౮౦ (౧౪౫౦) సర్వ ధారి భాద్రపద శు. ౧౩.

(3) *Ec. XII.Gb.* 32. శా. శ. ౧౪౫౧ విరోధి చైత్ర శు. ౫.

(4) *MAR.* 1929. *No.*32 శా. శ. ౧౪౮౦ (౧౪౮౦) విరోధి భాద్రపద శు. ౧౩.

(5) 104 *of* 1919 విరోధి. ఆవణి. ౨౦.

విరోధిసంవత్సర మాఘ తులామాసముల వఱ కును కృష్ణరాయల శాసనములు గానవచ్చుచున్నవి. కావున నీకాలమున కృష్ణరాయలతో గూడ నచ్యుత రాయలును సామ్రాజ్యమును పాలించుచుండెనని చెప్పవలసియున్నది.

24. *EC. III. Tn.* 76.

25. *Nuniz, Forgotten Empire p.* 367.

కృష్ణరాయల నిర్యాణము

అచ్యుత దేవరాయల నిట్లు రాజ్యాధిపత్యమున నెలకొల్పుటకు నిశ్చయించినను, కృష్ణరాయలు రాజ్యభారము నతనిపై మోపక తుదదాక సర్వకార్యములను దానె నిర్వహించుచుండెను. ఇట్లుండ రాయలు తనయొద్దనుండి జయించిగైకొన్న రాయచూరు దుర్గమును మరల స్వాధీనపఱచుకొనుటకొఱకు గజాశ్వదళములను గూర్చికొని యాదిల్ఖానుఁడు కూచిచేసి వచ్చెను. ఆ వర్తమానము జెవినోకినంతటనె మండిపడి కృష్ణరాయ లెవ్వరికిని జెప్పక యశ్వారూఢుఁడై రాయచూరువంక సత్వరముగ స్వారిచేసిపోయెను. రాయలు వచ్చుచున్నాడను వార్త యాదిల్ఖానునకు దెలియ వచ్చినది. ఇక నచట నాగుట శ్రేయస్కరముగాదని యతఁడు పరారి చిత్తగించెను. అంతట కృష్ణరాయలతని కిట్లు సందేశమంపెను.

'ఇప్పటివఱకు రెండు పర్యాయములు బాస దప్పితివి; ఆడినమాట తప్పినందులకు నీతో యుద్ధము జేసితిని, ఇంకను చేయుదును, నాకరిగాపు పగునంతవఱకు మానను, బెల్గామును వశపఱచుకొనునంత దనుక నిన్ను విడజాలను.'

వర్షాకాల మారంభ మగుటవలన దండయాత్రను వెంటనే ప్రారంభము సేయుటకు వీలులేక పోయినది; కావున కృష్ణరాయలు విజయనగరమునకు మరలి వచ్చెను; యుద్ధసన్నాహములను మానలేదు. వానలు నిల్చినంతటనె యాదిల్ఖానునిపై దండువెట్ట నిశ్చయించి తుపాకులు ఫిరంగులు మందుగుండు సామగ్రులను విస్తారముగ సమకూర్పవలయునని కందాచారాధి పతులకాజ్ఞ పించెను; మఱియు దన యత్నము నిర్విఘ్నముగ గొనసాగుటకు బోర్చుగీసుల సహాయము నపేక్షించి గోవాయందలి వారి ప్రతినిధికి సందేశ మంపెను. తనకు దోడ్పడిన బెల్గాము గైవసమైనంతటనె గోవా ద్వీపమున కెదుటనుండు తీరభూముల నిచ్చివేయుదునని మాట నిచ్చెను. కాని కృష్ణరాయల యుద్యమము కొనసాగలేదు. దైవ దుర్విలాసమువలన నతని కారోగ్యము దప్పినది; జాడ్యగ్రస్తుఁడై యచిర కాలముననె యవతారమును జాలింపవలసి వచ్చెను.

కృష్ణరాయ లెపు డస్తంగతుఁ డాయెనో కచ్చితముగ నిర్ణయించుటకు దగిన సాధనము లింకను లభ్యపడలేదు. శా. శ. ౧౪౫౦ కి సరియైన విరోధి సంవత్సర తులామాస పౌర్ణమాస్య భాను వారము (క్రీ. శ. ౧౫౨౯ అక్టోబరు ౧౭ వ తేది) నాడు ప్రాయించిన శాసనమునం దింకను కృష్ణరాయలు రాజ్యము సేయుచుండినట్లు వచించి యున్నది.[26] శా. శ. ౧౪౫౦ విరోధి వర్షకార్తిక శు ౧౫ భానువారము (క్రీ. శ. ౧౫౨౯ అక్టోబరు ౨౭ వ తేది) నాటి శ్రీశైల శాసనమునందుగూడ కృష్ణరాయలె రాజ్యపాలన మొనర్చుచుండినట్లు చెప్పియున్నది.[27] అందె మఱియొక శాసనమున శా. శ. ౧౪౫౨ వికృతి సం॥ చైత్ర బ. ౩౦ సోమవారము (మార్చి; క్రీ. శ. ౧౫౩౦) వఱకును రాజ్యము సేయుచుండి నట్లున్నది.[28] కాని ఇది సంశయాస్పదము. ఏలనగా క్రీ. శ. ౧౫౨౯ డిశంబరు తేది ౨౮ నాడు ప్రాయించిన యచ్యుత రాయల కడ లాడి తామ్రశాసనమునం దప్పటికె కృష్ణరాయలు స్వర్గస్థుడైనట్లు చెప్పియున్నది.[29] కాబట్టి రాబర్టు సూయలుగారు చెప్పినట్లు కృష్ణరాయలు క్రీ. శ. ౧౫౨౯ అక్టోబరు ౨౭ వ తేదికిని డిసెంబరు ౨౮ వ తేదికి మధ్య నెప్పుడో యొకనాడు పరలోకగతుఁడై యుండవలయును.[30]

కృష్ణరాయల నిర్యాణ[illegible] పద్య మొకటి వాడుక[illegible]

ఉ॥ బోరన యాచక[illegible]
భూరి విపద్ద[illegible]

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

26. *ARE.* 512 *of* 1919.
27. *ARE.* 15 *of* 1915.
28. *ARE.* 14 *of* 1915.
29. *EI XIV. p* 310. *f p.* 314.
30. *Robert Sewell, Historical inscriptions of Southern India, p.* 245.

నారయ శాలివాహన శకాబ్దము
లద్రియుగాబ్ధి సోములం
దారణ వత్సరంబు ననిదాఘ
దినంబున జ్యేష్ఠ శుద్ధష

ష్ఠిరవి వాసరంబున నృసింహుని
కృష్ణుడు చేరె స్వర్గముఁ
ద్వారక నున్న కృష్ణుఁ డవతార
సమాప్తము నొందు నెవడిఁ.

ఇటీవల శాసన పరిశోధక శాఖవారు సంపాదించిన అళియ రామరాజు తామ్ర శాసనమునగూడ నీపద్య ముదాహరింపబడెనని తోచుచున్నది. ఈ శాసనము శా. శ. ౧౪౪౮ చైత్ర శు. ౧౨ సోమవారమునాడు వ్రాయబడెనట. (12 *of* 1946-47.) ఇది కృత్రిమ మను తలంపునకు గొంత యవకాశముగలదు. పై పద్యము నాధారపఱచుకొని కీ. శే. కొమఱ్రాజు వేంకటలక్ష్మణరావు పంతులవారు కృష్ణరాయల నిధన కాలమునుగూర్చి జక్కని వ్యాసమును విరచించి, స్థానిక చరిత్రలోని కథలను గృష్ణరాయల కడపటి రాజ్యవర్షములలో వ్రాయబడిన కొన్ని శాసనములను నాధారపఱచుకొని, 'కృష్ణరాయలు శా. శ. ౧౪౪౬ లోనో ౧౪౪౭ లోనో మృతినొంది నట్లును, అప్పటినుండియు శా. శ. ౧౪౫౭ (క్రీ. శ. ౧౫౩౫) వఱకు విజయనగర రాజ్యము నాక్రమించు కొనవలయునని అతని కుమారుఁడైన తిరుమల రాయలును, అల్లుడైన రామరాయలును, తమ్ముడైన యచ్యుతరాయలును ప్రయత్నించు చుండి నట్లును ఎవ్వరికి వీలయినవారు శాసనములు వేయించుట, కొళ్ళిచ్చుట మొదలయిన పనులు చేయుచుండి నట్లును, ఈ కాలమున నెవరి యధికారమును స్థిర పడనట్లును దోచుచున్నది' అని యూహించిరి. (లక్ష్మణరాయ వ్యాసావళి పుట ౫౭) ఈ యూహకు ప్రబోదిగ లక్ష్మణరావుగా రుదాహరించిన సాధనము లలో నెల్ల శా. శ. ౧౪౪౬ తారణ మార్గశిర శు. ౨ శనివారమున వ్రాయించిన తిరుమల దేవ మహా రాయల శాసనము ముఖ్యమైనది (*EC. IX. Ma.* 82). ఇందు 'కృష్ణదేవ మహారాయరిగె గంగోదక సేవిత రప్ప...కోనప్ప నాయకరు' అను వాక్య మీ సందర్భమున జక్కఁగ గమనింపఁదగినది. ఈ వాక్యము నకు లక్ష్మణరావుగా రిట్లు వివరణమును వ్రాసి యున్నారు. 'కృష్ణరాయలకుఁ గోనప నాయకుఁడు గంగోదకము సేవింపజేసెననియునిందుఁ జెప్పఁబడి యున్నది. చరమావస్థయందు గొంతులో గంగఁ పోయు నాచారము హిందూదేశ మంతటను గలదు. కావున గోనపనాయకుఁడు రాయల చరమదశయం దాతని సేవఁజేసి ధన్యుఁడయ్యెనని మనము తలంప వచ్చును. పై చాటు పద్యమునందలి మరణతిథియె నిజమైనయెడల ఈ శాసనము రాయల మరణానం తరమున ఆఱునెలలో వేయబడినదియగును.' (లక్ష్మణ రాయణ వ్యాసావళి. పుట ౫౧). కాని పైశాసన పరిష్కర్తయగు లూయీ రైసుగారు 'గంగోదక సేవితరప్ప' యను మాటలకు గంగోదకమును మోయ్యువా (*The bearer of the Ganges Water to Krishnadeva Maharaya*) డని యర్థము జెప్పిరి. కృష్ణరాయలు స్వయముగ యాత్రచేసి గంగలో స్నానము సేయుటకు వలనుపడక పోగా నీ కోనప్ప నాయకు నంపి యతనిచే గంగాజలమును దెప్పించు కొని యందు స్నానమాడి యుండవచ్చును. ఇందసంగత మెద్దియులేదు. కావున పైవాక్యము నాధారపఱచుకొని కృష్ణరాయలా శాసనకాలము నకు ముందే మృతిజెందెనని చెప్పుట సమంజసము గాదు. మఱియును లక్ష్మణరావుగారే, 'ఈయూహాల కన్నిటికిని వ్యతిరేకముగ గృష్ణరాయని శాసనములు పెక్కులు శా. శ. ౧౪౫౭ వఱకును గలవు. కావు ననే సూయలు మొదలయిన తద్జ్ఞులు కృష్ణరా యలు శా. శ. ౧౪౫౦ (క్రీ. శ. ౧౫౩౦) వఱకును జీవించియుండెనని వ్రాసియున్నారు' అని యొప్పు కొని యున్నారు. (లక్ష్మణరాయ వ్యాసావళి. పుట. ౫౭). మఱియు శా. శ. ౧౪౪౬-౧౪౫౭ ల మధ్య కృష్ణరాయల కుమారుఁడైన తిరుమల రాయలును అల్లుడైన రాయలును, దమ్ముడైన అచ్యుతరాయ లను రాజ్యము కొఱకొండొరులతో బోరుచుండిరని తెల్పు సాక్ష్యము విశ్వాసపాత్రమైన దెద్దియు గాన రాదు. కావున పై చాటువునందు జెప్పినట్లు కృష్ణ రాయలు శా. శ. ౧౪౪౬ నకు సరియైన తారణ వర్షమున స్వర్గస్థుఁడాయెనని యంగీకరించుటకు వలనుపడదు.

* * *

AOUA101B138

ఆంధ్ర ప్రదేశ ప్రభుత్వ పాఠ్యగ్రంథముల
ముద్రణాలయమున ముద్రితము, హైదరాబాదు.

ముఖము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపత్రిక

పుస్తకం సంఖ్య	AOUA101B138
పుస్తకం పేరు	కృష్ణదేవరాయలు
తారీఖు	31 December 2025
ముందు అట్ట	49
వెనుక అట్ట	49
మొత్తం పేజీలు	105
పెద్ద సైజు పేజీలు	
ఖాకీ పేజీలు	CI, BCJ, IV
లేని పేజీలు	
తయారు చేసినది	Jayalakshmi.
పేజీలు విడదీసినది	Jayalakshmi
స్కాన్ చేసినది	Namakkal
పరీక్ష చేసినది	SARANYA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good